

# నా
# మాటే
# తూపాకి
# తూటా

మల్లు స్వరాజ్యం
ఆత్మకథ

# నా మాటే తుపాకి తూటా

## మల్లు స్వరాజ్యం ఆత్మకథ

కథనం

**విమల, కాత్యాయని**

మలిమాట

**ఉమా చక్రవర్తి**

హైదరాబాద్ బుక్ ట్రస్టు

| | | |
|---|---|---|
| ధర | : | రూ. 120/- |
| ప్రథమ ముద్రణ | : | జూన్ 2019 |
| అట్టమీద ఫోటో | : | ఫర్హాతుల్లా బేగ్ |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్,<br>ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006.<br>ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,<br>హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

# మల్లు స్వరాజ్యం: తెలంగాణా ఝాన్సీ రాణి

స్వాతంత్ర్యోద్యమం యువతను ఉర్రూతలూగిస్తున్న కాలానికి చెందిన మల్లు స్వరాజ్యం గొప్ప సాహస యోధురాలు. ఒక లెజెండ్, ఒక హీరో. ఆ కాలంలో గుర్రం మీద ప్రయాణం చేసే ఆమెను చూసి జనం అభిమానంతో ఝాన్సీ రాణి అని పిలుచుకునేవారు. స్వరాజ్యం ఒక సంపన్న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. పరదాల చాటున పెరిగారు. పరదాల చాటున్నే చదువు సంధ్యలు నేర్చుకున్నారు. మొదట స్వాతంత్ర్యోద్యమంలోనూ ఆ తరువాత తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలోనూ చాలా చురుకుగా పాల్గొన్నారు. నిర్మొహమాటానికి, ధైర్యానికి పెట్టింది పేరు. ఆమె అంటే సహచరులకే కాదు, నాయకులకు కూడా అభిమానమూ- భయమూ రెండూ వుండేవి. చక్కని వాక్చాతుర్యంతో, హాస్య సంభాషణలతో ఆకట్టుకుంటూ తన తరానికే కాదు, తర్వాతి తరానికి కూడా గొప్ప స్ఫూర్తిప్రదాతగా నిలిచారామె. అరమరికలు లేకుండా అందరితో కలసిపోయే మనస్తత్వం వల్ల ఇతర నాయకులకంటే ఆమె ఎంతో భిన్నంగా కనిపించేవారు. అటు స్వాతంత్ర్యోద్యమంలో, ఇటు సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొంటూ ఆమె తన అనుభవాలను వివరిస్తుంటే వినడం ఒక అనిర్వచనీయమైన అనుభూతిని, ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఆమె మాటతీరు, వ్యవహార శైలి మూస పద్ధతికి భిన్నంగా, చాలా విలక్షణంగా వుంటాయి. ఇలాంటి వ్యక్తులు శతాబ్దానికి ఏ ఒక్కరో వుంటారు. మల్లు స్వరాజ్యం రెండు శతాబ్దాలను ప్రభావితం చేసిన మహా యోధురాలు.

**- వసంత కన్నబిరాన్**

మల్లు స్వరాజ్యం గారి జీవితమంటే 20వ శతాబ్దపు తెలంగాణా సామాజిక రాజకీయ చరిత్ర. అణచివేతను సహించలేని ప్రజల సామూహిక తిరుగుబాటు చరిత్ర. పీడితుల పట్ల సహానుభూతితో పిడికిలి బిగించి పోరాడిన ఒక తరం చరిత్ర. వ్యక్తి శక్తిగా మారే క్రమాన్ని చూపే చరిత్ర.

రాజకీయాలలోకి మహిళలు రావటమంటే మల్లు స్వరాజ్యం గారిలా రావాలి. అధికారం, పెత్తనం, అనేకానేక స్వీయ ప్రయోజనాలను ఆశించి రాజకీయాలలోకి వచ్చిన నాయకురాళ్లకు పూర్తిగా భిన్నం ఆమె రాజకీయ జీవితం. మన జీవితాలకు సంబంధించిన నిర్ణయాధికారాన్ని మన చేతుల్లోకి తీసుకోవటమెలాగో నేర్పే గొప్ప పాఠం ఆమె తొలినాళ్ల జీవితం.

**– ఓల్గా**

మల్లు స్వరాజ్యం తన పదకొండేళ్ల వయసులో ప్రజా జీవితంలో అడుగుపెట్టారు. ఆనాడు తనలో ఏ నిప్పు రవ్వ రాజుకుందో ఇవాళ 86 ఏళ్ల వయసులో కూడా ఇంకా ఆ జ్వాల అలాగే ఎగిసిపడుతూ వుంది. ఈ రోజు కూడా ఆమె ఎంతో స్పష్టతతో, ఆలోచనాత్మకంగా మాట్లాడుతూ, పోరాడుతూ ఎందరో మహిళలకు స్ఫూర్తినిస్తున్నారు. కార్యాచరణకు పూనుకునేలా ప్రేరణను అందిస్తున్నారు. “నా గొంతే నాకు నా తుపాకి, తూటా” అంటారామె. జీవితంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ఏనాడూ వెనుకంజ వేయని ధీరత్వం ఆమెది. ఆమె జీవితం ఒక మార్క్సిస్టు వీరోచిత పోరాట గాథ.

**– శాంత సిన్హా**

# ప్రచురణకర్తల నుండి

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొని, విప్లవాన్నే తన చిరునామాగా మార్చుకున్న మల్లు స్వరాజ్యం జీవిత కథనాన్ని పుస్తకరూపంలో తీసుకురావాలని ఎప్పటినుంచో అనుకుంటున్నప్పటికీ ఆ ప్రయత్నం ఇన్నాళ్ల తర్వాత.. ఇప్పటికి సఫలమైంది.

ఆనాటి పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న స్త్రీల మౌఖిక చరిత్రను బహుశా తొలిసారిగా స్త్రీ శక్తి సంఘటన వారు 'మనకు తెలియని మన చరిత్ర' పేరిట రికార్డు చేశారు. ఆ తరువాత ఆచార్య తిరుమలి తన 'తిరుగబడ్డ తెలంగాణా'లో ఆ పోరాటాన్ని, ఆనాటి సమాజాన్ని, భూ పంపకాల తీరుతెన్నులను దళిత దృష్టి కోణం నుంచి విశ్లేషించారు. ఇదే క్రమంలో మోటూరి ఉదయం, మానుకోట సూర్యావతి, కొండపల్లి కోటేశ్వరమ్మ (నిర్జన వారధి) మొదలైన వారి స్వీయ చరిత్రల రూపంలో పలు పుస్తకాలు వచ్చాయి. ఈ వరుసలో ఆనాటి నిజాం రాజ్యంలో ఉస్మానాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మొహమ్మద్ హైదర్ రాసిన స్వీయానుభవాలతో కూడిన '1948 హైదరాబాద్ పతనం' పుస్తకం మరింత విలక్షణమైనది.

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో ప్రత్యక్షంగా తుపాకి పట్టుకుని గెరిల్లాగా పాల్గొన్న యోధురాలు మల్లు స్వరాజ్యం. ఆ తరువాత మహిళా నాయకురాలిగా, ఎమ్మెల్యేగా.. 86 ఏళ్ల వయసులోనూ ఉద్యమాలే ఊపిరిగా బతుకుతున్న మల్లు స్వరాజ్యం జీవిత కథనాన్ని హైదరాబాద్ బుక్ ట్రస్ట్ పుస్తక రూపంలో మీ ముందుంచుతున్నది.

గతంలో అనేక సందర్భాలలో తన జీవితానుభవాలను ఆమె స్వయంగా వివరించారు. అనేక మందికి ఇంటర్వ్యూలు ఇచ్చారు. 'మనకు తెలియని మన చరిత్ర' పుస్తకంలోనూ, భూమిక వంటి వివిధ పత్రికలలోనూ ఆమె జీవనయాత్ర గురించిన వ్యాసాలు వచ్చాయి. ప్రొఫెసర్ ఉమా చక్రవర్తి తను తీస్తున్న డాక్యుమెంటరీ చిత్రం కోసం స్వరాజ్యంను ఇంటర్వ్యూ చేశారు. ఆమె జీవిత చరిత్ర రాస్తున్న క్రమంలో అనేక చోట్ల సమాచారం అసమగ్రంగా వుండటంతో విమల తనని మళ్లీ ఇంటర్వ్యూ చేయాల్సి వచ్చింది. ఇలా

అనేకమంది చేసిన కృషి ఫలితంగా పోగుపడిన సమాచారాన్ని ఒక దగ్గర చేర్చే పనిని హెచ్‌బీటీ చేపట్టగా విమల, కాత్యాయిని దానికి ఇలా ఒక పుస్తక రూపాన్ని ఇచ్చారు.

మన కాలపు పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జీవితాన్ని ఇలా ఆవిష్కరించుకోవడం ఏ ఒక్కరివల్లో జరిగింది కాదు. మన అందరి సమిష్టి కృషి ఫలితం. ఈ సందర్భంగా విమల, కాత్యాయని, ఉమా చక్రవర్తి, కొండవీటి సత్యవతి, ప్రొ.సునీతారాణి, కె.సంధ్య, ప్రభాకర్ మందార తదితరులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం. ఈ పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయం అందించిన వాసిరెడ్డి సీతాదేవి ఫౌండేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్**

---

*ఈ ముందు మాటలో పేర్కొన్న 'తిరగబడ్డ తెలంగాణా', 'నిర్జన వారధి', '1948 హైదరాబాద్ పతనం' పుస్తకాలు మూడూ హెచ్‌బీటీ ప్రచురణలు.*

నేను పుట్టినది భూస్వామ్య కుటుంబం. నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలంలో కొత్తగూడెం అనే చిన్న గ్రామం. మా తండ్రి గారి పేరు రామిరెడ్డి, అమ్మపేరు చొక్కమ్మ, ఐదారువందల ఎకరాల భూస్వాములు.

1930–31 ప్రాంతాల్లో పుట్టినన్నేను. స్వరాజ్యం అని, నాకీపేరు మా అమ్మనే పెట్టుకున్నది. అవి స్వరాజ్యోద్యమం జరుగుతున్న దినాలు కదా! మా బంధువొకాయన, మా అమ్మకు మేనమామ కొడుకు – ఆయన కాంగ్రెస్ సభలకు పోతుండేటోడట. బంధువులు ఒకరిద్దరితోగల్సి బొంబాయికి పోయి సత్యాగ్రహంలో కూడా పాల్గొన్నడట. గాంధీని గురించి, జాతీయోద్యమాన్ని గురించి ఆయన ద్వారా వినడంతో ఆమెకు ఆ ఉద్యమం మీద అభిమానం కలిగిందట. నేను పుట్టిన ఇరవై రోజులకు ఆయన చూడ్డానికొచ్చిండట. ఆయన మాటమీదనే మా అమ్మ నాకు స్వరాజ్యం అని పేరు పెట్టుకున్నది.

నేను పుట్టి పెరిగిన కుటుంబ వాతావరణమే నేను ఉద్యమంలోకి రావడానికి ముఖ్య కారణమని చెప్పాలె. ఆనాడు ఆడపిల్లలకు చదువులు తక్కువే. కానీ భూస్వామ్య కుటుంబాలలో పరిస్థితి వేరేగా ఉండేది. ఆడపిల్లలను చదివించటం, గుర్రపుస్వారీ వంటివి నేర్పించడం ఉండేది. దీనికొక కారణమున్నది –

భూస్వామ్య వ్యవస్థలో పెద్ద భూస్వాములకూ, చిన్న భూస్వాములకూ వైరుధ్యం ఉండేది. ఆ రోజుల సంగతి చెబుతున్న – మా నాన్న వంటి భూస్వాములకు ఇంకా పెద్ద జాగీర్దార్లతో పోటీ ఉండేది. ఫలానా దొరల ఆడపిల్లలు గురుకులంలో చదువుతున్నారు, మనం కూడా వాళ్ళ సాంప్రదాయంలో నడవాలె, వాళ్లంత పెద్దగ ఎదగాలె అనేటువంటిది ఉండేది. రేప్పొద్దున ఏమయినా జరిగితే – పురుషులు సమయానికి లేకపోవడమో, చనిపోవడమో జరిగితే, స్త్రీలు గూడా జమిందారీ నిర్వహించేట్టుగా తయారు కావాలనేది ఉండేది. దానికోసం కొంచెం చదువు, తర్ఫీదు ఇప్పించేవాళ్ళు. అట్లా ఇంటిదగ్గరనే పంతుల్ని పిలిపించి ఆడపిల్లలకు చదువు చెప్పించిన్రు మా నాన్నగారు. రెండోది – ఝాన్సీ లక్ష్మీబాయి, ఓరుగల్లు రాజ్యాన్నేలిన రుద్రమాంబ ప్రభావం కూడా ఉండేది. అట్లా చదువు, ఈత, గుర్రపుస్వారీ వంటివి నేర్చుకున్నా. పత్రికలు తీసుకొచ్చి చదివిస్తుండేటోల్లు. మా అక్క బాగా చదివేది, ఆమె పేరు శశిరేఖ.

అట్లా భూస్వాములు, వాళ్ళ కుటుంబాల ప్రయోజనాల కోసమని ఆడపిల్లలను చదివించటం జరిగినప్పటికీ, ఆ చదువుల ద్వారానే నా వంటి ఆడపిల్లలకు వామపక్ష ఉద్యమాల్లోకి పోయే అవకాశం కూడా దొరికింది.

నేను ఈ పోరాటంలోకి రావడానికి ముఖ్య కారణం మా బంధువులే. వాళ్ళ నుండే స్ఫూర్తి పొందాను. అందులో ప్రధానం మా అన్నయ్య భీమిరెడ్డి నరసింహారెడ్డి. మా అక్కయ్య కూడా పనిచేసింది. ఆమెకు పద్దెనిమిదేండ్లకు పెండ్లయ్యింది. మా బావగారు మా మేనత్త కొడుకే. ఆయనగూడ స్వతంత్ర పోరాటంతోని బాగ ప్రభావితమయ్యిండు. మా అమ్మగారిది రామన్నగూడెం. వాళ్ళ పెద్దన్నయ్య వకీలు. ఆయన కొడుకుల్లో ముగ్గురు వచ్చిన్రు విప్లవోద్యమంలోకి. ఒకాయన మిలట్రీ దళాలను లీడ్ చేసిండు. ఇంకొకాయన కూడా మిలిట్రీ దళాలను నడుపుతూనే ఎన్‌కౌంటర్లో మరణించిండు. పోలీసుల మీద కాల్పులు చేసి పోలీసు ఎస్.ఐని చంపేసి, తన తుపాకిలో గుళ్ళన్నీ కొట్టేసి, వాళ్ళకు పనికిరాకుంటజేసి ప్రాణం వదిలిండు. ఇట్ల కుటుంబంలో విప్లవ వాతావరణం ఏర్పడింది.

ఇక మా అమ్మను గురించి ప్రత్యేకంగా చెప్పాలె – పెద్ద భూస్వామ్య కుటుంబం వాళ్ళది. జాజిరెడ్డిగూడెం, రామన్నగూడెం, సీతారాంపురం ఈ ఊర్లన్ని వాళ్ళవే. వాళ్ళకునాలుగువేల ఎకరాల వరకు భూమి ఉండేది. అక్కడొక దేవాలయం ఉండె. దానికున్న రెండువేల ఎకరాల భూమి కూడా వీళ్ళదే – కబ్జా. వాళ్ళకు పెద్ద బంగ్లా, వ్యవహారం, ఒక నాగరికత. ఇవన్నీ ఉన్నయ్. ఆ ప్రభావమే మా నాన్నమీద పడింది.

పదేడు, పద్దెనిమిదేండ్లకు పెండ్లయింది మా అమ్మకు. మొదట్లో ఈ కుటుంబాల స్త్రీలకు పర్దా ఉండెనట. గాజులు వేయించుకోవాల్నంటే తెరకిందంగ చెయ్యిచ్చి గాజులు పెట్టుకునేదట మా అమ్మ. చాకలామె ఆడమనిషేగదా, అయినా కన్పించటానికి వీల్లేదట. పనిమనుషులను చూడాల్నంటే పనిమాలా ఒకరోజు ఫిక్స్ చేసి చూడాల్సిన పరిస్థితి మా అమ్మకి పెండ్లయిన కొత్త రోజుల్లో ఉండేదట. స్త్రీలను పర్దాల చాటున పెట్టి, ఏం తెల్వకుంట ఉంచటం సరైనది కాదని ఆంధ్రమహాసభ అప్పుడే ప్రచారం చేస్తున్నది. అది ఈ స్త్రీలను ప్రభావితం చేసింది. ఆంధ్రమహాసభ మీద అభిమానం ఏర్పడింది వాళ్ళకు.

మా అమ్మ స్వతహాగా మానవతావాది. అట్లనే గొప్ప ధైర్యస్తురాలు కూడా. ఈ వ్యవస్థ మారాలనే ఆలోచన ఆమెలో ఉన్నది. పనిపాటలు చేసేటోళ్ళ జీవితం బానిసల్లాగ ఉండేది. ముందు భూస్వాముల పొలాలు నాటుబెట్టినంకనే వాళ్ళ సొంత పనులకు పోవాలె. ఏమయినా అవసరాలుంటే అమ్మా బాంచెన్, నీకాల్మొక్త అని అడుక్కోవాలే తప్ప, హక్కులన్నవేమీ ఉండవు. వాళ్ళను చూసి మా అమ్మ బాగ జాలిపడుతుండె. బాగా దానధర్మాలు చేసేది.

మా నాన్న చివరి రోజుల్లో ఆర్థిక వ్యవహారాలతోని బాగా ఒత్తిడికి గురయితుండేవాడు అనుకుంటా. ఒక్కోసారి జీతగాళ్ళను కొట్టేవాడు. మా అమ్మ వాళ్ళను పిలిచి ఓదార్చేది. నూనెపోసి, ఉప్పుపెట్టి పంపించేది. అంతకన్నా పురుషులను ఎదిరించే పరిస్థితి ఆమెకు లేదు. ఆ తర్వాత మా అన్నయ్య ఉద్యమంలోకి వచ్చినంక, ఈ భూస్వామ్య విధానమంతా దోపిడి వ్యవహారం, బానిస చాకిరి చేయించుకోవడం అని చెబ్తుంటే విని వూర్కునేది. కానీ దాని ప్రభావం ఆమె మీద పని చేసింది. అందుకే మానాన్న చనిపోయినంక మాకు మద్దతుగా నిలబడింది.

**నా బాల్యం**

నా చిన్న తనాన జరిగిన ఒక సంఘటన నాకు బాగా గుర్తున్నది. అప్పట్లో వడ్లు దంచాల్నంటే కూలీలే దంచెటోళ్ళు. ముఖ్యంగా ఆడవాళ్ళే. పుట్లకు పుట్లు దంచినా కూలీ నాలీ ఉండదు. రోజులకు రోజులు ఈ పని జరుగుతుండేది.

ఒక రోజున ఎల్లమ్మ అనేటామె వడ్లు దంచుతూ కళ్ళు తిరిగి పడిపోయింది. నేనక్కడే కాపలాగా ఉన్నానప్పుడు. దబదబ నీళ్ళు తీసుకపోయి తాపించినా. ఆకలైతున్నదని ఆమె చెప్పంగనే అన్నం తీస్కొచ్చి తిన్పించినా. దంచుతున్నవాళ్ళు అందరూ మాక్కూడా ఆకలైతున్నది అన్నం పెట్టమని అడిగిన్రు. ఇంట్లో చూస్తే అంత అన్నం లేదు. బియ్యం తీసుకోని నానపెట్టుకుని తింటమన్నరు. మంచిది, తినమని చెప్పినా.

ఆ తర్వాత ఈ సంగతి తెలిసి మా చిన్నాయనవాళ్ళు తప్పు పట్టిన్రు. “అది చిన్న పిల్ల, ఏమనకండి”, అని మా అమ్మ నాకు సపోర్టుగా నిలబడ్డది. అది నాకు చాలా స్ఫూర్తిని అందించింది. అప్పటికి మా అన్నయ్య హైదరాబాదులో చదువుకుంటున్నాడు. నాకప్పటికి ఆంధ్రమహాసభ ఉద్యమం గురించి ఏమీ తెల్వదు. మా అమ్మకు ఒక పక్కనేమో భూస్వామ్య వ్యవస్థలో ఇంకా డెవలప్ కావాలనే కోరిక కొంచెం ఉండేది. కానీ ఇటుచూస్తే ఆమె మరిది, మా అన్నయ్య వాళ్ళంతా తీసుకొచ్చిన స్వేచ్ఛాభావాల ప్రభావం పడుతున్నది. చివరికి ఆమె మావైపునే నిలబడ్డది. బాగా సపోర్టు చేసింది. ధైర్యంగా నిర్బంధాన్ని ఎదిరించింది.

నాకు ఎనిమిదేండ్ల వయసుండగా మా నాన్న చనిపోయిండు. మా చిన్నాయన కోనారెడ్డికి ఇంటి పెత్తనం వచ్చింది. ఆయనకు మా నాన్న పద్ధతులతో ముందునుంచే వ్యతిరేకత ఉండేది. వాళ్ళ పిల్లలను చాలా వెనకబాటుతనంతో పెంచుతున్నరు. మా నాన్న చనిపోయినంక తనకు పెత్తనం వచ్చింది కాబట్టి తానే అంతా పెత్తనం చేయాలనే ధోరణిలో ఉన్నాడు. మా అన్నయ్య లేడు, పిల్లలు ఎటో పోతున్నరు, వాళ్ళను కంట్రోల్ చేయాలనుకునేటోడు.

మా అమ్మ ప్రభావం నా మీద చాలా వుంది. ఆమెకి మేం రాణీరుద్రమాంబ లెక్క గావాలె అని వుండేది. చదివించాలని ఉండేది. పనోళ్ళు నీళ్ళు చేదుతరుగద. ఒకసారి వాళ్ళు చేదుతుంటే నేను ఇంట్లోకి మోసుకొస్తుంటే, ఒక్క దెబ్బ కొట్టింది. అది తప్పు, మా అమ్మ దెబ్బలు కొట్టిన అనుభవం లేదు నాకు. నేను ప్రతిదానికీ తిరగబడుతుండె. బాగా జిద్దు చేసేదాన్ని. ఒకసారి పొలానికి పోతానని పోయిన. అట్లబోవద్దు, అది పద్ధతిగాదు అంది అమ్మ. "నల్లబడతరు ఎండల. దొరల పిల్లలు ఎవరు జేసుకోరు మల్ల" అంది. అంటే కూడ బోయిన. నేను తిరిగి వచ్చేసరికి కబడి ఆడుతున్నరు పోరగాల్లు. ఇతర కులాల మగపిల్లలున్నరు. వాళ్ళతో పాటు నేను లంగ కాశబోసి ఆడిన. లంగ మీద బుషట్, చేతులు కిందిదాక వున్నవి వేసుకున్న. ముస్లిం డ్రెస్‌లలో వుండేదప్పుడు. ఇంతలో మా ఇంకొక చిన్నాయిన వీరారెడ్డి నన్ను జూసి. ఆడనే నన్ను రెండు దెబ్బలేసి, పట్టుకొని తిట్టి, ఇంటికి దీసకొచ్చిండు. ఆడితేంది, తప్పా అన్న నేను. "మగ పోరలతో పాటు సమంగ, ఇట్ల బెంచుతున్నవ్ పిల్లలని. ఏందిది? ఇది మంచిది గాదు" అని మా అమ్మతో అన్నాడు. మా నాయిన లేడు అప్పటికే. నాకు పదకుండేళ్ళుండొచ్చు. మా చిన్నాయిన తిట్టినంక, మా అమ్మ ఏడ్చింది ఆ రోజు. "వాళ్ళరాత ఎట్లుండే అట్ల బోతరు. నేనేం జేసేడిది" అనేది.

మగ పిల్లలు, ఆడపిల్లలని తేడాగ జూసుడు ఇష్టంలేకుండె నాకు. ఈ సమానత్వం అన్నది మా అమ్మా నాయినే ఎక్కించినట్లున్నది నాకు. మా అన్నయ్యలకు వ్యాయామం నేర్పిస్తుండె. ఆ రోజుల్లో చదువుకునే పిల్లలందరు వ్యాయామం కూడా జేసెడిది. ఆ వ్యాయమం చేసే దగ్గరే మా ఆవుల కొట్టాలుండేవి. మా అన్నయ్యలతో పాటు, మమ్ములను కూడా తీసుకుపోయేడిది మా నాయన. అప్పటికి మా అక్క కొంచెం పెద్దదైంది. నాకు ఆమెకీ వయసులో తేడా వుంది. ఆమె పెండ్లీడు మనిషి. నేనేమో చిన్నదాన్నింకా. నా తరువాత చెల్లె సరస్వతి, ఆ తరువాత తమ్ముడు కుశలవరెడ్డి. వాడు పోలీసులు వస్తే, రాళ్ళు తీసుకోని ఎంటబడ్డడు. వీళ్ళిద్దరి మీద కూడా పోరాట ప్రభావం బాగా పడింది. సరస్వతిని చదువుకోసం మా మేనత్త ఇంటికి పంపింది మా అమ్మ. అది హిందీ చదువుకుంది మంచిగ. చదువుకోనిది నేనొక్కదాన్నే. నాలుగో తరగతిలోనే చదువు కట్ చేసిన. మా అక్క శశిరేఖ హిందీ విశారద చదివింది. స్వయంగా బంగ్లా మీద కూసోని సుబ్బరంగా చదువుకునేది. కుశలవరెడ్డి కూడా పదో తరగతి చదివాక, ఉద్యమం గోలల్ల చదువు మానేసిండు. అవన్నీ అయిపోయినంక, మా అమ్మ తమ్ముడిని హన్మకొండ పంపి చదివించింది.

మా అన్నయ్య హైదరాబాదులో చదువుతున్నప్పుడే ఆంధ్రమహాసభలో పనిచెయ్యసాగిండు. నాన్న చనిపోయినంక ఇంటికొచ్చి వ్యవసాయం చేసుకుంటనే

ఆంధ్రమహాసభ కార్యక్రమాల్లో పాల్గొనేటోడు. ఊరిలో కూడా ఉద్యమాన్ని ప్రచారం చేసెటోడు. మా చిన్నాయనకు ఇదంతా నచ్చేడిదికాదు.

మా అన్నయ్య, మా బావగారు ఆంధ్రమహాసభతో ప్రభావితమై స్వతంత్ర భావాలను చెపుతుండెటోళ్ళు. మా మేనత్త బుచ్చిరామ్మ కొడుకే అంటే మేనబావే మా అక్క భర్త. మా చిన్నాయిన రంగారెడ్డి చిన్నప్పుడు నన్ను బాగా ఇష్టపడేవాడు. వాళ్లింట్లనే ఎక్కువగ వుండేది నేను. మా ఇంటికి. వాళ్ల ఇల్లు కొద్దిగా దూరం వున్నా, ఎక్కువగా అక్కడనే వుండేది. ఆస్తుల తగాదాల్లో, మా చిన్నాయినను చంపేసిన్రు. మా చిన్నమ్మ యశోద, ఆమె బిడ్డ శకుంతల వీళ్ళందరూ కూడా ఆ తరువాత ఉద్యమం ప్రభావంలోకి వచ్చినవాళ్ళే.

పిల్లలందరం కలిసి బాలల సంఘం పెట్టినం. మా ఊర్లో కూలీల సమ్మె జరిగిన తరువాతన్నమాట పిల్లల మీద ఈ ప్రభావం బాగా పడింది. భద్రమ్మని ఒక కోమటోల్ల పిల్ల కూడా మాతో ఉండేది. ఆమెకి బాల్య వివాహం చేసిన్రు అదివరకె. ఆమె అత్తగారింటికి పోలేదు. ఆమె కొద్దిగా మిలిటెంటే. మనిషి కొంచెం భారీగా కూడా వుండేది. ఆమెను అత్తింటివాల్లొచ్చి, మా ఇంటి ముంగల కెల్లే గుంజుకపోతున్నరు. అప్పుడు, శకుంతల, నేను, ఇంకా మిగిలిన పిల్లలు అందరం గలిసి ఎదిరించినం. ఆమెను మల్ల వెనక్కి గుంజుకొచ్చినం. ఆమెను మా ఇంట్లకు తోలిచ్చి, ఇగ మీతో రాదు పొమ్మన్నం. అప్పుడు పెద్ద మనుష్యులంతా కూడిన్రు. అది, ఇది, మాట్లాడి, ఆమెను వాళ్ళ తల్లిగారింటికి పంపిన్రు. ఆ తరువాత కొన్నాళ్ళకే ఆమెని మళ్ళీ అత్తగారింటికి తోలిన్రు గానీ, అది వేరే ముచ్చట. అట్ల మేం పిల్లలం ఒక బ్యాచ్ అయి, బాలల సంఘం మొదలుపెట్టినం. గౌడ కులం వాళ్ళు కూడా దీనిలో కొందరుండేవారు. సమస్యల్లో జొరబడటంలో, చొరవతీసుకోవడంలో నా పాత్రే పెద్దగున్నది. మమ్మల్ని మామూలుగా గొల్లోల్ల వాడలల్లోకి పోనీయకపోయేది. కానీ మేం ఆ వాడలల్లోకి పోయేడిది. మగళ్ళు కొట్టిన దెబ్బలకి ఆడోల్లు ఏడుస్తుండేది. తెల్లవార్లూ ఆ ఏడుపులు ఇనొచ్చేవి ఆ రోజులల్ల. అట్ల ఇనంగనే, మేం ఆ ఇల్లళ్లోకి జొరబడేది. భూస్వాముల బిడ్డలం గదా మేం. మేమంటే ఆల్లు జర భయపడేది. పోంగనే మంచమేసి, కూసోమనేది. ఆ మొగోల్లకు చెప్పేది మేం. అట్ల చేయద్దని.

మా మేనమామ పేరు లక్ష్మీనర్సింహారెడ్డి. మా నాయిన చనిపోయినాక, మా దగ్గరికే వచ్చి, మా ఇంట్లనే వుంటూ మా వ్యవసాయం చేయించేటోడు. ఆ సమయంలోనే ఆంధ్రమహాసభ వచ్చింది. రహస్యంగా పార్టీ సాహిత్యం కూడా వచ్చింది. ఆయన మా దగ్గరే వుండటంతో ఆయన కూడా పార్టీ ప్రభావంలో పడ్డాడు. దళాలలోకి వెళ్ళి దళ కమాండరుగా పనిచేశాడు. ఆయన పెద్ద కొడుకు అనిరెడ్డి వెంకటరెడ్డి. ఆ తరువాత అనిరెడ్డి రామిరెడ్డి, అనంతరెడ్డి, వీళ్ళంతా అన్నదమ్ములు. మా మేనమామకు ఏడుగురు

కొడుకులు వాళ్ళంతా చదువుకునే రోజుల్లోనే ఆంధ్ర మహాసభ పిలుపు ఇచ్చింది. అప్పటి విద్యార్థి సంఘం ప్రభుత్వ దౌర్జన్యానికి వ్యతిరేకంగా కాలేజీల్లో పోరాటం చేయాలని పిలుపు ఇచ్చింది. అప్పటికి అనిరెడ్డి రామిరెడ్డి, అనంతరెడ్డి ఇద్దరు ఇంటర్ చదువుతున్నారు. వీళ్ళు చదువు వదిలేసి, ఉద్యమంలోకి వచ్చారు. వీళ్ళతో పాటు, ఒక ముస్లిం అబ్బాయి, పేరు సరిగ్గా గుర్తులేదు, అతను కూడా ఉద్యమంలోకి వచ్చాడు.

మా బావ రాజిరెడ్డి కూడా ఇంటర్ వరకు చదువుకున్నాడు. మా అమ్మ మేనమావ కొడుకు ప్రతాపరెడ్డి. వీళ్ళిద్దరూ, స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా, బొంబాయిలో గాంధీ సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని వచ్చిన్రు. వాళ్ళు మా ఇంటికి సత్యాగ్రహం, స్వాతంత్ర్య పోరాటం వంటి వార్తలను తెచ్చిన్రు. ఆ తరువాత మా అన్నయ్య, ఆరుట్ల లక్ష్మీ నర్సింహారెడ్డి సంఘాన్ని కూడా తెచ్చారు. మా అన్నయ్య చదువుకోడానికి హైదరాబాదు వచ్చి, సంఘం ప్రభావంలో పడ్డాడు. మా ఊర్లో, మా ఇంట్లో మా అన్న, మా మేనబావ, మా అమ్మ మేనమామ కొడుకు, ఇట్ల అందరూ ఒక గుంపైపోయిన్రు.

దేవులపల్లి వెంకటేశ్వరరావు లా చదివిండు. ఆయన ప్రభావం కూడా నల్గొండ జిల్లాల వుండె. రావి నారాయణరెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి లాంటి వాళ్ల పేర్లు కూడా వినపడేవి. అట్ల మా ఇంట్లో అందరూ సంఘమే అయిన్రు. నేను అమ్మ నవల చదివిన. ఆ ప్రభావం కూడా వుంటది కదా! నేను పని చేయాలని అన్నది ఏదో అనుకొని చేసింది గాదు. చాలా సహజంగా జరిగిపోయింది. ఆ రకంగా ఇంట్లో రాజకీయ వాతావరణం ఏర్పడింది. నాకు పదకొండేళ్ళుండగా మా అన్నగారు నన్ను విజయవాడ పంపిండు, అక్కడ క్లాసులు ఇస్తున్నారు శిక్షణ తీసుకోమని. అది 1943 అనుకుంటా. అక్కడ ప్రధానంగా కమ్యూనిస్టు రాజకీయాలు చెప్పిన్రు. గెరిల్లా యుద్ధ శిక్షణ, ఆత్మరక్షణ పద్ధతులు నేర్పిన్రు. కొండపల్లి సీతారామయ్య, రాజేశ్వరరావ్ మాకివన్నీ నేర్పిన్రు. స్త్రీలకూ, పురుషులకూ సమానంగ ఇవన్నీ నేర్పిన్రు. ఒక బస్తను వేలాడగట్టి, ఒక మనిషితో పోరాడాల్నంటే ఎట్లకొట్టాలె, ఎక్కడ కొట్టాలెనని శిక్షణ ఇచ్చిన్రు. వీరుల్ని తయారు చేసేటటువంటి శిక్షణ అది. ఆ పాఠశాల నాకు బాగా నచ్చింది. మనం గనుక ఈ పోరాటంలో ఉన్నట్లయితే గొప్ప కార్యాలు చేయగల్గుతమని నమ్మకం ఏర్పడ్డంది. పురుషులకన్నా తీసిపోకుండా ఇందులో పాల్గొనాలని నిర్ణయించుకున్నాం. మా అక్కగారు కూడా ఆ క్లాసులకు హాజరయింది. సుగుణమ్మ, వాళ్ళ అక్క శశిరేఖగారు, ఇట్లా తెలంగాణ నుండి పదిపన్నెండుమంది ఆడవాళ్ళు వచ్చిన్రు.

మా అన్నగారు, మరి కొంతమంది కలిసి ఒక కమిటీ వేసుకొని దాని ద్వారా పనిచేస్తుండెటోల్లు. వాళ్ళు పేపర్లు, పుస్తకాలు పట్టుకొస్తుండె. మా అక్క వామపక్ష సాహిత్యం

బాగ చదివేది. ఇంతలో మా బృందం మధ్యకు మాక్జిమ్ గోర్కీ పుస్తకం 'అమ్మ' వచ్చింది. మా అందరిమీదా ఆ పుస్తకం గొప్ప ప్రభావాన్ని ఏసింది.

ఆ రోజుల్లో ఒక అలవాటుండేది. చదువురాని ఆడవాళ్లు పుస్తకాలను ఇతరులతో చదివించుకుని వినేటోళ్ళు. మా అమ్మగ్గూడా చదువురాదు. పక్కనున్న ఇండ్లలో కొంత చదువు వచ్చిన వాళ్ళుండేవాళ్ళు. వాళ్ళతో చదివించుకునేది. జమీందారీ ఇండ్లలో ఆడవాళ్ళు సామాన్యంగా రామాయణం, భారతం వంటి గ్రంథాలను చదివించుకునేవాళ్ళు, పుస్తకం పెట్టుకుని, పేజీలు తిప్పి చదువుకునే విధంగా ఉండే గమ్మత్తయిన చెక్క పలకల బల్ల వంటిది ఉండేది. దానిమీద పుస్తకం పెట్టుకొని, కింద కూర్చోని చదువుకునే అవకాశం ఉండేది.

ఇక ఈ 'అమ్మ' నవల వచ్చినప్పుడు మా అమ్మ ఎంబడి పడ్డాన్నేను – ఇది కూర్చోని చదువుదాం అని. ఆవులపాలు, బర్రెల పాలు సాయంత్రానికి ఇంటికి తీసుకొచ్చేవాళ్ళు. వాటిని దాలిలో కాగబెట్టేవాళ్ళు. అవి చల్లారినంక తోడుబెట్టే పనికోసం మా అమ్మ నిద్రగాస్తుండేది. ఆ సమయంలో కూర్చోని చదివినం గోర్కీ పుస్తకాన్ని. అందులో అక్షరం అక్షరం నా మీద ముద్ర పడిపోయింది. ఆ పుస్తకంలో అమ్మ పాత్ర మా అమ్మను బాగా ప్రభావితం చేసింది. తన కొడుకు కూడా ఉద్యమాల్లో ఉండటం, నిర్బంధాలు ఎదురవుతూ ఉండటం, ఇదంతా ఆమె మనసుకు గట్టిగా పట్టింది. ఆమె మీద ఎంతగట్టి ఇంప్రెషన్ పడిందంటే – ఆమె మా అన్నయ్యను 'సాషా' అని పిలవడం మొదలు బెట్టింది. రష్యాలో విప్లవం గురించి మాకు సరిగ్గా తెల్వదు. కానీ వాళ్ళక్కడ ఒక మంచి రాజ్యం కోసం, ప్రజల రాజ్యం కోసం పని చేసిన్రనే సంగతి మాకందరికీ అర్థమయింది. మా అన్నయ్య వాళ్ళంత ఒక మంచిపని చేస్తున్నారనే అభిప్రాయానికి వచ్చింది మా అమ్మ. మాకు దేనిలోనూ అడ్డుచెప్పకపోయెడిది. మా ఇంట్లో ఒక ప్రోత్సాహకరమైన వాతావరణం ఏర్పడింది. అట్లా బాల్యంలో నాకు కలిగిన ప్రేరణనూ, ఆలోచననూ ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేసిన. ఆ ప్రయత్నమే నన్ను ఈ ఉద్యమాల్లోకి నడిపించింది.

# 2

## తొలి అడుగులు

హైదరాబాదులో ఆంధ్రమహాసభ జరుగుతున్నదని మా అన్నయ్య వాళ్ళు వెళ్ళడానికి బయల్దేరిన్రు. బండి కదలడానికి సిద్ధంగా ఉన్నది. నేనొస్త, నేనొస్తనని వాళ్ళ ఎంటబడి బండెక్కిన. మా అక్క కూడా ఉత్సాహంగా ఉన్నది. ఆమె భర్త కూడా ఇందులో ఉన్నాడు. సరే, ఎట్లయితే ఏంది పోదామని అనుకున్నం. మళ్ళీ, అది బయట పడకూడదు.

హైదరాబాదుకు కొంచెం దగ్గర్లో జనగాం తాలూకలో దేవరుప్పల అనే ఊరున్నది. మా మేనత్తగారు అక్కడున్నరు. ముందు అక్కడికి వచ్చినం. అక్కడ నుండి హైదరాబాదులో సభకు హాజరయినం.

అక్కడ చాలా విషయాలు చర్చించిన్రు. దేశ స్వాతంత్రం, చదువు, హక్కులు, అందులో మైనర్‌ల హక్కుల గురించి కూడా చెప్పిన్రు. అక్కడ కమలాదేవి, ఇంకొకామె ఎవరో భూస్వాముల కుటుంబంలోని ఆమె, నాకిప్పుడు పేరు గుర్తులేదు – ఆమె కూడా అక్కడున్నది. దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా మూవ్‌మెంట్‌ను నడుపుతున్న రోజులవి. ఆమె అక్కడికి వచ్చినట్టులేదు.

కమలాదేవి అప్పటికి మాకన్నా కొంచెం ఎదిగిన వయసులోనే ఉన్నది. మహిళాశాఖ సమావేశం జరిపిన్రు. మహిళలకు పర్దా పద్ధతిని వ్యతిరేకించాలె, మహిళలకు ప్రత్యేక హాస్పిటల్ కోసం పోట్లాడాలె, ముఖ్యమైన విషయం మగవాళ్ళతో సమానంగా చదువుకునే హక్కుండాలె – ఇట్లా చాలా విషయాలు చర్చించిన్రు.

ఇదంతా ఇట్ల జరుగుతున్న సమయంలోనే వెట్టిచాకిరీకి, భూస్వాముల దోపిడి, దౌర్జన్యాలకూ వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం తీసుకున్నది. ఆంధ్రమహాసభ మొదటి దశలో సాంస్కృతిక ఉద్యమంగా మొదలయింది. ఆనాడున్న నినాదమేమంటే నైజాం పెత్తనం పోవాలె, ఉర్దూ భాషను మన నెత్తిన రుద్దటానికి వీల్లేదు, తెలుగు భాషకు ప్రాధాన్యత నివ్వాలె ఇట్లా ఉండేది.

నర్సింగరావు, బి.ఎన్ వాళ్ళందరూ దాన్లోచేరి ఉద్యమాన్ని గ్రామందాకా తీసుకొచ్చిన్రు. గ్రామాలకు వచ్చినంక ఇది పూర్తిగా భూస్వామ్య వ్యతిరేక ఉద్యమంగా మారింది. కూలీల రెక్కల కష్టాన్ని దోపిడి చేస్తున్నారు. "కోసుకు ఈసం" ఇయ్యాలెనని చట్టం వున్నా ఎవరూ లెక్కచెయ్యటం లేదు. కూలి పెంచాలెనని ఉద్యమం మొదలైంది. ప్రజలు భూస్వాములకూ, అధికారులకు చాకిరీ చెయ్యాలె. ఊళ్ళోకి ఏ అధికారి వస్తున్నాడన్నా ఊరోల్లు ఉరికిపోయి బరువులన్ని మోసుకు రావాలె. చాకలి, మంగలి, హరిజన కులాలన్నీ వంతుల వారీగా సామాన్లు మొయ్యాలె. బండ్ల ముందు ఉరకాలె. అధికారులు వచ్చినంక వాళ్ళకు వంటతోసహా చాకిరంత చెయ్యాలె. ఆ పనులకు గానూ వాళ్ళకేదో ఇంత ఇనాం మాన్యమని ఉండేది. అది పండినా, ఎండినా ఈ చాకిరి మాత్రం తప్పదు. వేరే కూలంటూ ఏమీ లేదు.

ఈ పరిస్థితుల్లో వెట్టి తీసెయ్యాలని కమ్యూనిస్టులు పిలుపునిస్తే, అది దావానలంగా అంటుకున్నది ప్రజల్లో. పటేల్లు, పట్వారిలు అందరి ఇండ్లల్ల వెట్టి చాకిరే సాగుతున్నది. దీన్ని రద్దుచెయ్యాలెనని ప్రచారం చెయ్యటమేగాక, ఆచరణలో పెట్టడానికి పూనుకున్నది

పార్టీ. కొంతమంది కామ్రేడ్స్ గుంపులుగా ఊరూరా తిరుగుతున్నరు. కూలీల అగచాట్లను వర్ణించుకుంట పాటలు కట్టి పాడెటోళ్ళు. ఆ పాటలు జనంలో మంచి ఊపుతెచ్చినై.

హైదరాబాదులో మీటింగ్‌కు మేము పోయి వచ్చినంక మా గ్రామంలో కూడా ఈ కార్యక్రమం మొదలుపెట్టిన్రు. మా అన్నగారు వాళ్ళంత ఏదో అండర్‌గ్రౌండ్ సమావేశం జరిపినట్లున్నది. వెట్టికి వ్యతిరేకంగా సమ్మె జరిపించాల్నని నిర్ణయించుకున్నరు. ఐతే మా బావగారు మళ్ళా వాళ్ళింటికి వెళ్ళిపోయిండు. మ అన్నయ్య మాత్రం చదువు మానేసి, పూర్తిగా ఈ పనుల మీదనే ఉన్నడు. ఆయనొక్కడే కూలీల సమ్మె చేయించాల్నని పూనుకున్నడు.

ఒక రాత్రిపూట మా జీతగాళ్ళతో సహా ఊళ్ళో వున్న జీతగాళ్ళందరినీ కూర్చోబెట్టి సమ్మెకు దింపుదామని మాట్లాడిండు. నేను కూడా అక్కడ ఉన్నాను కాబట్టి ఆ సంగతి తెలిసింది. ఈ సంగతి మా చిన్నాయనకు తెల్సింది. ఆయన పోలీస్ పటేల్‌గదా! తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌కు రిపోర్టు పంపిండు. సమావేశం అయినంక జీతగాళ్ళందరూ ఇళ్ళకూ, పొలాలకూ పోయిన్రు. ఇంట్లో మా అన్నయ్య ఒక్కడే ఉన్నడు. అర్ధరాత్రికి పోలీసులొచ్చిన్రు ఆయన్ను అరెస్ట్ చెయ్యడానికి. ఇక అరెస్టయితననే అనుకున్నడు మా అన్నయ్య. మా అమ్మ ధైర్యం చెయ్యడంతోనే అది తప్పింది.

పోలీసులకు చిక్కితె కొడుతరు. పెద్ద భూస్వాముల కుటుంబం కదా, జైళ్ళ పడుడు దెబ్బలు తినుడు నామోషి అనుకున్నట్లున్నది మా అమ్మ. పైగా అప్పటికే అక్కడక్కడ కొందరు కార్యకర్తలు అరెస్టయితున్నరు. నువ్వు తప్పించుకోవటమే అవసరమని ఆయనను ఒప్పించింది. ఆయనకు ముసుగేసి, చేతికి బైటపోయే చెంబు ఇచ్చి ఇంటెన్కకు పంపింది. ఇంట్లో డబ్బులు కూడా సరిగ్గా లేవు. ధాన్యంతోటే మారకమంత జరుగుతుండేది. గుమ్మిలో నుండి ఇన్ని జొన్నలు తోడి ఒక సంచిలో పోసి నా చేతికిచ్చింది. ఆయనకు ఏమయినా కొనుక్కునేదుంటె ఉపయోగపడతయని. అన్నయ్యను వెంట బెట్టుకొని పోయి ఇక్కడినుండి తప్పించు, నేనిక్కడ పోలీసులకు సమాధానం చెప్తనన్నది.

తర్వాత ఆమె బైట దర్వాజ దగ్గరకొచ్చి పోలీసులతోని కొట్లాట పెట్టుకున్నది. అప్పుడు కొన్ని కానూన్లుండేటివి – ఇంటిలోపలున్న ఆడమనిషి మొకం అవుతలోళ్ళు చూడొద్దు, కిటికీలోనుండి కూడ లోపలికి చూడొద్దు. రాత్రిపూట పోలీసులు ఇంటిమీదికి రావద్దు – ఇట్లాంటివి. వాటిని అడ్డంపెట్టుకునే పోలీసులతోని గొడవ పెట్టుకున్నది మా అమ్మ.

“నా కొడుకు ఇంట్లో లేడు, చదువుకోనికి పోయిండు. వాడు రాత్రి రానేలేదు. అయినా వాడిని అరెస్టు చేయవలసిన కారణం ఏందో చెప్పాల”ంటూ గొడవ పెట్టుకున్నది.

ఇల్లు సోదా చేస్తమన్నరు వాళ్ళు. "మొగవాళ్ళు లేనప్పుడు అర్ధరాత్రి మీరు జనానాలోకి రావటానికి కానూన్ లేదు. నేను దర్వాజ తీయను - కావాల్నంటె రాత్రంతా ఇంటి ముంగట్నె కూచోండి. తెల్లారిన తర్వాతనే తలుపు తీస్త. అప్పుడు సోదా చేసుకోండి", అని ఎదురు తిరిగింది. పోలీసులు సోదాకు వచ్చేదుంటె ముందుగా చెప్పి పంపాలె. జనానాలో ఆడవాళ్ళు తెరలూ అవీ ఏర్పాటు చేసుకున్నంకనే సోదా చెయ్యాలె - అది ఆనాటి కానూను. అదంత మా అమ్మకు ఎట్ల తెలిసిందో మరి. అప్పటికే ఆమెకు కొంత పరిజ్ఞానం ఉన్నదన్నమాట.

"నీ కొడుకు దొంగ - అట్ల తిరుగుతుండు, ఇట్ల తిరుగుతుండు, నువ్వే దాచినవు, తప్పిస్తున్నవు" అని వాళ్ళేమో వాగిన్రు. మా అమ్మ ఎంత మంచి సమాధానం చెప్పిందో! "నా కొడుకు దొంగ కాడు. గాంధీ మహాత్ముడు ఏ ఉద్యమం చేస్తుండో అదే ఉద్యమం చేస్తున్నడు. ఆ గాంధీ మహాత్ముడికి సెల్యూట్ కొట్టినట్లుగ ఎప్పుడో ఒకసారి నా కొడుకుకు కూడా మీరు సెల్యూట్ కొడుతరు", అని జవాబిచ్చింది. పోలీసులు తెల్లారిందాక ఉన్నారు. పొద్దున తలుపు తీసి చూసి వెళ్ళిపోయిన్రు. ఆ తర్వాత కాలంలో కూడా మా అమ్మ దాదాపు ఒక ఉద్యమ కేంద్రాన్ని నిర్వహించిందని చెప్పాలె. ఊరేగింపులు తీస్తుంటే ఆమె గాడి పొయ్యి తవ్వి, గుండిగలు పెట్టి అన్నం వండి పెట్టింది. రజాకార్ల దాడి సమయంలో ఆడవాళ్ళందరిని సమావేశపరిచి, "భయపడవద్దు, ఒక చోట కలిసివుందాం. పోతే అందరం ఒకసారి పోదం" అంటూ ధైర్యం చెప్పిన మనిషి.

ఆ రాత్రి అన్నయ్యను తప్పించమని నన్ను పంపింది. నేను ఇంటెనుకకు తీసుకపోతే, ఆయన అటునుండి వెళ్ళిపోయిండు. అన్నయ్య వెళ్ళిపోతూ నాకొక పని అప్పజెప్పిండు. "మరి నేను పోతున్న. ఈ జీతగాళ్ళు సమ్మె చేయరు, పోలీసులు వచ్చినంక భయపడుతరు. కాబట్టి నువ్వు ఒక ఉపాయం చెయ్యి. గొల్లల వాడకుపోయి, వాళ్ళు పనికి పోకుండ ఆప"మన్నడు. మా అక్కగారు కూడా ఇంట్లనే ఉన్నది. ఇద్దరినీ వెళ్ళమని చెప్పిండు. అయితే ఆమెకి పెండ్లయ్యింది గదా, ఆమె వద్దన్నది మా అమ్మ. మా బావగారు కూడా అడ్డు చెప్పలేదు. కానీ మా అమ్మ పంపలే.

నేను తెల్లారి లేచి గొల్లోల వాడలకు పోయి వాళ్ళందరినీ మా చెలకల పనివున్నది, మా పనికి రాండ్రని పిల్చిన. వాళ్ళందరూ భయపడ్తున్నరు. రాత్రి పోలీసులు వచ్చిన్రట, దొరను పట్క పోయిన్రట. నువ్వెందుకు వచ్చినవు దొరసాని - అంటున్నరు. కాదు, మాకు పనివున్నది రమ్మని ఎంటబడిన. నేనట్ల ఎంటబడితె వాళ్ళు భయపడిన్రు. ఎటుపోతున్నరని అడిగితే ఫలానా వాళ్ళ పనికి పోతున్నమని చెప్పారు. మా చిన్నాయన పనికే పోతున్నరన్నమాట.

కూలీలను పనికి పోనియ్యవద్దని చెప్పిండేగానీ, ఏం చెయ్యాల్నో అన్నయ్య చెప్పలే. మిమ్మల్ని పోనియ్యనని వాళ్ళ తోవకు అడ్డం పడుకున్నా. వాళ్ళు వినకుండ పోబోతున్నరు. నా మీదికెల్లి దాటిపోతే పొమ్మని డొంకల అడ్డం పడుకున్న. నీకు మొక్కుతం దొరసాని ఎల్లిపొమ్మని వాళ్ళు బతిమాలిన్రు. నేను కదలలే. విప్లవం అంటే ఇట్లనే చేయాల్నని అనిపించింది. 'అమ్మ' పుస్తకంలో చదివినం కదా, ఇటువంటి పరిస్థితుల్లో ఏం చేయాల్నో దాని నుండే గ్రహించిన.

నన్ను దాటిపోలేక, ఇక లాభం లేదనుకున్నరు. పనికి పోకుండ తప్పించుకోనీకి వెళ్ళి కట్టెలన్న ఏరుకొచ్చుకుంటమన్నరు. గుంట కాడికి పోయి కట్టెలేరుకొని చీకటి పడ్డంకనే ఇళ్ళకు తిరిగి పోయిన్రు. అట్ల ఆరోజు సమ్మె జయప్రదమయింది.

మర్నాడు మా చిన్నాయన వాళ్ళను పనికి పిల్చిండని తెలిసి మళ్ళా అక్కడికి పోయిన. కూలోళ్ళనేమనొద్దు, నన్ను కొట్టినంకనే వాళ్ళను కొట్టాలెనంటూ అడ్డం నిలబడ్డ. ఎందుకట్ల వచ్చినవని ఆయన నన్ను కోప్పడ్డడు. వాళ్ళతోని పని చేయించుకుంటున్నరేగాని చట్ట ప్రకారం కూలి ఇస్తలేరు. నాలుగుపైసలే ఇస్తున్నరు. కూలి రేట్లు పెరగాల్నని ఆంధ్రమహాసభ నాయకత్వాన సమ్మె చేస్తున్నం. అదేమీ చట్ట వ్యతిరేకం కాదు – అని నేను వాదించిన.

ఇక నాతో మాట్లాడితే లాభం లేదనుకొని వాళ్ళను తిట్టుడు మొదలు పెట్టిండు. కొడ్తమని వాళ్ళమీది కొస్తున్నడు. దెబ్బ నామీద పడ్డంకనే వాళ్ళమీద పడాలని ముందుకొచ్చిన. అందరూ నోరు తెరిచిన్రు, ఆశ్చర్యంతో. ఇప్పుడిక ఏమన్న అంటే ఈ అమ్మాయి గొడవ చేసేటట్టున్నది. చిన్నపిల్లనేగానీ, భూస్వామి బిడ్డనుగదా. కొట్టినంక ఏమయితదోనని ఊకున్నరు. కూలి పెంచితేనే పనికి వస్తమని చెప్పండని కూలోళ్ళకు చెప్పినా. దానిమీద ఊరిలో చర్చ మొదలయింది. కొందరు గట్టిగ వాదించిన్రు. నాలుగురోజుల తర్వాత కొంతరేటు పెంచిన్రు. అప్పటిదాక సోలెడు జొన్నలుండె. మూడు సోళ్ళో ఏమో పెంచిన్రు. దాంతో కూలీల సమ్మె జయప్రదమయింది. ఇది పేద వర్గాలకు చైతన్యం కలిగించటానికి ఉపయోగపడింది. సాంఘిక వ్యవస్థను బ్రేక్ చేసినట్లయింది.

ఇది జరిగినప్పుడు పన్నెండేళ్ళున్నయి నాకు. పైజామా, షర్టు ఏసుకుని చిన్న పిల్లగనే ఉంటిని. అప్పట్లో ముస్లిం నాగరికత ప్రకారం భూస్వాముల ఆడపిల్లలంత అట్లనే దుస్తులు వేసుకునేవాళ్ళు. పైన దుపట్టా లాంటిదేమీ ఉండేదికాదు. మగపిల్లలెక్కనే వేసుకునే వాళ్ళం. పెద్ద మనిషయినాక చీరలు కట్టేవాళ్ళు.

ఈ కూలీల సమ్మె నా జీవితంలో పెద్ద మలుపు. నాకప్పటికి సిద్ధాంతం అదీ ఏమీ తెల్వదు. అన్నయ్య చెప్పిన పని చేస్తున్న, అంతే. కాకపోతే, పేద ప్రజలందరూ ఏకమై

భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడాలె. రష్యాలోలాగా సోషలిస్టు సమాజం రావాలె – అని జనరల్‌గా తెలుసు, అంతే. ఆ అభిప్రాయాలను ఆచరణలో పెట్టడానికి ఈ అవకాశం దొరికింది. నా ఉద్యమ జీవితంలో మొదటి అడుగు అదే.

# 3

## ఐలమ్మ పోరుకు అండగ

కూలీల సమ్మె జరిగిన తర్వాత జనానికి కూడా ఉత్సాహం పెరిగింది. ఆ అనుభవం తీసుకొని మా అన్నయ్య, రావి నారాయణ రెడ్డి వంటి నాయకులు చుట్టుపక్కల ఊళ్ళల్లో కూడా వెట్టికి వ్యతిరేకంగా ప్రచారం మొదలు పెట్టిన్రు. ఈ సమయంలోనే మేము కమ్యూనిస్టు సాహిత్యం చదవటం మీద బాగా శ్రద్ధ పెట్టినం.

ఊర్లో మా పాలోల్లందరికీ మా మీద కోపం వచ్చింది. మా చిన్నాయనలొచ్చి మా అమ్మతోని పంచాయతి పెట్టిన్రు. దాంతో మా అమ్మ బాధపడి ఏడవటం మొదలుపెట్టింది. ఇంకా ఇక్కడనే ఉంటే గొడవలైతయని నన్ను మా మేనత్త దగ్గరికి పంపుతనన్నది. అప్పటికి మా అక్క, బావ లీగల్‌గా కొన్ని పనులు చేస్తున్నారు. వాళ్ళు కూడ నన్ను మందలించిన్రు – ఇట్లెందుకు తెగబడ్డవని. అంత తొందరగా తిరుగుబాటు రావాల్నంటె ఎట్లయితది, ఒక్కొక్కరుగ ప్రజలు వాళ్ళే వస్తరని అన్నారు. నా మనసుకయితే నేను చేసింది సరైనదేనని అన్పించింది.

ఇక కొంచెం హెచ్చు తగ్గులుగనైన ఉద్యమం నడుస్తనే ఉన్నది. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాడాలన్నది బాగా ప్రచారమవుతున్నది. జనం మొదట్లో భయపడ్డరు. కానీ ఉద్యమకారులు ఒక దళంగా బయలుదేరి పాటలు పాడుకుంట జనం దగ్గరికి పోతుండిరి. దొరల కచ్రాల వెంట జీతగాళ్ళు, సాకలోళ్ళు పరిగెత్తే పద్ధతి ఉండేది. ఒకసారి అట్ల పరిగెత్తిస్తున్న సంఘటన చూసి మా అన్నయ్య బాగా ఆవేశపడ్డాడు. పరిగెత్తే మనిషిని రెక్కపట్టి గుంజేసిండు. బండిలో పోతున్న భూస్వామి దిగి, కొట్టబోయిండుగని, అంత ధైర్యం చెయ్యలేక పోయిండు. నీ సంగతి జూస్తనని బెదిరించి ఎల్లిపోయిండు. ఇట్ల జరుగుతున్నదని తెలిసి దొరలంతా గూండాలను తయారుజేసిన్రు. ఒకసారి అట్ల తిరగబడిన జీతగాళ్ళు మళ్ళా ఊళ్ళలో ఉంటే రక్షణ ఉండదు. వాళ్ళను వేరేచోట ఉంచాలని నిర్ణయించిన్రు. ఇట్ల జీతగాళ్ళు ఒక్కొక్కరుగా వచ్చి సంగంలో చేరటం మొదలయింది.

ఊర్లతో సంబంధం పోయినంక వాళ్ళందరూ బయటికి వచ్చేసిన్రు. వేరే ఊర్లలో, చుట్టాల దగ్గరా సంగం కార్యకర్తల దగ్గరా ఉండేటోళ్ళు. ఎక్కడ అడిగినా తిండి దొరుకుతుండేది. సంగం చిట్టి తీసుకున్నరంటే వాళ్ళకు ధైర్యంగా ఉండేది. కొన్నాళ్ళ

తరవాత భూస్వాములు కొంత రాజీకి వచ్చిన్రు. జీతం పెంచుతామని ముందుకొచ్చిన్రు. అట్ల జీతగాళ్ళకూ, కూలోళ్ళకూ సంగం చిట్టి తీసుకోవాల్సనే ఆసక్తి పెరిగింది.

ఇక మా అమ్మ నన్ను మా మేనత్త దగ్గరికి దేవరుప్పలకు పంపింది. పెళ్ళిగాని పిల్ల ఇట్ల తిరుగుతుంటె కేసులొస్తయని మా అమ్మ భయం. అందులోనూ మా మేనత్తకు లేకలేక ఒక కొడుకు పుట్టిండు. దగ్గరుండి సాయం చెయ్యటానికి ఉపయోగ పడుతనని కూడా ఆలోచించింది.

ముందుగా నన్ను, ఆ తర్వాత మా చెల్లెనుగూడ పంపింది. ఆ ఊర్లో ఒక బడి కూడా వుంది. అమ్మకు నేను బాగా చదువుకోవాలని ఆకాంక్ష. మా అన్నయ్యేమో, చదువు బంద్‌చేసి, వెనక్కి వచ్చేయడంతో మేం మా మేనత్త దగ్గర వుంటే అక్కడ మమ్మల్ని బాగా చదివించొచ్చనుకునేది. మా అక్కా, బావ సంఘంలో వున్నా, వాళ్ళు పెద్దవాళ్ళు కాబట్టి, పనిచేయవచ్చనుకునేది. అప్పుడు మా అత్త దగ్గర దాదాపు మూడు నెలలున్నా. మా అత్త వాళ్ళ అత్తగారోల్లు బాగా వున్నవాళ్ళు. జీతగాల్లు, ఆడోల్లు, మొగోల్లు పని చేస్తే వాల్లకు సజ్జలు, జొన్నలు వంటివి పెట్టేటోల్లు. ఒక రోజు మా మేనత్త జొన్నలు దంచుతుండే, పొరపాటున ఆమె వేలు మీద పోటుపడి, చితికి నెత్తురొచ్చింది. దానితో అత్తా కోడల్లు పంచాయితీ పెట్టుకున్నరు. మా మామ వచ్చి మా అత్తను ఒక్క చెంప దెబ్బ ఏసిండు. దానితో ఆమె ఏడ్చుకుంట, అన్నంతినకుండనే, లోపలికిపోయి పండుకున్నది. ఆమె పిల్లగాడేమో ఏడుస్తున్నడు. అప్పుడు నేనేమో ఆ పిల్లగాడిని దీసికోని అక్కడి గుడికెల్లిన. అక్కడ ఆంధ్రమహాసభ ముచ్చట్లు రైతులు మాట్లాడుకుంటున్నరు. నాకు ఎందుకో బాగా సంతోషమైంది. అక్కడనే ఆ రోజు ఉయ్యాల పాటలు పాడుకున్నం. అక్కడికి మా మేనత్త పాలోల్ల పిల్లలు మర్రివారని ఒక కుటుంబం వుంటుండె. మర్రి దామోదర్ రెడ్డి అంటరు. వారి పిల్లలు కూడా వచ్చిన్రు. అప్పటికే వాళ్ళు ఆంధ్రమహాసభలో చేరి విసునూరి దొరోరికి తెల్వకుండ కార్యక్రమాలు చేసేది. పట్టాలు, కమతాలు, చట్టాలంటూ చర్చలు చేస్తున్నారక్కడ. నేను గుళ్ళో పాటలు పాడిన సంగతి. ఈ పిల్లలు పోయి వాళ్ళ ఇంట్లో చెప్పినట్లుంది. వాళ్ళు నన్ను పాటలు పాడేందుకు పిలిచారు. వాళ్ళింటికి పిలిస్తే పోయిన. అక్కడ రష్యా గురించి పాడిన. అక్కడి వాళ్ళకి కొత్తగా అనిపించింది. ఈ అమ్మాయికి ఇన్ని రాజకీయాలు తెలుసునా అని వాళ్ళనుకున్నారు. మా మేనమామ కూడ ఒక భూస్వామి. ఆయన ఉద్యమానికి అనుకూలంగా లేడు. ఐనా నేను బంధువుల అమ్మాయిని కనుక రక్షణ ఉంటదని మా అమ్మ ఆలోచన.

నేను ఆ ఊరికి పోయేవరకే అక్కడ ఆంధ్రమహాసభ ప్రభావ మున్నది. ఆ ఊరి పరిస్థితి చూస్తే, ప్రజల్లో కొద్దిమందికే భూములున్నయి. కౌలుదార్లకు హక్కులు లేవు.

భూములన్నీ విసునూరు జమీందారు కిందనే ఉన్నయి. దొర దౌర్జన్యాలకు అంతులేకుండున్నది. అందుకని ఊరువూరంత దొరకు వ్యతిరేకంగా ఉన్నది. ఈ పరిస్థితి ఆంధ్రమహాసభకు బాగ అనుకూలమయింది. ప్రజలు ఉద్యమంలోకి వచ్చిన్రు. అందువల్ల ఊరిలో ఆంధ్రమహాసభ జెండాలు, నినాదాలు ఉండేవి.

నేను చిన్నప్పటినుండి బాగ పాటలు పాడేదాన్ని. ఆంధ్రమహాసభ పాటలుగూడ బాగా పాడేదాన్ని. చిన్న అమ్మాయి, మంచిగ పాడుతున్నదని అందరూ పాటలు పాడించడం, మాట్లాడించడం చేసిన్రు. సమావేశాల్లో పాల్గొనే అవకాశం బాగా దొరికింది.

అప్పుడే ఐలమ్మ సంఘటన జరిగింది. భూస్వామి దగ్గర భూమి కౌలుకు తీసుకున్నది ఆమె. ఆ భూమిని కాజెయ్యటానికి రామచంద్రారెడ్డి దొర ఏజెంటు ప్రయత్నం చేస్తున్నాడు. ఐనాగాని, ఐలమ్మ ధైర్యం చేసి ఆ భూమిని పట్టింది. భూస్వామి ఏజెంటు ఆమెకు అడ్డం తగిలిండు. ఒక యజమాని దగ్గర కౌలుకు తీసుకున్నంక మరొకరు అడ్డం వచ్చుడేందని ఆమె వ్యవసాయం కొనసాగిస్తున్నది.

ఆమెకు భూమినిచ్చిన యజమానిగూడ అండగా నిలబడి, సంఘం దగ్గరకు పొమ్మని సలహాయిచ్చినట్లున్నాడు. అప్పుడు జనగాం తాలూకా నల్లగొండ జిల్లాలో ఉన్నది. ఆమె దేవరుప్పలకు వచ్చింది. అక్కడ ఆమె సమస్యలన్నిటినీ చర్చించి సూర్యాపేటకు పంపిన్రు. మా అన్నయ్య వాళ్ళు కొంతమంది అప్పటికే దళాన్ని ఏర్పాటు చేసిన్రు. భూస్వాములనుండి దాడులు వస్తాయి కాబట్టి మనం వట్టిగా పోవద్దు, ఆత్మరక్షణకు కర్రలు పట్టుకొని పోవాల్నని తయారై ఉన్నారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు, ధర్మబిక్షం వాళ్ళందరూ కూడా ఉద్యమంలో ఉన్నారు.

సంఘం వాళ్ళందరూ ఆలోచించి, ఇప్పుడేం చేయమంటవని ఐలమ్మనే అడిగిన్రు. దానికామె పంట తయారైంది, దీన్ని నా చేతికి రానియ్యకుంట కోసుకుపోతారు. దేవరుప్పలలో కూడ కౌలుదార్లు ఉన్నారు. వీళ్ళందరూ కూడా సంఘం కొరకే ఎదురు చూస్తున్నరు, పైగా నా పొలం యొక్క యజమాని కూడ నా తరపునే ఉన్నాడు. కాబట్టి మీరు ఎట్లనైన వచ్చి ఈ పొలం కొయ్యాలెనని అన్నది. సరే వస్తమని చెప్పి, కొడవళ్ళు తయారుంచమని చెప్పిన్రు. ఒక బ్యాచ్‌గ వెళ్ళి అక్కడి కూలోళ్ళను గూడ దించి, పాటలుపాడి ఆ కోతల పని పూర్తి చెయ్యాలెనని నిర్ణయించిన్రు.

తెల్లారి మళ్ళా గూండాలు వచ్చిన్రట. ఎవరైనా పొలంలో దిగితే చంపేస్తమని బెదిరించడంతో ఊరోళ్ళు భయపడిన్రు. మా అన్నయ్య దేవరుప్పల వచ్చిండు. మా అన్నావాళ్ళు సూర్యాపేట దిక్కు తిరుగుతున్నరు. మా అన్నది ఈ వైపు బాధ్యత కాదు. అయినా సరే, దేవులపల్లి వెంకటేశ్వరరావు మా అన్న దగ్గరికి యాదగిరిరావును పంపించిండు. ఐలమ్మకి మద్దతుగా మా అన్నయ్య, ఇంకా సంఘం వాళ్ళందరూ పోవాలని నిర్ణయించిన్రు.

పాలకుర్తిలో సభ పెట్టిన్రు. ఆ సభలో పాటలు పాడటానికి అన్నయ్య నన్ను తీసుకుపోయిండు. మా మేనత్త, మేనమామ గూడ ముందుగాల కోప్పడిన్రు గానీ తరువాత ఊరుకున్నారు. వాళ్ళ పిలగాడిని ఎత్తుకునేందుకు అక్కడవున్నా కదా. బడికి పోవడానికి వీలు కాలేదు. "మా చెల్లిని మల్ల మా ఇంటికే తీస్కబోతున్న" అని అక్కడివాళ్ళతో చెప్పి, నన్ను మీటింగ్‌కి తీసుకెళ్ళాడు మా అన్నయ్య. ఆ మీటింగ్‌కి దేవులపల్లి వెంకటేశ్వరావు, ఇంకా ఎవరెవరో పెద్ద పెద్దోల్లే వచ్చిన్రు. అక్కడ పాటలు పాడిన. ఐలమ్మ ఇంటికాడ వంటలు చేసిన్రు. అక్కడే తిన్నం. ఆ తరువాత పొలం కోసిన్రు.

కూలోల్లు కూడ కోతకు దిగిన్రు. పంటనంత కోసి రాసి వేసిన్రు. మళ్ళా గూండాలొచ్చి పొలంలనే దాడి చేసిన్రు. దాంతో ఈ సమస్యను గట్టిగ తీసుకోవాలని మా వాళ్ళంత నిర్ణయించిన్రు. దేవరుప్పలను కేంద్రంగా పెట్టుకొని, చుట్టుపక్కల ప్రచారం చేసి మీటింగ్‌లు పెట్టాల్నని ప్లాను చేసిన్రు. నేను కూడ అక్కడనే ఉన్న కదా. పాటలు పాడెటందుకు వెంకటేశ్వర్రావని ఇంకొక ఆయనగూడ ఉన్నాడు.

ఇక, ఈ పాటల విషయం కొంచెం చెప్పాలె. అప్పటికి జనరల్‌గా కొన్ని పాటలున్నయిగాని, అక్కడి ప్రజలు పాడుకొనే బాణీల్లో ఉయ్యాల పాటల వంటివి లేవు. మామూలుగా పేదవాళ్ళ గురించి పాడుతుంటె వాళ్ళకు కొంత వరకూ అర్థమయితాయి. కానీ ఆ భాషా, అదీ ఏం చెయ్యాల్నో తెలుస్తలేదు. మొదటినుండి ఎప్పుడూ నా పాయింట్ అదే. అందుకని వాళ్ళు ఏం చేయాలప్పుడు?

ఆ రోజుల్లో ఆడోళ్ళు – హరిజనులు, బిసిలు వాళ్ళ వాడల్లో రాత్రిపూట వడ్లు దంచుకుంట పాటలు పాడెటోళ్ళు. జరంత వెన్నెలున్న రాత్రుళ్ళలో ఈ పాటలు ఏం సక్కదనముండె? ఇండ్లల్ల పడుకున్నోళ్ళకు గూడ హాయిగా వినొస్తయి ఈ పాటలు. వాళ్ళు అనేక విషయాలపై పాడుతుండిరి. దేవుళ్ళ గురించి పాడుతారు, జీవితాల గురించి కూడ పాడుతారు –

ఆడపుట్టుకై నేను ఎందుకూ పుడితినే
ఎట్టయిన అడవిలో చెట్టన్నగానైతి
కోడాల కోడాల కొత్త కోడాల
పచ్చిపాల మీద మీగడేమాయె
వేడి పాలమీద వెన్న ఏమాయె
అమ్మరో ఓయమ్మ ఆకాశమమ్మ
పచ్చిపాలమీద మీగడుంటుందా
వేడి పాలమీద వెన్నలుంటాయా

– ఇట్ల పాడుకునేటోళ్ళు. సమాజంలో పేదింటి ఆడవాళ్ళకు ఇటు ఇంట్ల అత్తల పెత్తనం, బయట దొరల పెత్తనం. ఈ కష్టాలను గురించి పాడుకునేటోళ్ళు. ఇక మనం పోయి అండ్ల జొరబడ్డమంటే మనం చెప్పదల్చుకున్న సంగతులు చెప్పటానికి మంచి అవకాశమని నాకు అర్థమయింది. వాళ్ళ భాషలో, బాణీల్లో పాటలు కట్టడం మంచి మార్గమని ఆ సమయంలో ముందుగా మొదలు పెట్టిందయితే నేనే.

భారతి భారతి ఉయ్యాలో
మా తల్లి భారతి ఉయ్యాలో
జనగామ తాలూక ఉయ్యాలో
విసునూరి దొరోడు ఉయ్యాలో
నైజాం రాజ్యాన ఉయ్యాలో
నాగిరెడ్డి పాలన ఉయ్యాలో
వెట్టి చేయలేక ఉయ్యాలో
చచ్చిపోతున్నం ఉయ్యాలో
పచ్చి బాలింతల ఉయ్యాలో
పట్టి ఈడ్చుకపోయె ఉయ్యాలో
ఉయ్యాల్ల పిల్లలు ఉయ్యాలో
పసిబిడ్డలమ్మ ఉయ్యాలో
నోరెండి చచ్చిరే ఉయ్యాలో
గట్టు మీద ఉన్న ఉయ్యాలో
దొరను బతిమాలితె ఉయ్యాలో
అయ్యా నీ బాంచెనని ఉయ్యాలో
పాలు ఇవ్వొద్దనె ఉయ్యాలో
కాల్లు మొక్కినగాని ఉయ్యాలో
పాలివ్వ నియ్యడె ఉయ్యాలో
పసిపిల్ల నోరెండి ఉయ్యాలో
చచ్చిపోతుందని ఉయ్యాలో
అడిగినందుకు చూడు ఉయ్యాలో
రొమ్ముల మీద చెయ్యేసి ఉయ్యాలో
పాలు పిండి(నమ్మ ఉయ్యాలో
.... ... .... ....
.... .... .... ....

కూడు గుడ్డలేక ఉయ్యాలో
గుడిసె లేకుండా ఉయ్యాలో
ఎందుకు ఈ బతుకు ఉయ్యాలో
తిరగబడలేమా ఉయ్యాలో
ఊరంత ఏకమై ఉయ్యాలో
తిరగబడ్డానాడు ఉయ్యాలో
ఉందురా ఈ దొరలు ఉయ్యాలో
ఊరెళ్ళి పోవుదురు ఉయ్యాలో
ఈ భూమి మనదమ్మ ఉయ్యాలో

– ఇట్ల పాడెటోళ్ళం. ప్రజల భాషలో, బాణీలో ఈ పాట కట్టింది నేనే. ఏ ఊరికి పోతే, ఆ దొర పేరుచెప్పి వాళ్ళు చేసే దౌర్జన్యాలను చెబుతూ పాడేదాన్ని. ప్రజలు ఈ పాటలను మంచిగ స్వీకరించిన్రు.

అన్నయ్య చెప్పిన మాటమీద ఏనాడు కూలివాడల్లో జొరబడ్డానో, ఇప్పటికి అవే వాడల్లున్న, నా ఉద్యమ జన్మస్థానాలు ఆ వాడలే. నా ఉపన్యాసాలకు విషయాల్ని అందించింది, నా పాటలకు బాణీలనిచ్చింది, నా జీవితానికొక చరిత్ర నిచ్చింది వాళ్ళే.

ప్రజలంతా ఈ పాటలను అందుకున్నరు. కూలి చేసే మేస్త్రి ఉంటదిగదా, ఆమె నేను చెప్పిన పదమే పాడాల్సిన అవసరం లేదు. వాళ్ళ వాళ్ళ బాధలు, భూస్వాములు పెట్టిన బాధలు జోడించుకుంట పాడుతుంటే, మిగతా కూలీలందరూ అందుకునేటోళ్ళు. ఇట్ల ఈ పాటలు ప్రసిద్ధి అయినై, పాటలు ఎప్పుడూ సజీవంగా కొనసాగినై. ఆ సమయంలో నేనుగూడ దాదాపు ముప్పై ఊళ్ళు తిరిగి, పాటలు పాడినా.

ఒక్కొక్క ఊరిలో సంఘాన్ని గురించి ప్రచారం చెయ్యటానికి నా పాట ఒక సులువైన మార్గమయింది. తిరుగుబాటు విజయవంతమై గ్రామ రాజ్యాలు ఏర్పడినంక గూడ నాకు బాధ్యతలు అప్పజెప్పిన్రు. ఒక పక్కన తుపాకి పట్టుకుని, మరొక పక్కన మంత్రసాని పనికూడ చేసిన.

జనంలో నిప్పు రగిల్చి, తిరుగుబాటు చేయించడానికి ఒక సాధనమయింది నా పాట. అంతకంటె ఇంకేం కావాలె నాకు?

ఐలమ్మ భూమిలో పంట కోసిన తర్వాత మళ్ళ గూండాలు వస్తే, మనోళ్ళంత తరిమికొట్టిన్రు. పాలకుర్తిలో సభ జరిగింది. నేను కూడా పాల్గొని పాటలు పాడిన. ధర్మానాయక్ తండలో ఉండి, రెండు మూడు రోజులు చుట్టుపక్కల ఊళ్ళన్ని తిరుక్కుంట పాటలతో, ఉపన్యాసాలతో ప్రజలకు అన్ని విషయాలు చెప్పినం.

ఊరికి రక్షణగా నిలబడుతూనే ఇదంతా చేసింది సంఘం. గూండాలను, మిలిటరీ ఫోర్సును ఎదిరించి నిలబడ్డం. ఐలమ్మ ధైర్యంగా నిలబడ్డది. "దొరోడు ఏం పీకుతడో జూస్త"నని అనగలిగేటంత నిబ్బరాన్ని సంఘం ఆమెకు అందించింది. సంఘం నాయకులు పది పన్నెండు మందిని పండుకున్నోళ్ళను పండుకున్నట్టె అరెస్టు చేసిన్రు పోలీసులు. వాళ్ళలో మా అన్నయ్యతోబాటు, మా మేనమామ కొడుకు కూడ ఉన్నడు. రాంచంద్రారెడ్డి, తిర్మల్‌రావ్, యాదగిరిరావ్ వీళ్ళంతా ఉన్నరు. ఐలమ్మ భర్తను కూడ పట్టుకొని జనగాం జైల్లో పెట్టిన్రు. ఆసనాల్లో కారంబోసి కొట్టి, మూత్రం దాపి చిత్రహింసలు పెట్టిన్రు.

ఈ సమయంలో ఐలమ్మ చాలా ధైర్యంగా నిలబడ్డది. సద్దిగట్టుకొని హైద్రాబాదుకొచ్చి రావి నారాయణరెడ్డి వంటి నాయకులను కలుసుకుని అన్ని విషయాలు చెప్పింది. అవన్నీ, పేపర్లల్ల వచ్చినై. మనోళ్ళంత కలిసి ఆందోళన చేసిన తర్వాత వాళ్ళంతా విడుదలైనరు. ఆ రోజుల్లో ఒక గ్రామీణ స్త్రీ ఇంత ధైర్యంగా నిలబడ్డదంటే చిన్న విషయం కాదు. అందుకే ఆమె తన భూమిని దక్కించుకోగలిగింది. మంచి చెడ్డలన్నిటినీ తట్టుకొని నిలబడ్డది. ఐలమ్మ చేసిన పోరాటానికి కమ్యూనిస్టు పోరాట చరిత్రలో గౌరవనీయమైన స్థానమున్నది. రావి నారాయణరెడ్డి, సుందరయ్య వంటి నాయకులు ఆమెను గురించి పుస్తకాల్లో రాసిన్రు.

మా అక్క, బావ పాలకుర్తి మీటింగ్‌లకు రాలె. అప్పుడు వాళ్ళు మా ఇంటికాడే వున్నరు. నా లెక్కేమో, మొదటి సంది ఫీల్డ్ మీదకి రావాలెనని. వాళ్ళు ఆ తరువాత సంఘం అభివృద్ధి అయినంక బాధ్యతలు తీసుకున్నరు. పార్టీ రహస్య జీవితంలోకి వచ్చిన్రు. మా అక్క మంచి ఉపన్యాసకురాలు. నా లెక్క ఇట్ల ముందు నుండే ఫీల్డ్ మీద తిరగలే. నేనేమో సంఘం పుట్టుకతోనే వున్న గద. నేను ఊరూరు తిరగవలసి వచ్చింది.

మా అక్క జీవితం గురించి కొంచెం చెప్పాలె. మా ఇండ్లల్ల బాల్య వివాహాలు లేవు. మా అమ్మకు కూడా పదహారు పదిహేడేళ్ళ వయసుకు పెండ్లయింది. ఆ కాలంలో భూస్వాముల పిల్లల్ని హైదరాబాదులో వున్న గురుకుల విద్యాలయాలకు పంపేడిది. చిన్న చిన్న భూస్వాములు అట్లా పంపలేక, ఇండ్లలోనే వుంచేసేవారు. మా అక్కని అట్ల చదువుకోసం పంపాలని అనుకునే టైమ్‌కల్లా, మా నాన్న చనిపోయాడు. ఇంట్లోని పరిస్థితుల వల్ల కూడా వీలు కాలేదు. మా అక్కకి చదువంటే బాగా ఇంట్రస్ట్. ఇంటికాడ కూర్చునే చదువులో బాగా డెవలప్ అయింది. ఆమెకి కూడా 16, 17 ఏండ్లప్పుడు పెళ్ళి చేసారు. పెళ్ళయ్యాక హిందీ విశారద చదివింది. నిజానికి ఎప్పుడూ చదువుతూ కూర్చునేది.

మా అక్కకి కాన్పయింది. పిల్లతల్లి. నాలెక్కన నాలుగూర్లు తిరగనీకి వీలుబడలే. పాలకుర్తి తరువాత, అది విసునూరి రామచంద్రారెడ్డి దొరకి వ్యతిరేక పోరాటం కనుక, ఆ చుట్టు పక్కల గ్రామాలన్నీ నన్ను తిప్పిన్రు. మా అక్కా, ఆమెభర్త ఇద్దరూ ఉద్యమంలోనే వున్నారు.

పోరాటం ప్రారంభమయ్యాక, బాలెంలో జనం గుంపులు, గుంపులుగానే బయలుదేరిన్రు. వాళ్ళలో కరణపోల్ల అమ్మాయి లలిత కూడా వుంది. నిజానికి అసలు మా యింట్లోనే ఒక గుంపు వుంది. మా ఇల్లే కేంద్రమైంది. లలిత, ఆమె భర్త ఇద్దరూ సంఘంలోకి వచ్చిన్రు. పోలీసోల్లు దేవులాడితే ఆ కుటుంబాలు దొరకద్దు గద, రహస్యంగ వుండాలె. వాళ్ళ ఇల్లు చాలా దూరంగా వుంది. దేవులపల్లి సత్యవతి వాళ్ళకి దగ్గర. దాంతో లలిత మా ఇంటికొచ్చి ఉంది. దేవులపల్లి వెంకటేశ్వరరావుకి కూడా మా ఊరు మా ఇల్లు కేంద్రమైంది ప్రధానంగ.

పాలకుర్తి పోరాటం తరువాత, ఒకదానివెనుక మరొకటి. కొమురయ్య పోరాటం, మొండ్రాయి పోరాటం, అట్ల ఒకదాని వెనుకొకటి పోరాటాలు సాగుతూనేవున్నాయి. మా అత్తవాళ్ళ ఇంటికి వెళ్లే సమయానికి నాకు పదమూడేళ్ళుంటాయి. దాదాపు పధ్నాలుగేళ్ళకే నేను పోరాటాలలో తిరగడం మొదలుపెట్టిన. పోరాట విరమణ జరిగి బయటకు వచ్చేనాటికి నాకు ఇరవయి ఒక్క ఏళ్ళుంటాయి. ఇట్ల తిరుగుతున్న గద ఊర్ల పొంటి. మల్ల మా ఇంటికిబోలే. ఒకసారి బతుకమ్మ పండుగ వస్తే, రమ్మని నాకు కబురు పంపిన్రు. సంబురంగనే అప్పుడు ఇంటికి పోయిన. అప్పటికింక రజాకార్ల లొల్లి మొదలుగాలేదు. మా అమ్మ దాచిపెట్టిన నా నగలు – మెడకి గొలుసులు, కాళ్ళ పట్టాలు అవీ బెట్టింది. అక్కడ తొమ్మిది రోజులున్నం. సద్దుల పండుగ కూడ అయిపోయింది. తెల్లారితే కాల్పులు జరిగినయి. ఎక్కడ జరిగినయో నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు. మా అన్నయ్య ఎంబడే రమ్మని కబురు బెట్టిండు. నన్నేగాదు, మా మేనబావ, ఇంకొక బావ, అందరూ పోరాటంలో వున్నరు గద. అందర్నీ రమ్మని చెప్పిండు. అప్పటికి మా అక్కనే గాదు, మా ఇంట్లోనే వున్న లలితమ్మ గూడా కడుపుతోనే వున్నది. అప్పుడు ఆడోళ్ళు బయట తిరిగే పరిస్థితి లేదు. నేనొక్కదాన్నే తిరుగుతున్న బయట. మొండ్రాయి తండాలో మూడు నెలలున్నా నేనొక్కదాన్నే కాదు. వెంకటేశ్వర రావని ఒక ఆంధ్రా కామ్రేడ్ గూడా తిరిగేది. అప్పుడు లీడర్ని గాను నేను. పార్టీ ఏం పని చెబితే ఆ పని చేయడమే. చుట్టు పక్కల గ్రామాలు తిరిగేది. మీటింగులలో పాటలు పాడేది. ఉపన్యాసాలు గూడా దంచుడు నేర్చిన.

మా ఊరి పోలీసు పటేలు కోనారెడ్డి మా చిన్నాయినే. మా మేనత్త బుచ్చిరావమ్మను ఒక కొడుకు పుట్టినంక భర్త వదిలిపెట్టిండు. ఆమెకి తల్లిదండ్రులున్నరుగాబట్టి, పుట్టింటికి వచ్చింది. అప్పటికి మా చిన్నాన్నలు, మేం అందరం కలిసేవున్నం. ఈమె కొడుకు దాయం రాజిరెడ్డినే మా అక్కకిచ్చి పెండ్లిజేసిన్రు. కొడుకు ఉద్యమంలో వున్నడు. ఆమె కూడా ఉద్యమానికి సపోర్టు నిచ్చింది. మా అత్త పుట్టింటికొచ్చినంకద ఊకోలె. కొడుకులతో పాటు నాకు కూడా భూమి పంచియి ఇయ్యమని, నాకు పాలొస్తదని కొట్లాడింది ఆ రోజులల్లనే. మా చిన్నాయిన కోనారెడ్డి అట్ల భూమి పంచియ్యడానికి వ్యతిరేకం. మా అత్త

కోర్టుకు కూడా పోయింది. "నా భర్త నన్ను ఇడిసిపెట్టేసిండు. నాకు నా తల్లిదండ్రుల భూమిలో వాటా కావాలని" అనింది.

ఇక మరొక చిన్నమ్మ యశోదమ్మ కూడా మా దిక్కే వుండేది. అందరికన్నా పెద్దోడు మా నాయిన. తరువాత కోనారెడ్డి. అందరికన్న చిన్నోడు రంగారెడ్డి. చిన్నాయిన. యశోదమ్మ భర్తన్నట్టు. మా చిన్నాయన్ను చంపేసిన్రు. అప్పుడు పెద్ద భూస్వాములకు వ్యతిరేకంగా, ఊర్లల్ల వున్న చిన్న భూస్వాములు పోరాటాలు చేస్తుండె. వీళ్ళ చేతుల్లో హరిజనులు బాగుంటుండె. గానుగ బండ నుండి పెద్ద భూస్వాములైన ఎర్రబాడు దొరల ఏజెంట్లు వచ్చి, మా చిన్నాన్న రంగారెడ్డిని చంపేసిన్రు అనుకున్నరంతా అప్పుడు. మా రంగారెడ్డి చిన్నాయిన చనిపోయిన తరువాత, కొంత కాలానికి, మా నాన్న కూడా చనిపోయాడు. ఇక మా మేనత్త బుచ్చిరావమ్మ, మా చిన్నమ్మ యశోదమ్మ, మా అమ్మ ఇట్ల ఒక ఇంట్లనే ముగ్గురైన్రు. మా మేనత్తకి తల్లిదండ్రులిద్దరు చనిపోయిన్రు కొంతకాలానికి. అప్పుడు ఆమెను తల్లిగారింట్ల కెల్లి వెళ్ళగొట్టాలని ప్రయత్నం చేసిన్రు. "మీ అత్తగారింటికి నువ్వు పో" అని పంపించివేయాలని ప్రయత్నిస్తే ఆమె కేసులు వేసింది.

ఆమెని సంఘం సపోర్టుచేసింది. అంతేగాదు, మా యశోదమ్మ చిన్నమ్మ భర్త, మా నాయిన కూడా చనిపోయారు. గాబట్టి మాకు కూడా భూమి పంచి ఇయ్యాలని సంఘం చెప్పింది. యశోదమ్మకి వీరారెడ్డని పాలోల్లున్నారు. వాళ్ళ ఇంట్లో బుచ్చెమ్మని వుండె. ఆమెకి కూడా భూమిలో వాటా ఇప్పించేందుకు మేము ప్రయత్నం చేసినం.

వితంతువు అయినంక. ఇంట్లకెల్లి ఎల్లగొడతరు ఆస్థి కోసం సహజంగనె. మా చిన్నాన్న చనిపోయేనాటికి, మా చిన్నమ్మ యశోదమ్మ పొట్టతోనున్నది, గర్భవతి. తర్వాతనే కొడుకు జగన్‌మోహన్ రెడ్డి పుట్టిండు. వాడు చివరిదాక కమ్యూనిస్టుగనే వున్నడు. ఆమె కన్నంక, బిడ్డనుదీసుకోని, ఆమెని కూడా ఎల్లగొట్టాలనుకున్నరు. ఇగ మా అమ్మను గూడ. యశోదమ్మపై కూడా కోనారెడ్డి పెత్తనం చేస్తున్నడు గాబట్టి, ఆమె కూడా మాతోనే ఉండేది.

మా అమ్మ, బుచ్చిరావత్త, యశోదమ్మ ఒకటిగున్నరు. రజాకార్ల దాడులు జరిగినప్పుడు ప్రతిఘటించాల్సి వచ్చినప్పుడు ధైర్యంగా జనాన్ని నిలబెట్టిన్రు. మా అమ్మని అరెస్టు చేసినప్పుడు యశోదమ్మ ఇల్లే కేంద్రమైంది మల్ల. పోరాటం నాటికి మా నాయినమ్మ కూడా వుంది.

మా అన్న, బావ దాయం రాజిరెడ్డి సంఘంలో ఉండటంతో, మా గ్రామ ప్రజలు, రాజిరెడ్డి గ్రామమైన వెంపటి ప్రజలు మా వైపుకి వచ్చిన్రు.

అప్పటి నుంచి మొత్తం బీసీలయితే నిలబడిన్రు. మళ్ల హరిజనులు వదిలిపెట్టిన్రు. పంచిన భూములు కూడ వదిలిపెట్టిన్రు. హరిజనుల యొక్క హీన పరిస్థితి ఎట్లున్నదంటె పంచినయి కూడ అమ్ముకున్నరు.

అంటే భయంతోని కాదుగాని, పేదరికం వల్ల. వాడు ఎడ్లు కొనలేడు, వ్యవసాయం చెయ్యలేడు. దున్నుకోమంటె ఎట్ల దున్నుకుంట్రు? ఎడ్లు లేవు, అవి లేవు ఇవి లేవు అనే సమస్య అప్పుడు ఎదురయింది. దానికొక పరిష్కారం చేసినం.

అప్పుడు మేము చేసినదేమంటే – దొరోల్ల దొడ్లల్ల కౌలుదార్ల దొడ్లల్ల అవసరమైనవన్నీ ఉంటయి. యాభై నాగళ్ళు కడుతరు, నలుబై నాగళ్ళు కడుతరు వాళ్ళు. అవి మొత్తం హరిజనులకు, గౌండ్లోల్లకు స్వాధీనం చేసినం. నాగళ్ళు, ఎడ్లు లేనోల్లకందరికీ ఇచ్చినం. అంటే వాల్ల సొంతానికని గాదు. సొంతానికియ్యాల్నంటె అందరికీ చాలవు గదా. సమష్టిగానే వాటిని సాదాలె, సమష్టిగానే కాపాడాలె. సమష్టిగానే భూమి దున్ని వ్యవసాయం చెయ్యాలె. గట్లు అయితే పెట్టినంగాని, పొలం ఉన్నకాడ చెలుక ఉన్నకాడ ఏ తరుణంలో ఏ విత్తనాలు వేయాల్నో అట్లనే వేయాలె. పోరాట కమిటీలు, వ్యవసాయ కమిటీలు వేసినం. వ్యవసాయం చూసెటోళ్ళు వ్యవసాయం చూడాలె, పోరాటం చేసేటోళ్ళు పోరాటం చేయాలె.

ఇట్ల అంతా ఒక పద్ధతి ప్రకారం అన్ని పనులూ నిర్వహించినం.

# 4

## మహిళల పరిస్థితి

సంఘం కార్యక్రమాలు ప్రారంభమైన తొలి రోజుల్లో సంఘ సంస్కరణ భావాలను ప్రచారం చెయ్యటమన్నది ముఖ్యమైన కార్యక్రమంగా ఉండేది. ఆ రోజుల్లో ఆడవాళ్ళ పరిస్థితి దారుణంగా ఉండేది – సమాజంలోనూ, కుటుంబాల్లోనూ కూడా. అందువల్ల దాని మీద బాగా కేంద్రీకరించిన్రు. స్త్రీలు ఉద్యమంలోకి ఆకర్షించబడడానికి ఇది ముఖ్యమైన కారణం. ఆ తరవాత పోరాటం ఉధృతమై, భూస్వామ్య వ్యతిరేక సాయుధ పోరాటంగా మారిన క్రమంలోనే స్త్రీల చైతన్యం కూడా అభివృద్ధి చెందుతూ వచ్చింది. దళాల్లోకి ఆడవాళ్ళు రావటమన్నది కూడా చాలా సహజంగానే జరిగింది.

మేము సంఘంలో చేరి పని చేస్తున్న కాలంలో స్త్రీల పరిస్థితి దారుణంగానే ఉండేది. మా కుటుంబం వంటి భూస్వామ్య కుటుంబాల్లోనయితే నేను ఇదివరకే చెప్పినట్టుగా కుటుంబాల ఆస్తులను నిలబెట్టుకునే అవసరం కొరకు ఆడపిల్లలకు కొంత స్వేచ్ఛ నివ్వడం మొదలయింది. పర్దా పద్ధతి తగ్గుతూ వచ్చింది. కానీ సామాన్య కుటుంబాల స్త్రీలకు అన్ని రకాలుగానూ బాధలుండేవి.

అప్పట్లో మేము సంఘం పనుల్లో తిరుగుతూ, రాత్రుళ్ళు బజార్లలో నడుస్తుంటే ప్రతి ఇంట్లోనించీ ఆడవాళ్ళ ఏడ్పులు వినబడుతుండేటివి. మొగోళ్ళ తిట్లకూ, దెబ్బలకూ నిస్సహాయంగా ఏడ్వటం తప్ప వాళ్ళు ఎదురుచెప్పే పరిస్థితి ఆనాడు లేదు.

ఈ స్థితి నుంచి స్త్రీలు బయట పడాల్నంటే సంఘంలో చేరి పని చెయ్యాలెననే అభిప్రాయం మాకు కలిగింది. స్త్రీలు పురుషులతో సమానమేననే భావాన్ని సంఘం బాగా ప్రాచుర్యంలోకి తెచ్చింది. కుటుంబాల్లో, సంఘంలో ఉండే కట్టుబాట్లు, నిర్బంధాల నుండి స్త్రీలను బైటికి తీసుకురావడానికి పార్టీ బాగా శ్రద్ధ పెట్టింది. సమాన హక్కులు పొందాల్నంటే ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందేననే అభిప్రాయం చాలామంది స్త్రీలలో ఏర్పడింది.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా బాగా ప్రచారం చేసిన్రు. గురజాడ అప్పారావు రాసిన పుత్తడిబొమ్మ పూర్ణమ్మ పాటను బాగా పాడుతుండే వాళ్ళం. యుక్తవయసొచ్చిన తర్వాతనే పెళ్ళి చేయాలె, ఆడపిల్లలకు ఇష్టంలేని పెళ్ళిళ్ళు చెయ్యొద్దు, స్త్రీలు అబలలుకాదు సబలలు – ఇట్లా స్త్రీలమీది సాంఘిక పీడనను తొలగించే నినాదాలుండేటివి. ఒక వైపున భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను నడుపుతూనే స్త్రీల సమస్యలపై పోరాడటమన్నది సైడ్ బై సైడ్ జరిగింది. నిజం చెప్పాల్నంటే ఇప్పటికన్నా అప్పుడే ఎక్కువ శ్రద్ధ పెట్టారన్పిస్తది. బెజవాడలో పార్టీ శిక్షణాకేంద్రం నడిపినప్పుడు స్త్రీలకు ప్రత్యేకంగా శిక్షణా కేంద్రం నడిపించిన్రు. దాదాపు వందమందికి పైగా స్త్రీలు ఆ క్లాసులకు హాజరయ్యిన్రు. 1943లో ఇంత కృషి చెయ్యడమంటే సామాన్యమైన విషయం కాదు.

ఇట్లా ఈ ఇన్స్పిరేషన్‌తోనే మేము కూడ స్త్రీల సమస్యల మీద ఉత్సాహంగా పని చేసినం. ఒకసారి మా బంధువుల్లో ఒకమ్మాయిని ఒక ముసలాయనకిచ్చి పెండ్లి చేయాల్నని నిర్ణయించిన్రు. ఆమె చిన్నప్పట్నుంచి మా దోస్తు. ఆమెకు ఆ పెళ్ళి ఇష్టం లేదు. మీ అన్నయ్య వాళ్ళందరు సంగంల ఉన్నరు గనుక మీరంతా హాయిగున్నరుగని, నా పరిస్థితి ఇట్లున్నదని బాధ పడింది. ఇక ఆమెకు ఆ పెండ్లి తప్పించాల్నని నిర్ణయించుకున్నం. మేమందరం కలిసి ఆ అమ్మాయిని తీసుకపోయి బంధువులింట్ల దాచి పెట్టినం. ఇదంత మా అమ్మకు తెల్సినా సప్పుడు చెయ్యకుంట వూర్కున్నది. ఆ తర్వాత వాళ్ళ చిన్నమ్మలకు తెలిసినంక గొడవ మొదలైంది. మేమంత సంగంల తిరిగి చెడిపోయిందేగాక, ఆ పిల్లనుగూడ చెడగొట్టినమని ప్రచారం చేసిన్రు. చివరికి ఆ అమ్మాయిని పట్టుకొచ్చి, ఆ ముసలాయనకే ఇచ్చి పెండ్లి చేసిన్రు. ఇట్లాంటి సమస్యల విషయంలో ఏం చెయ్యాల్నని కమిటీలో పెద్ద చర్చనే జరిగింది.

ఆ తరవాత భీమునిగూడెంలో సత్యవతి అనే ఒక బ్రాహ్మణ అమ్మాయికి కూడా ఇట్లాంటి పరిస్థితే ఎదురైంది. ఆమెకుగూడ ఒక ముసలాయనతో పెండ్లి సెటిల్ చేసిన్రు. ఆమె దానికి ఇష్టపడక, పార్టీకి కబురు పంపింది. ఆ సమయానికి పార్టీ నిర్మాణం కూడ గట్టిపడింది. అందువల్ల ఆమెను తీసుకొచ్చి విజయవాడలో ప్రజాశక్తి నగర్‌లో పెట్టినం. దాంతో ఆ పెళ్ళెత్తి పోయింది. ఆమె మన ఉద్యమంలో చేరి పనిచేసింది. నైజాం వ్యతిరేక పోరాటం ముగిసిన తర్వాత తనకిష్టమైనట్టుగా జీవించింది. ఈ సంఘటన మాకొక విజయంగా అన్పించింది. ఎంతో గర్వంగా చెప్పుకున్నం.

తాపీ రాజమ్మ విషయం కూడ ఇటువంటిదే. ఆమె బ్రాహ్మణుల అమ్మాయి. బాగా ముసలాయనకిచ్చిన్రు. మా పార్టీ నాయకుడొకాయన ఒక రాత్రిపూట వెళ్ళి ఆమెను బయటకు తీసుకొచ్చిండు. పార్టీమీద కరపత్రాలు వేసి బాగా దుష్ప్రచారం చేసినప్పటికీ ఆమె మనతోనే పనిచేసింది.

సంగం ప్రభావంలోకి ఒక కుటుంబం వచ్చిందంటె, తప్పనిసరిగా ఆ ఇంటి స్త్రీలు కూడ పోరాటంలోకి వచ్చిన్రు. ఆ కుటుంబాల కున్నటువంటి సాంఘికస్థాయిని బట్టి స్త్రీలు పోరాటంలోకి రావడంలోని కారణాలలో కూడ తేడా వున్నది. నేనిందాక చెప్పినట్టుగా మధ్య తరగతిలో, పెద్ద కులాల్లో ఉండే స్త్రీలు ప్రధానంగా కుటుంబాల కట్టుబాట్లు, బలవంతపు పెళ్ళిళ్ళు వంటి సాంఘిక సమస్యలనుంచి బయట పడేందుకు ఉద్యమంలోకి ఆకర్షితులయిన్రు.

కానీ, శ్రామిక వర్గంలో, పీడనకు గురవుతున్న కులాల్లో ఉన్నటువంటి ఆడవాళ్ళు భూస్వాముల దోపిడి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమంలో సంఘటితమయిన్రు. అందుకొక గొప్ప ఉదాహరణ ఐలమ్మే. భూమికోసం, భుక్తికోసం కొట్లాట స్త్రీ పురుషులందరికీ సమానమే. అట్లా పోరాటంలో కలిసి పనిచేస్తున్న క్రమంలోనే స్త్రీలుగా తమ సమాన హక్కులను గురించి, పితృస్వామ్య పెత్తనాన్ని ఎదిరించడం గురించి చైతన్యవంతం అయిన్రు.

కూలినాలి చేసుకునే స్త్రీలు, వాళ్ళ కుటుంబాల మగవాళ్ళతో బాటు భూస్వాముల ఆర్థిక దోపిడికి గురయితునే ఉన్నరు. దానికి తోడు కుటుంబాల్లో మగవాళ్ళ పెత్తనం. భర్తలు కొట్టినా, చంపినా ఏమీ చెయ్యలేని నిస్సహాయ పరిస్థితి. ఈ రెండు సమస్యలనూ కలిసి ఎదుర్కొనే శక్తిని శ్రామిక స్త్రీలకు అందించింది ఉద్యమం. ఇది చాలా గొప్ప విషయం. ప్రత్యేకంగా గుర్తించాల్సిన విషయం.

ఆడవాళ్ళమీద గతంలో ఉన్న చిన్నచూపు, పెత్తనం ఉద్యమంలోకి చేరిన పురుషుల్లో తగ్గుతూ వచ్చింది. ఒక పక్కన శ్రామిక కుటుంబాల స్త్రీలు మగవాళ్ళతో బాటుగా

భూస్వాముల మీద పోరాటం చేస్తున్నరు. మరొక వైపున మగవాళ్ళు ఉద్యమంలోకి వెళ్ళిపోతే, అరెస్టయితే మిగిలిన కుటుంబాన్ని కాపాడే బాధ్యతను తీసుకుంటున్నరు. అందుకే ఆడవాళ్ళను సమానంగా చూడాలె, వాళ్ళకు అన్నీ తెలియ చెప్పాలెననే చైతన్యం మగవాళ్ళలో ప్రారంభమయింది. ఉధృతమైన ఒక పోరాటంలో కలిసి పని చేస్తున్నప్పుడు ఆడవాళ్ళ మీద పెత్తనం చెయ్యాలనీ, కొట్టాలనీ, అవమానించాలనీ – ఈ దృష్టి వదులుకున్నారు. అవన్నీ మరిచిపోయిన్రు.

ఇట్ల చెప్తున్ననంటే సంగంలో పితృస్వామ్యం పూర్తిగా నశించిపోయిందని కాదు. ఒక గొప్ప మార్పు మొదలయిందన్న సంగతి చెప్తున్న. మామూలు కార్యకర్తల నుండి, నాయకుల దాకా పితృస్వామ్య భావజాలానికి లోనయిన సంఘటనలూ, వాటిమీద విమర్శలూ పోరాటాలూ జరిగినై. అసలు అట్లా విమర్శించాల్సనే దృష్టి, చైతన్యం అందిందంటే అది ఉద్యమం వల్లనే కదా!

ఇంకొక విషయమేమంటే స్త్రీలూ పురుషులూ సమానమైన వ్యక్తులేననీ, స్త్రీలు లేనిదే ఏ పోరాటమూ విజయం సాధించదనీ మన సంఘాల ప్రచారం కూడా కంటిన్యూగా సాగుతూనే వచ్చింది. ఏ కుటుంబంలోనైనా ఆడవాళ్ళను కొట్టుడు, బాధపెట్టుడు జరిగిందంటే ఆ మగవాళ్ళను సంఘం ఎదటికి పిలిచి, హెచ్చరించే వాళ్ళు. గతంలో కుటుంబ తగాదాలను పరిష్కరించుకోవాల్నంటే భూస్వాముల దగ్గరికి పోవాల్సిందే. ఆ దొరలే పంచాయితీలు పెట్టి దండుగ లేస్తుండిరి. వాటిల్లో సాధారణంగా ఆడవాళ్ళు, వాళ్ళ తల్లిదండ్రులే శిక్షలు భరించాల్సి వస్తుండేది.

భర్త, అత్తమామలు పెట్టే బాధలు భరించలేక ఆడపిల్లలు పుట్టిళ్ళకు పారిపోయేటోళ్ళు. దానిమీద అత్తింటోళ్ళు పంచాయతి పెట్టిస్తరు. ఆమె తల్లిదండ్రులు దండుగ గట్టాల్నని తీర్పులు చెప్పేటోళ్ళు. ఆ దండుగలు కట్టుడు, ఆమెనూ ఆమె పిల్లలనూ పోషించుడూ తల్లిదండ్రులకు సాధ్యంకాదు. అందువల్ల నువ్వెందుకిట్ల ఎల్లొచ్చినవని కోప్పడుతరు. నీ ఇంటికి నువ్వు పొమ్మని వెనక్కి పంపిస్తరు.

ఎక్కడెక్కడ స్త్రీలు పాల్గొన్నరో అక్కడంతా కుప్పలు తెప్పలుగా స్త్రీల సమస్యలు వచ్చి పడినయి. అన్ని రకాల సామాజిక సమస్యలొచ్చినయి. అదివరికి సిస్టమ్‌లో ఏం ఉన్నది? పెళ్ళాన్ని మొగుడు కొట్టిన, మొగుణ్ణి పెళ్ళాం కొట్టిన ఒక పంచాయితీ అయ్యేది.

వాళ్ళిద్దరికి ఇంతంత పంచాయితి అయితె ఆకర్ణపోడు ఎక్కువ చేయడం, తర్వాత దండగలు తీసుకోవడం. ఉదాహరణకు అబార్షన్ల కేసులు. అప్పుడు నాటుమందు తాగి కాన్పులు తీసేసుకునేటోళ్ళు కొందరు. ఒక్కొక్కళ్ళు తొమ్మిది మందిని, పది మందిని, పన్నెండు మందిని కనేటోళ్ళు. ఫ్యామిలీప్లానింగ్ లేదుగదా. వెంటవెంటనే పిల్లలయితే, అట్ల కాన్పులు తీసేసుకునేటోళ్ళు.

అట్లాంటి సంఘటనల్లో గూడ పిల్చి తప్పుచేసినవని చెప్పి దండుగలు తీసుకునేటోళ్ళు. ఆ దండుగలు కట్టలేక జనం అల్లకల్లోలమయ్యేది. దండుగలు కట్టకపోతే ఇక కొట్టుడే.

కులపెద్దలయితే కొంచెం అనుకూలంగనే ఉండెటోళ్ళు. ఏదో పది రూపాయలు తీసుకొని పంచాయితీ చేసెటోళ్ళు. కానీ గ్రామ పెద్దలు, కర్ణాలు ఒప్పుకునేటోళ్ళుగాదు. కుల పెద్దలకు ఇష్టం లేకున్నా వాళ్ళ తీర్పునే అమలు చేయాల్సిన పరిస్థితి.

ఉద్యమం మొదలయినంక ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. పార్టీ తరపున గ్రామాల్లో కమిటీలు ఏర్పాటయినై. ప్రజల ఆరోగ్యాన్ని చూడటం, భూములు పంచటం, కుటుంబ తగాదాలు పరిష్కరించటం వంటి పనులు ఈ కమిటీలు నిర్వహించేవి. అందుకోసం ప్రత్యేక శిక్షణ కూడ ఇప్పించిన్రు. ప్రసూతి వైద్యంలో శిక్షణ కొరకు విజయవాడ తీసుకుపోయి కొమర్రాజు అచ్చమాంబగారితో చెప్పించిన్రు. అట్లా తెలంగాణలో ఈ కమిటీల్లో ఇద్దరు ఆడవాళ్ళను పెట్టిన్రు. కుటుంబ పంచాయతీల విషయంలో స్త్రీలకు న్యాయం జరిగేట్టుగా చూడాలనేది నిర్ణయం. ఉద్యమం బలంగా ఉండటంతో కుటుంబ పంచాయతీలు మన దగ్గరికే రావటం మొదలైంది. ఈ పంచాయితీల్లో ఆడమనిషిది తప్పని తేలినప్పటికీ ఆమెకు దండుగ లేదు, మొగోనిది తప్పయిన సందర్భాల్లో మాత్రం స్త్రీలకు డబ్బు చెల్లించాలెనని తీర్పులు చెప్పెటోళ్ళం. అది ఒక ఉప్పెనవలె అయింది. కుటుంబాల్లో అవస్థలు పడుతూ కూడా దండుగలు కట్టలేక భయపడి బయటికి చెప్పుకోలేని స్త్రీలంత మన దగ్గరకే వచ్చెటోళ్ళు. ఆ విధంగా ఉద్యమానికి దగ్గరయిన స్త్రీలు చాలామంది ఉన్నారు.

ఇట్లాంటి సామాజిక సమస్యలు వచ్చేవి. వాటిని ఎట్ల తక్కువ చేయాలనేది ఒక పెద్ద చర్చ. పార్టీలోగూడ చర్చించాల్సి వచ్చేది. ఒక ప్రక్కనేమో పోరాటం. అది ప్రాణాలతో తెగబడే పోరాటం. సమాజంలోని వెనకబడ్డ భావాలతోటి తగాదా పడుతుంటే ప్రధానమైన పోరాటంలో చీలికలు వస్తయేమోనని వ్యతిరేకించెటోళ్ళు ఉంటరేమో. ఏంచేద్దాం, ఏం చేద్దామని చాలా రోజులు చర్చించిన్రు.

ఈ సమస్యలను పరిష్కరించాల్సిందేనని ఆడవాళ్ళం అనేటోళ్ళం. వీలయినంత వరకు మన భావాలను జొరపెట్టడానికే మనం ప్రయత్నం చేయాలె. మన బలం ఉన్న కాడనైతె పెద్దగా అభ్యంతర పెట్టరు. ఒకవేళ పెట్టినా, వాళ్ళకు అర్థం చేయించే ప్రయత్నం చేద్దాం. ఇక బలం లేనికాడ మనం వాటిని కొంచెం పక్కకు పెడదాం. లేదంటే ఊళ్ళల్ల పెద్దమనుషులుంటరు కదా, వాళ్ళకు ఒప్ప చెబుదాం. దండుగలు మాత్రం తీసుకోకూడదని షరతుపెడదాం అని నిర్ణయించుకున్నం.

గడ్డు పంచాయితీగాని, సామాజిక పంచాయితీగాని, మొగుడూపెళ్ళాల పంచాయితీగాని డబ్బులు తీసుకోకుండా చేయాల్నని గట్టిగా చెప్పింది పార్టీ. అది

అమలయితనే ఉన్నది. మన బలం ఉన్న గ్రామాలలో స్త్రీల సమస్యలను పరిష్కారం చెయ్యాల్నని ప్రయత్నం చేసినం.

ఆ రోజుల్లో మగవాళ్ళు ఇద్దరు, ముగ్గురు, నలుగురు భార్యలను చేసుకునే పద్ధతి ఉండేది. అందువల్ల విపరీతమైన అసంతృప్తి ఉండేది స్త్రీలలో. ఇద్దరు భార్యలు, ముగ్గురు భార్యలు ఎట్ల మెసులుతారు మరి? ఒకామెను చేసుకున్నంక కొద్ది రోజుల్లోనే పిల్లలు పుట్టకుంటె మళ్ళీ ఇంకొకామెను చేసుకునేది. ఆమెకు ఏదయిన జబ్బు చేసిందనుకో, అది పనిచేయకుంటె ఎల్లదు కదా, అని ఇంకొకామెను చేసుకునేది.

ఇంటి పనంటె, ఇప్పటి లెక్క కాదాయె ఆ రోజుల్లో. వడ్లు దంచి బియ్యం చేసి, వంట చెయ్యాల్సుండె. ఇప్పటి రోజులు కావు, ఇప్పటి బియ్యం కావు, ఇప్పటి పొట్లాలు కావు. మొత్తం బాధ్యతలు ఆడవాళ్ళవే.

ఒకపక్కనేమొ మొగోని మాదిరి కర్రబట్టుకొని వ్యవసాయం చెయ్యాలె, మరొకపక్క ఇంటిపని, పిల్లల పని చెయ్యాలె, సమష్టి కుటుంబాలు – బావలు, మర్దులు, వాళ్ళ కుటుంబాలు, వచ్చి పోయెటోళ్ళు పెద్ద జనాభా ఉండేది. ఎంతమందొచ్చినా వండి పెట్టాల్సిందే.

ఈ రెండు రకాల పనులను ఎట్లనో సమన్వయం చేసుకుంట బతకటం వలన వ్యక్తిగత జీవితాలను గురించి ఆలోచించుకునెటందుకు వాళ్ళకు అవకాశమే తక్కువ. కాని కొంతమందికి ఇదంత బాధగనే ఉంటది కదా. సహజంగానే అసంతృప్తి ఉండేది. దాంతో వాళ్ళేం చేసేటోళ్ళంటే, మన దళాలు మీటింగ్ పెట్టే దగ్గరికి వస్తుండెటోళ్ళు. అట్లనే క్రమంగా దళాల్లోకి కూడ వచ్చి చేరుతూ తుపాకులియ్యమని పార్టీని డిమాండ్ చేసేటోళ్ళు చాలామంది.

ఇప్పటితో పోల్చిచూస్తే, రేప్ కేసులు బాగ తక్కువే. కానీ, సామాజికంగానే స్త్రీలపై పీడన ఉన్నది. ముఖ్యంగా అత్తగారింట్ల వేధింపులతోని సమస్యలొచ్చేవి. భరించలేక తల్లిగారింట్లకు పోయివుంటే, పంచాయితీలయ్యేవి. ఎవరు విడిపోతామంటే వాళ్ళు దండుగ కట్టాలె. మొగపిల్లగాడైతే ఇష్టంలేదని అననే అనడు, దండుగ కట్టాల్సొస్తుందని దాని దగ్గర పండినా, పండకున్నాసరే ఇష్టంలేదని చెప్పడు.

ఆడోళ్ళే విసిగిపోయి, బయట పడాలనుకునేటోళ్ళు. పిల్లలు కూడ కాకపోతే, ఇక అక్కడ పడుండి ఏం లాభమని పుట్టింట్లయిన చాకిరీ చేసుకుందమని అనుకునేటోళ్ళు. అట్లాంటి పంచాయతీలు వస్తుండేవి. వీటిలో తీర్పు చెప్పేటందుకు డబ్బులు తీసుకోవద్దు, దండుగలు వేయొద్దు. ఆడవాళ్ళు వాళ్ళకు ఇష్టం లేదన్నప్పుడు వాళ్ళను పోనియ్యాలె అనేది మనలైను. అట్ల నాల్గయిదు ఊళ్ళల్ల కేసులు నేను పరిష్కారం చేసిన. ఇట్ల చేసేవరకే రాజక్క పుస్తెలు తెంపుకుంట పోతుందని లొల్లి పుట్టించిన్రు.

అసలు నిజంగ, న్యాయంగా ఆలోచిస్తే ఇద్దరు, ముగ్గరు తోటి ఒక మొగోడు ఉండగలడా? వాడు సంసార జీవితం నిర్వహించగలడా? మరి పెళ్ళి అనేది సెక్స్ జీవితం కోసం, పిల్లల్ని కనేటందుకోసమేగద! అసలు భార్య ఉండనంటున్నదిగద, పోనీయండి అని చెప్పేదాన్ని. ఇదొక బర్నింగ్ సమస్యయింది. ఇక మహిళలే తెగబడుడు మొదలయింది.

ముందుగాల కుల పెద్దలను కూర్చోబెట్టెటోళ్ళం. ఒక్కొక్క కులానికి ఒక పెద్దమనిషుంటడు. ఒక్కొక్క మహిళను కూడ కూర్చోపెట్టాల్సిందేనని మనం చెప్పినం. అదివరకు లేడీస్ పాల్గొనేటందుకు లేదు. దొరలు పంచాయతీలు చేసేటప్పుడు ఆడోళ్ళకు ఎటువంటి భాగస్వామ్యం లేదు, పూర్తిగ పక్కకు పెడ్తరు. మేము ఆ పరిస్థితిని మార్చినం. బాగా జనాన్ని కూడగట్టగల ఆడవాళ్ళుంటరు. అట్లాంటి వాళ్ళను ఏరి పంచాయతీల కూర్చోబెట్టినం.

ఇవి పట్టించుకుని తీరాల్సిన సమస్యలు. ఎవరూ పట్టించుకోకుంటెగూడ కష్టాలు భరించలేక, ఆడోళ్ళు బావుల్లపడి చావడం, ఉరిపెట్టుక చావడం, మందులుతాగి చావటం... ఇట్లాంటి ఘటనలు జరిగేవి. అందుకని దాన్నొక సమస్యలాగ తీసుకొని, ఒక ఉద్యమంలాగ చేస్తే ఇక కొందరు వ్యతిరేకించిన్రు. రాజక్క ఇట్ల చేస్కుంట పోతున్నదని నాకే ఎదురైంది.

మగవాళ్ళు ఎంత ఆలోచించినగాని వామ్మో, ఇది తీసుకుంటె మళ్ళ పోరాటానికి నష్టమయితదనే భావజాలం వాళ్ళలో ఉండేది. అయినాసరే, నష్టమో కష్టమో మనం అమలు చేస్తేనేకదా, తేలేది. అప్పటికీ, ఇప్పటికీ ఆ అనుభవాలు నాకెంతో ఉపయోగపడతయి. ఒక పాలసీని తయారు చేసుకునేటందుకు ఆ పోరాటాలు నేర్పించిన పాఠాలే దారి చూపుతయి.

ఐతే బయటి సమాజంలో మగవాళ్ళేకాక, మన కార్యకర్తల్లో కొంతమంది కూడ దీన్ని వ్యతిరేకించిన్రు. ఇట్ల స్త్రీల పట్ల పక్షపాతం చూపితే మగవాళ్ళు ఉద్యమానికి దూరమవుతరనే ఆర్గ్యుమెంట్ వచ్చింది. అవతల ఒక గొప్ప పోరాటం సాగుతున్నది. స్త్రీలూ, పురుషులూ కలిసి పనిచేస్తేనే గాని దాన్ని గెలవలేం. సాంఘిక సమస్యల మీద శ్రద్ధ పెట్టాల్సిందే, కానీ పొలిటికల్ పోరాటాన్ని దెబ్బతీసేటట్లుగా ఉండకూడదనే చర్చ వచ్చింది. సమాజంలో స్త్రీలూ, పురుషులూ అసమానంగా ఉన్నారు కాబట్టి, వాళ్ళకు ఒకే రకమైన శిక్షలు వెయ్యటం తప్పని మేము వాదించినం. మా వాదాన్ని నాయకత్వాలు కూడ అంగీకరించిన్రు. ఐనప్పటికీ కొన్ని సందర్భాల్లో మేము కూడ సర్దుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా దళాల్లోకి స్త్రీలను సమీకరించాల్సిన సమయంలో వాళ్ళ కుటుంబాలతో మంచి సంబంధాలుంటేనే అది సాధ్యమవుతది. సాంఘిక పోరాటాలు సక్సెస్ కావాల్నంటే రాజకీయ పోరాటానికి ప్రాముఖ్యత ఇవ్వాలనే దానిలో మాకు కూడా ఏకాభిప్రాయమున్నది. కనుక

కొన్ని సందర్భాలలో కొంత సర్దుకోవలసి వచ్చింది. ఐతే మొత్తంగా చూసినప్పుడు స్త్రీలు, ఇతర పీడితుల పక్షాన్నే నిలబడటం జరిగింది. దానివల్ల ప్రజల్లో, స్త్రీలలో మనమీద విశ్వాసం ఏర్పడింది.

మొదట్లో నేను ప్రధానంగా పాటలు పాడటం, ఏ ఊరి సమస్యలను ఆ ఊరిలో పాటలుగా కట్టి పాడటం, జనాన్ని చైతన్యవంతం చెయ్యటం మీద శ్రద్ధ పెడుతుంటిని. ఆ తర్వాత ఉపన్యాసాలు ఇవ్వటం కూడా మొదలుపెట్టినా. గ్రామాల్లోకి, పొలాల్లో పని చేసే కూలోళ్ళ దగ్గరికి పోయి ఉపన్యాసాలు ఇస్తుంటి. ఎంతమంది ముందైన మాట్లాడానికి నాకెట్లాంటి జంకు ఉండేది కాదు. పోరాటానికి సహాయంగా జనాన్ని సమీకరించటం, చందాలు సేకరించటం వంటి పనుల్లో నన్ను తప్పకుండా నియమించే వాళ్ళు. ఎందుకంటే నేను జనానికి అర్థమయ్యే పద్ధతిలో, వాళ్ళ భాషలో వాళ్ళ సమస్యలను వివరించి చెప్పగలిగేదాన్ని. ప్రజలు బాగా రిసీవ్ చేసుకున్నరు. నారాయణరెడ్డిగారు, రఫీ అహ్మద్‌గారు, బద్దం ఎల్లారెడ్డిగారు – వీళ్ళందరితోబాటు నేను ఈ బాధ్యతలు నిర్వహించా.

ఆరోజుల్లో బాగా చదువుకున్న ఆడవాళ్ళు కూడా స్టేజిల మీదికెక్కి మాట్లాడ్డానికి వెనకాడుతుండిరి. నేను ఉపన్యాసాలిస్తుంటే, బాగా చదువుకున్న దాన్నేమోనని అనుకునే వాళ్ళు. బి.ఏ. చదివిన్నని అనుకున్నరట. నిజానికి నా చదువు నాలుగో, ఐదో తరగతులు, అంతే. నా వయసు కూడా పద్నాలుగు, పదిహేనేళ్ళకు ఎక్కువ లేదు. కానీ స్వరాజ్యం మంచి ఉపన్యాసకురాలనే పేరొచ్చింది. 'ఆంధ్రదేశపు ముద్దుబిడ్డ' అని పేరుపెట్టిన్రు నాకు. నేను ఉపన్యాసం ఇస్తుంటే పార్టీ నిధుల కోసమని నామీదకు డబ్బులు ఎగజల్లేటోళ్ళు. రూపాయి నోట్ల దండలేసేటోళ్ళు. అంత మంచిగ మాట్లాడగలిగేదాన్ని.

ఎప్పుడైతే జమీందార్లకు వ్యతిరేకంగా జనం స్పందించి ఊరేగింపులు తియ్యటం మొదలయిందో అప్పుడు మొత్తం కార్మికులు, వ్యవసాయ కూలీలు ఉద్యమంలోకి వచ్చిన్రు. కుటుంబాల ఆడవాళ్ళు కూడా ఉద్యమంలో భాగమైన్రు. కూలి, నాలి చేసుకునే ఆడవాళ్ళయితే నేమి, మధ్యతరగతి ఆడవాళ్ళయితేనేమి ఎన్ని నిర్బంధాలొచ్చినా ఎదిరించి ఉద్యమానికి సపోర్టుగా నిలిచిన్రు. ఆ తర్వాత గిరిజనులు, ముఖ్యంగా లంబాడీలు అందుకున్నరు. నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో లంబాడీలు ఈ భూస్వాముల కింద నలిగిపోతున్నరు. వాళ్ళ దొడ్లల్ల ఆవులు, మేకలు, గొర్లు, ఏవంటే అవి భూస్వాములు కాజేస్తుండిరి.

అసలు ఈ భూస్వాముల పీడన కింద ఇబ్బందులు పడని ప్రజలే లేరని చెప్పొచ్చు. ఇస్తర్లు కుట్టెటోళ్ళతోసహా, సాతానోళ్ళతోసహా, సామానిచ్చే సావుకార్లతోసహా, యాటనిచ్చే

గొల్లోళ్ళు, కల్లుబోసే గౌండ్లోల్లతోసహా అందరూ దొరల దోపిడికి గురయ్యేటోళ్ళే. ఆ ఇళ్ళల్లోని ఆడవాళ్ళందరూ జీతం, బత్తెం లేకుంట భూస్వాముల దగ్గర చాకిరి చెయ్యాలె. అందుకే పార్టీ ఒక్కసారి పిలుపు నివ్వంగనే అన్ని శ్రేణుల ప్రజల్లోనూ గొప్ప స్పందన వచ్చింది. వాళ్ళ తిరుగుబాటులో సామాజిక, ఆర్థిక సమస్యలన్నీ కలగలిసి ఉన్నయి. దానికొక రాజకీయ రూపాన్ని పార్టీ అందించింది. మొదట్లో సంఘ సంస్కరణ కార్యక్రమాలతో తెలుగు భాషకు గుర్తింపు కావాల్ననే డిమాండ్‌తో ప్రారంభమయిన ఆంధ్రమహాసభ వెట్టికి వ్యతిరేకంగా నినాద మివ్వటం, అది మరింత ముందుకు పోయి ఒక ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటుకొరకు సాగటం జరిగింది.

రైతులందరు కమ్యూనిస్టు పార్టీకి సపోర్టు చేస్తున్నరనే కక్షతో రైతుల దగ్గర బలవంతంగ లెవీ ధాన్యం వసూళ్ళను మొదలు పెట్టింది సర్కారు. సర్కారు మనుషులు ఊళ్ళమీద పడి రైతుల ఇళ్ళల్లో చొరబడి ధాన్యం ఎత్తుకొస్తున్నరు. ఈ పద్ధతికి వ్యతిరేకంగా తిరగబడమని పార్టీ పిలుపునిచ్చింది. రైతులు దాన్ని అందుకున్నరు. లెవీ కట్టటానికి నిరాకరించిన్రు. రెవెన్యూ అధికారులకు, పట్వారీలకు ఎదురు తిరిగిన్రు. ఇక ఊళ్ళమీదికి పోలీసులు దిగిన్రు. ప్రజలమీద హింస, నిర్బంధం ఎక్కువయినై.

పరిస్థితి ఇట్ల తయారయినంక ప్రజలు నిరాయుధంగా పోరాడటం సాధ్యం కాదు. ఎక్కడంటే అక్కడ ప్రజలను, కార్యకర్తలను పట్టుకుని కాల్చేస్తున్నరు పోలీసులు. అందుకని ప్రజలను సమీకరించి గుత్పల సంఘాలు పెట్టినం. ఈ గుత్ప సంఘాలు ఊరిని రక్షించేపని చేస్తయి కాబట్టి దాన్ని గ్రామమే సాదాలె. ఈ గుత్పలతోబాటు వడిశెలలు కూడ ప్రయోగించినం. పోలీసోళ్ళను ఊళ్ళోకి రానియ్యకుండ అడ్డుకోవటం, గ్రామాలలో పోలీసు క్యాంపులను వెళ్ళగొట్టటం ఈ సంఘాల బాధ్యత.

యువతులందరూ చాలా మిలిటెంటుగ పాల్గొన్నరు. గ్రామరక్షణ కమిటీలలో గూడ చాలామంది చేరిన్రు. ఈ మహిళా వాలంటీర్ల ప్రత్యేకత ఏమిటంటె, యువతులందరుగూడ నైట్ కాపలా కాయటానికి, వడ్సెల్ల రాళ్ళు తీసుకొని కొట్టడానికి బయలుదేరిన్రు. మేము గెరిల్లాల్లో చేర్తం, మాకు తుపాకీలు ఇవ్వండి అనే నినాదం వచ్చింది వాళ్ళనుండి.

అదివరకు స్త్రీలకు వేరే పనులు చెప్పిన్రు. ఎక్కువగా నర్సింగ్ ట్రైనింగ్ ఇప్పించిన్రు. ఆడవాళ్ళకు తుపాకులిచ్చి పోరాటంలో పెడితే శక్తివంతంగా చెయ్యలేరేమోనన్న సందేహం ఉండింది. పైగా శత్రువులకు దొరికితె అవమానాల పాలైతరన్న భయం కూడ ఉండింది.

నేను దాన్ని వ్యతిరేకించిన. యువతులు ఎంతో మిలిటెంటుగ ముందుకొస్తన్నరు. వాళ్ళలో నుండి సెలెక్టు చేసి గెరిల్లాదళాల్లోకి తీసుకోవాల్నని నేను ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన.

వాలంటీర్ దళాల్లో ఉన్నవాళ్ళ పని ఏంది, వాళ్ళకు ఎట్లాంటి పని చూపియ్యాలె మరి.

మగవాళ్ళంతానేమో పంచిన పొలాలు దున్నుకోవడం, వాళ్ళ సొంత పొలాలు దున్నుకోవడం పని ఉంటుంది. వాళ్ళు ఉద్యమంలోకి పోయినప్పుడు గ్రామంలో పొలాలను, పశువులను, కుటుంబాలను రక్షించే పనంతా ఆడవాళ్ళదే. అందుకని వాళ్ళకు కొంత పోరాట పద్ధతులు నేర్పించాల్సిన అవసరమున్నది మనకు.

పోలీసులు ఊర్లల్ల చొరబడ్డప్పుడు ఏంచేయాల్నేది కూడ ఆడవాళ్ళకు నేర్పించెటోళ్ళం. ఇండ్లల్ల ధాన్యాన్ని ఉంచొద్దు. ధాన్యాన్ని మొదలు మొదలె భద్రం చేసి ఉంచాలి. విలువైన వస్తువులేవీ ఇండ్లల్ల ఉంచకూడదు. గ్రామస్తులందరు కూడ ఒక సైన్యంలాగా, తిరగబడెటందుకు సిద్ధంగా ఉండాలె. ఇక గ్రామరక్షణ దళాల బాధ్యత ఏమిటి? గ్రామానికి నాలుగు మూలల నాలుగు డొంకలుంటాయి. గ్రామానికి వచ్చే దారులలో అవి ఉంటయి. వాటి రక్షణను గ్రామ రక్షణ దళం చూసుకోవాలె.

ఆ నాలుగు దారులలోను రాళ్ళకుప్పలు పోయాలె. రాళ్ళ కుప్పలు మొత్తం డొంకలపొంటి అక్కడి నుంచి ఇక్కడిదాకా పోయాలె. అక్కడంతా రక్షణ దళాలు కాపుగాయాలె. అదొక ప్రణాళిక ప్రకారం జరగాలె. ఆ ప్రణాళికను ఈ లేడీస్ విజయవంతంగా అమలు చేసిన్రు. ఫస్టు మొగవాళ్ళను ఆ దారుల దగ్గర ఉంచుతరు. ముందుగా కబురు తెల్వాలె. అందుకొరకు చెట్లు ఎక్కి కాపలా కాయాలె. లేదంటె మంచెల మీద నుండి కనిపెట్టాలె.

ఇట్ల మంచెల మీద ఉండటమనేది ఆ రోజుల్లో వ్యవసాయ కూలీలందరికీ అలవాటే. అక్కడ నిలబడి వడ్సెల పట్టుకొని పిట్టల కొట్టెటోళ్ళు. అందుకని ప్రతి యువతికి వడ్సెల కొట్టొస్తది. అందుకని వాళ్ళే వడ్సెలల్లో రాళ్ళుబెట్టి కాపలాకు కూర్చునేటోళ్ళు. పోలీసులను, భూస్వాముల గూండాలను ఆ రాళ్ళతోని ఒక్కసారిగా దాడిచేసి ఎల్లగొట్టాలె.

అంతేగాక దళాలకు రక్షణగా కాపుగాయటం, అన్నాలు పంపటం కూడ ఆడవాళ్ళే చేసిన్రు. మగవాళ్ళు పోతే బయటపడ్తదనే ఉద్దేశ్యంతోని ఆడవాళ్ళే అన్నాలు తీసుకపోయెటోళ్ళు. చూడటానికి ఇవన్నీ చిన్న చిన్న పనుల లెక్కనే ఉంటయి. కానీ పోరాటానికి ఎంతో ముఖ్యమైన పనులవి.

చెట్లమీదికెక్కి కాపలా కాయటంలో యువతులు బలే యాక్టివ్‌గా ఉండెటోళ్ళు. అసలు ఈ ఆడోళ్ళ హుషారు ఏందోగాని వాళ్ళను చూస్తుంటె నాకే ఆశ్చర్యమేసేది. పొద్దుందాక వాళ్ళకు పని ఉంటది కదా. చెలకల్ల పనిచేస్తరు, ఇంటికాడ పనిచేస్తరు. మళ్ళా రాత్రుళ్ళు నిద్ర కాయడంలో కూడ వీళ్ళే ముందుండెటోళ్ళు.

ఆ రోజుల్లో జమీందార్ల, భూస్వాములందరి దగ్గర తుపాకులుండేవి. పిట్టలను, జంతువులను వేటాడటానికని వాటిని దగ్గరుంచుకునేటోళ్ళు. వాటిని గుంజుకోవాల్నే

నిర్ణయం జరిగింది. రెండు మూడు వందల మంది కలిసి గుత్పలేసుకొని పోయినట్టయితే ఇది సాధ్యమయితది. భూస్వాముల ఇళ్ళమీద దాడి చేసి తుపాకులు గుంజుకుని, వాటిని జనానికి పంచిపెట్టుకుంట పోయేవాళ్ళం. ప్రజలు వాళ్ళనువాళ్ళు రక్షించుకోవాలంటే ఆయుధాలుండాలె కదా! భూస్వాములను, పోలీసోళ్ళను కొట్టి పోవటమేగాదు – వాళ్ళనుండి రక్షించుకోటానికి ప్రజలకు తగిన ఏర్పాట్లు చెయ్యటం కూడ మన బాధ్యతే.

ఇట్ల ఈ ఉద్యమమంతా జరుగుతున్నప్పుడు కూడ స్త్రీలు దానిలో భాగమైనరు. నేను కూడ ఉద్యమంలో పాత్రధారిని. పాటలతో, ఉపన్యాసాలతో జనాన్ని కూడగట్టడం నాకు ప్రధానమైన బాధ్యత. మా అక్కయ్య, శశిరేఖ, లలితమ్మ, కొంచెం చదువుకొని మాట్లాడగలిగిన స్త్రీలందరం దీనిలో పాల్గొన్నం. మా అత్తగారు కూడా పనిచేసిన్రు. ఆమెకు పాటలంతగా రావు. కానీ ఉపన్యాసాలివ్వటం, సాంఘిక సమస్యల గురించి పనిచెయ్యటం – ఇటువంటివన్నీ చేసిందామె.

ముఖ్యంగా మహిళలు పాల్గొన్నచోట మహిళలే ఎక్కువగా కదిలేవాళ్ళు. చైతన్యవంతం అయ్యేవాళ్ళు. వాళ్ళు చైతన్యవంతులయితే పురుషులు సంతోషించడం, వీళ్ళు కూడా స్ఫూర్తి పొందడం జరిగేది.

# 5

## రగులుకున్న రైతాంగ పోరాటం

తెలంగాణలో సాగుతుండిన ఈ భూస్వామ్య వ్యతిరేక పోరాటమన్నది సాయుధపోరాట దశకు చేరుకోవటం హటాత్తుగా జరిగినది కాదు – దాని వెనకాల చాలా ప్రాసెస్ ఉన్నది. తుపాకులు పట్టి గెరిల్లా పోరాటం చేస్తామని తొలిరోజుల్లో మాకెవ్వరికీ స్పష్టంగా తెలియదు. అదంతా ఒకరు నిర్ణయించింది కాదు. ఒక రకంగా జనమే ఉద్యమానికి ఆ మార్గాన్ని అందించిన్రని చెప్పాలె.

1946 చివరి రోజుల దాకా ప్రత్యేకంగా ఆయుధ శిక్షణ ఇవ్వటం వంటిది జరగలేదు. ఐతే అంతకంతకూ ప్రజల్లో భూస్వాములపై వ్యతిరేకతా, ప్రతిఘటనా పెరగటమూ – ఇంకొక వైపున ప్రజలమీదా, సంఘం మీదా దాడులు పెరగటమూ జరుగుతూ వచ్చింది.

ఐలమ్మ విషయంలో విసునూరు రామచంద్రారెడ్డిపై విజయం సాధించటంతో తెలంగాణా ప్రజల్లో గొప్ప ఉత్సాహం వచ్చింది. ఈ అవమానంతో దొర బాగా రెచ్చిపోయిండు. నాయకులమీద, ప్రజలమీద కేసులు పెట్టి అరెస్టు చేయించిండు. ఉద్యమంలో చురుగ్గా వ్యవహరిస్తున్న నాయకులను చంపించాల్నని దొర పథకం పన్నిండు.

1946 జూలై 4వ తేదీన కడివెండి గ్రామంలో ప్రజలు ఊరేగింపు తీసిన్రు. అప్పటికే దొరల గూండాలు నాయకుల ఇళ్ళమీద దాడులు చేసిన్రు. ప్రజల దగ్గర ఆయుధాలేమీ లేవు, కర్రలు, వడిసెలలు తప్ప. ప్రభుత్వ భూముల్లోని తుమ్మచెట్ల కాయలు కొట్టుకోవాల్నన్నా, అక్కడ గొర్లనూ మేకలనూ మేపుకోవాల్నన్నా పన్ను కట్టాల్సిన పద్ధతుండేది. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు ఊరేగింపు తీసిన్రు. గ్రామ సంఘం నాయకులు దొడ్డి కొమురయ్య, దొడ్డి మల్లయ్య ఊరేగింపుకు నాయకత్వం వహించిన్రు.

దొర గడీవున్న గల్లీలోకి ఊరేగింపు చేరే సమయానికి, అప్పటికే తయారుగా ఉన్న గూండాలు కాల్పులు జరిపిన్రు. దొడ్డి కొమురయ్య కడుపులో తూటా దూసుకపోయి, ఆయన అక్కడిక్కడే మరణించిండు. వాళ్ళ అన్నగారు దొడ్డి మల్లయ్య బాగ గాయపడిండు. అంత జరిగిన కాని ప్రజలు భయపడలేదు. ఊరేగింపు ముందుకే సాగింది. ఈ వార్త చుట్టుపట్ల గ్రామాలంత పాకిపోయింది. వేలాది జనం కడివెండికి వచ్చిన్రు. నేనప్పుడు దేవరుప్పలలోనే ఉన్న. ఈ సంగతి తెలిసి మేమంతా కూడా వెళ్ళినం.

వేలమంది జనం దొర బంగ్లను చుట్టుముట్టి గడీని కాలబెట్టమని సిద్ధమయిన్రు. ఈ సంగతి తెలిసి విసునూరు నుండి, దొర కొడుకు వందలాది మంది గూండాలను ఆయుధాలతో పంపిండు. ప్రజల ఆగ్రహం ముందు వాళ్ళు నిలవలేక పోయిన్రు. వాళ్ళను తరిమికొట్టిన్రు జనం.

అప్పటికింకా సంఘం దగ్గర ఆయుధాలు లేవు. శాంతి భద్రతల పేరిట గ్రామాల్లో ఊరేగింపుల మీద కూడా నిషేధం ఉన్నది. ఇటువంటి పరిస్థితుల్లో దొర గడీని కాలబెడితే పరిస్థితి ఇంకా తీవ్రమవుతది. రాబోయే నిర్బంధాన్ని తట్టుకోగలిగేందుకు మనం ముందుగా సిద్ధపడాలని చెప్పి ఆరుట్ల రామచంద్రారెడ్డి, క్రిష్ణమూర్తి, మా అన్నగారు వంటి నాయకులు ప్రజలను శాంతింప చేసిన్రు. అయినా సంఘం నాయకులపై పోలీసులు కేసులు పెట్టిన్రు.

కొమురయ్య మరణంతో ఉద్యమం మరింత తీవ్రమైంది. ఆయన అంత్యక్రియల్లో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నరు. ఆయనమీద పాటలు కట్టి పాడుకునెటోళ్ళు. వెట్టిచాకిరి, అక్రమ వసూళ్ళు ఇంక సాగవని సంఘం తరపున నిర్ణయాలు చేసి, అమలు పరిచిన్రు.

ఇట్లా వెట్టిచాకిరికి వ్యతిరేకంగా మొదలైన పోరాటం ఐలమ్మ సంఘటనతో కౌలుదారుల పోరాటంగా తయారైంది. ఒక కౌలురైతుగా తన హక్కును నిలబెట్టుకొనేందుకు నిలబడ్డది ఐలమ్మ. దానిమీద ఎంత నిర్బంధం వచ్చినప్పటికీ తట్టుకొని నిలబడటం, సంఘం ఆమెకు అండగా నిలబడటం ప్రజలకు గొప్ప ధైర్యాన్నిచ్చింది. ఆ వ్యవస్థలో విసునూరు దొర వంటి భూస్వాములు అనేకమంది వల్ల, ఎందరో కౌలుదారులు భూకబ్జాల సమస్యను ఎదుర్కొంటున్నారు. అందుకని ఆ పోరాటం కౌలుదారుల పోరాటంగా

రూపాంతరం చెందింది. ఐలమ్మ సంఘటన దానిలో ముఖ్యమైన పరిణామం. వెట్టికి వ్యతిరేకంగా మొదలైన పోరాటం, కూలి పెంపుకోసం మొదలైన పోరాటం – ఇదంతా కలిసి కౌలుదారుల పోరాటమయింది. ఈ పోరాటమే భూ పంపకానికి పరిణామం చెందింది. ఇదంతా ఒక దశ.

ఇక రెండో దశలో తీవ్రమైన నిర్బంధంతో, గూండాల దాడులతో ఉద్యమాన్ని అణిచివెయ్యటానికి భూస్వాములు ప్రయత్నం చేసిన్రు. అది సాధ్యం కాకుండా తిరిగి గుతుప సంఘాలను మొదలుపెట్టి, ప్రతి గ్రామంలోనూ వాలంటరీ దళాలు గుతుపలు పట్టుకొని ఆత్మరక్షణ చేసుకోవటాన్ని సంఘం నేర్పించింది. ఇదంతా ఆంధ్రమహాసభ నాయకత్వంలోనే జరిగింది. తమ ఇళ్ళను, గ్రామాలను కాపాడుకోటానికి కర్రలనూ, వడిశెలనూ ప్రయోగించటం, ఆడవాళ్ళయితే కారంపొడితో, రాళ్ళతో దాడులను ఎదుర్కోవటం – ఇట్లా ప్రజలకు శిక్షణ ఇచ్చాయి ఈ వాలంటరి దళాలు. 1946లో ఖమ్మంలో మహాసభ జరిగింది. ప్రజలు వాళ్ళంతట వాళ్ళు సంఘటితమై కౌలుదారుల పోరాటంలోకి వస్తూనే ఉన్నారు.

కొమురయ్యను చంపిన తరువాత విద్యార్థులు కూడ పోరాటంలోకి రావటం మొదలైంది. కాలేజీలను బాయ్‌కాట్ చేసి వాళ్ళు కూడ గుతుపల సంఘాలలోనికి వస్తుండటంతో పోరాటం బాగ విస్తృతమయింది.

జనగామ తాలూకా ధర్మారం గ్రామంలోకి పోలీసులొచ్చి స్థానిక నాయకులను అరెస్టు చేస్తే, వందలాది మంది ప్రజలు నిరసన తెలిపారు. ఆ తర్వాత కడివెండి, ధర్మారం, సీతారాంపురం, దేవరుప్పల – నాలుగు గ్రామాల్లో 144 సెక్షన్ పెట్టారు. నల్లా నరసింహులు, మోహన రెడ్డి, కొమురయ్య, లింగయ్య మొదలైన నాయకులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టినా వాళ్ళు లొంగిరాలేదు. సూర్యాపేటలో కూడ కొందరు నాయకులను అరెస్టు చేసిన్రు.

సూర్యాపేట తాలూకా బాలేముల గ్రామంలో పార్టీ నాయకులకు ఆశ్రయం ఇచ్చిండని మట్టారెడ్డి అనే ఆయన ఇంటి పై దాడిచేసిన్రు పోలీసులు. చుట్టుపక్కలున్న జనమంతా కర్రలతో ప్రతిఘటించిన్రు. పోలీసుల కాల్పుల్లో మట్టారెడ్డి మరణించిండు. అనంతరెడ్డి అనే నాయకుడు కూడా ఈ దాడిలోనే ప్రాణాలు కోల్పోయిండు. ఈ సంఘటనతో ప్రజల్లో ఆగ్రహం మరింతగా రాజుకున్నది.

ఆ తర్వాత, సూర్యాపేట తాలూకాలోని పాత సూర్యాపేట, దేవరుప్పల, జనగామ ఊళ్ళమీద పోలీసులు దాడులు చెయ్యడానికి తయారవుతున్నరని ప్రజలకు తెలిసింది. వాళ్ళను ఎదుర్కోటానికి ప్రజలు సన్నద్ధమయిన్రు. చుట్టుపక్కల ఊళ్ళ నుండి కూడ జనం కర్రలతో, వడిశెలలతో, రాళ్ళతో వచ్చి రాత్రుళ్ళు కాపలా కాసేవాళ్ళు.

ఒకనాడు పోలీసులు, మిలిటరీ వాళ్ళు పాతసూర్యాపేట గ్రామాన్ని చుట్టుముట్టిన్రు. స్త్రీలూ, పురుషులూ కలిసి వడిశెలలతో రాళ్ళు రువ్వుతూ వాళ్ళను నిలువరించిన్రు. తుపాకులతో కాల్చుతామని పోలీసులు బెదిరించినా ప్రజలు వెనక్కు తగ్గలేదు. పోలీసులు కాల్పులు జరపటంతో ఇద్దరు కార్యకర్తలు మరణించిన్రు. చాలా మందికి తీవ్రమైన గాయాలయినై. బాలేముల, దేవరుప్పల, మల్లారెడ్డి గూడెం గ్రామాల మీద కూడ పోలీసుల దాడులు జరిగినై. ప్రజలు కర్రలు, వడిశెలలతో బాటు నాటు తుపాకులతో గూడ దాడుల్ని ఎదిరించిన్రు.

ఆ రోజుల్లో పోలీసులు, మిలిటరీ చేసిన దారుణాలకు అంతులేదు. సైన్యం గుంపులుగా వెళ్ళి ఆడవాళ్ళపై అత్యాచారాలు చేసిన్రు. మగవాళ్ళను చిత్రహింసలు పెట్టిన్రు. ఇళ్ళ మీద పడి దోచుకున్నరు. ప్రజలు సంఘటితంగా నిలిచి కాపాడుకున్నరు. ఆడవాళ్ళు తమ మాన ప్రాణాల రక్షణకు కారం పొట్లాలు బొడ్లో పెట్టుకొని పోరాడిన్రు. ఇంత నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, పోరాటం చేస్తూ కూడా వ్యవసాయం పనులు చేసుకుంటనే, పంటలు పండిస్తునే ఉన్నరు ప్రజలు. ఇది చాలా గొప్ప విషయం.

అప్పుడు గ్రామాలను రక్షించుకోటానికి మాకు ప్రోగ్రాం ఇచ్చిన్రు. మహిళలను వాలంటీర్ దళాలుగా ఏర్పాటు చేసి, అప్పటికే సమష్టి వ్యవసాయం చేస్తుండిన, విముక్తి అయిన గ్రామాలను పోలీసు దాడుల నుండి రక్షించుకునేందుకు శిక్షణ ఇచ్చిన్రు. గ్రామ రాజ్యాలను నిర్వహించటం ఇంకొక ముఖ్యమైన బాధ్యత. గ్రామాల్లో వచ్చే తగాదాలను, కుటుంబ తగాదాలను భూస్వాముల దగ్గరికి పోనియ్యకుండ ఈ పంచాయితీలే విచారించేవి.

గ్రామాల మీద పోలీసులు, మిలిటరీ బలగాలు, రజాకార్లు భయంకరమైన దాడులకు దిగిన్రు. మల్లారెడ్డి గూడెం, ఆకునూరు పల్లి గ్రామాల్లో జరిగిన సంఘటనలను ప్రత్యేకంగా చెప్పాలె. మొగవాళ్ళను గుంపులు గుంపులుగ తీసుకపోయి జైళ్ళలో కుక్కిన్రు. జైళ్ళు చాలకపోతే ఒకచోట మైదానంలో నిలబెట్టి కాల్చేసిన్రు. ఊళ్ళను తగలబెట్టిన్రు. ఈ పరిస్థితి దాదాపు ఒక సంవత్సరం పాటు సాగింది.

ఇక మన కర్రలతోని, వడిశెలలతోని లాభం లేదనే పరిస్థితి వచ్చింది. దళాలను ఏర్పాటుచేసి ఆయుధ శిక్షణ ఇచ్చింది పార్టీ. అనేకమంది ఆడవాళ్ళు గ్రామాల్లో కింది తరగతులనుండి ఈ శిక్షణకు వచ్చిన్రు. ఆర్థికంగా పై స్థాయి కుటుంబాల నుంచి వచ్చిన నా వంటి వాళ్ళం నలుగురం. మా అక్క కూడ వచ్చింది. ఆమె కూడా బాగా మాట్లాడేది.

మా అక్కపేరు శశిరేఖ. ఆమెకొక చంటిపిల్ల ఉన్నది. పిల్లను సంకనబెట్టుకొని అట్లనే వచ్చింది. పిల్లతోటి వస్తే కష్టమని చెప్పినంక మా అమ్మ దగ్గర వదిలిపెట్టి వచ్చింది. ఆ ఊరిమీద దాడి జరిగింది. మా అమ్మ, మేనత్త, మా చిన్నమ్మ, ఇంకో చిన్నాయన భార్య, ఇంకా చాలా మంది స్త్రీలు ఒక చోటికి చేరిన్రు. పోలీసుల దాడి జరిగినప్పుడు స్త్రీలందరూ

ఒక చోటికి చేరి ఆత్మరక్షణ చేసుకోవాల్నని, సామూహికంగా ప్రతిఘటించాల్నని పార్టీ పిలుపునిచ్చింది. మా అమ్మను పోలీసులు పట్టుకపోయి, స్టేషన్లో పెట్టిన్రు. ఆ వార్త తెలిసినప్పుడు మాత్రం నాకు దుఃఖమొచ్చింది.

మొదట్లో భూస్వాముల దగ్గర గుంజుకున్న ఆయుధాలతోనే ప్రారంభం చేసినం. పోలీసు క్యాంపుల మీద దాడులు చేసి తుపాకులు ఎత్తుకొచ్చెటోళ్ళం. ప్రభుత్వంతో డైరెక్ట్గా యుద్ధం ప్రారంభమయిందన్నమాట. ఆకునూరు, మాచిరెడ్డి పల్లి గ్రామాల్లో జరిగినది చాలా గొప్ప పోరాటం. స్థానిక స్త్రీలు, పురుషులు కలిసి పోరాడిన్రు.

ఆ గ్రామాన్ని రక్షించడానికి కొన్ని దళాలను తీసుకొని వెళ్ళమని నన్ను ఆదేశించిన్రు. వాళ్ళు చేసిన పోరాటాన్ని చూసి నేను చాలా ఆశ్చర్యపడ్డ, చాలా ఇంప్రెస్ అయిన. లెవీ పేరుతో ఊరిలో ధాన్యమంత దోపిడి చేసిన్రు భూస్వాములు. ధాన్యాన్ని బండ్లకెత్తి తోల్క పోయిన్రు. ఊళ్ళో మొగోళ్ళు లేరు. చాలా మందిని జైళ్ళల్లో పెట్టిన్రు. ఉన్న కొద్ది మంది పారిపోయి చెల్కల్లో దాక్కోవలసి వచ్చింది.

ఆడవాళ్ళు కూడా మొదట పారిపోయిన్రు. ఎవ్వరం లేకపోతే ఆ గూండాలు ఎక్కడ గొడ్డు, గోదలన్నిటిని తీసుకుపోతరో, ఇండ్లన్ని తగుల బెడతరో, మనం రక్షించుకోకపోతే లాభం లేదని మళ్ళా ఊళ్ళోకొచ్చిన్రు. ఈ ఆడవాళ్ళు వాళ్ళంతట వాళ్ళే కొన్ని దళాలుగ ఏర్పడిన్రు. ఊళ్ళో నుండి తీసుకపోయిన ధాన్యాన్ని, యాటలను కచీర్ల పెట్టుకొని వండుకొని తింటున్నరు గూండాలు, పోలీసులు. ఈ దళాలుపోయి ఆ పోలీసు క్యాంపుల మీద దాడి చేసిన్రు.

దాంతో పోలీసులు ఊళ్ళో కొచ్చి సామూహికంగా అత్యాచారాలు చేయడానికి పూనుకున్నరు. వాళ్ళ కండ్లల్ల కారం కొట్టి ఎదిరించిన్రు. పోలీసోళ్ళను ఇండ్లల్లకు రమ్మని పిల్చి కండ్లల్లో కారంగొట్టి, తుపాకులు గుంజుకున్నరు. ఈ పోరాటానికి డైరెక్షన్ ఇచ్చెటందుకు మమ్మల్ని పంపించింది పార్టీ. ఇట్లా ప్రజలు తిరుగబడటంతో పోలీసోళ్ళు అప్పటికి పారిపోయి, రజాకార్లను వెంటబెట్టుకొని తిరిగి వచ్చిన్రు. నలుగురు మొగవాళ్ళు దొరికితే వాళ్ళను నిలబెట్టి కాల్చేసిన్రు. ఆడవాళ్ళ మీద అత్యాచారాలు చేసి, గ్రామాన్ని తగలబెట్టిన్రు. అదంతా పార్లమెంటుదాకా పోయింది.

అట్లాంటివి పది, పదిహేను పోరాటాల్లో నేను నిలబడి డైరెక్షన్ చెయ్యటం, పాల్గొనటం జరిగింది. సూర్యాపేట, మల్లారెడ్డి గూడెం, ఆకునూరు, మాచిరెడ్డి పల్లి – ఇట్లా చాలా పోరాటాల్లో పాల్గొన్నాను. నేనొక్కదాన్నే కాదు, నా వెంబడి దళం, తుపాకులు ఇవన్నీ కూడా ఉన్నాయి.

దాడులలో నేరుగా పాల్గొనటం కన్నా కూడా దళాల్లోకి జనాన్ని సమీకరించటం, డైరెక్షన్ ఇవ్వటం, ప్రజలను చైతన్య పరిచి ముందుకు నడిపించటం వంటి పనులను

నాకు అప్పగించారు. వీటితోబాటుగా గ్రామాల్లో వ్యవసాయ పనులను చేయించటం, గ్రామ పరిపాలన చేయటం, స్త్రీలకు వైద్య సహాయం చేయటం వంటి పనులు కూడా నేను నిర్వహించా. వీటన్నిటిలోనూ మాకు శిక్షణ నిచ్చారు. పిండిప్రోలు అడవుల్లో మాకు ప్రత్యేకంగా గెరిల్లా శిక్షణ ఇచ్చిన్రు. అప్పుడు మా మహిళా గెరిల్లాల దళాన్ని ఫోటో తీసిన్రని అప్పుడు నాకు తెల్వదు. నేను దాన్ని అప్పుడు చూడలేదు. ఇప్పుడు చాలాసార్లు టీ.వీలో దాన్ని చూపిస్తుంటారు.

ఈ ఘటనలన్నీ వివరించగలిగితే ఉత్తేజం వస్తది. ఇప్పుడు అందరూ ఇంటర్వ్యూలు తీసుకుంటున్నరు. కాని, చెప్పేటప్పుడు ఏమయితుందంటే ఆమె ఈ గొప్పపని చేసింది, ఈమె ఆ గొప్పపని చేసింది అని రాస్తారనుకోండి, దానికి ఉత్తేజం రాదు. ఆ ఘటనలు ఏ చరిత్ర పరిణామంలో జరిగిందీ, దాని ఫలితం ఎట్లా వచ్చింది, జనం మీద దాని ప్రభావం ఏ విధంగా పడ్డది – అని రాసినప్పుడే ఆ ఉత్తేజం వస్తది.

మన కోటేశ్వరమ్మగారు నిర్జన వారధి అని తన జీవితాన్ని గురించి గొప్ప పుస్తకం రాసింది. చిన్న చిన్న సంఘటనలను కూడ వదిలిపెట్టకుండ రాసింది. ఆమెకు ఎదురయిన సమస్యలు, వాటిని ఆమె ఎదుర్కొన్న తీరు, అట్లా ప్రవర్తించటంలో ఆమె భావజాలం అందించిన శక్తి – యివన్నీ మంచిగ వివరించటం వల్ల ఆ పుస్తకం చాలా ఆకర్షణగా వచ్చింది.

ఉద్యమంలో పాల్గొనే క్రమంలో ఎన్నో సమస్యలు ఎదురైతాయి. వాటిని గురించిన విశ్లేషణను కూడ చెప్పగలిగితేనే ఆ జీవితాలకు సంబంధించిన ఉత్తేజం చదివేవాళ్ళకు అందుతుంది. చూడటానికి చిన్న చిన్న విషయాలుగానే ఉండొచ్చు. కానీ వాటి వెనకాల ఎంతో లోతు వుంటది. నా జీవితంలో ఎదురయిన అన్ని సంఘటనలూ నాకిప్పుడు గుర్తులేవు. కొన్ని మాత్రమే జ్ఞాపకం ఉన్నాయి. వాటినైనా చెప్పాలని నా ప్రయత్నం.

పోరాటంలో ఉన్నవాళ్ళందరం ముఖ్యంగా రెండు బాధ్యతలను నిర్వహించినం. ఒకటి గ్రామ వాలంటీర్ దళాలను ఏర్పాటు చేసి రక్షణ బాధ్యతలు చూడడం. రెండోది గ్రామ పరిపాలనను నిర్వహించడం. మగవాళ్ళకూ, ఆడవాళ్ళకూ కూడా ఈ బాధ్యతలు ఇచ్చిన్రు.

గ్రామ పోరాట కమిటీలను ఏర్పాటు చేసి, వాలంటీర్లను ఎంపిక చేసి క్రమంగా గెరిల్లా సైన్యంలోకి పంపాలె. అట్లా పంపే కార్యక్రమాన్ని నాకు కూడ ఇచ్చిన్రు. దాన్ని నేను చాలా విజయవంతంగా నడపగల్గిన. పరిపాలన బాధ్యతల్లో పోరాటం, భూ పంపకం ఇవన్నీ చేయాల. గ్రామస్తులతో కమిటీలు వేసి, ఆ కమిటీలను తీసుకొనిపోయి చెలుకల్లో. పొలాల్లో నిలబడి పంచినం. ఒక ప్లాన్ ప్రకారం నిర్వహించినం.

జనానికి సంబంధించిన కొన్ని సమస్యలు కూడ వస్తయి. ప్రతిఘటించవలసి వస్తది, జవాబు చెప్పవలసి ఉంటది. అవతలి పక్షం ఎదురు తిరిగినప్పుడు రాళ్ళు తీసుకొని, కట్టెలు తీసుకుని తరమవలసి వస్తది. ఇట్ల ఒక ఊరిలో జరిగిన పోరాటం మిగతా చోట్ల ప్రభావితం చేస్తది.

రాములమ్మ, సత్యవతి వంటి స్త్రీలందరూ ఈ దళాల్లో ఉన్నరు. పోరాటం మొదటి దశలో స్త్రీలది చాలా ముఖ్యమైన పాత్ర. గ్రామ పరిపాలన, స్త్రీల సమస్యలు వంటి విషయాల్లో స్త్రీలందరం కలిసికట్టుగా పనిచేశాం.

# 6

## ప్రతిఘటన

1947, ఆగస్టు 15వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ప్రకటించిన్రు. అంటే బ్రిటిష్ పరిపాలన ఉన్న ప్రాంతాల సంగతి అది. హైదరాబాద్ సంస్థానంలో నైజాంపాలన నడుస్తనే ఉన్నది. ప్రజలమీద దాడులు జరుగుతునే ఉన్నాయి. యుద్ధం నడుస్తూనే ఉన్నది.

భారత యూనియన్ ప్రభుత్వం, దేశంలోని సంస్థానాలను విలీనం చేసుకొనే కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. నైజాం నవాబు మాత్రం, తాను యూనియన్‌లో చేరననీ స్వతంత్రంగానే పాలన చేస్తాననీ పట్టుపట్టాడు. నైజాంను యూనియన్‌లో చేరమని భారత జాతీయ కాంగ్రెస్ సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించింది.

నిజాం సంస్థానాన్ని యూనియన్‌లో విలీనం చెయ్యాలని కోరుతూనే, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలను కమ్యూనిస్టు పార్టీ నడిపించింది. అన్ని విషయాల్లోనూ భూస్వామ్య విధానం రద్దు కావాలని ప్రచారం చేసినాం. వెట్టి చాకిరికి, నిర్బంధ వసూళ్ళకు వ్యతిరేకంగా ప్రజలు నిలబడేట్టు చేశాం. భూస్వాముల వద్దనున్న అక్రమనిల్వల ధాన్యాన్ని స్వాధీనం చేసుకొని, పేదలకు పంచే కార్యక్రమాలను గ్రామ దళాలు నిర్వహించినై. భూస్వాములకు గరిష్ట భూ పరిమితిని వంద ఎకరాలుగా నిర్ణయించి, అంతకన్నా ఎక్కువున్న భూమిని ప్రజలకు పంపిణీ చేశాం.

ఈ విధమైన ప్రతిఘటనతో నైజాం నవాబు రెచ్చిపోయి, రజాకార్ దళాలను ఏర్పాటు చేసిండు. సైన్యం అండతో వాళ్ళను ఊళ్ళమీదకు తోలిండు. లూటీలు, గ్రామాలను తగులపెట్టడాలు, అత్యాచారాలు, హత్యలు లెక్కలేకుంట జరిగినై. వీటిని గొప్ప సాహసంతో ఎదుర్కొంటూ ప్రజల పక్షాన నిలబడినవి కమ్యూనిస్టు దళాలు, ఆంధ్ర మహాసభ దళాలు.

ఇక నిజాం నవాబుకు, యూనియన్ ప్రభుత్వానికి చర్చలు జరుగుతున్నవి. ఏం జరుగుతుందో చూద్దాం, ఒక మూడు నెలలు పోరాటాన్ని తగ్గించి, ఆత్మరక్షణ చేసుకొమ్మని మాకు పార్టీ నుండి ఆదేశాలు వచ్చినై. ఇట్ల మనం ఆగేవరకల్ల వాళ్ళు బాగా చెలరేగిపోయిన్రు. పోలీసులు, రజాకార్లు చేసే దాడులకు అంతులేకుండ పోయింది. మేము బయటున్న వాళ్ళం బయటనే ఉండిపోయినం, అడవిలో ఉన్నవాళ్ళం అడవిలోనే ఉండిపోయినం.

నైజాం రాజ్యాన్ని విలీనం చేసుకోవటమేగాక, కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని అరికట్టాలనే లక్ష్యం కూడ ఉన్నది యూనియన్ ప్రభుత్వానికి. అడవుల్లో ఉండే దళాల జాడలు తెలుసుకున్నది ప్రభుత్వం. విమానాల ద్వారా కరపత్రాలు చల్లటం మొదలు పెట్టిన్రు. నెహ్రూ ఉపన్యాసాన్ని ప్రింటుచేసి పంచుతున్నారు. అడవిలో పడిన కరపత్రాలను నేను గూడ చదివిన.

ఆ కరపత్రమంతా కమ్యూనిస్టులను పోరాటం నుండి విరమించమని చెప్పటానికే రాసిన్రు. నిజాం రాజు చాల క్రూరమైన విధానాన్ని అనుసరిస్తున్నడనేది వాస్తవం. అందుకే ఆ రాజ్యాన్ని యూనియన్ ప్రభుత్వంలో విలీనం చేసుకుంటం. గాంధీ చెప్పిన సూత్రాల ప్రకారం గ్రామ రాజ్యాన్ని స్థాపించి, భూములు పంచుతం. మీరు తుపాకులు వదిలిపెట్టి, ఎన్నికల్లో పాల్గొనండి – ఇట్లా బోధిస్తూ వేశారు కరపత్రాలు.

దీని మీద ఎట్లాంటి వైఖరి తీసుకోవాల్నని చర్చలు జరిగినై. కాంగ్రెసు నాయకత్వం భూస్వాములకు అనుకూలంగనే వ్యవహరిస్తున్నది. వాళ్ళను నమ్మలేము. నమ్మి, పోరాటాన్ని ఆపితే భూస్వాములు మళ్ళా తిరిగి బలపడతారు, ప్రజల్ని బాధపెడతారు. కాబట్టి మనం జనం పక్షాన నిలబడి పోరాటాన్ని సాగించాల్సిందేనని నిర్ణయం జరిగింది.

తెలంగాణలోని ఎనిమిది జిల్లాలను ఉత్తర ఏరియా కమిటీ, దక్షిణ ఏరియా కమిటీ అనే రెండు భాగాలుగా చేసిన్రు. ఓంకార్, నేను, మల్లు వెంకట నర్సింహారెడ్డి. మేమందరం ఈ కమిటీల్లో పని చేసినం. మిలిటరీ పరంగా, పొలిటికల్‌గా రెండు కమిటీలు ఏర్పాటయినై. మా అన్నయ్య, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, లక్ష్మీ నరసింహారెడ్డి, వీళ్ళందరినీ కలిపి ఒక పోరాట కమిటీ వేసిన్రు. పోరాటం ఆపాల్నా, వద్దా అని చర్చలు జరిగినై. అటు దళాలవైపు రాజేశ్వర రావుగారు, ఇటు దళాలవైపు సుందరయ్యగారు ఉన్నారు. మా అన్నగారు బొంబాయిలో ఉండి పనిచేస్తూ హైదరాబాద్‌లో కూడా నడుమ నడుమ షెల్టర్ తీసుకుంటుండె. కాని, రజాకార్ల వ్యవహారం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో షెల్టర్ కుదరలేదు. నాగపూర్‌లో ఉంటూ సెంట్రల్ కమిటీ పని చూస్తుండేది. మొత్తంమీద పోరాటం

నిలదొక్కుకున్నది. గిరిజనులను తిరుగుబాటుకు సిద్ధం చేసిన్రు. బయ్యారం, గార్ల, ఇల్లందు, కొత్తగూడెం ప్రాంతాల్లో బ్రహ్మాండంగా సాగింది ఉద్యమం.

కొత్తగూడెం బొగ్గుగనుల ప్రాంతంలో కూడా నేను పనిచేసిన. విప్పపువ్వు ఏరటానికి పోయే కోయోళ్ళ స్త్రీలు మాకు పోలీసుల సమాచారం అందించెటోళ్ళు. ఒకసారి ఆ రోడ్డు మీద వస్తున్న బస్సులో పోలీసులున్నరని సమాచారం అందింది. రోడ్డుకు అడ్డంబడి వెళ్ళి తుపాకితో బస్సుటైర్లను పేల్చి ఆపేసిన. బస్సులో ఎక్కి సోదాచేసి కానిస్టేబుల్ వుంటె, ఆయన తుపాకి గుంజుకొని ఎల్లగొట్టిన. అట్లనే డొంకల్ల పోలీసోళ్ళు ఎదురయిన్రు రెండు మూడు సార్లు. ఒక్క తుపాకి గుండు పేల్చి నాలుగైదు తుపాకులు ఎత్తుకొచ్చినా. ఇట్లా పోలీసుల జాడలు తెలుసుకుని తుపాకులు గుంజుకొచ్చే పనుల్లో వి.ఎన్ కూడా చాలా చాకచక్యంగా పనిచేసేవాడు.

అప్పుడున్న వాతావరణం ఏందంటే – దేశానికి స్వతంత్రం వచ్చిందనీ, నైజాం సంస్థానం కూడా రద్దయితున్నదనీ వార్తలు వినడంతో పోలీసోళ్ళు కూడ కొంచెం డిఫెన్స్‌లో పడిపోయిన్రు. దాన్ని అవకాశంగా తీసుకొని విపరీతంగా తుపాకులు సమీకరించినం. గ్రామాల ప్రజలు కూడా మంచి చైతన్యంతో ఉండటం వల్ల పోలీసు క్యాంపుల మీద దాడులు చేసి తుపాకులను మోపులుగట్టి తెచ్చెటోళ్ళం.

జైపాల్‌సింగ్ అనే ఒక రిటైర్డు మిలిటరీ ఆఫీసరు ఉత్తరాది ఏరియా నుండి వచ్చి ఆయుధ శిక్షణ ఇచ్చిండు. ఇక తిరుగులేకుండ మా జైత్రయాత్ర సాగింది. అందులో ఎవరికి దొరికిన పాత్ర, ఎవరికి వీలయిన పాత్ర వాళ్ళు నిర్వహించిన్రు. యూనియన్ సైన్యంతోటి పోరాటంలో కూడ చాలా తుపాకులు గుంజుకున్నం.

అప్పట్లో పోలీసుల క్యాంపులపై ఎట్లాంటి దాడులు జరిగాయో చెప్పటానికి ఒక ఉదాహరణగా ఎర్రపాడు క్యాంపుమీది దాడిని చూపించొచ్చు.

సూర్యాపేట తాలూకా ఎర్రపాడు గ్రామంలోని గడీలో పోలీసులు క్యాంపు పెట్టిన్రు. దాని మీద దాడి చేయాల్నని నిర్ణయించుకున్నం. గడీకున్న ప్రహరీగోడ చాలా ఎత్తున్నది. పోలీసులేమో పై బంగ్లాలోని ఒక గదిలో ఉన్నరు. లొంగిపొమ్మని హెచ్చరికలు చేస్తూ రెండు రోజులు గడిపినం. వాళ్ళు లొంగుతలేరు. ఇంక లాభం లేదని మూడవ రోజున మొత్తం జనాన్ని కూడగట్టి గడీని చుట్టుముట్టినం.

గడ్డపారలతో గడీ గోడలను తవ్వడం మొదలు పెట్టిన్రు. అయినా గోడలు చెక్కు చెదరలేదు. గడ్డి మోపులో మిరపకాయలు పెట్టి దానికి అగ్గిపుల్ల అంటించి కిటికీలోంచి లోపలికి వేసిన్రు. బంగ్లాకు నిచ్చెన వేసుకొని ఎక్కి దాన్ని లోపలికి వేసిన్రు. ఇక లోపలంత పెద్ద పొగకమ్మింది. ఊపిరి మెసలక చచ్చిపోతమని పోలీసులకు అర్థమైంది. కిటికీల్లోంచి, బురుజుల మీద నుండి తుపాకులు కాల్చిన్రు.

ఈ దాడిలో ఇద్దరు ముగ్గురు ప్రజలు మరణించిన్రు. గాయపడిన వాళ్ళను సురక్షిత ప్రాంతానికి చేర్చటమే చాలా కష్టమై పోయింది. దారంత మిలిటరీ క్యాంపులున్నప్పటికీ ప్రజలు సాహసంతో పోలీసు క్యాంపుల మీద దాడులు చేసి తుపాకులను స్వాధీనం చేసుకున్నరు.

ఒక్కొక్క ఏరియా కమిటీలో ఐదారు దళాలుండేవి. దళాలకు కమాండర్లున్నారు. మా ఏరియా కమిటీలో ముగ్గురు ఆర్గనైజర్లుండేటోళ్ళు. ఈ ఆర్గనైజర్ దగ్గర తుపాకి ఉంటది. దళాలనూ, గ్రామ పరిపాలనను కూడ వీళ్ళు ఆర్గనైజ్ చేయాలె. భూమి పంపకం, సాంఘిక సమస్యల పరిష్కారం, వైద్య సహాయం ఇవన్నీ చేసే పనిని నిర్వహించాలె. నేను అందులోనే ఉండేదాన్ని.

వీటన్నిటితోబాటు స్త్రీలను దళాల్లోకి రిక్రూట్ చేయాల్సిన బాధ్యత ఉండేది. కుటుంబాల్లోని మగవాళ్ళు గనుక మన సభ్యులో, సానుభూతిపరులో అయితే స్త్రీలు ఉద్యమంలోకి రావటం సులభమయింది. అట్లా కానప్పుడు స్త్రీలను బయటికి తీసుకురావటం కష్టం. కొందరు స్త్రీలయితే ఇంట్లో చెప్పకుండ పారిపోయి వచ్చేటోళ్ళు. అన్ని బాధ్యతల్లోనూ స్త్రీలు సమానంగా బాధ్యతలు నిర్వర్తించారు.

ఈ సందర్భంలో కొంతమంది స్త్రీలను గురించి తప్పకుండ చెప్పుకోవాలె –

రాములమ్మ అనే ఆమె, భర్తతోబాటుగ 1946లో పార్టీలోకి వచ్చింది. ఆమెది నల్గొండ తాలూకా చెరుకుపల్లి గ్రామం. రెండేళ్ళ తర్వాత ఆమె భర్త పార్టీని విడిచిపెట్టి వెనక్కి పోయిండు. ఆమె మాత్రం వెనక్కు పోనన్నది. నైజాం వ్యతిరేక పోరాటం రోజుల్లో మిలిటరీ శిక్షణ తీసుకొని దళంలో పని చేసింది. మిర్యాలగూడెం తాలూకాలో ఒక కేంద్రానికి కార్యదర్శి అయింది.

ఒకసారి ఆమె ఒక గ్రామానికి పోయినప్పుడు భూస్వాములు పట్టుకొని, పోలీసులకు అప్పగించిన్రు. ఆమె దగ్గర ఆయుధం ఉన్నప్పటికీ తప్పించుకునే పరిస్థితి లేదు. పోలీసుల మధ్యనే నిలబడి ప్రజలకొక ఉపన్యాసం ఇచ్చింది. చాలా గొప్ప పనులు చేసింది, ఎన్నో దాడులను ఎదుర్కొన్నది. రాములమ్మ దళమంటేనే గొప్ప పేరు. ఆమెను అరెస్టు చేసి కొన్నాళ్ళు జైల్లో పెట్టిన్రు. విడుదలయినంక ఒక కామ్రేడ్‌ను పెళ్ళి చేసుకున్నది.

అట్లనే నాగమ్మ అని ఒకామె ఉండేది. తుపాకంత ఎత్తు కూడా ఉండేది కాదు, కాని మంచి ఫైటర్. మంచి సూటిగ తుపాకి కాల్చేది. తుపాకి కాల్చడానికి మంచి సత్తువ ఉండాలె. భుజానికి ఆనిచ్చి కాలుస్తం కాబట్టి, అది పేలేటప్పటికి మనం భుజం గట్టిగ పెట్టకపోతే తుపాకి గుండు పడదు. లేదంటే అది ఎటోపోయి మందిని జంపుతది. ఆ

నాగమ్మకు తుపాకిని భుజానికేసుకుంటే నేలకు ఆనేది. తుపాకిని భుజం మీదనన్న పెట్టుకుని తిరుగుతాను కాని, నాకు రైఫిల్ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టేదామె.

నాగమ్మ భర్త దళ కమాండర్. ఒకసారి వాళ్ళ దళం, పోలీసులను కొట్టాల్నని ప్లాన్ వేసింది. నాగమ్మ కన్నా ముందు ఇద్దరు కామ్రేడ్స్ నిలబడ్డరు దారిలో. పోలీసులు దగ్గరికి రాంగనే అటునుంచి వాళ్ళు, ఇటునుంచి నాగమ్మ, వాళ్ళను చుట్టేసి కవర్ చేయాలె. వాళ్ళమీద దాడి చేసి తుపాకులు గుంజుకోవాలని ప్లాన్.

అయితే పోలీసులు దగ్గరికొచ్చినా కూడా కమాండర్‌గా వున్న ఆమె భర్త తుపాకి పేల్చి సిగ్నల్ ఇవ్వనే లేదు. పోలీసులు దాటిపోతున్నరు, ఇక లాభం లేదనుకొని ఆమెనే చొరవ తీసుకొని తుపాకి పేల్చింది. పోలీసులు భయపడి తుపాకులు అప్పగించిన్రు.

మొత్తానికి ప్లాన్ సక్సెస్ అయింది. కానీ కమాండర్‌గా ఉన్న ఆమె భర్త ఆమెనే తప్పు పట్టిండు. ఆయనకు అహం దెబ్బతిన్నది. ఇద్దరూ వాదులాడుకొని విడిపోయే పరిస్థితి వచ్చింది. చివరికి నాయకులు ముందుకొచ్చి ఆయననే బతిమిలాడి సర్దుబాటు చెయ్యాల్సొచ్చింది. ఎందుకంటే ఆమెకున్నంత చైతన్యం ఆయనకు లేదు. ఈ గొడవ పెద్దదైతే ఉద్యమం నష్టపోతది. పార్టీ సిద్ధాంతాలలో ఆడవాళ్ళు, మగవాళ్ళు సమానమే. కానీ, వ్యక్తుల్లోని వెనకబాటు భావాలు అడ్డం పడుతై, అప్పటికప్పుడు ఏమీ చెయ్యలేని పరిస్థితులుంటై. అయినా గొప్ప సామర్థ్యాలున్న స్త్రీలు పార్టీలో ముందుకే పోయిన్రు. ఉద్యమం వాళ్ళకు ప్రోత్సాహాన్నిచ్చింది. క్రమంగా నాగమ్మ భర్త ఉద్యమంలో వెనక పడిపోయిండు, కానీ ఆమె దళ కమాండర్‌గా ఎదిగింది.

ఇంకొక విషయం కూడా చెప్పాలె. ఒకసారి నన్నూ, ఇంకొక మహిళా కార్యకర్తనూ ఒక ప్రాంతంలో పని చెయ్యమని పై కమిటి ఆదేశించింది. మేమిద్దరం వెళ్ళి అక్కడి ఆర్గనైజర్‌ను కలిసి విషయం చెప్పినం. "అమ్మో, ఇదేంది, ఈ జొన్నలగంప నా నెత్తిన పెట్టిన్రు. ఆడవాళ్ళతోని పనిచేయించుడు నాతోని కాదు, వెళ్ళిపో"మ్మన్నడు. మాకు బాగా కోపమొచ్చింది. "నువ్వు మాతోని చేయించుడేంది, నీకన్న గొప్పగ మేమే చేస్తం చూస్తుండమని" సవాలు చేసినం.

కొన్ని నెలలయినంక వేరే ప్రాంతానికి మారాల్సి వచ్చింది. ముప్పై గ్రామాలను ఆర్గనైజ్ చేసే పనిని ముగ్గురు మహిళలకు అప్పగించింది పార్టీ. మేము బ్రహ్మాండంగా ఉద్యమాన్ని విస్తృతం చేసినం. అంతకుముందు మమ్మల్ని వెళ్ళిపొమ్మన్నాయన మా ప్రాంతానికి రావలసి వచ్చింది. మమ్మల్ని నేరుగా కలవటానికి వీల్లేదు. అంచెలంచెలుగా చిట్టిలు అందుకున్నంక ముప్పైమందున్న దళాన్ని తీసుకుని ఆయన్ను కలిసేటందుకు వెళ్ళిన.

అప్పుడు ఆ ప్రాంతంలో నేను రాజక్క అనే పేరుతో ఉండేదాన్ని. రాజక్క దళమంటే పోలీసులకి, గూండాలకి హడల్, అంటూ ఆ ప్రాంతంలో చెప్పుకునేవన్నీ ఆయన విన్నాడు. ఆ రాజక్క ఎవరో, ఏందోనని మూడు రోజులపాటు ఎదురు చూసినంక నేనే రాజక్కనని తెలిసి దిమ్మెరపోయిండు. ఉరికొచ్చి ఎత్తుకున్నడు ఆనందంతో. “నీ వయసుకు, ఇంత పని చేసుడు ఎట్ల సాధ్యమయిందం”టూ ఆశ్చర్యపోయిండు. అంత ధైర్యంతో, చొరవతో పనిచేసినాం మహిళలం.

ఆ రోజుల్లో దేనికీ భయమన్నదే ఉండకపోయేది మాలో. ప్రజలను, ఉద్యమాన్ని రక్షించుకోవటం తప్ప మరొక ధ్యాసలేదు. పోలీసులైనా, మిలిటరీ వాళ్ళున్నా జడవకపోయేవాళ్ళం. వాళ్ళ చేతికి చిక్కితే ఇంక ప్రాణాలతో బయటపడలేమని తెలుసు. అడవిలో కూడా ఎన్నో ప్రమాదాలుంటై. వాటి నడుమన్నే పనిచేయటం నేర్చుకున్నం. ఏదన్న పురుగు కరిస్తేనో, జబ్బులొస్తేనో ఫస్ట్ ఎయిడ్ చెయ్యటంలో శిక్షణ నిచ్చిన్రు మాకు.

ఒకసారి మా దళం రాత్రిపూట ఒక అడవిలో పడుకున్నం. వెన్నెల రాత్రుల్లో పోలీసు దాడులు ఎక్కువగా జరిగేవి. అందుకే వెలుతురు పడకుండ చీకటిగా ఉండే చోటు చూసుకొని రక్షణ తీసుకునేవాళ్ళం. ఆ రోజు రాత్రి మేము పడుకున్న ప్రదేశంలో గుడ్డెలుగు ఉన్నట్టున్నది. అది దాని జాగ అయ్యుండొచ్చు, ఒక రకమైన వాసనొస్తున్నది. రాత్రి మేము నిద్రపోతున్న సమయానికి అది వచ్చి గుంజుడు మొదలుపెట్టింది. అందరం వరసగా పడుకున్నం. నేను మూడో మనిషినో, నాలుగో మనిషినో.

అది నా దగ్గరకు వచ్చి గుంజుతుంటె మెలకువయ్యింది. ఇదేదో ఉన్నట్లె ఉన్నదనుకొని కప్పుకున్న దుప్పటి తీసి దాని మీద ఇట్ల పడేసిన. మీద గుడ్డ పడేసినా, కొర్రాయి చూపించినా ఆగిపోతదని కొయ్యోళ్ళు చెప్తుంటె వింటుండేదాన్ని. అట్ల దాని మొకాన గుడ్డ పడగనే తిక్కలేసినట్లయి ఇసురుకుంటనే పైకి లేచేటందుకు ప్రయత్నం చేస్తున్నది.

దాని కాళ్ళను మెసలరాకుంట పట్టుకొని వెనక్కి తోసిపారేసిన. బోర్ల పడ్డది. దాని ధ్యాసంతా మొకానికి తగులుకున్న దుప్పటిమీదనే ఉన్నది. మనిషిని గమనించే పరిస్థితిలో లేదు. నేను వెంటనే తప్పించుకున్న.

ఇంకొక సారి అడవిలో పోతుంటె పులి ఎదురొచ్చింది. నేనిక ఒక గడ్డ మీదెక్కి నిలబడ్డ. ఎటుకదిలితే ఏమయితదోనని అట్లనే నిలబడ్డ. ఆడనే నిలబడి చూస్తున్నదది. కొంత సేపటికి అది ముందుకు అడుగు వేయబోంగనే నేను తుపాకి తీసుకొని పక్కకు పేల్చిన. దాన్ని కాల్చితే తప్పించుకున్నదంటె ప్రమాదమని పక్కకు కాల్చిన. దానితో భయపడి వెనక్కుమళ్ళి ఉరికింది. ఇట్లాంటి సంఘటనలు ఎన్నో.

ఆడవాళ్ళకు శారీరకంగా, సాంఘికంగా ప్రత్యేకమైన సమస్యలుండేవి. అయినా ఎవ్వరూ జంకలేదు. ఒక ఊరినుంచి ఇంకొక ఊరికి వెళ్ళి పనిచేసేటప్పుడు షెల్టర్స్ దొరకటం కూడ కష్టమే. లలితమ్మ సంగతి చెప్పిన కదా! జనంలో కలవటానికి వీల్లేని రూపం, మాటతీరు ఉన్న పెద్ద కులాల ఆడవాళ్ళను దాచటం కష్టమయ్యేది.

ఇక శారీరకమైన ఇబ్బందులు కొన్ని ఆడవాళ్ళకుంటయి. పీరియడ్స్ వచ్చినప్పుడు చాలా కష్టంగా ఉండేది. అప్పుడు అందరూ గుడ్డలే వాడుతుండిరి. అడవుల్ల ఉన్నప్పుడు గుడ్డలు దొరకటం కూడ కష్టమే. అడవి బీరకాయలు, అడవి సొరకాయలు అనేటివి ఉంటయి అడవుల్ల. వాటిని ఎండబెట్టి అంబలి బుర్రలుగ వాడుతరు. వాటికి పీచు ఉండేది. ఆ పీచును పాతగుడ్డ చుట్టి వాడుకునేటోళ్ళం. ఆ పీచు పారేసి, గుడ్డను ఉతుక్కొని, మళ్ళా వాడుకోవటమే.

డాక్టర్స్ వచ్చేటప్పుడు దూది తెచ్చెటోళ్ళు. కాని, గాయాలయినప్పుడు అవసరమయితదని, పీరియడ్స్‌కు దాన్ని వాడకపోయెటోళ్ళం. కొన్నిసార్లు ఆ పీచు కూడ అందుబాటులో ఉండదు. అప్పుడంతా 16 మూరల చీరలు కడుతుంటిమి కదా. వాటిలో లోపట గోచిలాగ తీసి చెక్కుకోవాల్సి వచ్చేది. అది చాల కష్టమయ్యేది.

గర్భవతిగా వున్న సమయాలు, చంటి పిల్లలతోని ఉండటం, యివన్నీ సమస్యలే ఆడవాళ్ళకు. చంటిపిల్లల్ని ఎవరి దగ్గరనన్న వదిలేసిన సంఘటనలు కూడ ఉన్నయి. అన్నయ్య విషయంలో అట్లనే జరిగింది. ఆయన దళాల్లో ఉన్న రోజుల్లో ఒకసారి భార్యను చూద్దమని అడవికి రమ్మని పిలిపించుకున్నడు. ఎల్లంపేట దగ్గర దళాల సమావేశం జరుగుతుంటె అక్కడికొచ్చిందామె. పసిపిల్లగాన్ని చంకనేసుకొని వచ్చింది.

హటాత్తుగా క్యాంప్ మీద పోలీసులు దాడి చేసిన్రు. ఆ రోజు మా మేనమామ కొడుకు అనంత్‌రెడ్డి కూడ అండ్లనే ఉన్నడు. అన్నయ్యకు, ఆయనకు, మిగతా దళ సభ్యులకంతా పోలీసులను ఎదుర్కోవడమే సరిపాయె. ఇక ఏం చేయాలె. ఆమెనూ, పిలగాణ్ణీ?

చారి అని ఒకాయనుండెటోడు. ఆయన టైపు కూడ చేసేది. సెంటర్ల సమావేశాలప్పుడు టైపు చేసెటోడు. ఆయన పిలగాణ్ణి తీసుకొని ఉర్కిండు. అన్నయ్య, మేనమామ కొడుకు, ఇంకా ఎల్లయ్య అనే దళ సభ్యుడు – వాళ్ళందరూ తుపాకులతో కాల్పులు జరుపుతూ పోలీసులను ఎదుర్కొంటున్నరు. క్యాంపును పూర్తిగా పోలీసులు చుట్టేసిన్రు. దాన్ని గండికొట్టి, వీళ్ళను తప్పించిన్రు దళ సభ్యులు. పిలగాణ్ణి తీసుకొని తల్లి ఒక్కతే పోవడం ప్రమాదం కదా. అందుకని చారిగారు పిలగాణ్ణి భుజానేసుకొని పరిగెత్తిండు.

అట్ల పరిగెత్తి పోయినోళ్ళు ఇక ఆ రాత్రికి కల్వటానికి వీలు కాలేదు. దారిలో ఒక తండా కనబడితె, అందులో పడుకున్నరు. పిలగాణ్ణి పట్టుకొని తిరుగుడు ప్రమాదమని, కాపాడమని చెప్పి తండాలో ఇచ్చేసిన్రు. కొన్నాళ్ళయినంక వచ్చి తీసుకపోతమని, అందాక జాగ్రత్తగా చూసుకోమని వాళ్ళకు చెప్పివచ్చిన్రు. అట్లనే చాలా మంది గర్భవతులుగా ఉండి దళాలకు వస్తే, కాన్పయినంక చుట్టాలకో, సానుభూతి పరులకో ఇచ్చేసి పోరాటంలో పాల్గొన్నరు.

ఇవన్నీ ఎవరో నాయకులు చెప్పిన్రని చెయ్యలే. పోరాటాన్ని రక్షించుకోవటమనే లక్ష్యంతో మహిళలు గొప్ప త్యాగాలకు సిద్ధపడ్డరు.

# 7

## ప్రజలే కాపాడుకున్నరు

1948 సెప్టెంబర్ 13వ తేదీన భారత యూనిన్ సైన్యాలు హైదరాబాదు సంస్థానం మీద పోలీసుచర్య ప్రారంభించాయి. నైజాం సైన్యాలు యూనియన్ ప్రభుత్వానికి లొంగిపోయినై. 1948 సెప్టెంబర్ 18న భారత యూనియన్‌కు లొంగిపోతున్నానని నైజాం నవాబు ప్రకటించిండు.

నవాబు లొంగిపోయిన విషయం తెలిగానే ప్రజలు, పార్టీ దళాలూ పోలీసు క్యాంపుల మీదా, రజాకార్ల శిబిరాలమీద దాడులు చేసిన్రు. ఎందరో దొరల గడీలను కూల్చి వేసిన్రు. ధాన్యాన్ని కొల్లగొట్టి ప్రజలు పంచుకున్నరు.

అదంతా సాగుతుండగానే సెప్టెంబరు చివర్లో యూనియన్ ప్రభుత్వం కమ్యూనిస్టుల మీదా, ప్రజల మీదా దాడులు ప్రారంభించింది. గెరిల్లాల ఆచూకి చెప్పమంటూ ప్రజలను చిత్రహింసలు పెట్టసాగిన్రు. ఇట్లా సంవత్సరం పాటు సాగినప్పటికీ ప్రజలు గ్రామ రాజ్యాలను కాపాడుకుంటూనే ఉన్నారు.

యూనియన్ సైన్యాలు వచ్చినాక మా ఇంటిని కాలబెట్టిన్రు. దోసుకపోయిన్రు. ఇంట్లోని వెండిసామాన్లు, బంగారం అంతా దోచుకున్నరు. ఆవులను కూడా తోల్కపోయి హర్రాజ్ పాడి అమ్మేసింది సర్కారు. దానితో మా వాళ్ళు వేరే దగ్గరకి పోయి తలదాచుకోవాల్సి వచ్చింది. మునగాల ఏరియాలో మనవాళ్ళే క్యాంపులు పెట్టి శిక్షణ ఇస్తున్నరప్పుడు. మా వాళ్ళు కూడా అక్కడికే వచ్చి తలదాచుకున్నరు. ఆంధ్రాకి దగ్గరగ ఉంటదది. అక్కడ రక్షణ తీసుకున్నరన్నమాట.

ఎర్రబాడు మీద దాడి జరిగింది. చిల్పకుంట్ల, సందుపట్ల జనాన్ని సమీకరించు కొనిపోయి, అన్నాలు వండుకబోయి వాళ్ళకి బెట్టాలి. రాళ్లేరి కుప్పలు బోయించాలి. జనాన్ని

కదిలించే పాత్రనాది. గ్రామరాజ్యాల పరిపాలనా కమిటీలు ఏర్పాటు చేసిన్రు. ఆ కమిటీలల్లో ఉన్నాం మేము. ఆ ఏరియాలో వాటిని కాపాడేందుకు గ్రామరక్షణ దళాలను ఏర్పాటు చేసే కార్యక్రమంలో వున్న మాకు జనం బ్రహ్మరథం పట్టిన్రు.

అడవులల్ల కోయోళ్ళ తాన, "కమ్యూనిస్టోల్లని, చీకటన్నలను నమ్మద్దు, వాళ్ళు గొంతులు కోస్తరు" అన్న ప్రచారం జరిగింది. అందుకే ఉద్యమాన్ని విస్తరించేపనిలో, ఆ ప్రాంతాలలో నన్నే ఇన్‌వాల్వ్ చేసిన్రు. నన్ను, వి.ఎన్.ను పంపినరు. ఆయన మైదాన ప్రాంతాలలో భూ సమీకరణ చేసి, ఖబ్జా పెట్టడానికి జనాన్ని తయారు చేయాలి. అప్పటికి మాకు సంబంధమేలేదు. ఆయనెవరో, నేనెవరో. నాకేమో గ్రామ రాజ్య పరిపాలనా సంబంధ కార్యక్రమాలు ఇచ్చిన్రు. ఆయనను ఉద్యమ విస్తరణ కోసం ముందుగ తోలిన్రు. ఆ తరువాత నేనుపోయిన. నన్ను దాదాపు మూడు నాలుగు నెలల పాటు ఉపన్యాసాలకు పంపిన్రు. అడవులు, గిరిజనుల మధ్య రజాకార్ల క్యాంపుల మీద దాడులు జరిగిన, ఆ ప్రారంభకాలంలో వున్నా. అప్పుడు ఆయుధాలు లేవుగానీ, నాకు జనాన్ని కదిలించే పని ఇచ్చారు. జనంలోకెళ్ళి, ఉపన్యాసాలిచ్చి, నిధులు వసూలు జేసి, ఆ డబ్బులతో తుపాకులు కొనాలన్న ఉద్దేశమన్న మాట. అప్పటికి గుదుప దళాలే వున్నయి మనకి.

సూర్యాపేట తాలూకా, కాసర్ల పాడులో రాజక్క అని ఒక కంచెరామె, మంచిలీడరు. మొత్తం ఆడోళ్లతోనే గ్రామాలలో కమిటీలు వేసాం. ఆ కమిటీలే గ్రామ రక్షక దళాలుగా పనిచేసినయి. గ్రామాల నుండి జనాన్ని ఊడ్చుకపోయి, క్యాంపులల్ల బెట్టిన్రు. ఊర్లల్ల ఆడోల్లే వ్యవసాయాన్ని రక్షించాల్సి వచ్చింది. పంచుకున్న భూములని సమష్టి వ్యవసాయం చేసే వైపుకు, గ్రామాలకు కాపలాకాసుకుని, రక్షించుకునే వైపుకు జనాన్ని కదిలించాల్సి వచ్చింది.

రాజక్కకి చిన్నప్పుడే భర్త పోయిండు. ముగ్గురో, నలుగురో పిల్లలున్నరు. వాళ్ళని ఆమె సాదుకుంటున్నది. వాళ్ళలో ఇద్దరు మన ఉద్యమంలోనే ఉన్నారు. ఊర్లో సంఘంలో పనిజేస్తున్నది. బాగా పేరుంది ఆమెకి అప్పటికే. ప్రియంవద, మా అమ్మ మేనమామ కొడుకు ప్రతాపరెడ్డి, నేను మేం ముగ్గురం గ్రామ పాలనా కమిటీలు ఏర్పాటు చేసే పనిలో తిరుగుతూ వున్నాం. దాడులు జరుగుతున్న సమయం అది. చిల్పకుంటలో లచ్చమ్మని వుంది. ఒకసారి ఏమయిందంటే పొద్దుపోయే దాంక గ్రామాలల్ల భూముల పంపకం జరిగింది. మహిళా దళాలను కూడా ఏర్పాటు చేసినం. మొగోళ్ళను కూడా కూడగట్టి మాట్లాడినం. ఊరిబైట మర్రిచెట్టు మీద అదివరకే జెండా వుండె. అక్కడ దగ్గర్లో. ఆముదం చేన్లో దాక్కున్నం. మాతో కాసర్లపాడు రాజక్క గూడా ఉంది. తర్వాత ఆమె ఇంటికాడ పండుకున్నం. లలిత కూడా ఆ ఊరి షెల్టర్‌లో వుంది. అప్పటికే పిల్లతల్లామె. ఆమె ఎటూ

కదిలేట్టులేదు. ఒక కంచెరోల్ల ఇంట్ల వున్నది. పోలీసులు వచ్చి ఊరును చుట్టుముట్టిన్రు. ఈ రాజక్క ఏం జేసిందంటే, ఒక ఇంట్లకు బోయి, ఆడ ఒక ముసలాయన వుంటే, ఆయనను గడ్డి కిందేయమని అంది. ఆ గడ్డి మీద ఆయనను పండబెట్టింది. లలితమ్మని ఆడ కూర్చోబెట్టి, మీరు ఏడ్చుకుంట వుండండి అంటే. ఆ ఇంట్లోల్లు అట్లనే మేనేజ్ చేసిన్రు.

అక్కడి నుండి తన ఇంటికి ఉరికొచ్చింది. అంతదాకా నేను ఆమె ఇంట్లోనే దాక్కుని ఉన్నా. నన్ను ఇంకొకరి ఇంటికి తీసుకపోయి, నన్నేమో ఒక పిడకల గూట్లోకి తీస్కబోయి ఆడ కూసోబెట్టి, కమ్మలేసి, కప్పేసింది. ప్రతాపరెడ్డి ఆ ఊరోడే ఆయనను దాయటం మహాకష్టం అని, ఆయన్ని ముందుగాలే బాయికాడికి ఎట్లనో పంపింది. పోలీసులు మొత్తం ఊర్లో జనాన్నందరినీ కూడగట్టిన్రు. ఎనుకకు చేతులు కట్టేసిన్రు. ఆ పోలీసుల ధోరణి ఎట్లుంటదో గ్రామాల్లో అందరికీ తెలుసు. వాళ్ళు ఒక ఊరిమీద పడంగనే ముందు జనాన్నంత తీసుకపోయి గుంపు వేసెటోళ్ళు. వాళ్ళ చేతులు కట్టేసి నిలబెట్టెటోళ్ళు. పట్వారి వచ్చి ఎవరు పార్టీకి పనిచేస్తారో గుర్తు పట్టినంక ఆ వ్యక్తులందరినీ కాల్చేస్తారు. ఆ పట్వారి వచ్చేలోగా పోలీసులు ఊరిమీద పడి దోచుకునేటోళ్ళు. కోళ్ళు కొక్కరాయిలు కోయించుకుని తింటరు. ఇంత టైము పడుతుందన్నమాట. పట్వారి వచ్చి గుర్తుపట్టిందాక పోలీసోళ్ళకు గ్రామస్తుల్లో ఎవరు ఏందో తెలిసే అవకాశం లేదు. ఆ జనంలో ఒక దళకమాండర్ కూడా వున్నడు. అతనిది పక్క గ్రామం. భార్యది ఈ ఊరు. అత్తగారింటికి భార్యకోసం వచ్చివున్నాడతను. తుపాకేమో, ఊరవతల ఎక్కడనో పెట్టి, రాత్రి ఇంటికి వచ్చాడు. అందరితోపాటు అతన్ని గూడా పట్టుకు వచ్చారు. ఊరి పటేలు సర్కారు ఏజెంటు పటేలు గనుక వస్తే, అతన్ని తప్పక గుర్తుపట్టి తమ ఊరివాడు కాదని చెప్తాడు. అయితే, ఆ సమయంలో పటేలు, పోలీసోళ్ళకి వంటలు చేయించడం, కోళ్ళు ఎత్తుకొచ్చి కోయించటం ఈ పని మీదున్నడు. జనం దగ్గర ఒక్కరిద్దరు పోలీసోల్లని బెట్టి. మిగిలిన వాల్లు దూరంగ రెస్టుతీసకుంటున్నరు. దానితో రాజమ్మ ఆ దళకమాండర్ దగ్గరికి చిన్నగా లైను వెనకకు పోయి, ఆ దళసభ్యుడి చేతుల కట్లు విప్పేసింది. ఆయన్ను దబదబ కొట్టుడు మొదలుపెట్టింది. పో గాడ్డి కొడుక! ఆవులన్ని ఇడ్చుకొని పోయినై. జొన్న చెలో పడ్డయంట. అది పచ్చజొన్న, తిన్నయంటె చస్తయి పశువులన్ని. ఫలానోళ్ళ జొన్న చేలో పడ్డయి, ఉర్కురా గాడ్డి కొడుక, అంటూ పల్లపల్ల కొట్టింది. “ఏ ఫో గొడ్లపోతున్నయి, ఫో” అని అనుకుంట, జనంలో మెల్లిగ ఆయనకి దారి ఇడిసింది. అతను అర్థం చేసుకుని తప్పించుకొని ఊరవతలకి పోయి, తుపాకి పేల్చిండు. ఇంతలో “ముసిల్దానా! ఏం జేసినవే?” అంటూ ఒక పోలీసోడు ఆమెను కొట్టనీకొచ్చిండు. ఆమె ఆ పోలీసును అంత మంది

ముంగట తన్నింది. వాడు ఎల్లెంకల బడ్డడు. వాడు లేచేలోగనే రాజక్క తప్పించుకుంది. ఆ ఇద్దరు పోలీసులు జనాన్ని "హాట్ హూాట్" అని అంటున్నరు గానీ, అంతమంది జనాన్ని కొట్టనీకి రాదుగద. వాళ్ళు వెనక్కి బోయి, మిగిలిన పోలీసుల్ని తెచ్చుకోవాలిగద.

ఈ లోగా ఆ దళనాయకుడు ఇంకొక్క పక్కకి బోయి, తుపాకి కొట్టిండు. ఉరికి ఈ పక్క, ఆ పక్కా బోయి, నాలుగు రోకల తుపాకీ పేల్చేతలికి పోలీసోళ్ళు బాగా భయపడిపోయిన్రు. దళంలో ఎంతమందున్నరోనని భయపడి దోచుకున్న సొమ్మంతా వదిలిపెట్టి పారిపోయిన్రు. వండించుకున్న కుండలు వదిలి పరిగెత్తిన్రు.

పోలీసులు ఒక ఊరిమీద పడంగనే డబ్బు, ధాన్యం, కోళ్ళు, గొర్లు అన్నీ దోచుకునేటోళ్ళు. పార్టీ మనుషలను గుర్తుపట్టంగనే వాళ్ళను కాల్చిచంపి, దోచుకున్న వస్తువులన్నీ బండ్ల కెత్తుకొని పోయెటోళ్ళు. పోలీసులు సోదాలు జేసుడు, తినేది ఇడిసిపెట్టి పారిపోయిన్రు. ఆ రోజు రాజమ్మ అంత సాహసం చేయకపోతే ఎన్ని ప్రాణాలు పోయేవో, గ్రామం ఎంత దోపిడికి గురయ్యేదో ఊహించలేం. అంత గొప్ప పని చేసింది రాజమ్మ. మన ప్రాణాలు ఉంటయా, పోతవా అనే ఆలోచన లేదు వాళ్ళకు. ఎంత త్యాగానికైనా సిద్ధపడి పార్టీని రక్షించిన్రు. ఆ కంచర రాజమ్మ పేరుమీదనే నేను రాజక్క అని పార్టీలో పేరు పెట్టుకున్న. అది నాకు స్ఫూర్తి నిచ్చింది. ఆమె ఒక లీడర్ అనిపించింది. కంచెర్ల రాజక్క ఏమైందని ఆ పొద్దు గూడ అడిగిన. ఆమె సచ్చిపోయింది.

ఇట్లాంటి ప్రతిఘటన లేకపోవటంతో చందుపట్ల అనే గ్రామంలో పదకొండు మందిని నిలబెట్టి కాల్చేసిన్రు. ఆ గ్రామంలో మొగోళ్లు తక్కువమంది ఉన్నరు. ఆడోళ్ళు కూడ అంత చురుకుగా ప్రతిఘటించలేకపోవటంతో పదకొండు ప్రాణాలు పోయినై. బ్రాహ్మణపల్లిలో కూడ అట్లనే చేసిన్రు.

ఎక్కడికక్కడ ప్రజలే ముందుకొచ్చి పోరాటం చేసిన్రు. మనం చేసినది, వాళ్ళకు ఆ చైతన్యాన్ని ఇవ్వటమే. సామాజిక సమస్యలమీద కూడ ప్రజల్లో చైతన్యం వచ్చింది. అంటరానితనం అన్నది ఎక్కడా రాలేదు. గ్రామ పరిపాలన బాధ్యతలు నేను నిర్వహించాను గదా. ప్రజలందరూ ఒక్క తాటిపై నిలబడి కలసి పోరాడిన్రు. అందరూ కలిసి ఒకచోట తినటం, పండుకోవటం, రక్షణ ఏర్పాటు చేసుకోవడం జరిగేది. అందుకే ప్రజల మధ్యన కులం ప్రసక్తి రాలేదు. పోరాటంలో ఉన్న వాళ్ళను కులం పేరిట ఇండ్లలోకి రానివ్వకపోవటం జరగలేదు.

ఇతర సంప్రదాయాల విషయంలో కూడ మార్పులు వచ్చినై, దొరోల్ల ముంగిట పండుగలు జరిపే పద్ధతి మానాలని తీర్మానం చేసినం. దొరలమీద జనం పాటలు

కట్టుకున్నరు. మాదిగోడు, మాదిగోడని మమ్ముల అంటరుగని, మాట తప్పనోల్లమంటె మేమే, మాట తప్పెటోడు దొరోడేనని అర్థం వచ్చేట్టుగా పాటలు కట్టి పాడిన్రు.

ప్రజల నుండి గొప్ప కళాకారులు పుట్టిన్రు. ఆ పోరాటమే వాళ్ళను కళాకారులుగా చేసింది. ఆంధ్రనుండి వెంకటేశ్వరరావు అనే కళాకారుడొకాయన వచ్చిండు. కొంచెం మేధావి. చదువుకున్నోళ్ళు అందరూ ఆ పోరాటంలోకి వచ్చి ఏదో ఒక బాధ్యత తీసుకునే ప్రయత్నం చేసిన ఆంధ్రా జనం చాలామందున్నరు. ఖమ్మం సరిహద్దుల మొదలుపెడితే గుంటూరు దాకా వాళ్ళు డైరెక్ట్ ఫీల్డ్‌ల పాల్గొనేటటువంటి పరిస్థితుల కొచ్చిన్రు. మాకు మద్యలో మునగాల అడ్డం ఉన్నది కాబట్టి నల్లగొండ జిల్లాకు ఎక్కువమంది రాలేకపోయిన్రు. చివరిదశలో గుంటూరు నుండి పరంధామయ్యగారని ఒకాయన వచ్చిండు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లా పుతుంబాకకు పోయి పనిచేసిండు. ఇట్ల చాలామంది వచ్చిన్రు.

ఈ సందర్భంల్లో గ్రామ పరిపాలన మొత్తం సామాజిక సమాన హక్కుల పద్ధతిలోనే సాగాలనీ, పండుగలు, ఇతర సాంప్రదాయాల విషయంలో కూడా అట్లనే జరగాలని పార్టీ పాలసీ తీసుకున్నది. ఉదాహరణకు బతుకమ్మ పండుగలో హరిజనులు పాల్గోవటం లేకుండె. ఉద్యమం దాన్ని మార్చేసింది. హరిజన స్త్రీలను కలుపుకొని సామూహికంగా ఆడేవాళ్ళం. దొరోళ్ల ఇంటిముంగిటకు పోయి ఆడుడు కూడా బందయ్యింది.

ఆ పండుగ విషయంలో అది మొదలు మేము చేన్లలో, అడవుల్లో దొరికే పూలన్ని ఏరుకొచ్చేటోళ్ళం. పువ్వులు కొని, బతుకమ్మ పేర్చడం ఇప్పుడొచ్చిందిగాని అప్పుడన్ని అడవి పువ్వులేగదా! తంగేడు పూలు, గునుగపూలు, కట్లపూలు– ఎంతో అందమైన పువ్వులన్నీ అడవిలనే దొరికేవి. బంతిపూలు మాత్రమే తోటల్లో పూచేటివి. దొరోల్ల తోటల్ల దొరికేవి. కానీ ఆ బంతిపువ్వులు బతుకమ్మకు పెట్టకపోయేది అప్పుడు. తంగేడు పూలు పెడ్తేనే బతుకమ్మ.

ఇప్పుడు బంతి, చామంతి అన్ని పూలు పెడుతున్నరు. అప్పుడు మాకు పళ్ళేలు కూడ ఉండేటివి కావు. అవన్నీ ఎక్కడ దొరుకుతయి? డబ్బున్నోళ్లకయితే వెండి తట్టలు ఉండేటివి. అగ్రకులాల్లో కొంచెం పేదోళ్ళయితే కంచుపళ్ళాలు వాడెటోళ్ళు. వాటికి కళాయి పోస్తే వెండిలెక్క తెల్లగవుండేవి. ఆడవాళ్ళందరినీ పోగుచేసి ఆడాలనుకున్నప్పుడు మాకు ఇవేవీ అందుబాటులో ఉండకపోయేవి. అప్పుడు ఒక ముసలమ్మ ఉపాయం చెప్పింది. అన్నం వార్చే సిబ్బులుంటాయి కదా, వాటిలో పెట్టుకుందామని చెప్పిందామె. ఆ సిబ్బుల్లో గుమ్మడాకులు వేసి పువ్వులు పెట్టుకొని ఆడెటోళ్ళం. వాళ్ళు పాడే పాటల వరసల్లోనే నేను ఉయ్యాలపాటలు కూర్చిన. అన్ని బతుకమ్మలను చెరువు దగ్గరకు తీస్కపోయి, ఒకేచోట కలిపి పెడుతుంటే బాపనోల్లు వచ్చి పూజ చేయ్యటానికి భయపడుతుండిరి. అట్ల కొన్ని ఊర్లల మేము పెట్టించినంక, అదే పద్ధతి అన్ని గ్రామాలల్లో గూడాలల్లో కొనసాగింది.

నేను ఎంఎల్ఏను అయినంక కూడ బతుకమ్మ పాట పాడమని గ్రామాలకు పిలుస్తుండిరి. తిమ్మాపురంల అందరు కల్సి ఆడుతుంటె నేను పోయి పాటపాడిన. అట్లనే ఐదారు గ్రామాలకు వెళ్ళి పాటలు పాడిన.

పోలీసోళ్ళను, గూండాలను ఎదుర్కోవటానికి వడిశెలలను మంచి సాధనంగా ప్రయోగించుకున్నం. చేన్లలో మంచెలమీద కూర్చొని పిట్టలను కొట్టెటందుకు వడిశెలలను ఉపయోగిస్తారు. వ్యవసాయం చేసే ఆడవాళ్ళకు బాగా చాతనయితది. వాళ్ళకు ఎప్పటినుండో అలవాటున్నది. మిడిల్‌క్లాస్ వాళ్ళు మాత్రం అప్పుడే నేర్చుకోవాల్సి వచ్చింది. లేదంటే రాళ్ళేరుకొచ్చి, గుట్టలుగా పోసి కొట్టేటోళ్ళకు అందించేవాళ్ళం. పోలీసోళ్ళు నడిచొస్తుంటే టంగ్, టంగ్‌మని శబ్దం వచ్చేది. ఆ శబ్దాన్ని వినంగనే పోలీసులొచ్చిన్రని తెలిసిపోతది. ఇక వడిశెలతో రాళ్ళు కొట్టటం మొదలవుతది.

అట్లనే చిల్పకుంట్లలలో గౌండ్లామె లక్ష్మి కుల పెద్ద భార్య. ఆమెకి పిల్లలు లేరు. ఎవరినో సాదుకున్నది. ఊర్లో నాయకత్వంలో ఉన్నవాళ్ళందరూ అరెస్టయినరు. దానితో ఆమె ఊర్లో నాయకురాలైంది. ఒకసారి నిద్రబోయేటందుకు వారి ఊరు బోయినం. “నా యింట్ల పడుకుందువుగాని రా. ఏంగాదు” అందామె. ఆ ఊరి జెండా మర్రి కాడా ఊరి జనం కాపలా బెట్టిన్రు. పోలీసులొస్తే, బూర ఊదాలనుకున్నరు. పోలీసులు చాలామంది వచ్చిన్రు. ఆ ఏరియానే గాదు. కాసర్లపాడు చుట్టుపక్కల కూడా బాగ చుట్టేసిన్రు. ఉన్న ఊర్లకెల్లి తప్పుకోని, వేరే ఊర్లకి జొరపడుదామన్నా, కుదిరేటట్లులేదు. అంతగనం ఊరిని చుట్టేసినరన్నమాట. పొద్దుగాల దొడ్డికి బోయే ఆడోల్లు ఇది చూసి, కబురు తీసుకొచ్చిన్రు. అప్పుడు లక్ష్మి ఏం జేసిందంటే. ఆమె విధవరాలు. చేతులకు కడియాలుండేటివి. భర్తలేనోళ్ళు గాజులు వేసుకోకపోయేది. వెండి కడియాలు వేసుకునేటోళ్ళు. వాటిని ముండ కడియాలు అనేటోళ్ళు అప్పట్లో. ఎంత పేదోళ్ళకయిన అన్నలో, కొడుకులో చేయించెటోళ్ళు. మరీ లేనోళ్ళు తిప్ప తీగలని ఉంటయి, వాటి చేతులకు కడియాల మాదిరి చుట్టుకునెటోళ్ళు. అవి పచ్చరంగులో ఉండేవి. చాలా రోజులదాక రంగు చెడిపోక పోయేది. వాటిని వేసుకోవడమంటే మరీ పేదోళ్ళని అర్థం. ముండ కడియాలక్కూడ గతిలేనంత పేదోళ్ళని వాళ్ళను గురించి చెప్పుకునేటోళ్ళు.

అట్లనే కాళ్ళగ్గూడ కడియాలు పెట్టుకునేటోళ్ళు. భర్తలున్నోళ్ళు, ముత్తయిదులు కూడ కాళ్ళకు కడియాలు, వెండి గొలుసులు, ముత్యాలు అన్నీ పెట్టుకునేటోళ్ళు. ఇక బంగారంతోని పుస్తె మాత్రం చేయించుకునేటోళ్ళు. పుస్తె కూడ లేకపోతే పసుపు కొమ్ములు కట్టుకునేటోళ్ళు. పేద స్త్రీలను చూసి పుస్తెకు కూడ గతిలేనోళ్ళు, ముండ కడియాలక్కూడ గతిలేనోళ్ళు అని అవమానంగా చెప్పుకునేటోళ్ళు గ్రామాలలో.

అప్పట్లో నాకు గాజులంటే బాగా ఇష్టముండె. చాలా ఎక్కువ గాజులు పెట్టుకునేదాన్ని. నాకు ఇష్టంగా ఉండటమేగాక, గ్రామాల్లో ఆడవాళ్ళందరిలోనూ కలిసినట్లుగా ఉండాలని కూడా అట్లా ఉండేదాన్ని.

ఆరోజు లక్ష్మి, నన్ను తప్పించడానికి ఒక ఉపాయం చేసింది. నా చేతికున్న మట్టిగాజులు తీసేసి, ఆమె చేతికున్న ముండగాజులు, కడియాలు అన్ని ఏసి కల్లుకుండ చేతికిచ్చి ఆమె ముసలిదాన్లెక్క కర్ర చేతులబట్టుకోని నన్ను మెల్లిగా ఊరిబయటకు తోల్తామని తీసుకొచ్చింది. మేం ఇద్దరం కొంత దూరం పోయినంక, ఒక పోలీసోడు చూసి. "హత్తెరి, ఎవలు. ఎవలు" అంటు అరిచిండు. ఆమె నన్ను అటునూకి, "అది నా బిడ్డయ్యా" అని ఎదరకుబోయి "పోలీసోల్లకి కల్లుగావల్నంటే తీస్కబోతున్ననయ్యా" అని అన్నది. వాడు నాకు కూడ గావాల్నన్నడు. "నీకు జర పొద్దెక్కినంక తీసుకొనొస్త" అని వానికి చెప్పింది. అట్ల నేను ముందుకు బోయి తప్పుకున్న ఇక నేను పరిగెత్తిన. కాని, ఎక్కడకని పోవాలె? ఆ ప్రాంతంలో పెద్ద చెట్లు కూడ లేవు. అన్నీ ఆముదం చెట్లే ఉన్నాయి. ఆ చెట్లు పెద్ద ఎత్తుగా ఉండవు. నేనేమో ఎత్తు మనిషిని, పొట్టిదాన్నయితేనయిన వాటిలో దాగటానికి వీలయ్యేది.

పొలాలేమో అన్నీ జొన్నచేలు, సజ్జచేలు ఉన్నయి. వాటిల్లో దాగరాదు. వేరే ఊర్లలో దొరోల్ల కంచె ఉండెడిది. దానిలో మనిషి దాగటానికి వీలుండేది. కానీ ఆ కంచెల దగ్గర దొరోల్ల జీతగాళ్ళు, ఏజెంట్‌లు ఉంటరు. వాళ్ళు మనల్ని కనిపెడితే మరింత ప్రమాదం.

ఇక ఆ రోజు నేను ఉరికి, ఉరికి ఒక లంబాడి తండాలోకి పోయిన. నేను పోయెసరికె ఒకరిద్దరు ఇంకో పక్కన ఉన్నారు. వాళ్ళు మనోళ్ళే పరిగెత్తుకుంట వస్తున్నరు. ఇంకో ఊరి నుండి వస్తున్నారు. ఇక్కడ జరిగిన సంగతులు వాళ్ళకు తెలియవు. అప్పటికే పోలీసులు దాదాపు 30 ఊళ్ళను చుట్టేసిన్రు. అయితే పోలీసోల్లు మరొక ఊరినుండి వస్తున్నరు. మాకు కొద్ది దూరంలో వున్నారు. అటు వరంగల్ జనగామ రోడ్డుంటది. అప్పుడు వాల్లని మలబారు పోలీసోల్లు అని అనేడిది. నే జొరబడ్డతండా మా ఊరితండానే చిల్పకుంట్ల. మా ఊరు కొత్తగూడెం అన్నీ దగ్గరదగ్గరనే ఉంటయి. నేను లంబాడి తండాలో చొరబడగానే ఒక లంబడామె చూసింది. పొయ్యి దగ్గర కూర్చొని రొట్టెలు చేస్తున్నదామె. నన్ను చూడంగనే లేచి, ఆడ ఒక మంచం ఉంటే, దానిని తెచ్చి వేసింది. మంచంలో దుప్పట్లన్ని దానిమీద పడేసి, నన్ను దానిలో కూర్చోబెట్టింది. రొట్టెలకాడినుంచి లేచి, పోలీసోల్లకు ఎదురుగ పోయింది. ప్రాణాలకు తెగించి వాళ్లకు ఎదురుపోయింది. లంబడామె తన నెత్తిమీదున్న ముసుగు తీసి, నా నెత్తిమీదేసింది. మంచాన్ని తీసుకపోయి పొయ్యి ముంగల ఏసి కూసోబెట్టింది. నేను ఇంట్లో లోనికి పోయేసరికే. ఆమె రొట్టెలు చేస్తున్నది

కదా! ఆమె అప్పటికే చేసిన రొట్టెల దొంతి వళ్లో ఏసుకుని, బయటకు పోయింది. పోలీసులు రాంగనే "ఎవలు లేరయ్యా, నా బిడ్డ బాలింత. సలికి పొయికాడ కూసోని రొట్టెలు జేస్తున్నది. కావాల్నంటే ఈ రొట్టెలు దినుండి" అని వాళ్ళకి రొట్టెలు ఇచ్చింది. వాళ్ళు పోయిన్రు. పోలీసోళ్ళు పోగానే పాపం ఆమె నామీదబడి ఏడుపు మొదలుపెట్టింది. ఆమె తెగింపుకు అభిమానానికి నాకు కండ్లనీళ్ళు వచ్చినయి. ఆ తరువాత నేను ఆ తండా ఇడిసిపెట్టి, మళ్ళీ ముందుకురికిన. కొంచెం సేపయినంక ఆముదం చెట్లల్ల పడి నడుస్తుంటే ఇంకో ఇద్దరు మా పార్టీ కార్యకర్తలు వచ్చి కలిసిన్రు – ప్రియంవద, ప్రతాపరెడ్డి అనే ఆయన. ఆయన మా అమ్మకు మేనమామ కొడుకయితడు. వాళ్ళ ఊరు కాసర్లపాడు. వాళ్ళ ఊరిని కూడ పోలీసులు చుట్టుముట్టిన్రు. వీళ్ళిద్దరూ అక్కడనుండి తప్పించుకొని ఇట్లా వస్తున్నారు. మేమందరం సీతారామపురం చేరుకునే సరికి సాయంత్రం నాలుగు గంటలవుతున్నది. ఎటుబోదాం, ఎటు దాక్కుందాం అని చూసినం. ఒక దిక్కు రోడ్డు. అటు దిక్కు తొవ్వ, మైదానం. ఇటుబోతే సీతారామపురం అన్న చిన్న ఊరు. ఆలోచించి, ఒక పుట్టగడ్డ మీద ఆముదం చేను. చానా ఎత్తుల ఉంది. అందరు భారీ, ఎత్తయిన మనుష్యులమే. అక్కడక్కడే వుంటే కనపడతామని చెప్పి, ఆ ఆముదం చెట్ల మధ్యకు బోయినం. ఆ చెట్ల మధ్య మెసలకుండ కూర్చున్నం. ఏమన్నగానీ పొద్దుబోయిందాకా అక్కడే ఉందామనుకొన్నం. కానీ, పోలీసులు గాని కనిపెట్టిన్రంటే ముగ్గురం ఒక్కసారిగా దొరికిపోతం. దానికి దగ్గరలోనే ఇంకొక డొంక కనబడింది. అది నేరుగా సీతారాంపురమనే ఊరికి పోతది. ఆ డొంకన పడి పోదమని ఆలోచిస్తున్నం.

ఇంతలో అక్కడ గొడ్లు కాసెటాయిన ఒక వ్యక్తి మమ్మల్ని చూసిండు. గొర్లను, గొడ్లను మేతకు ఇడ్సిపెట్టి చెట్టెక్కి కూర్చొని కాపలా కాస్తుంటే మేము కనబడినం. అప్పటికే రామన్న గూడేన్ని, సీతారాంపురాన్ని పోలీసులు చుట్టేసిన్రని ఆయనకు తెలుసు. ఇక్కడికి కూడ ఏ క్షణమైనా రావచ్చు. మమ్మల్ని పోలీసులు చూస్తే ప్రాణాలతో ఉంచరు. అక్కడే బండ దగ్గర తుమ్మచెట్టుంటే, దాని మీదకెక్కిండు, ఆ గొల్లాయన. ఎవరూ మమ్ములను జూడలేదని మేం అనుకున్నం. కానీ, ఆ గొల్లాయన జూసిండు. మమ్ములను గుర్తుపట్టుడే గాదు, మమ్మల్ని దాయాలె అనే బాధ్యతను తీసుకున్నడు. ఆ చెట్టుమీద కెల్లి చూసుకుంట, పోలీసులు ఎటు దిక్కు వస్తున్నరో కనిబెడుతున్నడు. పోలీసులు లారీల్లో వచ్చి, రోడ్డుమీద ఆగటం ఆయనకు కనబడ్డది. వాళ్ళను చూడంగనే కిందికి దుంకిండు. కాళ్ళకు దెబ్బ తగిలినా పట్టించుకోలేదాయన. జెరి, జెరి అని గొడ్లను, గొర్లను అదిలిస్తున్నట్టుగా కట్టెతోని మాకు సైగ చేసిండు. ఓ ఎర్ర ఆవు, జెరిజెరి – ఓ నల్ల ఆవు జెరి, జెరి అనుకుంట మాకు సైగ చేసిండు. ప్రతాపరెడ్డి నల్లగ ఉంటడు. ఓ నల్ల ఆవు, అని ఆయనకు సూచన

చేస్తున్నడన్నమాట. మేము కదలకుండ దాక్కున్నం. పోలీసులు అక్కడికి దగ్గర్నే ఉన్న బండమీద వరకు వచ్చిన్రు. బూట్ల చప్పుడు ఇనబడుతున్నది మాకు చాలా దగ్గరగా. పోలీసులు దూరం నుండె తుపాకి ఎక్కుపెట్టిన్రు. ఆయన మీదికి ఇక కాలుస్తరనుకున్నడేమొ, తానే వాళ్ళకు ఎదురు పోయిండు ముగ్గురు మనుషులు ఇటే వచ్చిన్రు. జాడ చెప్పమని వాళ్ళు ఎంత అడిగినగానీ, నాకు తెల్వదంటడే తప్ప ఒక్కమాటయిన చెప్తలేదు. ఆడొక పెద్ద బండ వున్నది. ఆయను దానిమీద పడేసి కొడుతున్నరు పోలీసులు. ఆ దెబ్బలు, ఆయన కేకలు మాకు వినబడుతున్నయి. పోలీసులా గొల్లాయనను పట్టుకొని, "ఈడికెందుకొచ్చినవ్" అంటూ, కిందేసి తొక్కుతున్నరు. ఎంత అడిగినా, "ఆవులను గాస్తున్న" అంటున్నడే గానీ, మేం ఈడున్నం అని మాత్రం చెప్తలేదు. అట్లా అతన్ని హింసపెడుతుంటే, మేం ఎంతసేపు ఆ హింసని తట్టుకుంటడు, ఇగ జెప్పేస్తడు, మా పని అయిపోయినట్లే అనుకున్నం. కాని, ఆయన చూపిన సాహసం సామాన్యమయినది కాదు. వాళ్ళు అంత కొడుతున్నగాని – నాకు ఎరుకలేదు, నేను చూడలేదు – అని తప్ప ఆయన నోటంట ఇంకొక మాటరాలే. ఒక మొగోడు, ఇద్దరు ఆడోళ్ళు ఇటే వచ్చిన్రు, నీకు కన్పడకుండ ఎట్టుంటదని కొడుతున్నరు. ఆయన కొంచెం తేరుకొని ఒకటే జవాబు చెప్పిండు. ఓ అయ్యా, ఆడోళ్ళో మొగోళ్ళో నాకు తెల్వదుగాని, ఎవరో మనుషులయితే ముసుగులేస్కొని అటు సీతారామపురంకెల్లి ఉరికిన్రని చెప్పిండు. ఊళ్ళోకి ఉరికిన్రని అటు దిక్కు చూపుతున్నడు.

వాళ్ళింకా ఆయన్ను వదులుతలేరు. మాతోబాటు ఊర్లోకి వచ్చి, చూపిద్దువుగాని పదమంటున్నరు. అయ్యో, నా గొడ్లు పోతయి, నా గొర్లు పోతయి, నేనెట్ల వస్తనయ్యా, అని ఇటు మర్లుతాండు, అటు మర్లుతాండు. నాలుగడుగులు పోయి, మళ్ళ కాదంటున్నడు. నిజంగానే గొర్లన్నీ చెల్లాచెదరుగా అయితున్నై.

అట్ల చాలా సేపటిదాక వాళ్ళను సతాయించుకుంట ఆపిండు. ఊరిలోకొచ్చి మమ్మల్ని గుర్తుపట్టమని వాళ్ళు అడుగుతున్నరు. నేను ఇక్కడుంటినయ్యా, వాళ్ళేమొ ఊర్లకు ఉరికిన్రు. అంతవరకే నాకు తెలుసు. ఇగ ఏ ఇంట్లకు జొరబడిన్రో, నాకెట్ల తెలుస్తది. మీరే పోయి ఎతుక్కోండని అడ్డం తిరిగిండు. అప్పటికి చీకటి పడుతున్నది. పోలీసువాళ్ళు అతన్ని ఊర్లకు గుంజుకపోయి ఇండ్లు జూపమన్నరట. వాళ్ళ బారినుండి ఎట్లనో తప్పించుకుపోయి అతను లంబడి తండకు బోయి "మాకు ఇంత బువ్వబెట్టేందుకు తోలండి ఎవలనన్న" అన్నడట.

లంబాడి తండా ఉన్నది దగ్గర్లోనే, అక్కడికి పోయి అన్నం వండించుకొని మోదుగాకులు తెంపి వాటిల్లో అన్నం కారప్పొడి కట్టుకొని తెచ్చిండు. ఒక గుర్గుల నెయ్యి

కూడ తీసుకొని వెతుక్కుంట మా దగ్గరకి వచ్చిన్రు. అన్ని దెబ్బలు తిన్నంక గూడ మాకు రక్షణనిచ్చి, అన్నం పెట్టిన ఆ త్యాగాన్ని ఏమని చెప్పాలె, ఎంతని చెప్పాలె?

బాగ ఆకలిమీదున్నం. లండడోల్లు తెచ్చిపెట్టిన అన్నం ఎంత తిన్నామో! ఇప్పటికీ ఆయన మొకం నాకండ్లల్ల కనబడుతున్నట్టే ఉంటది. వాళ్ళ త్యాగాల ముందు మేమెంత? ఆ రోజు బాగా రాత్రయిందాక అక్కడనే ఉండి, తర్వాతన బయల్దేరినం.

అప్పటికి రాత్రి నెల బొడిసింది. చందమామ వచ్చింది. లారీల సప్పుడు ఇనబడింది. మొత్తం పోలీసులందరు ఎల్లిపోయిన్రు. లంబడోల్లు బువ్వపట్టుకోని వచ్చేసరికి ఆశ్చర్యమనిపించింది మాకు. నిజానికి జనమే నడిపిన్రు పోరాటాన్ని. ఆ రాత్రి తిని ఏ ముప్పయి మైళ్ళో, ఆ రాత్రంతా నడిచినం. లలితమ్మ కూడ కలిసింది. ఇంకో ఊరికి చేరినంక లలితమ్మ అనేటామె కూడ మాతోని బయల్దేరింది. ఆమె పిల్ల తల్లి. నాకన్న చాలా పెద్దది. నాకయితే అప్పటికి పదిహేనేండ్లు ఉంటయేమొ. ఆ లలితమ్మ ఇప్పుడు కూడ బతికి ఉన్నదనుకుంటా. ఉంటే నూరేళ్ళుదాటి ఉండొచ్చు. లలితమ్మకు ఆమె పసిబిడ్డను తీసుకొని తెల్లారేసరికి ఒక ఊరు చేరినం. పిల్లని ఎత్తుకోని నడ్వలేకపోతుండే. తొవ్వలో మా ఊరు తగిల్తే, మా యశోదమ్మ చిన్నమ్మ ఇంట్ల అందరం ఒక్క జాగలో పండుకోవాలనుకున్నం. ఊర్లలో కూడా పోలీసులొస్తే ఎదుర్కోవాలని, ఆడోల్లందరు ఒక్కతానే రాత్రులు పండుకునేది. అక్కడి ఆడోల్లకి పిల్లని అప్పజెప్పి, లలితమ్మ మల్లొచ్చి బిడ్డని తీస్కపోతదని చెప్పినం. ఇట్లాంటి సందర్భాల్లో కొన్ని సమస్యలు ఎదురయ్యేవి. శ్రామిక వర్గం నుండి వచ్చిన ఆడవాళ్లు ఎక్కడయినా కలిసిపోయేటోళ్ళు. వాళ్ళను గుర్తుపట్టటం పోలీసులకు సాధ్యం కాకపోయేది. కానీ పై వర్గాల నుంచి, కులాల నుంచి వచ్చిన ఆడవాళ్లను దాచడం కష్టమయ్యేది.

ఈ లలితమ్మ సంగతే చెప్పాలంటే – ఆమెను తీసుకొనిపోతే ఇండ్లలో ఉంచుకోటానికి ఎవ్వరూ ఒప్పుకోకపోయేది. అంటే ఉంచుకోవటం ఇష్టంలేక కాదు – వామ్మో ఇంత అందంగా ఉన్నది. మా జనంలో ఈమె ఎట్ల కలుస్తది, ఎట్ల దాచిపెట్టాలె, ఎట్ల రక్షించాలెనని భయపడేటోళ్ళు జనం. అన్నట్టే ఆ లలితమ్మది చెప్పలేనంత అందం, మంచి రంగు. పైగా కరణాల కుటుంబాల మాటే ఒక తీరుగ ఉండేది. అదేదో మంత్రాల భాష తీరుగ ఉండేది మాట్లాడుతుంటే. సులభంగా గర్తుపడతరు ఎవరైనా.

ఆఖరికి ఆమెను ఆ ఊళ్ళో ఒక అవుసలోళ్ళ ఇంట్లో ఉంచిన్రు. ఆ ఊళ్ళో బాపనోళ్ళు లేరు. అవుసలోళ్ళు కూడ మంచి పోషణతో, నగలు, కట్టుబొట్టు తీరు, ఆచారం అదంతా బాపనోళ్ళ లెక్కనె ఉంటది. ఆమెను అక్కడుంచి, నేను, ప్రతాపరెడ్డి మా బాధ్యతల మీద వెళ్ళిపోయినం. ఆమె ఆ తరువాత మల్లెప్పుడో కొంతకాలానికి తిరిగి వచ్చి, పోతున్నప్పుడు

మఱ్రిపెడ దగ్గర పోలీసులకు దొరికింది. మూడేళ్ళు జైలుకేసిన్రు. రహస్య జీవితం పాటించటం కూడా కష్టమైపోయింది కొందరికి. అందమైనవాళ్ళు, చూడగానే కొంచెం వేరుగా కన్పించేటోల్లకు జనంలో కల్సిపోయినట్లు ఉండుడు కష్టమైపోతది. వాళ్ళను చూడగానే, వీళ్ళు వాళ్ళలో ఒకరుకాదని గుర్తుపట్టేసేటట్లుంటరు. వాళ్ళను చూడగానే బయటి వాళ్ళని తెలిసిపోతుంది. నేనేమో మోటుమనిషిని. అవసరం వున్నా, లేకున్న నేను కాసెబోసి, ఎప్పటికి రెడీగా వుండేది.

# 8

## సాయుధ పోరాట విరమణ

యూనియన్ సైన్యాలు రజాకార్లకన్న దుర్మార్గంగ ప్రవర్తించిన్రు. దొరలను తీసుకొచ్చి మళ్ళా ఊళ్ళల్ల పెట్టి జనం మీద మళ్ళా రజాకార్లు చేసినట్టే చేస్తున్నరు. జనం నుంచి మొత్తం భూములు విడిపిచ్చిన్రు. మనం ఏర్పాటు చేసిన కమిటీలను అరెస్టు చెయ్యడంగానీ, చంపడం గాని చేస్తున్నరు. యూనియన్ సైన్యాలు వచ్చిందే అందుకు.

నైజాం నవాబుతో పటేలు మాట్లాడిండు. కమ్యూనిస్టోల్లను అణచకుంటె ఇక రాజ్యం నీకు దక్కదు, నాకు దక్కదని ఇద్దరూ ఒక ఒప్పందానికొచ్చిన్రు. రాజభరణం ఇస్తమన్నంక ఇగ నైజాం నవాబుకు అభ్యంతరం ఎందుకుంటది? పాలకులందరి నడుమ ఒక అవగాహన ఉన్నది. కమ్యూనిస్టులుంటే వాళ్ళకెవరికీ నడవదన్న సంగతి బాగా తెలుసు వాళ్ళకు. అందుకే యుద్ధంలో ఓడిపోయినంక కూడ నవాబుకు రాజభరణం ఇచ్చి గౌరవించిన్రు.

ఇకముందు సాయుధ పోరాటం కొనసాగించాలా, వద్దా అనే విషయంలో ఎన్నో వివాదాలూ, చర్చలూ జరిగినై, కొన్నిచోట్ల దళాలు ఆయుధాలను కిందికి దించిన్రు. మరికొన్నిచోట్ల పోరాటం సాగుతూనే ఉన్నది. అడవుల్లోని వాళ్ళు అడవుల్లోనూ, బయటివాళ్ళూ బయటా అట్లనే ఉన్నరు.

పార్టీమీద తీవ్రమైన నిర్బంధం, హింస కొనసాగినై, పార్టీ నాయకులను, సానుభూతి పరులనూ వేలాది మందిని పోలీసులు హత్య చేసిన్రు. అడవిలోని ఉద్యమానికీ, మైదాన ప్రాంతానికీ సంబంధాలు కొనసాగించటం కష్టంగా మారింది. ఆధునికమైన ఆయుధాలున్న యూనియన్ సైన్యాలను ఎదరించటం ప్రజాఉద్యమానికి శక్తికి మించిన పనిగా మారింది. ఇది ఇట్లానే కొనసాగిస్తే ప్రజలకు మరింత ప్రాణనష్టం వాటిల్లుతుందనీ, సాయుధ పోరాటాన్ని ఇంక విరమించాలనీ నిర్ణయం జరిగింది. చివరికి 1951 అక్టోబర్ 21వ తేదీన సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నట్లుగా ప్రకటన వెలువడింది.

అప్పటికింకా కొందరు జైళ్ళలో ఉన్నరు, మరికొందరు అజ్ఞాతంలో ఉన్నరు. నా మీద కూడా పదివేల రూపాయల రివార్డున్నది.

నిజాం పోరాట కాలంలో నేను అడవిలో శిక్షణ తీసుకుంటున్న టైము నుండే గిరిజన ప్రాంతంలోని వ్యవహారాలన్నీ చూసుకునేదాన్ని. గిరిజనులతో, ఆ స్త్రీలతో బాగా కలిసిపోయేదాన్ని. వాళ్ళు నాకు ఎంతగానో రక్షణనిచ్చిన్రు. పోలీసుల, రజాకార్ల ఆచూకీ గురించి వార్తలు తెచ్చేవాళ్ళు.

నేను ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతం వాళ్ళ పేరుతోనే తిరిగేదాన్ని – ఒక చోట ఎల్లమ్మ, ఇంకోచోట మల్లమ్మ, ఇంకోచోట ముత్యాలమ్మ, గిరిజన ప్రాంతాలల్లో సమ్మక్క... ఇట్లా. మొదట్లో గిరిజనులు మమ్మల్ని చూసి భయపడేటోళ్ళు. సర్కారు మా మీద చేసిన దుష్ప్రచారం వల్ల మేము ఏంచేస్తమోనని భయపడేటోళ్ళు. కానీ, మేము వాళ్ళకు దగ్గరయినంక వాళ్ళ సొంతమనుషులుగా చూసుకునేటోళ్ళు.

అట్లా, అప్పట్లో దళంలో నాపేరు రాజక్క, రాజక్క దళమంటె పోలీసోళ్ళకే హడల్. ఇంకొక విషయమేమంటే జనం కూడా తమ లీడర్ల గురించి బాగ ఎక్కువచేసి చెప్పుకుంటరు. "రాజక్కంటె మామూలు లీడర్ కాదు, ఎదురు పడ్డరంటె యిగ ఎందరు పోలీసులయిన ఖతం..." ఇట్ల ప్రచారం చేస్తుంటిరి. నిజాం సర్కారు కూడ అట్లనే ప్రచారం చేసింది. దళ కమాండర్ రాజక్క ఝాన్సీరాణి తిరిగినట్లు గుర్రం ఎక్కి తిరుగుతున్నదట, ఆమెను పట్టిస్తే పదివేల రూపాయల నజరానా ఇస్తమని ప్రకటించింది సర్కారు.

నైజాం సర్కారు పోలీసులు కానీ, రజాకార్లుగానీ అడవుల్లోకొచ్చి మమ్మల్ని పట్టుకోలేక పోయిన్రు. అడవిలో కాలుబెట్టి కమ్యూనిస్టులను పట్టుకునేంత ధైర్యం వాళ్ళకు లేదు. ఎప్పుడయితే నైజాం రాజ్యం రద్దయిందో, అప్పటినుంచే యూనియన్ సైన్యాలు మా వెంటబడ్డయి. అప్పటిదాకా సాగిన దారుణాలు ఒకెత్తయితే, యూనియన్ సైన్యాలు పెట్టిన హింసలు ఇంకొక ఎత్తు.

కమ్యూనిస్టులను వెదికి వెదికి చంపిన్రు. వాళ్ళ ఆచూకి చెప్పమని సామాన్య ప్రజలను నిలబెట్టి కాల్చిన్రు. ఊళ్ళొదిలి పారిపోయిన భూస్వాములను మళ్ళా ఊళ్ళకు తీసుకొచ్చి, ప్రజలు స్వాధీనం చేసుకున్న భూములను గుంజుకొన్నరు. అడవుల్లో మా మీద పడ్డరు. నేనప్పటికి అజ్ఞాతంలోనే ఉన్నా. అన్నయ్య జైల్లో ఉన్నడు. కొంతమందిని వదిలిపెట్టిన్రు.

ఇట్లాంటి పరిస్థితుల్లో సాయుధ పోరాట విరమణ జరిగినట్టు ప్రకటించింది పార్టీ. ఎన్నికల్లో తన అభ్యర్థులను నిలబెట్టాలని కూడ నిర్ణయించింది. ఐతే కమ్యూనిస్టు పార్టీమీద నిషేధం కొనసాగుతునే ఉన్నది. అందువల్ల నేరుగా పార్టీ పేరుతో అభ్యర్థులను నిలబెట్టడం సాధ్యం కాదు. పిడిఎఫ్ పేరిట పార్టీ అభ్యర్థులను ఎన్నికల్లో నిలబెట్టాలని నిర్ణయం జరిగింది.

నేను, ఓంకార్, వినయ్ వంటి కొంతమందిమి ప్రజల్లో తిరుగుతూ పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించమని ప్రచారం చేసినం. నేను అప్పటికీ అజ్ఞాతంలోనే ఉన్నాను. పిడిఎఫ్ తరపున పెద్దపెల్లిలో జరిగిన సభలో సరోజినీ నాయుడు కొడుకు డాక్టర్ జయసూర్య ఉత్తేజపూరితంగా ఉపన్యాసం ఇచ్చిండు. నేను కూడ ఆ సభకు హాజరయినా. బహిరంగంగా రావటానికి వీల్లేని పరిస్థితి. భుజానికి తుపాకి తగిలించుకొని, అది కనబడకుండ గొంగడి కప్పుకొని జనం నడుమ కూర్చున్న. ఐనా రాజక్క వచ్చిందని కొందరు ప్రజలు గుర్తుపట్టిన్రు. జయసూర్యకు కూడ నేనొచ్చిన్నని తెలిసింది పిడిఎఫ్ అభ్యర్థులు గొప్ప మెజారిటీతో గెలిచిన్రు. తెలంగాణలోని వంద స్థానాల్లో 40 స్థానాలను పిడిఎఫ్, అది బలపరిచిన వాళ్ళూ గెలిచిన్రు.

1954లో నామీద నిజాం సర్కారు ప్రకటించిన పదివేల రూపాయల రివార్డును ఎత్తేసిన్రు. అది తప్ప వేరే కేసులేమీ లేవు నా మీద. అసలు దళాలల్ల తిరిగినన్నాళ్ళు నన్ను కనిపెట్టినోళ్ళే లేరు. ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతం స్త్రీలల్లో ఎక్కువగా కనబడే పేర్లు పెట్టుకొని పనిచేసినగదా! ఎల్లమ్మ, మల్లమ్మ, సమ్మక్క, ముత్యాలమ్మ, రాజక్క. ఇట్ల చెప్పుకొనుడే తప్ప నేను స్వరాజ్యాన్నని గుర్తుపట్టినోళ్ళే లేరు.

1954లో హైదరాబాద్‌లో విశాలాంధ్ర మహాసభ జరిగింది. ఆ సభలోనే నేను బైటికొచ్చిన. విశాలాంధ్రలో ప్రజారాజ్యం, అనే నినాదాన్ని తీసుకున్నది పార్టీ. వేలాదిమంది ప్రజలు హాజరయిన్రు. ఆ సభలో నేను ఉపన్యాసమిచ్చిన. ఏడేళ్ళ అజ్ఞాతవాసం తర్వాత బయటికొచ్చి, వేదికనెక్కిన నన్ను చూసి, నా ఉపన్యాసం విని ప్రజలు బాగా ప్రభావితం అయిన్రు. విపరీతంగ చప్పట్లుకొట్టిన్రు.

ఇక అదే రోజు రాత్రి మల్లు వెంకట నరసింహారెడ్డి (వి.ఎన్)తో నా పెళ్ళి జరిగింది. ఆయన అప్పటికింకా అజ్ఞాతంలోనే ఉన్నడు. అప్పుడు దేవులపల్లి వెంకటేశ్వరరావు ఎం.పి.గా ఉన్నడు. ఆయన ఎంఎల్ఎ క్వార్టర్స్‌లో ఉన్నడు. అక్కడే వి.ఎన్‌కూ నాకూ దండలపెళ్ళి జరిగింది. బద్దం ఎల్లారెడ్డి, చంద్ర రాజేశ్వరరావు సమక్షంలో జరిగింది.

వివన్ గారు నాతోబాటు దళాలల్లో పనిచేసిన వ్యక్తి. ఏరియా లీడర్‌గా చేసిండు. కాకపోతే నాకన్న వెనకొచ్చిండు. దొడ్డి కొమురయ్య చనిపోయినంక వీళ్ళంతా స్కూళ్ళ నుండి బైటికొచ్చి డైరెక్ట్‌గ దళాల్లో కొచ్చిన్రు. ఓంకార్ నాయకత్వంలో ఆయన పని చేసిండు.

ఆ పెండ్లి కూడ కావాలని చేసుకోలె. ఎందుకంటె ఉద్యమంలో ఉన్నన్నాళ్ళు మా దృష్టంతా ఉద్యమాన్ని ఎట్లా నిలబెట్టాలె, ఎట్లా విస్తృతం చేయాల్ననే దానిమీదనే ఉండేది. ఉద్యమంలోకి వచ్చేనాటికే పెండ్లిల్లయినోళ్ళు కొందరున్నరు. పెండ్లికాని వాళ్ళు అక్కడ పెండ్లిల్లు చేసుకోకూడదని పార్టీ నిర్ణయం. ఉద్యమంలో చచ్చెటోడెవరో, బతికెటోడెవరో

కాబట్టి ఆ నిర్ణయం తీసుకున్నరు. ఒకటి రెండు సంఘటనల్లో కొన్ని సమస్యలొచ్చినయి. కానీ వాటిని సామరస్యంగనే పరిష్కరించినం. అవతల శత్రువు దాడి చేస్తుండగ, ఈ విషయాల మీద లొల్లి పెట్టుకుంట కూర్చోలేం కదా! అందుకని తప్పులు జరిగినప్పుడు మందలించి, పరిష్కరించిన్రు. తాగుడుకానీ, స్త్రీలతో అమర్యాదగా ఉండటం కానీ పార్టీలోపలా బయటాకూడా చెయ్యకూడదనే ఆదర్శ సిద్ధాంతం ఉన్నది. ఆ తర్వాత మేము కూడ నాయకత్వ స్థానాల్లోకొచ్చి, మూవ్‌మెంట్ బాధ్యత మా నెత్తినుండంగ పెండ్లి ఆలోచన ఎందుకొస్తది?

ఐతే, రాజేశ్వర్రావ్ వాళ్ళంత కూర్చొని పెండ్లికాకుండ తిరిగితె మంచిది కాదు, నువ్వు చేసుకోవాల్సిందేనని పట్టుపట్టిన్రు. నేను చేసుకుంటనంటె ఆయనను ఒప్పిస్తమన్నరు. ఆయనక్కూడ అప్పటికి పెండ్లికాలే. ఆయన ఇష్టపడ్తడని కూడ నేను అనుకోలే. వయసు కూడ నాకూ, ఆయనకూ ఒక సంవత్సరం తేడా ఉంటదో లేదో. పైగా ఆయన లీడర్ అనే భావం కూడ ఉండేది. రాజేశ్వర్రావ్ ఏం చెప్పిండో కానీ, ఆలోచించి చెప్తనన్నడట వి.ఎన్. అట్ల 1954లో మా పెళ్ళి జరిగింది.

***

సాయుధ పోరాట విరమణను ప్రకటించినప్పుడు ఆ తర్వాత జీవితం గురించిన ఆలోచన వెంటనే రాలే. మనసుకు బాధనిపించిన మాట నిజమే. ప్రజలు ఇన్ని కష్టాలు పడి సాధించుకున్న విజయాలు వెనక్కి పోతయిగదా అన్పించింది. నాకు వ్యక్తిగతంగా ఏమన్పించిందంటే – ఒకసారి ఆయుధాలు కిందపెట్టినంక మళ్ళీ పోరాటం మొదలు పెట్టడమనేది అసాధ్యమయితది. కాకపోతే పరిస్థితుల రీత్యా ఒకచోట కొంత ఆపితే ఇంకొక చోట లేపటం చేయాలె. ఉత్తర హిందూ స్థానంలో కూడ ఇట్లాంటి రాచరిక వ్యవస్థనే ఉన్నది కాబట్టి, అన్ని సంస్థానాల్లోనూ పోరాటం కనుక జరిగితే, భారతదేశ స్థాయిలో విముక్తి జరుగుతది కదా, అన్పించేది.

ఐతే, ఇట్లాంటివన్నీ చర్చించే అవకాశం మాకప్పుడు లేకుండె. సాయుధ పోరాటం ముగిసినప్పటికీ మనపని మనకుంటదికదా, అడ్డు చెప్పెటోళ్ళు ఎవరుంటరులే అనుకున్న. కానీ మమ్మల్నందరినీ ఇముడ్చుకునేటందుకు పార్టీకి అవకాశం లేకుంట పోయిందని తెలిసినప్పుడు చాలా నిరాశపడిపోయిన. ఇక మా ఆశయం పోయింది, జీవితమంత కరాబైపోయింది, ఇక జీవితమే అయిపోయిందని అన్పించింది. ఇంటిపట్టునుండి సంసారం చేసుకోవడం తప్ప ఏమీ లేదనుకున్నప్పుడు నేను ఏడ్చిన ఏడ్పు ఇంతా అంతా కాదు. చెప్పాలంటే అదొక పెద్ద గ్రంథమైతది.

నేను బైటికి వచ్చే సమయానికి కూడ ఇంకొందరు జైళ్ళనే ఉన్నరు. అన్నయ్య జైల్లోనే ఉన్నడు, ఆయన మీద కేసులున్నయి. రాములమ్మ వాళ్ళు బైటున్నరు. ఇప్పుడిక మా జీవితం ఏందనే విషయం అర్థంకాలే. దాన్ని గురించి మాట్లాడుకోటానికి రెండువందల మందిమి సమావేశమయినం. ఈ కమిటీలోళ్ళు, ఆ కమిటీలోళ్ళు, కొరియర్లు... ఇట్లా వందలాది మంది కార్యకర్తలున్నరు. నేను, రాములమ్మ, బ్రిజ్‌రాణి గౌర్ ఇంకా కొంతమందిమి కలిసి అందరినీ పిలవాలనుకున్నం. ఆడవాళ్ళనే కాదు, మొగవాళ్ళను కూడ పిలిచినం.

రంగారెడ్డి జిల్లాలో రంగాపూరనే గ్రామంలో సమావేశం పెట్టినం. ఇంతకాలం ప్రజలకొరకు పనిచేసినం. మిగిలిన జీవితాన్ని కూడ ఆ పనిలోనే గడపాలె. పూర్తిగా ఉద్యమం నుండి రిట్రీట్ కావొద్దు, పార్టీ కూడా మనకు అట్ల చెప్పొద్దు. ఏదో ఒక రకంగా కార్యకర్తలందరినీ పనిలో ఇముడ్చుకోవాలె.

మనం చెయ్యగలిగిన పనులు ఇప్పటికీ ఎన్నో ఉన్నయి. ముందుగా మనం ఏయే పనులు చెయ్యగలమో ఆలోచించుకొని పార్టీకి చెప్పాలె. ఫలానా ఆర్గనైజేషన్ పనిని మేము చూడగలం, ఒక ఏరియాను చూడగలం, చదువుకున్న వాళ్ళం పార్టీ ఆఫీసుల్లో వ్యవహారాలు చూడగలం – ఇట్లా మనం కొన్ని నిర్ణయాలు తీసుకొని పార్టీకి చెప్పాలనుకున్నం. ఐతే వీటిని ఎవరికివారు తమ జీవితానికి అప్లై చేసుకొని పనులు నిర్ణయించుకోవాలంటే వెంటనే ఎవరూ ఏమీ తేల్చుకోలేక పోయిర్రు.

పార్టీ కూడా ఏమీ చెప్పలేక పోయింది. ఎందుకంటే దళ సభ్యులున్నరు. వందలమంది కార్యకర్తలున్నరు. నిజంగనే అంతమందికి ఆ పరిస్థితుల్లో ఏం పని చూపించగలరు? ఐనా చెయ్యాల్సిన పనులు లేకపోలేదు. మనం పంచిన భూముల రక్షణకు ఒక ప్రోగ్రాం ఉన్నది. పంచిన భూమిని రక్షించుకోవడం, గ్రామ పరిపాలనను రక్షించుకోవడం అనే బాధ్యతలున్నయి. అట్లాగే జైళ్ళలో ఉన్నవాళ్ళ కుటుంబాలు, అమర వీరుల కుటుంబాలు – వాళ్ళను పరామర్శించి ధైర్యం చెప్పడం, వాళ్ళ బతుకుదెరువుకు ఏర్పాట్లు చేయడం అనేది ఒకటి చూసుకోవాలె. ఈ బాధ్యతలకు సంబంధించిన ఆర్గనైజేషన్స్ ఏర్పాటు చేసి చూసుకోవాలని నిర్ణయించిర్రు. మిగిలిన వాళ్ళు తిరిగి గ్రామాలకు, ఇండ్లకు పోయి వ్యవసాయం వంటి పనులు చేసుకుంటూనే వీలయిన బాధ్యతలు చూడాలె. పెండ్లికాని వాళ్ళు పెండ్లిళ్ళు చేసుకొని, సమాజానికి సంబంధించిన పనులను వారికి చాతనయింతా వాళ్ళు చెయ్యాలె.

ఈ నిర్ణయాలు మంచివే. కానీ ఏం చెయ్యడానికైనా మొగవాళ్ళకున్న అవకాశాలు ఆడవాళ్ళకెక్కడివి? మగవాళ్ళు చాలామంది తిరిగి ఇండ్లకు పోగలిగిర్రు. చదువుకొని

లాయర్లయిన్రు. కానీ ఆడవాళ్ళలో చదువుకున్న వాళ్ళు తక్కువ. చాలా మందికి కుటుంబాలతో అప్పటికే సంబంధాలు తెగిపోయినై. పెండ్లికానోళ్ళు, వితంతువులు.. వీళ్ళందరి భవిష్యత్తు ఎట్లుంటది? పెళ్ళి చేసుకొని సెటిల్ కావాల్నంటే ఎవడు చేసుకుంటడు వీళ్ళను?

ఇందులో ఇంకొక సమస్య కూడ ఉన్నది. పోరాటం విరమించి మేమంత బైటికొచ్చే నాటికే ఒక ప్రచారం జరుగుతున్నది. శత్రువర్గం లేపిన ప్రచారం ఇది – ఈ పార్టీ వాళ్ళు ఆడ, మొగ తేడా లేకుండ తిరుగుతున్నారు. ఒక పెండ్లి లేదు, ఒక పద్ధతి లేదు. ఆడోళ్ళు, మొగోళ్ళు సంబంధాలు పెట్టుకొని ఉన్నరనే ప్రచారం పెద్దగనే జరుగుతున్నది.

ఇట్లాంటి పరిస్థితుల్లో పార్టీ ఆడవాళ్ళను ఎవరు పెండ్లి చేసుకుంటరు? రాములమ్మ పార్టీలోకి వచ్చే నాటికే ఆమెకు పెండ్లయింది. ఉద్యమంలో ఆయన వెనుకకు పోయిండని, ఆయన్ను వదిలిపెట్టి ఆమె ఉద్యమంలో కొనసాగింది. ఆ తరువాత ఇంకొక కామ్రేడ్‌ను చేసుకున్నది. ఆయన పెద్ద ఫైటర్. ఆయనకు ఉరిశిక్ష పడి జైల్లో ఉన్నడు. నర్సమ్మ అనే ఇంకొకామె ఉన్నది. ఇంట్ల భర్త వదిలిపెడితే, ఆ తర్వాత ఆమె ఉద్యమంలోకి వచ్చింది. మూవ్‌మెంట్‌లో గట్టిగ నిలబడింది. రాంరెడ్డి అని నకిరేకల్ ఆయన ఆమెను పెండ్లి చేసుకున్నడు. బయటికి రాంగనే నేను చదువుకుంట, లాయరవుతనంటూ చదివిండు. ఆ తర్వాత ఆమెను విడిచిపెట్టిండు. ఇంకా కొంతమంది జీవితాలు కూడ డిస్టర్బ్ అయినై.

ఇక నా సంగతంటే, వి.ఎన్ గారు నాతో కలిసి పనిచేసిండు. ఒకరినొకరం అర్థం చేసుకున్నం కాబట్టి పెండ్లి చేసుకున్నం. కానీ, దళాలల్లో పని చేసిన వచ్చిన స్త్రీలను చేసుకునేటందుకు ఎవడు ముందుకొస్తడు, చేసుకున్నా ఎవడు భరిస్తడు? ఆ తర్వాత లైఫ్ మొత్తం డిస్టర్బ్ కాకుండా ఉండదు.

ఇదంత బాగా ఆందోళన కలిగించింది నాకు. రాజేశ్వర్రావ్‌తోని, దేవులపల్లి వెంకటేశ్వర్రావుతోని విపరీతంగ వాదించిన. "నాకు ఏదయిన పని చెప్పి ఆర్గనైజేషన్‌లో ఇముడ్చుకోండి, లేదంటె మళ్ళీ అడవికి పంపండి. ఆడనే గిరిజన ప్రజలతో ఉండి వాళ్ళను ఆర్గనైజ్ చేస్త, అక్కడ క్యాంప్ నాదే కదా! రాజక్క దళమంటే, రాజక్క క్యాంప్ అంటే ప్రజలకు తెలిసిందే కద, వాళ్ళే నన్ను ఇముడ్చుకుంటర"ని వాదించిన. ఐతే ప్రాక్టికల్‌గ ఇదంత సాధ్యమయ్యే పని కాదు.

ఇక్కడ ఇంకొక ముఖ్యమైన విషయం చెప్పాలె. పోరాటం నుండి వెనుకకు పోవడమన్నది కేవలం మా సమస్య మాత్రమేనని నేను అనుకోలే. ఎంతమంది ప్రజలు, గిరిజనులు, స్త్రీలు త్యాగం చేసిన్రు? అదే నాకు చాలా బాధన్పించింది.

ప్రజలు చేసిన త్యాగాలను ఇన్నని చెప్పలేం. కానీ, ఒక సంఘటన నాకెన్నటికీ మరుపుకు రాదు.

ఒకసారి నా దళంతో బాటు ఒక కోయగూడెంలో షెల్టర్ తీసుకుంటున్న. అది చలికాలం. గుడిసె మధ్యన గుంట తీసి నిప్పు రాజేస్తారు, చలిని తట్టుకోటానికి. దాని పక్కన ఒక ఉయ్యాలకట్టి పసిపిల్లను పడుకోబెట్టిన్రు – ఆర్నెల్ల పిల్ల. ఆ పిల్ల తల్లి, ఆమె తల్లిదండ్రులు ముసలోళ్ళు, అందరం పండుకున్నం. పోలీసులొస్తరేమోనని కాపలా పెట్టినం. కానీ మైదానంలో వలె అడవిలో పోలీసుల కదలికలను ముందుగా పసిగట్టడం కష్టం.

పోలీసులు చప్పుడు కాకుండ వచ్చి గుడిసెను చుట్టేసిన్రు. అనుకోకుండా పోలీసులు చుట్టేసినప్పుడు మనం ఎదురు తిరిగేందుకు అవకాశం తక్కువ. అట్లాంటి పరిస్థితి వస్తే జనంలో కలిసిపోయి తప్పించుకోవాలని డైరెక్షన్ ఉన్నది. ఆ పరిస్థితిలో మేము తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నం. పోలీసులు నేరుగా లోపలికొస్తే నన్ను చూస్తరని, ఆపేటందుకు పిల్లతల్లి బయటికి వెళ్ళింది. నేనేమో ఆ చంటి పిల్లను ఎత్తుకొని తప్పించుకున్న.

ఆ చంటిపిల్ల తల్లి కోయస్త్రీ. మంచి ఎత్తుగ, అచ్చంగ నేనున్నట్టే ఉన్నది. నేనుకొని ఆమెను పట్టుకున్నరట. మాకేమో కొంత దూరం పోయిన తర్వాత వార్త వచ్చిందేమంటే, ఆ గుడిసెలో వాళ్ళందరు క్షేమంగానే బయట పడ్డరని. వాళ్ళు ఇంకెక్కడికో పోయి ఉండొచ్చు. పిల్లను వెనుకకు తీసుకోవటం మంచిది కాదన్పించింది. సమయం చూసి, గ్రామంలో పిల్లను అప్ప జెప్పాలనుకొని నాతోనే తీసుకుపోయిన.

అడవిలో ఆవుల మందలు మేతకు వస్తయి. అట్ల ఆవుల పాలు పోసుకుంట మూడు రోజులు పిల్లను సాదినం. కాని, ఆ పిల్ల బతకలె, చచ్చిపోయింది. నేను ఎంత ఏడ్చిన్నో చెప్పటానికి లేదు. మా అమ్మను జైల్లో పెట్టి, బాధలు పెట్టిన్రని తెలిసినప్పుడు ఎంత ఏడ్చిన్నో అంత దుఖ్ఖమొచ్చింది. ఇప్పుడు ఆ తల్లికి నేనేమని సమాధానం చెప్పాలె? పిల్లను కాపాడుదమనుకొని తెచ్చిన. కాని, తీసుకు రాకుండనైన ఉండక పోతినే, అన్పించింది. తల్లి దగ్గరున్నా బతికిపోవునేమో! అది జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఇప్పటికీ నా ఒళ్ళు దడదడ లేస్తది.

ఇక, అక్కడ జరిగిందేమిటని తర్వాత తెలిసింది. ఆ చంటిపిల్ల తల్లిని నేనుకున్నరట పోలీసులు. ఆమెను పట్టుకపోయి, నువ్వు రాజక్కవని మాకు తెలిసిపోయిందంటూ విపరీతంగా కొట్టిన్రట. నేను రాజక్కను కాను, చంటిపిల్ల తల్లినని ఆమె చెబితే, పాలు పిండించి చూసిన్రట. ఇక, రాజక్క వచ్చిందని మాకు తెలుసు, జాడ చెప్పమని ఆమెను బాగ హింసలు పెట్టిన్రు. ఎంత కొట్టినప్పటికీ తెల్వదని జవాబిచ్చిందే తప్ప, నేను వచ్చిన్నని ఆమె ఒప్పుకోలే. కనీసం తన బిడ్డ కోసమైనా నా జాడ దొరకాల్నని ఆమె అనుకోలే. వారం తర్వాత ఆమెను విడిచి పెట్టిన్రు పోలీసులు.

ఆమె గ్రామానికి వచ్చిందని తెలుసుకొని ఆమెను కలుసుకొని, ఏడవడం మొదలు పెట్టిన. ఎందుకేడుస్తున్నవని నన్నే అడిగింది. ఆమె పేరు సమ్మక్క. “నీ పిల్లను నేను ఎత్తుక పోవటం వల్లనే ప్రాణం పోయె, నేను వదిలిపెట్టి పోయినా బాగుండెనేమో, నువ్వు దక్కించుకుందుమేమో. నాది తప్పయింది, ఇంత జరుగుతదని అనుకోలేద”ని ఏడ్చిన.

నేను ఏడుస్తుంటే ఆమె అన్నది కదా – “నా పిల్ల కోసం ఏడుస్తున్నవు కాని, నిన్ను మీ అమ్మ ఎట్ల వదిలి పెట్టిందో కదా ప్రజలకోసం”, అన్నది. అమ్మో! అని నోరు తెరిచి నిలబడి పోయిన. ఏమని చెప్పాలె ఆ తల్లి త్యాగాన్ని! ఏం త్యాగం ఈ ప్రజలది! ఉద్యమకారుల ప్రాణాలకు ప్రాణం అడ్డుపెట్టిన్రు. ఆ జ్ఞాపకం ఎప్పటికీ నా లోపలనుండి పోదు. తరవాత రోజుల్లో నా పిల్లలను పెంచుతున్నప్పుడు ఉన్నట్టుండి సమ్మక్క గుర్తుకొచ్చి గుండెలో దడ లేచినట్టయ్యేది. మళ్ళా ఆమెను కలుసుకుందమని ప్రయత్నించినా, దొరకలేదు.

అట్లాంటి త్యాగాలు చేసిన ప్రజలకు తోడుగ, ధైర్యంగా నిలబడకపోయినంక ఇదేమి జీవితమని దిగులు కలిగింది. మామూలు గృహిణి లెక్క కుటుంబంలో ఇమడటం నాతోని ఎట్లవుతదని భయమయ్యింది.

పోరాటం ఆగినంక, నిజానికి ఖంగుదిన్న. బయటకొచ్చి, ఏం చేయాలో అర్థంకాని స్థితి. తుపాకి కిందబెట్టినంక ఎకాఎకిన బయటకు రాలేదు. ఇంకా కేసులున్నయి. గాబట్టి ఓంకారు, నేను, వి.ఎన్‌గారు, ఇంకా కొందరం దాదాపు ఒక సంవత్సరంపాటు లోపలనే వున్నం. ఈ లోపటనే పార్టీలో వాదనలవీ వచ్చినయి. జైళ్ళలో వున్నవారు కొందరు బయటకి వచ్చి ఎమ్.ఎల్.ఎ.లు అయినరు. అప్పుడు ఎమ్.ఎల్.ఎ.లుగా పెడదామంటే మనుష్యులు దొరకలె. చివరికి మనకి సానుభూతి పరులుగ వున్న లాయర్‌లను, వాళ్ళను, వీళ్ళను జూసి పెట్టిన్రు. వాళ్ళు గెలిచినంక, జనానికి సంతోషం.

వి.ఎన్.గారి పేరుతో వాళ్ళ చిన్నాయిన కొడుకు ఒక బొండుమల్లె చెట్టేసిండు. ఇది బతికితే ఆయన బతికినట్లు, ఇది పోతే, ఆయన బోయినట్లు అనుకున్నరట. అప్పుడు నా చేతినుండి గాజులు తీసిన గౌండ్ల లక్ష్మి, మల్ల ఎన్నటికన్నా, స్వరాజ్యం వస్తదని చెప్పి, ఆ లొట్టిలో నా గాజులను అట్లనే దాసిపెట్టినదంట.

నిజానికి నా మీద పెద్ద కేసులు లేవని తెల్సింది. తర్వాత చిన్నప్పుడేమో తిరుగుతున్నా, చిన్నపిల్ల అని వదిలేసిన్రు లోపట తిరుగుతున్నప్పుడు పట్టుకుంటే పదివేలన్నరు. కానీ, ఆ తరువాత రికార్డుల్లో నా గురించి పోలీసులకి సరిగ్గా సమాచారం దొరికినట్లు లేదు. చివరికి కేసులు పెద్దగేమి లేకుండె. మా అమ్మ తమ్ముడు సత్యనారాయణ రెడ్డి, జాజిరెడ్డి గూడెంలో వుంటడు. అతను కొంచెం అటు ఇటు వుంటడు. అసుంటోల్లని

పోలీసులు ఏమంటలేరు. కానీ ఆయన కొడుకును మాత్రం అరెస్టు చేసిన్రు. అతని కొడుకు యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తూ, పార్టీ దిక్కే ఉన్నడు. ఆయన ఒకసారి, "మన వంశంలోనే లేదు. నువ్వు, పిల్లలు ఇసుంటి పనులు జేస్తున్నరు. మీ ఆవులను హుర్రాజ్ పాడుతున్నరు. అయ్యింటిని ఇడిపించుకొస్తగానీ, నువ్వు మన ఇంటికి రా. కచ్చడం గట్టి నిన్నూ, నీ పిల్లల్ని తీస్కబోత" అన్నడు మా అమ్మతోని.

"నేను రాను నా కొడుకు బిడ్డలు, అల్లుడు అందరు బోయిన్రు అందులకు. వాళ్ళందరు ఎట్లుంటరో, ఎట్ల బోతరో అట్లుంట. జనంతో బాటు నేను తలదాసుకుంట గానీ, మీ ఇంటికి రాను" అన్నది మా అమ్మ. నిజానికి రాజకీయ వైరం కూడా వుంది. "మీ ఇంటికి వస్తే నన్ను హేళన జేస్తరు. ఇట్ల జేసిన్రు. అట్ల జేసిన్రు అనుకుంట. నాకు ఆస్తి వుంది. భూమి కౌలుదార్లు జేస్తరు. ఎట్లనో అట్ల బతుకుత. ఫో" అన్నది తమ్మునితోని.

తినే కంచాలతో సహా పోలీసులు ఎత్తుకపోయి, ఇల్లు తగలబెట్టిన్రు. ఇల్లు బంగ్లా గాబట్టి, మొత్తం తగలబెట్టటానికి రాలేదు. వెనకవైపు వంట ఇల్లు. పెంకులతో మూడు గదులేసిన్రు అవి తగలబెట్టిన్రు? లేవన్నట్లు ప్రకటించిన్రు లిస్టులో.

# 9

## మా ఇంటి కథ

మా అక్క శశిరేఖ ఫస్టు ఫస్టులోనే పోలీసులకు దొరికిపోయింది. అప్పుడప్పుడే ఆయుధాలు పడుతున్నం. ఆమె మూడేళ్ళు జైల్లోనే వుంది. తరువాత ప్రియంవద, లలిత కూడా దొరికిపోయారు. జైల్లకెల్లె ప్రియంవద నాకు ఉత్తరంబంపింది. "నువ్వెంత అదృష్టవంతురాలివే. నీ మీద అవార్డు ప్రకటించినా నువ్వు దొరకకుండ, పోరాటంలో వున్నవు. మేమేమో జైల్లో వున్నం. పోరాడుదమన్న మాకు అవకాశం దొరకదాయె" అనిరాసింది.

పిల్లతల్లని మా శశిరేఖని మా చుట్టాలు, సత్తెమ్మగారని వున్నరు, వాళ్ళ ఇంట్లనే ఉంచిన్రు. కంటె, వడ్డాణం, ఇట్ల అన్నీ పెట్టి. ఆ ఇండ్లల్ల ఆడోల్లు ఎట్లుంటరో అట్లనే. మా యమ్మ అన్నీ బెట్టి, నా బిడ్డని దాయండని వాళ్ళ తానకు తోలింది. ఆ ప్రాంతం కుక్కడం, పోరాట ప్రాంతమే. మా అక్క ఏడైతే వుందో, ఆ ఇంటి పాలోల్లే ఆ ఊరి పోలీసు పటేలు. అతను పోలీసులకు పట్టించిండు. తుంగతుర్తి పోలీసులొచ్చి పట్టుకున్నరు మా అక్కను. బిడ్డతో సహా జైల్‌లో పెట్టిన్రు. మా అమ్మ ములాఖాత్ కని పోయి, మా అక్క బిడ్డను తీసుకొని వచ్చింది. యూనియన్ సైన్యాలు మా ఇల్లు తగలబెట్టి, దోచుకున్నంక, మునగాల ఏరియాలో నర్సింహుల గూడెంలో మా చెల్లి, తమ్మునితో సహా రక్షణ తీసుకుంటూ

అక్కడే వుంది మా అమ్మ. మా అమ్మనే కాదు, బుచ్చిరావత్తను కూడా అరెస్టు చేసారు. అప్పటికే మా చిన్నమ్మ క్యాంపులో తలదాచుకుంటోంది. మా అమ్మను స్టేషన్‌లోనే పెట్టిన్రు. కొట్టడానికి ప్రయత్నం జేసిన్రుగానీ, మా నాన్న పేరు పెద్ద గుండేడిది పోలీసు అధికారులలో. అందుకుని ఆమెను దెబ్బలు కొట్టలేదని అనుకున్నరప్పుడు.

మా అక్క భర్త పైన అప్పటి పార్టీ నాయకుడు రావి నారాయణరెడ్డి వాళ్ళ ప్రభావం మొదలే, అడవులలున్నప్పుడే పడ్డది. రావి నారాయణరెడ్డి వాళ్ళ వాదం పోరాటాన్ని విరమించాలని కదా! నారాయణరెడ్డి తప్పించుకొని పోయిండంట అని సెంటర్‌ల తెలిసె. పార్టీ లోపట వాళ్ళలో వాళ్ళకే సంఘర్షణ జరుగుతున్నది. పోరాటం ఆపాల్నా వద్దా అని. మా బావ పార్టీ రాజకీయ సెంటర్‌పైన దాడి జేసి, దాన్ని కబ్జా జేసిండు. అప్పటికి ఇంకా పోలీసు నిర్బంధం వుంది. లొంగిపోయినోళ్ల ను కూడా కాల్చేస్తున్నరు. అప్పటికి మా అక్క ఔరంగాబాద్ జైల్లోనే వుంది. ప్రియంవద, ఓంకార్ భార్య కూడా అక్కడే వున్నారు. ఓంకార్ భార్య కలరా దగిలి చచ్చిపోయింది. ఆ జైళ్ళల్ల మన పార్టీ వాళ్లు చాలామందే వున్నరు. మగవాళ్లు కూడా అక్కడున్నరు. మొదటి దశలో జైళ్ళకు పంపినా, రెండో దశలో దొరికిన వాళ్ళని కాల్చేసిన్రు. మా అన్నయ్య మొదటి నుండి కొసదంక ఉన్నడు. ఆయన చివరి దశలో దొరికాడు పోలీసులకు. ఆయనపై కేసులు బెట్టి, జైల్లో పెట్టిన్రు. నా పెళ్ళినాటికి మా అన్న బయటలేడు.

ఆరుట్ల కమలాదేవి, ఇంకా ఇట్లా అందరితోపాటు మా అక్క బయటకు వచ్చింది. ఆమె జీవితంలో పెద్ద పోరాటమే జరిగింది. బయటకు వచ్చినంక, ఎక్కడ వుండాలనే సమస్య వచ్చింది. ఆమె భర్త రాజిరెడ్డి, ద్రోహం చేసి, బయటకు పోయిండనే రికార్డున్నది పార్టీల. పారిపోతూ, ఆయన కూడా అరెస్టయిండు. జైల్లవుండె. మొదటినుండి మా అక్క సంసారం ఇండిపెండెంటుగనే వుండే. ఆ తరువాత ఆయన కూడా విడుదలై బయటకొచ్చిండు.

ప్రియంవద మా బావకి చెల్లెలు. అంటే మా బావ తండ్రికి ఇంకొక ఆమె కూడా వుంది. ఆమెకి ఇద్దరు బిడ్డలు పుట్టిన్రు. ఆమె బిడ్డే ప్రియంవద. ఆమె వాళ్ళ అన్న ద్వారానే పార్టీలోకి వచ్చింది.

జైలు నుండి విడుదలైనంక, మా అక్క సరిగ్గా మా అమ్మ ఇంటికే వచ్చింది. కష్టమో నిష్టూరమో నా దగ్గర్నే బతుకతది అని మా అక్కని తన దగ్గరే ఉంచుకుంది. కానీ, ఆ తరువాత మా అన్నయ్య ఇంకా పార్టీ కమిటీ అందరూ మా బావ పార్టీకి ద్రోహం చేసిపోయిండు కాబట్టి, మల్ల మా అక్క అతని దగ్గరకి పోవద్దని చెప్పిన్రు. మా అక్క కూడా స్వతహాగానే అక్కడికి పోవడానికి సిద్ధంగా లేదు. ఇక్కడ మా అమ్మావాళ్ళింట్ల కాస్త

సాగుబాటెక్కువ. పని మనుషులుండేవారు. మా అన్న జైల్లోనే వున్నప్పుడు మా అన్న భార్య సరోజిని కూడా మా అమ్మదగ్గరికే వచ్చింది. మా అన్న వితంతువుని చేసుకున్నడు. రావినారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిందా పెళ్ళి అన్నయ్య ఇంకా అండర్‌గ్రౌండ్‌లోకి పోక మునుపే.

మా మేనమామ బిడ్డని మా అన్నకిస్తరని, చిన్నప్పుడు అనుకున్నరు. ఆమె నలుగురన్నలు కూడా ఉద్యమంలోకి వచ్చిన్రు. ఈ అమ్మాయి నేను గూడ వస్తనని అన్నది. చిన్నప్పుడు మేమిద్దరం మంచి ఫ్రెండ్స్‌మి. నేను అక్కడే, మా తాతావాళ్ళ ఇంటి దగ్గరే పెరిగిన. ఆమెకి కూడా మా అన్నను చేసుకోవాలని వుండేది. ఎందుకంటే పెద్దోల్లు చెప్పిన్రు కదా! అట్లనే మా అమ్మకి కూడా ఇష్టం వుండె. కానీ, వాళ్ళ ఇంట్లోవాళ్ళు పెళ్ళికి నిరాకరించిన్రు. చివరికి మా అన్న రావి నారాయణరెడ్డి ఇష్ట ప్రకారం వితంతువును చేసుకున్నడు. ఈ పెళ్ళి మా అమ్మకి అంత ఇష్టం లేకుండె. మా వదిన ఒక పిలగాడు పుట్టినంక అండర్‌గ్రౌండ్‌కు బోయింది. ఆమె పిలగాన్ని ఎక్కడో రహస్యంగా దాచిన్రు. హైదరాబాదులో డెన్ బెడితే. ఆ డెన్‌లో వుండేవారు. కొన్నాళ్ళు మునగాలలో కూడా వున్నరు. వాళ్ళ ఇంకో పిలగానికి జబ్బు చేసింది. వాడిని తీసుకొని పొమ్మన్నరు నన్ను విజయవాడకు. అక్కడ డాక్టర్ అచ్చమాంబ దగ్గరకు తీసుకుపోతే. ఆమె బాగుజేస్తదని అన్నరు. పిలగాడిని తీసుకొని ఊర్లమీదుకెల్లి ఒక్కదాన్నే పోతున్న, మధ్యమధ్యల వాడికి పాలుదాపించుకుంట. బాగ ఎండగొడుతున్నది. దారిలో ఒక పెద్దబావి కనిపిస్తే, ఇన్ని నీళ్ళు దాపిద్దామని బోయిన. ఇన్ని నీళ్ళు దాపుతనే వున్న, నా చేతులల్లనే పోయిండువాడు. అప్పుడు బాగా ఏడ్చిన నేను. ఏం చేయాలో ఎటు దీస్కపోవాల్నో అర్థంగాలే నాకు. వెనక్కుదీసుకెళ్ళి తల్లిదండ్రులకు అప్పజెప్పేటట్లు లేదు. కబురుపంపితే తల్లి వచ్చింది. ఆ పిల్లవాన్ని నర్సింహులగూడెం వద్దనే దహనం జేసిన్రు.

నేను అడవుల్లనే కేంద్రం పెట్టిన. ఒకసారి అన్నయ్యను కలుద్దామని అనుకున్న. ఎల్లన్నపేట దగ్గర ఒకసారి దాడి జరిగింది. అయితే అక్కడికి దగ్గరలోనే మన ఎక్స్‌టెన్షన్ సెంటర్ పెట్టి ఉన్నాం మేము. అక్కడికి మా వదిన కూడా మళ్ళీ పుట్టిన పిల్లవాడిని తీసుకొని వచ్చింది. ఫీల్డ్‌మీదే వుంది. అన్నయ్యను రాష్ట్ర కమిటీలో వేసిన్రు. ఆ పనుల మీదనే ఆయనను హైదరాబాద్ డెన్‌లకి పంపారు. ఆ డెన్‌లకి నన్ను కూడా రమ్మన్నరు. నేను రాను, ఇక్కడ్నే వుంటానని అడవిలోనే వున్నా.

పోరాటం ఆగినంక, మా వదిన కూడా మా తల్లిగారి ఇంటికే వచ్చింది. ఆమె అదివరకు పట్నంలో పెరిగింది గద. అక్కడ జీవితం అలవాటు. ఇక్కడ కొంచెం తగాదా పడటం మొదలుబెట్టింది. అప్పటికి మా అన్న ఇంకా జైల్లోనే వున్నాడు. ఆయన్ని కలవడానికి

జైలుకెడితే, ఆస్తిలో కొంత భాగం తీసి ఆమెకి ఇవ్వండి. ఆమెను తృప్తి పెట్టండి ఎట్లనో అట్ల. ఆమె స్వతంత్రంగా బతకడానికి అవకాశం ఇయ్యండి అని చెప్పిండు. వచ్చి, అట్లనే భూమి, పాడి, జీతగాళ్ళను, ఇంటిని ఆమెకి ఏర్పాటు చేసినం. అన్నయ్య వచ్చినంక ఫైనల్ జేద్దం అప్పటిదాకా ఇట్ల వుండు అని చెప్పినం. మా అక్క కూడా జైల్ నుండి విడుదలై మా ఇంటికే వచ్చింది గద. ఇగ ఇంట్ల, మా అమ్మ, నేను, మా అక్క ముగ్గురమైనం. వెనక్కి వచ్చి, ఇంటికి జేరినంక ఎట్ల బతకాలన్నది సమస్య కద. మా అక్క అత్తగారింటి వారికి ఆస్తులు లేవు. పోరాట సమయంలో వాళ్ళ ఇల్లు గూడ తగలబడితే, వాళ్ళంతా తల దాచుకునేందుకు నర్సింహుల గూడానికి వచ్చిన్రు. మా అక్క మావగారు మల్ల పెళ్ళి జేసుకుంటే, ఆ మారత్తకు చిన్నపిల్లలున్నరు. వాళ్లే ఎట్ల బతకాలని తన్లాడుకుంటున్నరు. వాళ్లే బాధపడుతున్నరు. మా బావ సంగతి జెప్పిన గద. మా అక్క అక్కడికి పోయెటట్లు లేదు. అప్పుడేం జేసినం "ఆడపిల్లలకి భూమియ్యాలని" మొదలుబెట్టినం, నేను, మా అక్కగూడ.

మా యశోదమ్మ చిన్నమ్మకి భూమి పంపకం చేయాలన్నప్పుడు నేనే ముందర పడవలసి వచ్చింది. అప్పుడు గ్రామంలో నేనున్న. మా ఇంకో చిన్నాయిన భార్యను గూడ. ఆమెకు ఒక్కతే ఆడపిల్ల. ఆమెను గూడ, ఆమె తల్లిగారి ఊరు పసునూరుకెల్లగొట్టిన్రు. ఆ వెళ్లగొట్టినామెని తిరిగి పట్టుకొచ్చి, మా వీరారెడ్డి చిన్నాయినతో తగాదాబడి, పాలు పంచిచ్చింది నేనే. అన్నయ్యేమో జైల్లో వున్నడు. మరి మా వదినని వేరు పెట్టమన్నరుగద. అప్పుడు మా సంగతేంది అని అడిగిన నేను.

మా చెల్లె పెళ్ళి నా కన్నా ముందే జరిగింది. రజాకార్ల గోలలు కొంచెం తగ్గి, యూనియన్ సైన్యాలు ప్రవేశిస్తున్న టైంలోనే మా చెల్లె సరస్వతికి పెండ్లి జేసింది మా అమ్మ. ఏదో ఇంత వెండి, బంగారం పెట్టి పెండ్లయితే జేసిందిగానీ, అత్తగారోల్లకి ఇంత భూమి గూడలేదు. అప్పటికి ఆమె భర్త పదిదాక చదువుకున్నడు. ఉద్యోగం జేస్తడని పిల్లనిచ్చిన్రు. మా ఆయన వి.ఎన్. పెదనాన్న కొడుక్కే ఇచ్చిన్రు మా చెల్లిని.

మా వదినేమన్నదంటే "ఆడపిల్లలకు భూములియ్యరు" అన్నది. ఆ కాలంలో ఆడపిల్లలకి అంత కట్నాలిచ్చేది కూడా లేదు. అంతేగాదు. ఆమె మాకు భూములివ్వద్దని పంచాయితీ గూడ పెట్టింది.

మా బుచ్చిరామత్త మా చిన్నప్పుడే, తల్లిదండ్రుల ఇంట్లవుంటూ, ఆమె వాటా భూమికోసం కొట్లాడుతుండేది గదా! చివరికి ఆమెకి చెల్కయిచ్చిన్రు ఆమె పుట్టింటి వాళ్ళు. ఇంకొక పొలం ఇవ్వకపోతే కోర్టుకు పోయింది. సద్దిగట్టుకొని కోర్టు చుట్టూ తిరిగి, భూమి సాధించుకుంది. ఎన్నో ఏండ్లు నడిచింది కేసు. రాయనిగూడెంలో నేను

సంసారం పెట్టినాక, ఒకసారి నా దగ్గరికి వచ్చి, "కేసు ఫైనల్ అయిపోయింది. నేనే గెల్చిన" అంది. మా అక్క ఆమె కొడుకునే చేసుకుంది. గాబట్టి, ఆమెను మా బుచ్చిరామత్తతానకే పంపుదామన్నరు. కానీ మా అక్క ఆడకు బోను ఈడకు బోను. ఇక్కడనే వుంటాను అంది. మా ఇంట్ల భూమి కోసం కొట్లాడిన, ఆ సిల్‌సిలా వుంది గాబట్టి, మేం ముగ్గురం ఆడపిల్లలం మాకు కూడ భూమి ఇవ్వాలని నినాదం ఇచ్చినం. మా అన్నయ్య ఏమనలేదు.

అప్పటికి మా చెల్లెలు అత్తగారింట్లనే వుంది. ఎర్రబాడు దొరకింది ఊరువాళ్ళది. మా చెల్లె గాబట్టి, దొరలు ఆమెను ఊర్లకెళ్లి ఎల్లగొట్టిన్రు. వాళ్ళాయనకి ఇంకా ఉద్యోగం రాలేదు. దానితో మా చెల్లె కూడా దాదాపు మా అమ్మ దగ్గర ఉండటం మొదలుపెట్టింది. ఇంతకుముందు మాకు దాదాపు రెండు వందల యాభయి ఎకరాల భూమి వుండేది. కౌలుదార్లు భూమి చేస్తుండె. పంచిన భూమి పోగా సుమారు ఇంకా నూట యాభై ఎకరాల దాకా వుండొచ్చు. అప్పుడు వీరారెడ్డని మా బంధువొకాయన వచ్చి "మా ఇండ్లల్ల, మా ఊర్ల ఆడపిల్లలకు ఎన్నడు భూమి ఇయ్యలేదు. మీకెట్లిస్తరు? ఇయ్యరు" అని పంచాయితీ పెట్టిండు. అప్పుడు ఏం చేయాలని ఆలోచించి మొదట మా చెల్లెలికివ్వండి. "రజాకార్ల గోలల్ల మా చెల్లెలికి ఏం పెట్టలే. వాళ్ళ అత్తగారోళ్ళు గూడ కమ్యూనిస్టు భావాలుండబట్టి, జేసుకున్నరు. ఆమెకి ఇప్పుడన్నా ఏమైన పెట్టాలె" అన్నం. సరే, అని కొంత భూమి అమ్మిన్రు. అప్పటికి మా మేనమామ కొడుకు ప్రభాకర్‌రెడ్డి, విడుదలై వచ్చిండు. మాకు తోడుగ, మా దగ్గర్నే వున్నడు. ఆయన పెద్ద మనిషిగ వ్యవహరించి, చెల్లెకని మొదలు మూడెకరాలు పొలం అమ్మి, ఆ డబ్బు తీస్కబోయి, వాళ్ళ ఊరుదగ్గర ఐదెకరాలు గొని, చెల్లెకి ఇచ్చిండు. అన్నయ్య తరవాత జైలు నుండి బయటకు వచ్చిండు. అన్నయ్య తీర్పుజేస్తడని అనుకున్నం. అన్నయ్య వచ్చాక, మా వదిన భూమి పంపకాల విషయంలో చాలా గట్టిపట్టుబట్టింది. ఆడపిల్లలకి పంచద్దని, దానితో మా అన్నయ్య డోలాయమానంలో పడ్డాడు. "ఎందుకంత పట్టుబడతరు. భూమి ఏడికి బోతది. ఇక్కడే వుండండి అందరూ అమ్మ దగ్గర" అన్నడు. నేను మాత్రం ఊరుకోలేదు. గట్టిగా పట్టుబట్టి రాష్ట్ర కమిటీ రాజేశ్వరరావుకి కబురుజేసిన. ఆయన ఠంచనుగ వచ్చిదిగిండు. అన్ని మహిళా సంఘాలకన్నా మొదలు నేను డిమాండు పెట్టిన – ఆడవాళ్ళకి ఆస్తి పంపకాల డిమాండు. ఊర్లో దీనికి ఎవరూ సరిగ్గా ఒప్పుకునేటట్లు లేరు. మా కుటుంబ వ్యవహారాలు తెలిసిన ఒక గౌండ్ల పెద్దమనిషున్నడు. ఆయన మా పనులు, వ్యవసాయం అదీ ఇదీ చూస్తూంటడు. మా అమ్మ, మమ్మల్ని పార్టీలోకి తీసుకెడుతుంటే మా అన్నతో "ఈ పిల్లల్ని ఇట్ల దీస్కపోతున్నవు. వాళ్ళ బతుకులేమైతయి ఆ తరువాత? శశిరేఖకైతే పెండ్లయింది. ఆమె

పోతుంది. మరి స్వరాజ్యం సంగతేంది? అత్త దగ్గరికి పంపితే, అటునుంచి అటే తీస్కపోతివి. ఇటు తాత ఇంటికి రామన్న గూడెం పంపితే, అటు నుంచి గూడ తీస్కపోతివి. పెండ్లీడు కొచ్చిన పిల్ల దాని సంగతేంది?" అని అన్నది.

"అది నాకంటే ఎక్కువ తెలివిగలది అమ్మా. అది ఫయిటరైతది. నీకెందుకు నాయిన సంపాదించిన భూమి ఉన్నదిగదనె. తలా ఇంత దీసుకుంటం" అన్నడు మా అన్న అప్పుడు. మా అమ్మ ఆ సంగతి జ్ఞాపకం జేసింది. రెండు రోజులు పస్తు పడుకున్న నేను మా అన్నయ్య మీద హంగర్ స్ట్రయిక్ చేసిన. అప్పుడు గౌండ్ల మైసయ్యనేటాయిన వచ్చి, "ఎందుకమ్మ, ఇంత పేరుబడ్డదానివి. ఇట్లెందుకు పండుకుంటవ్" అన్నడు. పేరుబడ్డదాన్ని కాబట్టే ఇంట్ల బడుకున్న, లేకుంటే బజార్లో హంగర్ స్ట్రయిక్ చేసేదాన్ని. నువ్వు చెప్పాలె తీర్పు ఇప్పుడు అన్న. ఆయనప్పుడు అన్నయ్యకి కొంచెం గట్టిగనే చెప్పిండు. దీనితో అయితదో గాదో అని రాజేశ్వరావుకి గూడా చెప్పినగద. ఆయన కూడా వచ్చిండు.

"నువ్వు ఇన్నేసి భూములు పంచినవు. ఇట్ల చేయగూడదు ఆడపిల్లల దగ్గరికి వచ్చేసరికి. మన సిద్ధాంతంలో కూడా వుందిగద సమానమని. అందుకని సమానంగా ఇవ్వాలి వాళ్ళకు" అన్నడు. ఎందుకో మా అమ్మనే కొంచెం జంకింది. "మూడు భాగాలు జేయండి. నా భాగం నాకివ్వండి. నా భాగంలోనే, నా ముగ్గురు ఆడపిల్లలకి ఇచ్చుకుంట" అన్నది. కొడుకులకే కొంచెం ఎక్కువ భూమి ఉండాలని అనుకున్నట్లుంది. మా తమ్ముడు ఏమనలె. అందరి పొత్తుల ఒక పన్నెండెకరాల చెలక నాకిచ్చిన్రు. అది పది ఎకరాలే ఉందనుకొని తీరా కొలిస్తే రెండెకరాలు ఎక్కువవుంది. మా వదిన ఇదేందని అడిగితే మా తమ్ముడు "అది మా అయ్య సంపాదించింది. మా అక్క దింటది ఫో" అన్నడు. నేనంటే భలే పావురం వుండేది వాడికి. అట్లాంటోడే నాకు వ్యతిరేకంగా పోటీ చేసి, నన్ను ఓడించిండు తరువాత. "ఆడబిడ్డ గంప పడుతున్నది. రాజకీయాలలో గూడా. ఇదివరకే ఇచ్చినంగద ఆమెకి" అనేది వాడు ప్రచారంజేసుకుంట తిరిగిండు. ఇదంతా చూస్తే ఒక్కోసారి నవ్వొచ్చేది. ఒక్కోసారి ఏందిరా ఈ ఖర్మమనిపించేది.

సరే, ఒక ఎకరమంత నీళ్ళవసతిలేదుగానీ, పొలం ఇచ్చిన్రు. అంతా అమ్మితే తొమ్మిది వేలొచ్చినయి తర్వాత ఆ డబ్బుతో రాయని గూడెంలో భూమి గొన్నం. అందులో పలుగురాళ్లు, పల్లేరు కాయలున్నయి.

మా అక్కకు ఇదివరకే పాత పద్ధతి ప్రకారం బంగారం అదీ బాగానే పెట్టిన్రు. కానీ పోలీసులు దోచుకుపోయిన్రు గద. అందులో ఆమెని ఆ భర్త పార్టీకి ద్రోహం చేసి పోయిండు గాబట్టి, ఆయన దగ్గరకు పోవద్దని పార్టీ నిర్ణయించింది గద. ఒకవేళ ఆయన దగ్గరికే పోతే, మా అక్క ఆయన ఇష్ట ప్రకారమే ఉండవలసి వస్తుంది తప్పా, వేరేలా ఎలా

వుండగలగుతుంది? కాబట్టి మా అక్క పోలేదు. మా తాతా వాళ్ళ ఇంట్ల ఉంది కొన్నాళ్ళు. అక్కడ మా అత్తయ్య వుండనీయలేదు. మా నాయిన నాకిచ్చిన ఇల్లు ఇది. నువ్వెందుకుంటవు ఇక్కడ, వెంపటికే పో అన్నది. అట్లా అన్నాగానీ, పోలేదు మా అక్క. కానీ, తర్వాత, ఎప్పటికో, మళ్ళీ ఆ భర్త దగ్గరికే పోయింది చాలా కాలానికి. నాకు పెళ్ళయి సంసారం చేస్తున్న కాలంలోనే. మా బావ కుర్చీ కఱ్ఱ తీసుకొని మా అక్కని విపరీతంగా కొట్టాడు. ఆ రోజు కూడా చాలా దుఃఖం వచ్చింది నాకు. పంచాయితీకి బోయిననేను. వంటరాదు మా అక్కకి. బుక్కుపట్టుకుని కూర్చున్నదట. నాకు కూడా వంట రాకపోయేది. ఏదో నేర్చుకున్న తర్వాత.

వంటచేయమని మా అక్కనంటే, మనిషిని బెట్టమన్నదట వాళ్ళాయనతో. వాళ్ళకు అంత ఆస్తిలేదు. ఆయనేవో కాంట్రాక్టులు చేసి నడుపుతున్నడు సంసారం. ఇద్దరు కొడుకులు, ఒక బిడ్డ మా అక్కకి. ఆమె స్నానం జేసుకుంట గోడమీద బట్టలేసిందట. మట్టిగోడగద. చెదలు బట్టినయి చీరెకు. అదొక నేరం. ఎడ్లకు దానపెట్టాలంటే, దాన ఉలవలు ముందుగనే తడపాలె. అవి సాయంత్రం వచ్చి తింటయి. అవి తడిపి పెట్టలేదట. అన్నం, కూర వండమంటే వంటరాదంటుంది. ఎట్ల సంసారం జేయాలి ఈమెతో అని తగాదా బెట్టుకున్నడు.

మా అమ్మగారింట్ల వంటమనిషి వున్నడు. మా అమ్మకి కూడా వంటరాదు. మా అమ్మ తల్లిగారింటి నుండి మేనాలో వచ్చేది.

"నువ్వేమో చేన్ల పలుగురాళ్లు ఏరుతున్నవ్. కష్టం జేసుకోని, పండించుకోని తింటున్నవ్. మీ అక్కకేమో పనిచేతగాదు, పని మనుషులను నేను బెట్టలేను. ఎప్పుడు చూసినా బుక్కులు పట్టుకోని చదువుతుంటది. ఆమె నాకొద్దు" అన్నాడు మా బావ.

అప్పటికే ఆయనకి మరో ఆమెతో సంబంధం వుంది. ఈమెను పట్టించుకుంటలేదు. మా అక్కా వాళ్ళ ఇంట్లోనే ప్రియంవద కూడా వుంది. ప్రియంవదకి మా బావ అన్నవుతడు గద. ఆమె పిల్లలను జూస్తున్నది. వాళ్ళిద్దరూ కూడా కొంచెం సర్దుకోలేకపోయిన్రు. దానికన్నా ఎక్కువ మా బావ మా అక్కను సహించేటట్లు లేడు. మా అక్క కూడా అదివరకటి నుండే నేను ఇక్కడ వుండనని పంచాయితీ జేస్తునే వుంది. మా అమ్మ అక్కకి ఆరెకరాలు ఇచ్చింది గద. ఇక్కడికే తీసుకొచ్చి, బంగ్లలోనే ఒక రూముల ఉండేదానికేందని మా అమ్మ గూడ ఆలోచించింది. అప్పుడు మా తమ్ముడు బోయి మా అక్కను అమ్మావాళ్ళ ఇంటికి తీసుకొని వచ్చిండు చివరికి.

నేను పంచాయితీకి బోయిన గద. "నువ్వు ఇట్ల దెబ్బలు గొడుతుంటే, ఏ ఆడది భరిస్తది. మేం ఉంచం ఇక్కడ, నువ్వు కమ్యూనిస్టు పార్టీలోకి బోయి ఆడ ద్రోహం జేసినవు.

ఇంకెక్కడికో బోయి, ఇప్పుడు మా అక్కను దెబ్బలుగొడతావా? ఛో" అని తిట్టి ఆమెని రాయనిగూడెం తీసుకచ్చిన అప్పుడు.

ఆమె విశారద, అదీ చదివిందిగద. ఎట్ల ఏం చేయాలని ఆలోచించిన. తెలుగుభాషా పండిట్ అంతా చదివింది.

ఒకసారి సమితిలో వుండే మహిళా సంక్షేమ అధికారిణి రాయనగూడెం వచ్చింది నన్ను చూసి పోదామని. అప్పటికే నాకు కొంచెం పేరుందిగద. ఆమెతో మాట్లాడుతున్నప్పుడు, మా అక్క గురించి అడిగింది. అప్పుడు ఇట్ల సంగతమ్మ, ఆమె చదువుకున్నది. ఎట్లన్న చేసి ఏదన్న ఉద్యోగం ఇప్పించమ్మ అని అన్నా. ఆమె చదువుకి టీచర్ పోస్టు దొరుకుతుందండి, నేను ప్రయత్నం జేస్తా అన్నదామె. ఎట్లనో ప్రయత్నం చేసింది. మా అక్కకు పోస్టు వచ్చింది. దేవరకొండ కేసిన్రు. ఆమెకి రచనాశక్తి వుండె. చదువే ఇష్టం ఆమెకి. వ్యాసాలవీ రాసేది. కానీ ఏ పేపర్లకూ పంపేటట్లు లేదు. ఆమె ఉన్న ఊర్లకు పేపర్లేరావు. వి.ఎన్.గారే ఆమెని తీసుకువెళ్ళి దించివచ్చాడు ఊర్లో. ఆమెకి వంటరాదుగద. ఆ ఊర్లోనే ఎవరినో వండిపెట్టమంటే, ఇంత వండి పెట్టిన్రట. ఆమెకి అప్పుడు చిన్న పిలగాడున్నడు. వాడిని నేను సాదుత నువ్వు ఉద్యోగానికి పోవే, అని చెప్పి, నేనే సాదిన పెద్దోడయ్యేదాక. కొంచెం పెద్దగైనంక, వాడిని, వాళ్ళ ఇంటికే పంపింది. పండగైన, పబ్బమైన, మా ఇంటికే వచ్చేది మా అక్క. అక్కడినుండి అరటిపాములకి ట్రాన్స్‌ఫరైంది మా అక్కకి. నేను ఎమ్.ఎల్.ఎ అయ్యేటైంకి ఆమెకి ఇంకా కొంచెం సర్వీసు వుండింది. కానీ రిటైర్‌మెంటు దీసుకోని, చిన్న కొడుక్కి ఆ ఉద్యోగం ఇప్పించింది. ఆ కొడుకంటే చాలా పావురం ఆమెకి. పెద్దపిల్లలు అప్పటికే సెటిల్ అయ్యారు.

మా అన్న ఎం.పి.గ జేస్తుండె అప్పుడు. మా వదిన హైదరాబాదులో ఇల్లు గట్టుకోని, ఆడనే ఉండేది. మాకు, ఆమెకి అంత కలవలె మొదటిసంది. మా అక్కని ఉద్యోగంలో బెట్టినంక మా అన్న "మన కుటుంబాలలో ఆడోళ్ళు ఉద్యోగాలు ఎన్నడన్న జేసిన్రా. శశిరేఖను దీస్కబోయి అట్ల తోలొచ్చినవేంది. ఆమెకి భూమిచ్చినంగద" అన్నడు. మా అన్నకి తెల్వదు ఇంట్ల వ్యవహారాలు, ఖర్చులు, పరిస్థితులు. ఇంటివరకు ఆయన భార్య జెప్పిందే చేస్తడు. డెబ్బయి రెండు సంవత్సరాల వయసులో చనిపోయింది మా అక్క. పిల్లనెత్తుకోని అప్పుడు జైలుకుబోయింది. అటెన్క గొడవలయ్యినంక చిన్న కొడుకు రామ్మోహన్‌ను ఎత్తుకోని నా దగ్గరకు వచ్చింది. జైల్ నుంచి వచ్చినంక, కొంతకాలం మా అమ్మదగ్గరేవుండి, చివరికి మా బావ దగ్గరికే పోయిందిగద. అప్పుడు ఇద్దరు బిడ్డల్ని గన్నది. శశిరేఖ పెద్ద కొడుకు పేరు విక్రం. బిడ్డపేరు సుమతి. పెద్ద కొడుకు సి.పి.ఐ లోనే వున్నడు. చిన్నోడు రామ్మోహన్‌కు చదువు సరిగ్గా అబ్బలేదు. ఆస్తులు పెద్దగలేవు. రిటైర్ అయినంక వెంపటికే బోయి

పెద్దకొడుకు విక్రం దగ్గర్నే వుంది. ఆడనే చనిపోయింది. మావి కష్టజీవుల కుటుంబాలు కావు. ఇంట్ల కష్టం చేయరు. ఆస్తులు, ఏమీ లేకుండపోయినయి. అక్కకి పెన్షన్ వచ్చేది. కూతురు సుమతి తన అత్తగారిని తీసుకు వచ్చి, తన ఇంట్లోనే పెట్టుకుంది. వియ్యపురాళ్ళిద్దరు ఒక దగ్గర్నే వుంటే తగాదాలొస్తయని అంటరుగదా, అదీగాక ఈ కుటుంబాలలో మళ్ళీ కొడుకుల దగ్గరే ఉండాల్సి వచ్చేది. సామాజిక పరిస్థితులు తెలంగాణాలో అట్లనే ఉండేవి. అక్క కూడా ఆవేదనతోనే చనిపోయింది. ఆమె జీవితం అంతా కష్టపడుతూనే వుంది. అక్కడా, ఇక్కడా తిరిగింది. మా ఇంటికాడ కొంత స్వాంతన పడ్డా, ఆమె మానసిక వేదన చాలా బడింది. భర్తతో సహజీవనం సరిగ్గాలేదు. అంతా సంఘర్షణే. పిల్లలు ఎక్కడో పెరిగిన్రు. తను ఎక్కడో ఉద్యోగం చేసుకుంటూ ఉండాల్సి వచ్చింది. పార్టీలో చీలిక వచ్చినప్పుడు షాక్ తిన్నది. బాగా హర్ట్ అయింది. ఉమ్మడి పార్టీగా ఉన్నప్పుడు ఆమె తాలూకా, జిల్లా స్థాయి కమిటీ స్థాయి వుంది. ఆమె మంచి స్పీకర్. చివరి వరకూ ఈ రాజకీయాలతోనే వుందిగానీ, ఆమె జీవితం అజ్ఞాతం అయిపోయింది. చీలిక తరువాత ఇనాక్టివ్ అయింది. భర్త పేరు తెస్తే కూడా భయపడేది. కుర్చీ కర్ర తీసుకొని కొట్టిండుగద.

# 10

## జీవితమే ఒక పోరాటం

పోరాట విరమణ తరువాత జీవితం పెద్ద మలుపు తిరిగినట్లయింది. ఉద్యమంలో ఉన్నన్నాళ్ళు ఇక వేరే ఆలోచనే ఉండేది కాదు. ఇప్పుడట్లా కాదు. బతుకుదెరువు సమస్య ముందుకొచ్చింది. ఇల్లులేదు, వాకిలిలేదు. నేను పొట్టతోని ఉన్న. అయినా పార్టీ చెప్పిన పనులు చేస్తూనే ఉన్న. మా బాబు రెండు నెలలకు పుడ్తడన్నదాక ఎన్నికల ప్రచారంలో తిరుగుతునే ఉన్న. ప్రజల సమస్యలు ఇంకా పరిష్కారం కాకముందే నేనిట్లా వ్యక్తిగత జీవితానికి పరిమితం కావాలనేది మింగుడు పడకపోతుండె. పురుడొచ్చినంక కూడ ఆలోచన చేసిన. ఆరేడు నెలలయినంక పిలగాన్ని ఎవరికన్న ఇచ్చేసి మళ్ళా ఉద్యమంలో పనిచేయాలన్నది నా ఆలోచన.

మా పెద్దమ్మ ఒకామె ఉండె. ఆమెకు భర్తలేడు, పిల్లల్లేరు. పిలగాన్ని చూసుకోమని అడిగితే, ఆమె ఒప్పుకోలే. పిలగాన్ని మీద పడేసి పోతనంటవు. అదేం పని, అని ఒప్పుకోక పోతే మల్ల తెచ్చుకున్న. పార్టీ ఏదన్న పని చెప్పిందంటె మాత్రం ఆగేది లేదు. చంటి పిలగాన్ని సంకలేసుకొని పోయి ఉపన్యాసాలిచ్చే దాన్ని.

మా పెండ్లియినంక అమ్మ దగ్గరకు పోయినం. అమ్మ సంతోషించింది. నేను ఒంటరిగ ఉండేకంటే ఇట్ల పెండ్లి చేసుకోవడం ఆమెకు సంతోషమన్పించింది. అందులో ఆయన అందంగ ఉన్నడు, చదువుకున్నడు కదా! ఐతే ఇప్పుడు మా బతుకు దెరువు ఒక సమస్య అయింది. మా తల్లిగారి ఆస్తి అప్పటికింకా సమష్టిగనే ఉన్నది. అన్నదమ్ములు, అక్క చెల్లెండ్లందరికి భూమి పంచాల్నని నిజానికి అన్నయ్య అభిప్రాయం. ఆయన ఇంకా బయటికి రాలే, జైల్లోనే ఉన్నడు.

అజ్ఞాతం నుండి బయటికి వచ్చినంక నా జీవితమే ఒక పోరాటం అయింది. నాకు కొంచెం చెలుక దొరికిందిగానీ, అది పూర్తిగా పలుగురాళ్ళ, పల్లేరుగాయల చెలుక. జొన్నలు ఏసిన పండదు, ఇంకే పంట ఏసిన గాని పండదు. అసలు గొడ్లు మెయ్యటానికి చొంగబడుతుంది వాటికి. దాన్ని బాగుచేసి ఒక దారికి తెచ్చెటందుకు నేను పడిన బాధలు ఇన్నన్ని కావు. రాళ్ళు ఏరేసి, పల్లేరుగాయలు పీకి, పంటకు వీలుగా దాన్ని తయారు చెయ్యడానికి ఎన్ని బాధలు పడ్డానో లెక్కలేదు.

భూమి ఇచ్చినంక వి.ఎన్. గారు వ్యవసాయం మొదలు పెట్టిండు. ఒక సంవత్సరం కాంగనే వదినె బాగనే తప్పులు పెట్టింది. ఇక ఆయన గూడ విసిగిపోయిండు. బయటికి వచ్చినోళ్ళు చాలామంది అప్పటికే చదువుకొని, వేరే జీవితం ఏర్పరుచుకున్నరు. ఎప్పుడైతే భూముల తగాదా వచ్చిందో, అప్పుడు వి.ఎన్. కూడ లా చదువాల్నని అనుకున్నడు. నాతో చెప్పగూడ చెప్పకుండనే తల్లిని అడిగి ఫీజు గట్టి వచ్చిండు.

అప్పుడు కొంతమందిని చదువుకోమని ప్రోత్సహిస్తున్నరు. సుందరయ్యగారు అట్లనే అనంతరెడ్డిని, భాస్కర్‌ను ప్రోత్సహించిన్రు. ఈయన గూడా లా చదువుత, హోల్‌టైమర్‌గ ఉండనన్నడు. నాకేందంటే ఇట్లనే ఇద్దరు ముగ్గురు చదువుకుంటమని బోయి డిస్ట్రబ్ అయ్యిన్రు. వాళ్ళు ఇంటర్ కాస్ట్ మ్యారేజ్‌లు చేసుకున్నరు. అట్ల నల్గొండ నుండి ఒకరు, నక్రేకల్ నుండి ఒకరు పోయిన్రు, బాగా చదువుకున్నరు. సంపాదన మొదలు బెట్టినంక, పెళ్ళాలను వదిలిపెట్టిన్రు. నల్గొండలో అట్ల నర్సమ్మ అనేటామె వుందిప్పుడు. ఈ పెళ్ళిళ్ళేంది, ఇడిసిపెట్టుడేంది. నాకేమనిపించిందంటే సంపాదించకపోతే మానె. ఇంతభూమి వుందిగద. ఆ భూమి దున్నుకుని బతికెదానికేముంది? అన్నం తినడానికి దొరికితే సరిపోయేగద. మనం కడుపు నింపుకునే, బట్టలు గట్టుకునే పరిస్థితి వుంటే చాలదా అనుకున్న గానీ, పిల్లలున్నరు, వారి భవిష్యత్తు ఏమిటి, అనే ఆలోచన రాలే నాకు. కానీ ఆయనకు వచ్చిందేమో?

"ఇగ నువ్వు చదవద్దు. నువ్వింక వేరేపని చేయద్దు. ఇండ్లనే ఉండాలె మనం. కమ్యూనిస్టు పార్టీలోనే మనిద్దరం వుండాలి. నువ్వు ఖచ్చితంగా పార్టీ పనిజెయ్యి. ఎట్లన్న

పిల్లలను సాదటం అనేది నీ వల్లగాదు. నావల్ల అయితది. మంచో చెడో నా వల్లయితది. భూమి దున్నుకోని బతుకుదాం. కానీ నువ్వు చదువులైన్‌ల పడ్డంక, సంపాదనలైన్‌ల పడతవ్. సంపాదనలైన్ల పడ్డంక పెద్ద, మంచి జీవితం కోసం ఆలోచిస్తవ్. అప్పుడు కష్టజీవులు, కష్టాలు బడే జీవితం కుదరదు. కాబట్టి చదవద్దంటే, చదవద్దని" పంచాయితీ బెట్టుకున్నా.

నేను వెంటనే రాజేశ్వర్రావుకు కంప్లైంట్ చేసిన. ఈయన లాయరయితే ఇక ఉద్యమానికి పనిజెయ్యడు. మన మాట వినడు. ఆయన ఇంకోదారి ఎంచుకుంటున్నడు. అటు పోతే ఇక నాకూ దొరకడు, మీకూ దొరకడు. పూర్తిగా మా కుటుంబం ప్రజా జీవితానికి దూరమవుతది. ఆయనను ఆపమని పార్టీకి చెప్పిన. తనమీద కంప్లైంట్ చేసిన్నని కొన్ని రోజులు కొట్లాడిండు. కానీ, ఆయన పోతున్న దారి మంచిది కాదని తెల్సినప్పుడు నా ప్రయత్నం నేను చెయ్యాలెగదా! ఆయన పైకి నెమ్మదిగా కనబడుతాడు గానీ మంచి వర్కర్, నిర్మాణ దక్షతగల కార్యకర్త.

చివరికి ఆయన విన్నడు. ఆయన మేధావిగద. ఈ వ్యవసాయం పని చేయడం ఇష్టం వుండకపోయేది. చదువేమో నేను చదవనియ్యకపోతిని. పార్టీ మీదనే బాగా కేంద్రీకరించిండు. నాకంటే ముందరనే కేంద్రకమిటీ సభ్యుడైండు ఆయన.

సరే ఇంతలో సుందరయ్యగారు వచ్చిండు. వి.ఎన్. గారు పార్టీ పనుల్లోకి రావలసిన అవసరమున్నది. ఆయన పాలసీ మేకర్. ఇట్ల వ్యవసాయం చేసుకుంట ఉండిపోతే ఎట్లనని పట్టుపట్టిండు. వి.ఎన్. ఒప్పుకొని హోల్‌టైమర్‌గ పార్టీలోకి వెళ్ళిండు. సూర్యాపేటలో ఉండి పని చెయ్యాలెనని నిర్ణయం జరిగింది.

ఇక నాకు వ్యవసాయం పని పూర్తిగా చూసుకోవటం తప్ప ఇంకొక మార్గం లేకపోయింది. నేను కూడ అక్కడికి దగ్గర్లోనే ఉండటం మంచిదని అనుకున్నం. అమ్మా వాళ్ళు నాకిచ్చిన భూమిని అమ్మేసి, సూర్యాపేట దగ్గర రాయనగూడెంలో పదిహేను ఎకరాల భూమి గొన్నం. రాయనగూడెం రావడానికి కారణం ఏమిటంటే వి.ఎన్. అప్పుడు సూర్యాపేట ఏరియాకి సెక్రటరీగా వున్నాడు. మా తల్లిగారి ఊరు కొత్తగూడెం నుండి గానీ, మా అత్తగారి ఊరినుండి గానీ, సూర్యాపేటకి బస్సులు లేవు ఆ రోజులల్లో. పార్టీ పనికి పోవాలంటే రోజంతా నడవాలి. అందుకని వి.ఎన్. సూర్యాపేటలోనే ఉండాలని నిర్ణయం అయింది.

రాయనగూడెంలో వడ్డెరోళ్ళ ఇండ్లకాడ ఒక చుట్టు గుడిసె కొన్నం. దానిలో కట్టెల పొయ్యి వుంటది. తమాషా ఏందంటే, నేను చాలా ఎత్తు. దానిలోకి వంగిపోవాలి. అట్ల వంగి పోవడం చాలా ఇబ్బందయింది. పొయ్యిదగ్గర కూర్చుని టక్కున లేచేసరికి, పైన

దూలం కొట్టుకునేది. ఆ గుడిసెల నుంచి ఎంత వంగిన, బయటకు వచ్చేప్పుడు దర్వాజ దగ్గర చూరు నుదిటికి కొట్టుకునేది. మొఖము, తలంత బొడిపెలు గట్టేవి. అది ఒక దుర్భరమైన జీవితమే. ఎకాఎకిన పోరాటం నుండి, దీన్లకు వచ్చేతలికి. విషయం ఏమిడిదంటే, లైఫ్ గురించి నా కొక అంచనా లేదు. ఇట్లా వుంటది, ఇట్లా వండుకోవాలి, ఇట్లా వుండాలని. మా ఇంట్లో మా అమ్మకి, మా అక్కకి, నాకు గానీ వంటలు రావు. ఎందుకంటే ఆ ఊర్లో సాతానోల్లుండేది. వాళ్ళొచ్చి వంటలు జేసేది ఇంట్ల పండుగలు గిట్లయితే. ఇక రోజూ వంటలు చేయడానికి వెంకటయ్య అని ఒకాయనుండె. తరువాత నేనేమో లైఫ్ ఏదో జరగాలె గాబట్టి ఏదో వంట చేసేది. ఇదంతా బాధగా వుండేది. కానీ దీనికన్నా లైఫ్‌లో వెనక్కి పోతున్నంగద అనేది ఎక్కువ బాధగావుండేది. రాజకీయ జీవితం ఇంక కట్ అయ్యేట్లు ఉంది. ఏ లక్ష్యాన్నయితే పెట్టుకొని, చివరిదాకా పనిచేయాలని అనుకున్నామో, అది సాగేటట్లు లేదనిపించింది. చివరికి, ఈ వండుకోని తినడం కోసమే, ఇంత పోరాటం చేయవలసి వచ్చిందా? ఏందిది అని ఆత్మ సంఘర్షణ, అవస్థ జీవితం ఇట్లయితున్నా ఎందుకో వెనక్కిమల్లుదం అని అనిపించలేదు. అది గొప్పతనమే. గొప్పతనమని ఎందుకుంటున్నానంటే ఇట్లాంటి జీవితంలోకి వచ్చినగానీ, పిల్లగాన్ని సంకలేసుకుని, నాతోటోల్లని కలుసుకున్న. "ఒక్క తుపాకీకే పనికి వచ్చేటోల్లంగాదు కదా మనం ఏం జేద్దాం. ఆర్గనైజేషన్ సమర్థతలున్నాయి. మనకి రాజకీయ చైతన్యం వుంది. నిర్మాణం వుంది. ఈ బయటి ఉద్యమాలలోనే, అందరు నాయకులతో పాటు మనం ఎందుకుండకూడదు?" అన్న చర్చను అందరం కలిసి చేసినం. అప్పుడు కమ్యూనిస్టు పార్టీ ఎన్నకు బొమ్మని అనలేదుగానీ, ఒక రకంగా, ఇల్లూ వాకిలి ఏర్పాటు చేసుకోవాలె. అదైతే తప్పలేదు. అట్లనే పనికి అందుబాటులో వుండాలని పార్టీవాళ్ళు చెప్పిన్రు. పార్టీ కమిటీకి నాయకులు వి.ఎన్., ఓంకారు, నేను, ఇంకా మరికొందరం. అట్లానే, మేం పనిచేసిన ప్రాంతంలోనే ఉండాలనుకున్నాం పోరాట విరమణ తరువాత కూడా. అంతర్గతంగా పార్టీలో పలు ఘర్షణలు జరుగుతూనే వున్నయి. ఆ తరువాత పార్టీలోపల రెండు భాగాలు సి.పి.ఐ., సి.పి.యం అని ఏర్పడినయి అనుకోండి.

నేనూ వి.ఎన్. సూర్యాపేటకి వచ్చి ఒక నెల రోజులున్నం. అక్కడ తిండి తిప్పలకి చాలానే ఇబ్బంది ఏర్పడింది. మేం కిరాయికున్న ఇంటి పక్కన బాపనోళ్ళున్నరు. వాళ్ళ దగ్గరికి పోయి ఇంత ఉడుకుడ్కు అన్నం అడిగి మా కొడుకు గౌతంకి పెట్టవలసివచ్చింది. చిన్న పిల్లగాడప్పుడు వాడు. దాదాపు ఒకటి, రెండు రోజులు పస్తులుండవలసి వచ్చింది. ఇట్లా ఇక్కడికి వచ్చినా కూడా, ఎట్ల నిలదొక్కుకోవాలన్నదే సమస్యదప్పా ఎవరిపైనా ఆధారపడేటట్లు లేదు. ఎవరినీ సాయం అడిగేటట్లు లేదు. వాళ్ళూ ఇచ్చేటట్లు లేరు. అన్ని

సంసారాలు చితికి పోయినట్లే వున్నాయి. కనుచూపు మేరలో. మా రాములమ్మ దగ్గరికి పోతే ఆమె టీ కొట్టు బెట్టుకున్నది. చాయిగిట్ట అమ్మి బతుకుతున్నది. గొల్లోల్ల లక్ష్మి, ఆమె భర్తా ఇద్దరూ కమ్యూనిస్టులే. అతను బాగా చదువుకున్నడు. యూనివర్సిటీ నుండి వచ్చిండు. వాళ్ళది ఇంటర్‌కాస్ట్ మ్యారేజ్. ఏం జేసి బతకాలనేడిది వచ్చేసరికి, ఇండ్లల్ల పని జేసన్న బతకాలన్నది వచ్చింది. కమలమ్మ, ముకుందం వాళ్ళకి కూడా ఇదే సమస్య. కమలమ్మ మంత్రసానం పనే మొదలుపెట్టింది. ఇట్లా ఎవరికి చేతనైంది వాళ్ళు చేస్తా, తొందరగానే అడ్జెస్ట్ అయిన్రు. బతకాలిగదా మరి ఎవరైనా. అప్పటికి నాకు ఒక బిడ్డగద. వద్దు. ఈ బిడ్డని ఎవరికైనా ఇచ్చి మల్లబోతా అనుకున్న. కొద్దిగా మొండితనం. నాకేమో ఎప్పటిలాగానే పని చేయాలని వుంది. మా అక్క, అంటే మా పెద్దమ్మ బిడ్డకు పిల్లలులేరు. జనగాం తాలూకా నెల్లుట్ల ఆమెది. పిలగాన్ని తీస్కబోయి ఆమెకిచ్చి మల్ల కనకుండ వుందమనుకున్న. "నా పిలగాన్ని సాదు నువ్వు. నేను మల్ల ఎప్పటిలాగనే. ఆర్గనైజర్‌గ జేస్తా" అని మొండిపట్టు పట్టిన నేను. కానీ ఆమె అదివరకే ఆసుపత్రిలో ఎవరో వదిలేసిపోయిన ఒక ఆడపిల్లని దెచ్చుకుని సాదుకుంటున్నది. "నేను ఈ పిల్లని సాదుతున్ననే" అన్నది.

"నా కొడుకు నిస్తనే నీకు. అమ్మనాకు భూమి గూడా ఇచ్చింది. అది గూడ ఇచ్చేసి పోతనే" అన్న. కానీ ఆమెకి ఆమె అమ్మగారు బొచ్చెడు భూమి ఇచ్చిన్రు. ఆమె వితంతువు పిల్లలు లేరు. అయితే ఆమె నావల్లగాదంది. మా పెద్దమ్మను అప్పటిలో పెద్ద భూస్వామికి ఇచ్చి పెళ్ళిచేసిన్రు. వాళ్ళకి బాటసింగారం కాడ చాలా భూములున్నాయి. ఆ తరువాత, మా అక్క ఇంకొక పిలగాన్ని కూడా సాదింది. గానీ, ఎందుకో నా పిల్లగాన్ని సాదనన్నది. కానీ, చాలా మంచిదామె. నేను పెళ్ళి చేసుకుని, బిడ్డను కూడా కన్నందుకు చాలా సంతోషించింది. నీ భర్త మంచోడు. సక్కంగుంటడు అనేది. వి.ఎన్. గారంటే అభిమానం తనకి. చివరికి "నువ్వు సంసారం మొదలుబెట్టలేక, నీ బిడ్డని ఈడ ఇచ్చి, ఆయనను గూడ బాధపెడతవ్. అది మంచిది గాదు. నువ్వూ, ఆయనా మంచిగుండాలె. నీకో ఇల్లుండాలె. నీ బిడ్డని నువ్వే సాదుకోవాలె. మంచిమనిషి నీకు దొరికిండు. మీరు చెదరద్దు. చక్కగ సంసారం జేసుకోని, మంచిగుండాలె" అని చెప్పింది. మా అమ్మ కూడా అదే మాట చెప్పింది.

మేం రాయనగూడెంలో బడ్డం గద. అక్కడ అందరూ వ్యవసాయమే జేసుకుంటరు. ఇండ్లల్ల పనులు చేయడానికి ఎవరూ దొరకరు. ఎవరిపనుల్లో వాళ్ళుంటరు. పశువులు గాయనికి ఒక పిలగాన్ని పెట్టుకుంటే, వాడు బయట వాటిని దిప్పి ఇంట్ల తోలేసి పోయేది. ఆ ఊర్లో అదే పద్ధతి. ఆడోల్లే పశువులను ఇంట్ల కట్టేసుకోని పేడ తీస్కుంటరు. నాకు ఆ

పనులన్నీ రావు. వానికి నువ్వే ఇంట్లగట్టేసిపో అని ఎంత చెప్పినా వినేటోడు గాదు. ఏం జేస్తమల్ల తప్పనిసరైనప్పుడు నేనే జేసిన. నేనేం చేయనింక.

నాకు ఉబ్బసం వుంది. రాయనగూడెం వచ్చినంక నాకు ఆస్తమా ఎక్కువైపోయింది. అడవులల్ల గూడ నాకు ఒకటి, రెండుసార్లు ఎటాక్ అయింది. నేనక్కడ రాతి గుహలుంటయి గద వాటిలో వుండేది. ఆవులను మేపటానికి మైదాన ప్రాంతాల నుండి వచ్చెటోల్లు బాగా పరిచయం. వాళ్ళు పాలుబోసేది. ఆ పాలుదాగి పడుకునేది. కాన్పు అయినంక తరచు ఆస్తమావస్తున్నది నాకు. పిలగాన్ని చూసెటోల్లు లేరు. ఈయనేమో, పార్టీ పనిమీద పూర్తిగా సూర్యాపేటలోనే వుండుడు. ఆయన చిన్నమ్మమ్మ చెల్లెలు సూర్యాపేటలో హాస్టల్‌లాగా పెట్టింది చదువుకునే పిల్లలకు. ఆ పిల్లలు తలా కుండెడు బియ్యందెస్తరు. నెలకి పది రూపాయలిస్తరు. వాళ్ళకి ఆమె వండిపెడుతుంది. ఆ ఇంటినే ఆయన ఆశ్రయం జేసుకున్నడు. ఆ హాస్టల్‌ల భోజనం చేస్తున్నడు. ఆఫీసులో పండుకుంటున్నడు. అప్పటికే వి.ఎన్.కు అమ్మలేదు. నిర్మాణపరమైన బాధ్యతలను అతను ఎక్కువ చూసేది మొదటి సంది. ఆయన ఎక్కడ పనిజేస్తే, అక్కడ ఆయన ప్రభావం పడేది. చాలా నియమాలు పెట్టుకున్నడు. సుందరయ్యగారి లాగానే. ఒక్క పూలదండ మెడలో వేయించుకోలేదు. అప్పుడు దండాలు బెట్టడం మామూలుగద. ఎవరన్నా వంగి దండం బెట్టపోతే, కయ్యిన కసరించేడిది. ఆయనకు కఠినమైన క్రమశిక్షణా నియమాలు చాలా వున్నాయి. నాకు కూడా ఒక్కొక్కసారి భరించడం కష్టమయ్యేడిది. ఎన్నడన్నా, కష్టాల గురించి చెప్పబోతే “మనం ఎంచుకున్న మార్గాన్ని బట్టి వుంటాయి. మధ్యలో కంగారుబడితే లాభం లేదు” అనేవారు. అయితే ఆయనలోపల గూడా ఏదో ఆలోచన పని చేసిందో ఏమో! ఇంత కష్టపడుతున్నరు గద వీళ్ళు అని ఆయనకి కూడ ఆలోచన వచ్చిందేమో. వ్యవసాయంలో సహకరించాలన్న ప్రయత్నం జేసిండు. కానీ, ఆయనకు టైము దొరకలేదు. నేను ఫీల్డ్‌మెన్‌ను. ఏ పని అవసరమైతే, ఆ పని జేసిన. ఆయనేమో ఆలోచనల మనిషి, మేధావి. ఆయనేమో పరిష్కారాలకోసం చూస్తాడు. మరి పార్టీ నిర్ణయం ప్రకారం వి.ఎన్ గారు పోవాలె. ఏమన్న అంటే నువ్వు చెప్పిందే కదా అంటడు. అయినా ఈ పిలగాండ్లను సాదుడు ఆయనతోని అయ్యేది కాదు. ఇక నేనే వ్యవసాయంలోకి దిగిన. అన్ని పనులు చేసిన. నాగలి పట్టి దున్నుడు ఒక్కటే చెయ్యలే. నీళ్ళు పట్టిన, కాపుగాసిన, కోత కోసిన.

నేను ఒక్కదాన్ని కష్టపడుతుంటే, వెళ్ళి, వాళ్ళ అమ్మమ్మను తీసుకొచ్చిండు. పాపం ఆ అమ్మమ్మ వచ్చి చాలా హెల్ప్ చేసింది. లేకపోతే, సంసారం జేతునో లేదో, ఏం జేతునో తెల్వదు నాకైతే.

ఒకరోజు ఆయన్ని అడిగిన, "మీ చిన్నమ్మమ్మ నీకైతే అన్నం పెడుతుందిగద సూర్యాపేటల. నాకెందుకు బెట్టదు. నేను గూడవస్త. అక్కడనే జేరదాం ఇద్దరం. కుండెడు బియ్యమే అయితే ఇక్కడినుండైనా, అక్కడి నుండైన తేవచ్చు. ఆడనే చేద్దాం పని ఇద్దరం" అని ఆయన ఎంటబడ్డ. "అట్లయితే, ఇద్దర్ని గలిపి ఎల్లగొడతది" అన్నడు.

నేను మా పెద్దమ్మ బిడ్డ తానికి బోయి, పిలగాన్ని ఇయ్యబోవడం గూడా తప్పని అనుకున్నడు అతను. నేనేమో ముందే ఏం సలహా అడగకపోయేదాన్ని. పని చేసివచ్చినాంక మంచో, చెడ్డో, ఆయనకు చెప్పదలుచుకుంటే చెప్పేదాన్ని. లేకుంటే ఊరుకునేది. "నేను తప్పు చేస్తున్నానని తెలిస్తే, నువ్వు ముందే చెబితే మంచిదిగద" అని నేనంటే

"చెబితే వినేదానివి గాదుగద నువ్వు. నాకంటే పెద్ద నాయకురాలివి. ఏంజెప్పను నీకు" అనేడిది అతను.

"మంచిదిగాదు అని నువ్వు చెబితే, నేను చేయలేదుగదా అన్న భావన అన్నా నాకు వస్తదిగ" అని అన్న. అంటే "అది అంతేలే. నీకు తెలవకుండేమున్నది" అనేది అతను. ఆయనకు కూడా మొదలు నేనే నాయకురాలిననే ఇంప్రషన్ బడింది. ఆ అభిమానం వుండేది. నిజంగనే, నాకు తెలుసు అన్న భావనతోటే వున్నడాయన. నేను అసాధ్యమైన పనులు చేసుకురాగలిగిన దాన్నని ఆయనకు అనిపించేదేమో.

వాళ్ళ అమ్మమ్మను తీసుకొచ్చినంక, మల్లీ ఒక కొత్త గుడిసె ఏసినం. పాత గుడిసెలో వండుకునేది. ఈ కొత్తదాన్ల పండుకునేది. ఎడ్ల కోసం కొట్టం ఏసినం. దానిలోనే ఒక రోకు (వైపు) గోడబెట్టి, ఈ గుడిసె ఏసినమన్నట్లు.

రాయనగూడెంలో వున్నప్పుడు ప్రజలు ఆదుకుంటరు అన్న విశ్వాసం వచ్చిన ఒకటి రెండు సంఘటనలున్నయి.

మా ఊర్లో ఒక చెరువుంది. ఆ చెరువులో చేపలు పడతారు. ఆ చెరువు కిందనే మా పొలంవుంది. మామూలుగా వరదలొచ్చి, ఆ చెరువులోకే చేపలు కొట్టుకొచ్చేడిది. అయ్యే సరిపోయేటివి పిల్లలకు పెట్టడానికి. ఆ చెరువులో సూర్యాపేట నుండి వచ్చి చేపలు పట్టేవారు. వారెవరూ వృత్తిదారులు గాదు. వేరే వాళ్ళను తీసుకొచ్చి, చేపలు పట్టించి, వాళ్ళు తీసుకుపోయేవాళ్ళు. దీనికి వ్యతిరేకంగా, గ్రామంలో సొసైటీని నిర్మించే పని, మా వి.ఎన్.గారే చేసిండు. మా ఊర్లో ముత్రాసోల్లు బాగావున్నారు. అప్పుడు ఊర్లో సొసైటికి, వూర్లో పెత్తందార్లకు, బయట నుండి వచ్చి చేపలు పట్టేవారికీ మధ్య పంచాయితీ వచ్చింది. ఆ పంచాయితీల, ముత్రాసోల్ల దిక్కే గద ఎప్పటిలెక్కనే నేను. చెరువు కట్టమీద కాపలాపడుకున్న ముత్రాసోల్లు భయపడుతున్నరు. అప్పటికే ఊర్లల్ల పోలీసోల్లంటే జనాలకి విపరీతమైన భయమే. పిల్లల్ని అమ్మమ్మదగ్గర వుంచి, వాళ్ళకు మద్దతుగ నేను గూడ

బోయి పండుకున్న. ఆడ రాత్రి నెగడేసినం. కావలున్నం. రాత్రి బాగా పొద్దుపోయినంక పండుకున్నం. వాళ్ళకి ధైర్యం చెప్పటానికి నేను వచ్చిన ఆ సంఘటనని ఊర్లో వాళ్ళు ఎన్నోసార్లు సంబురంగ గుర్తు చేసుకుంటరు.

చేపల చెర్వుకు కాపలాగున్నం గద. ఒకసారి వాళ్ళు చేపలు పట్టుకోని, తెచ్చిచ్చిన్రు వండుకోమని. నాకు పసిపిల్లలు. పొలాల్లో దొరికినా, గాలాలేసి పట్టుకునేందుకు. మా పిల్లలు చిన్నోల్లు. ఆ వయసు రాలే పిల్లలకు. నేను పోయేటట్టులేదు. ఏదో ఇంత పిల్లలకు వండిపెడదామనుకున్న నేను. ఆ సమయానికి వి.ఎన్.గారున్నరు ఇంట్ల. ఆ వచ్చిన వాళ్ళతో సీరియస్‌గా "ఇదేం పద్ధతి, ఇది లంచమా? ఎందుకిట్ల పట్టుకొచ్చిన్రు? మల్ల ఎన్కటి దొరల పద్ధతి మొదలు బెడతరా?" అని వాళ్ళను ఎల్లగొట్టిండు. ఆ రోజు వి.ఎన్.తో లెస్స పంచాయితీ పెట్టుకున్న "రాత్రిపూట కాపలా పండుకోనుంటే తెల్సేది నీకు. పోనీ నా కష్టానికాన్న వాళ్ళు రెండు చేపలు ఇచ్చిన్రు అనుకో" అన్న. వాళ్ళ అమ్మమ్మ అయితే కంటనీరే పెట్టింది. "ఏందిరా నీ కేమన్న తిక్కనా ఏంది సంగతి? నోటికాడి తినే వస్తువు. ఎవరన్నా దానంబెడితే తీసుకోరా" అని కోప్పడింది. అట్లన్నగానీ, ఆ రోజు వద్దంటే వద్దని, వాళ్ళని ఎల్లగొట్టిండు వి.ఎన్. అంత ఖచ్చితం ఆయన. "ఇయ్యాల చేపలైతయి. రేపు ఇంకొకటైతది. ఇట్లాంటి పనులు చేయకురి మీరు" అన్నడు.

అట్లనే ఒకసారి పొయ్యిలకు కట్టెలులేవు. వాళ్ళ అమ్మమ్మ ఏం జేసింది. వడ్డోల్ల ఇల్లు దగ్గరనే వుంది. వాల్ల దగ్గరికి పోయి ఇన్ని చెక్క పెల్లలియ్యర ఈ పూటకి అని, ఇన్నన్ని అడుక్కొచ్చింది. పాపం వళ్లోబోసుకొని వచ్చింది. వి.ఎన్.గారిట్లన్నరు ఇంటిముంగల. ఆయన ఇంట్లోకి రాకముందే పోయిందామె. ఇంతలో వచ్చిండు. ఇంత అన్నం దిన్నాక, "ఎటుబోయింది అమ్మమ్మ" అని అంటున్నడు. ఇగ ఆమె వచ్చి గోడ చాటున దాక్కున్నది. అసలు అగపడ్తలేదు. లోనికొస్తే, అట్ల అడుక్కొస్తావా అని అంటడేమోనని. దానికి దగ్గట్లు, కట్టె పెల్లలు వళ్లోనే ఏసుకొచ్చింది. నేను అర్థం చేసుకున్నా. మనవడికి భయపడుతున్నదని. నేను మెల్లిగ గోడపక్కన ఉన్నట్లున్నది తీసుక వద్దామని పోతుంటే, నా ఎనకబడి వచ్చిండు. అమ్మమ్మ ఆడనే కట్టెపేడులు గమ్మరించింది. మల్ల అటుకెల్లి వచ్చి, లెస్స కోప్పడింది.

"ఎందుకొచ్చిన సంసారం ఇది. ఛో, పోయే నువ్వు. మహరాజులసుంటి ఇంట్ల బుట్టి, ఏందీ సంసారం. ఇల్లు ఇడిసిపెట్టి, పిల్లల్ని దీసుకొని, సప్పుడు జేయక ఎల్లిపో" అన్నది. ఆయనను కూడా కోప్పడింది. నాక్కూడా బాధనిపించింది కాస్సేపు. ఏందో మరీ, ఇంత ఇదేందని. ఆయన అట్ల. అంత ఖచ్చితంగ వుంటేనే మనమిట్ల బతికున్నమేమో అని అనిపిస్తదిప్పుడు. అట్లుండేటోడు ఆయన.

ఒకరోజు పండుగ. బచ్చాలు (భక్ష్యాలు) చేసే పండుగ ఉగాది. పెద్దోడిని అంజిరెడ్డి గూడెంలో హాస్టల్‌ల ఏసిన్రు. సెలవలకి అక్కడినుండి నా దగ్గరికి వచ్చిండు పిలగాడు. ఇంట్ల పిల్లలున్నరు. పండుగ. మా పక్కనున్న వన్నీ వడ్డెరోళ్ళ ఇళ్ళు. ఆడనేవున్నం మేము. నాకు చేయరాదు. కానీ పప్పు ఉడకబెట్టి, బెల్లంవేసి ఆ పప్పు గోధుమ పిండిబెట్టి, ఇట్ల బచ్చాలు చేసేదానికన్నా, ఆ ముద్ద పెడితే అట్ల కూడ బలమేగద అనుకునేదాన్ని. రొట్టెలు బాగా చేసేదాన్ని నేను. ఈసారి ఆ పప్పు కూడా దొరికేటట్లులేదు. ఆ పప్పుకు పావలా పైసలు కూడా దొరికేటట్లులేవు. పావులాకు శేరుపప్పు అప్పుడు. ఇల్లు అలుకుతున్న నేను. ఇంటికాడ ఇంత సాయం జేసే మనిషన్నా లేడు. ఎర్రమన్నేసి, మట్టి ఇల్లేగదా మాది, అలుకుతున్న. అలుకుతున్నగానీ, ఏడొపొస్తున్నది నాకు. నాకు కూడా తినాలని ఉంటదిగద. తిండి సక్కగ దొరుకుతలేదు. ఎప్పుడూ జొన్నరొట్టెలే, జొన్నరొట్టెలు. ఒకనాడు బియ్యం దొరకక, దొరకక దొరికితే బాగ ఆకలెత్తున్నది గాలించి వండినదాని కన్నా, ఆలస్యం చేయకుంట పచ్చిబియ్యం బుక్కిన. అప్పుడు పిల్లలు పాలుదాగుతుండె. బాగ ఆకలైతుండేది. ఇబ్బందయ్యేది. పాపం వాళ్ళ అమ్మమ్మ గూడ చాలా ఏడ్చి, బాధపడి ఆఖరికి ఒక బర్రెని అడుక్కొచ్చుకోవే. నువ్వు అమ్మగారి ఇంటికెల్లి బర్రెను దెస్తే, నేను పాలు అమ్ముత అనేది. చివరికి మా అమ్మగారి ఇంటికి చెప్పిపంపితే వాళ్ళు ఒక బర్రెను పంపిన్రు. ఆ బర్రె పాలు పిండి వి.ఎన్.గారిక్కూడా ఎర్కలేకుండ అమ్మిందామె. అమ్మమ్మ సగం భారందింపింది.

సరే, ఆ రోజు ఆమె గూడా లేదు. ఏం జేయాల్నో అర్థంగాక, ఏడుపొచ్చిందింక. ఏందీ లైఫ్ అని. అవతల అంత బాధ్యతలు నిర్వహించిన వాళ్ళం, వదులుకోని రావడం ఏంది? పిల్లలను ఈ తిప్పలు బెట్టడం ఏందని. ఆ పిలగాల్లను ముందట బెట్టుకోని, నేనేడుస్తున్న. వాళ్ళేడుస్తున్నరు, ఏం అర్థంగాక. ఆ పరిస్థితుల్లో రాజక్క కాసర్లపాడు నుండి, బిడ్డను జూడనీకి, మా ఊరు మీదికెల్లే పోతున్నది. ఆమె బిడ్డ మా ఊరి పక్క ఊర్లోనే వుంటది. రాజక్క వాళ్ళ ఊరి చేన్లలో చెనిగలు ఏస్తరు. కూలికిపోతరుగద. చెనిక్కాయలు, అవి, ఏర్కొచ్చుకోని, పప్పు ఇసురుకోని బిడ్డకోసం ఆమె వస్తున్నది. బిడ్డవుండే టేకుమట్ల గ్రామానికి పోవడానికి. ఈ ఊరు మా అమ్మ మేనమావల ఊరు. మేం రాయనగూడెంలో దిగినప్పుడు పొయికట్టెలు, బియ్యం, ఒక పనిమనిషిని, ఇక్కడకెల్లే నా దగ్గరికి పంపిన్రు. అప్పుడు బాలింతను నేను. నేను ఈ ఊర్లనే వుంటానని రాజక్కకి తెలుసు. స్వరాజ్యాన్ని చూడాలి, చూడాలి అని ఎప్పటినుండో అనుకుంటున్నదట. తన బిడ్డింటికి పోదామని, అట్ల ఈడికి గూడ వద్దామని అనుకుని బెల్లంతో సహా ఇంత పప్పు మూటగట్టుకొని బయలుదేరింది. ఇగ మా గుడిసెలకు వచ్చి చూసింది. నా చేతిలో ఇల్లు అలికే పిడస అట్లనే వుంది. "ఏంది ఇట్ల గూర్చున్నవ్. ఈ అలుకుడేంది" అని ఒక్కసారే నెత్తికొట్టుకోని

భోరుమని ఏడ్చింది. "నువ్వెందుకేడుస్తున్నవ్" అని నేనంటే "నువ్వు ఇల్లలుకుతున్నవా?" అంటూ ఇంకింత ఏడ్చింది. దానితో నా ఏడుపు ఇంకింత ఎక్కువైంది. పిల్లలు అప్పాలని అంటున్నారు పప్పు అన్నా ఉడకబెడదామంటే పావల పైసలు గూడ నాతాన లేవు అంటూ, మొత్తం చెప్పేసిన. ఒక మాట గూడ ఆగలే. నాకు దుఃఖమే, దుఃఖం. ఏవేవో యాదికొచ్చి. ఆమె "ఓ అమ్మ, ఊకో, ఊకో, నేనొండుత. నేను పప్పు పట్టుకొచ్చిన. నా బిడ్డ ఇంటికి పోనుగాని" అని అక్కడే వున్నది. అప్పుడు వి.ఎన్. లేడు. అప్పుడు ఆయన అండర్ గ్రౌండ్‌లో వున్నడు. ఏదో కేసో, ఏందో జ్ఞాపకంలేదు. ఎక్కువ భాగం వుండడు. మిలట్రోని పెండ్లాం ఎదురుజూసినట్లు జూసేది నేను ఆయన గురించి. ఎక్కడ ఘర్షణలు, ఎక్కడ మర్డర్‌లు జరుగుతున్నయో ఎక్కడ పరిస్థితి కష్టంగా వుండేదో అక్కడికి పోయేటోడు. ఆడగూడ అండర్‌గ్రౌండ్‌లోనే వుండేది. అన్నింటినీ తిప్పికొట్టి, అన్నింటిని సవరించి, పని అయ్యేదాంక, నెలలకు నెలలు అక్కడనే వుండేది.

రాజక్కనే నాకు ధైర్యం చెబుతూ "ఎందుకిట్ల బాధపడతవమ్మ. ఎవర్ని అడిగినా బెడతరుగద నీకు" అని ఓదార్చింది. అంత నాకేబెడుతున్నవ్ అనంటే "నా బిడ్డ కూలి చేసి సంపాదిస్తుంది ఏం గాదులే. ఆమె మంచిగనే వున్నది" అంది రాజక్క. నేను ఉన్నచోట కూలి పనులుగూడ దొరకవు. అట్లా దొరికితే పోయేదాన్నే ఏమో. ముత్రాసోల్లే కూలోళ్ళు అక్కడ. వాళ్ళు నా చేనులోకి వచ్చేది. నేను బదులుగా, వాళ్ళ చేన్లకు బోయేడిది. అట్ల కలిసిమేల్సే వుండెటోల్లం.

## 11

### రాజకీయాల్ని ఎన్నడిడ్వలే

ఈ వ్యవసాయం పనులన్నీ చేసుకుంట, పిల్లల్ని సాదుకుంటనే జనరల్ ఉద్యమాలన్నిటా పని చేసినా. నేను మంచి స్పీకర్‌నని పేరున్నది. నా ఉపన్యాసాలకు ప్రజలు బాగ స్పందించెటోళ్ళు. అందుకనే ప్రతి సందర్భంలోనూ నన్ను పిలిచేది పార్టీ. చైనా యుద్ధం సమయంలో చాలా మంది నాయకులను అరెస్టు చేసిన్రు. ఇది మనకు కష్టకాలం. నీకెన్ని సమస్యలున్నా సరే ఫ్రంట్‌కు రావాలె, నీ పాత్ర చాలా అవసరం, నీ గొంతు విప్పాలె, అని పార్టీ నుండి లెటర్ వచ్చింది.

అప్పుడు మా చిన్నోడికి రెండు సంవత్సరాలు. నంబూద్రిపాద్ ఖమ్మం వస్తున్నడు. పౌరహక్కుల గురించి ఉద్యమం మొదలయింది. పెద్ద సభ పెట్టిన్రు. చిన్నోన్ని భుజానేసుకొని పోయిన. చలికాలం, దుప్పటి కప్పుకొని జనంలోకి పోయి కూర్చున్న. స్వరాజ్యం ఎక్కడున్నా స్టేజి మీదికి రావాలని పిలిచిన్రు. పిలగాన్ని స్టేజి మీదనే అడ్డం

పడేసి ఉపన్యాసం ఇచ్చిన. పౌరహక్కుల గురించి ఆమె ఉపన్యాసం ఇచ్చిన తీరుకు, ఆమె రూపానికి ఏం సంబంధమే లేదు – ఎంత పవర్‌ఫుల్‌గ మాట్లాడింది, అని మెచ్చుకున్నరు.

ఇందిరాగాంధీని గురించి ఎత్తుకొని చెప్పిన కొన్ని విషయాలు. అప్పుడంత ఆమె గురించి కాంగ్రెసోళ్ళు బాగా ప్రచారం చేసుకుంటున్నరు. లంబడోళ్ళ గుడిసెలకు పోయి తెడ్డు తిప్పిందని, లంబాడి మహిళలెక్క వేషం వేసుకున్నదని గొప్పగ ప్రచారం చేస్తున్నరు.

దాన్ని గట్టిగ ఎదిరించి మాట్లాడిన నా ఉపన్యాసంలో ఉత్తిగ వేషం వేసుకొనుడు, లంబడోళ్ళ గుడిసెకు పోయి వాళ్ళు వండిన అన్నాన్ని తెడ్డుతోని తిప్పుడు గాదు, నీకు చాతనయితే ఈ పలుగురాళ్ళ చెలకల్ల పల్లేరుగాయలు ఏరుదం, రా! అని సవాలు చేసిన బహిరంగ సభలో. జనం నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. బాగా చప్పట్లు కొట్టిన్రు.

ఆ రోజుల్లోనే విజయవాడలో కూడ ఒక సభలో మాట్లాడినా. ఆడపిల్లల సమస్యల మీద మోటూరి ఉదయం గారు సభపెట్టి, నన్ను రమ్మని పిలిచిన్రు. ఆడపిల్లలకు పెండ్లి చేసి ఏదో ఇంత యిచ్చి వదిలించుకుంటున్నరు తల్లిదండ్రులు. ఆ తరువాత దాని బాధలు అది పడుతున్నది. కొడుకులయితె జన్మంత వదలకుండ పీడిస్తున్నరు. మన రెక్కల కష్టం కూడ దోచిపెడుతున్నం వాళ్లకి. అందువల్ల ఆడపిల్లలను భారమనుకోవడం సరైంది కాదు అని మాట్లాడిన. ఉదయం గారింట్లో అన్నం తినడానికి ఏర్పాటు చేసిన్రు. అన్నం తింటున్నప్పుడు ఆమె బాగ మెచ్చుకున్నది నా ఉపన్యాసాన్ని. ఎట్ల చెప్తవు ఈ మాటలన్నీ, ఎందుకు వస్తయి ఈ ఆలోచనలు, నీ కొడుకులేమన్న ఇబ్బంది పెడుతున్నరా? అని అడిగింది. అవేమీ లేదు. నా కొడుకులు ఇంకా చిన్న పిల్లలే. వాళ్ళను గురించి ప్రత్యేకంగా చెప్తలేను. లోకంలో మనస్తత్వాలు అట్లున్నయి, అని జవాబిచ్చినా. జనాన్ని ప్రతిచోటా పరిశీలించటం, అర్థం చేసుకోవడం చేసేదాన్ని.

పౌర హక్కుల ఉద్యమంలో పనిచేసినప్పుడు కూడ పోలీసుల నుంచి సమస్యలున్నయి. ఒకసారి నా ఇంటికొచ్చిన్రు. ఇంటికి తాళమేసి, జప్తుచేస్తమని వచ్చిన్రు. ఇంటి ముంగట రాళ్ళు పోగుపెట్టిన. నా మీద వారెంట్ వుంటే నన్ను అరెస్టు చెయ్యి, కేసుపెట్టు. నా ఇల్లు జప్తు చెయ్యడానికి నీకేమి అధికారమున్నది, అట్లాంటి పనులకు పూనుకుంటె ఈ రాళ్ళతోని తలకాయలు పగలగొడ్తనని ఎదురు తిరిగిన. కొంతసేపు గొడవపడి, వెళ్ళిపోయిన్రు.

ఏడున్నా ఎక్కడికక్కడ జనాన్ని కూడగట్టి, వాళ్ళ సమస్యలపై పోరాడుతూనే ఉండేదాన్ని. అందుకే ప్రజలు నన్ను వాళ్ళలో ఒక మనిషిగా చూసుకున్నరు.

ముగ్గురు పిల్లలు నాకు. ఇద్దరు కొడుకులు, ఒక బిడ్డ. మంచిగనే చదువుకొని సెటిలయిన్రు. కాని వాళ్ళు చిన్న పిల్లలుగ ఉన్న కాలమంతా చాలా కష్టపడ్డాం. చాలా

దరిద్రాన్ని అనుభవించాల్సి వచ్చింది. వాన పడిందంటె గుడిసెంత కారుతుండె. పిల్లలను గుండెల పెట్టుకొని మీద గొంగడి కప్పుకొని కూర్చుండేదాన్ని. నీళ్ళకు కరువుండె. తాగటానికి నీళ్ళు కూడ రాత్రిపూట కాల్వనుండి తెచ్చుకునే దాన్ని. పగటిపూట తెచ్చుకోవాలంటే రైతులు రానియ్యరు. అట్లాంటి పరిస్థితుల్లోనే వ్యవసాయం చేసినా. చిన్న చిన్న అవసరాలకు కూడ కష్టపడాల్సి వచ్చింది. పేపర్ తెప్పించుకోవాలన్నా డబ్బులుండేటివి కాదు. పిల్లలను చదివించటానికి కూడ చాల కష్టమయింది.

మా అమ్మ తల్లిగారోల్లు బాగా ధనవంతులు. బంగ్లాలల్లో వుండేది. అట్లాంటామె పెళ్ళయినంక. ముందు మా నాయిన గూడ ఇల్లుగట్టలే. చిన్న ఇంట్ల వున్నది. తరువాత మా నాయన ఇల్లు గట్టడం మొదలు పెట్టినంగ, అది పూర్తికాక ముందే చచ్చిపోయిండు. మా అమ్మ తండ్రి వచ్చి చూసి, మా మేనమామను పంపించి, మా సొమ్ములతోనే గానీ, మంచి బంగ్లా కట్టించిండు. మా తాత బంగ్లా అయితే, మంచి జోరుగుండేది. ఆ స్థాయి అయితే మా నాన్నావాళ్ళకులేదు. మా అమ్మ డెబ్బయి రెండేళ్ళ వయసులో చనిపోయింది. ఆ లాస్టు దశలో రెండేళ్ళు నేనే సాదిన మా అమ్మని. మా అమ్మనేగాదు, మా అక్క గూడ ఆ గుడిసెలోనే నా దగ్గర్నే వున్నది కొంతకాలం. అక్కడే వడ్ల గుమ్ములుండేటివి. అక్కడ వడ్లు బోసుకుంటే, మా అమ్మకి పండుకో రాకపోయేడిది. ఎట్లనే, ఎట్లనే అంటే దేరావేసిన, కందికట్టెలు కట్టి. తరువాత తాటికమ్మల గుడిసె ఏసిన. మా అమ్మ పెద్ద బంగ్లాలలో వుండేది. అంత బాగా బతికిన మా అమ్మను తీసుకొచ్చి గీ గుడిసెల పెట్టాల్సి వచ్చేనే అని, నేను ఫీల్ అయి ఏడ్చేది. చాలా పావురంగ జూసేడిది మాయమ్మను నేను. మా తమ్ముడు అమ్మ విషయంలో కొంత సహకరించిండు. తమ్ముని భార్య అమ్మని వాళ్ళ ఇంట్లోనే ఉంచుకుంది కొంతకాలం. మంచిగనే చూసేది. కానీ తర్వాత ఆమె వల్లగాలేదు. మా అమ్మ పేరు మీద రెండెకరాల చెల్క వుండేది. అది అమ్మి ఆ డబ్బు తీసుకొచ్చి నా చేతికిచ్చి "అక్క నువ్వే అమ్మని సవరించవే ఇంక" అన్నడు. మా అమ్మ స్థితి చూసి, చాలా బాధపడ్డా నేను.

చాలా కాలం గడిచింది. వ్యవసాయం గూడా చేతికందింది. ఒకసారి బసవపున్నయ్య, జగదాంబ బొంబాయి మీటింగ్‌కు పోతున్నరు. బొంబాయిలో ఆలిండియా కాన్ఫరెన్స్ జరుగుతున్నది. అప్పటికి పార్టీ విడిపోవడానికి వచ్చిందిగద. వాళ్ళు పోతా, పోతా నా సలహా అడగనీకి నా గుడిసెకి వచ్చిన్రు. అప్పుడు వి.ఎన్. లేడు. ఆయన రాష్ట్ర కమిటీలో వున్నాడు. వాళ్ళు పరిస్థితి ఇట్లున్నది పార్టీల అని చెప్పిన్రు. అప్పటికి కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాలు చేస్తూనే వుంది గ్రామాలలో. భూస్వాములను వెతికితెచ్చి వారికి భూములు అప్పజెబుతూనే వుంది. కమ్యూనిస్టు పార్టీ క్యాడర్ పైన దాడులు, చంపటాలు జరుగుతూనే

వున్నాయి. గ్రామాల్లో ఊచకోత కోస్తునే వున్నారు. రాయలసీమలో లాగా గ్రామాల్లో ఘర్షణలు జరుగుతూనే వున్నాయి. గ్రామాలలో సర్పంచ్ పదవులు మనకే అంటే, కంకీ కొడవలి గుర్తుకే వచ్చినయి. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ సి.పి.యం.గా చీలిపోతే, ఒకే పార్టీ అన్న భావం దెబ్బతింటే, శతృవుకి అలుసైతం. అందువల్ల చీలిపోయే వ్యవహారం చేయకండి అన్న. ఏమైనా సరే. మెజారిటీ వస్తే, ఆ మెజారిటీ నిర్ణయం ప్రకారమే మనం వెళ్ళడం మంచిది. ఉద్యమాన్ని ఈ పరిస్థితుల్లో నిలబెట్టడం కష్టమైతది. సి.పి.ఐ. పాలసీతో నాకు అంగీకారం లేదు అని చెప్పిన. ఐనప్పటికీ, టైం కావాలి. మనం మన ఆత్మరక్షణ కోసం ఏర్పాట్లు చేసుకున్నంకే ముందుకు పోవాలి అనేది నేను. అప్పటి నా ఊహ ఏమంటే, మల్ల మన దళాలను, రహస్య దళాలను మనం ఏర్పాటు చేసుకోవాలన్నదే నా ఆలోచన.

ఆ రాత్రి మా ఇంటికి వచ్చిన వాళ్ళు అక్కడ పరిస్థితి చూసి, బాగా ఆశ్చర్యపోయారు. దీపం లేదు. కుంపటిలాగ కప్పుతం నిప్పును. ఆ కుంపటేం వెలింగించేదికాదు. బాలాజీ అని సి.ఐ.టి.యు నాయకుడొకాయన బసవ పున్నయ్యతోని కలిసి వచ్చిండు. ఆయన సిగెరెట్ లైటర్ వెలిగించిండు. అది కాస్సేపే. కానీ చీకట్లో మాట్లాడడం ఎట్ల. బయటకు బోయి కుసుందామంటే అమావాస్య. చివరికి ఏదో ఎక్కబుడ్డి (బుడ్డీదీపం) ఎతికి, అది దొరికితే దాన్ని వెలిగించి కూసున్నం. అప్పుడే వర్షం వచ్చి వెలిసింది. ఆ వర్షంలో ఏ పొజిషన్‌లో వున్నాను నేనంటే ఇట్ల వొళ్లో ఒక పోరగాడు. చంటోడు నాగర్జును. ఆ పక్కకొక పిల్ల. అప్పుడు మా ఆయన అమ్మమ్మ లేదింట్ల. ఊరికిబోయింది. ఈ పక్కన ఇంకొక పిలగాడున్నడు. గుడిసె కురుస్తున్నది. నవారు మంచాలుండె. ఆ మంచం కిందినుండి ఒక కర్ర నిట్రాడులా పాతి, దాని మీద గొంగడేసిన. అంటె, గుడిసెలోనే ఇంకొక గుడిసె అన్నమాట. మంచం వరకు వర్షపు నీరు క్రింద బడకుండ. అది జూసి వాళ్ళు, “ఇగ నీతోని ఏం మాట్లాడలనో, మేం నీతోని మాట్లాడి సలహాదీసుకోని పోదుమని వచ్చినంగానీ, అర్థమైతలేదు. నువ్వు ఏ లోకంలో వున్నవో. ఏందీ సంగతి” అన్నరు. “ఏం లేదు మాట్లాడండి. ఇంకా బుర్ర వుంది రాజకీయాలలోనే. ఎప్పుడు దుంకుదునా అని నేననుకుంటున్న” అన్నాను నేను. అప్పుడు మాట్లాడిన్రు వాళ్లు.

రాజేశ్వరరావు, బసవపున్నయ్య చాలాసార్లు కూర్చుని అన్నయ్యను నన్ను అడుగుతుండేవాళ్ళు ఏం జేస్తే మంచిదని. అన్నయ్య తీవ్రవాది (నవ్వు). ఆయన కన్నా కొద్దిగా బాలెన్స్‌డ్ నేనే. నాకు ఎప్పుడూ ప్రజలే గుర్తుకొస్తరు. ఆ జనం మెచ్చుతరా ఇది లేదా అని ఆలోచిస్త. జనం నాడి, జనం ఆలోచన ఎప్పుడూ వుంటాయి నాకు.

పార్టీలో చీలిక ప్రారంభమైంది. ఒక సంవత్సరం తరువాత సి.పి.ఐ (యం) పార్టీ ఏర్పాటైంది. కాంగ్రెస్‌తో కలవాల్నా వద్దా అన్నది. అట్లా కలవడం అంటే, వర్గ పోరాటాన్ని

వదులుకోవడమే. అది గూడా వదులుకున్నాక, భారతదేశంలో వెలిగించిన ఈ చిరుదీపం గూడా వెలిగే పరిస్థితి లేదు. నేనైతే ఇంకా చాలాకాలం ఆయుధాలు పట్టుకోవాల్సి వస్తుందనుకున్నా. ఆయుధాలు కొండగుహల్లో దాచి వచ్చినం ఆనాడు. అన్నీ ఒప్పజెప్పలే. అప్పుడు మన పరిస్థితి ఎట్లున్నదంటే, మన చేతిలో ఆయుధం లేకపోతే, ఊచకోత గోస్తున్నడు శత్రువు. కాల్చేస్తున్నడు. పోరాటం మనం ఆపినం అన్న తరువాత గూడ కాల్చేస్తూనే వున్నరు అప్పుడు. అందువల్ల మన ఆత్మరక్షణ కోసం గూడ ఆయుధం ఉంచుకోవాల్సి వస్తున్నది. ఒక పిస్టల్‌ను పట్టుకొచ్చిన నేను. కొత్తగూడెంలో మా అమ్మగారి ఇంటికాడనే. పెంటగడ్డలో దాచిపెట్టిన. చివరికి మా తమ్మునికేదో ప్రమాదం వస్తే వాడిని తీసుకోమని ఇచ్చిన. ఏమున్నది. ఇదే ప్రమాదం. మా తమ్ముడు గూడ ఇండ్లనే ఉన్నడుగద. వాడు ఇంకెవరో క్యాడర్‌కి ఇచ్చిండు. వాళ్ళేమో ఒక భూస్వామిని చంపుదామని మాటు బెట్టిన్రుగానీ, చివరికి ఫెయిలైంది. అయితే, ఆ భూస్వామి వాళ్ళే, ముందుగాల వీళ్ళను గుర్తుబట్టి ఎంటబడితే పారొచ్చిన్రు. ఆ పిస్టల్ పారేసి, పరిగెత్తిన్రు.

ఎమర్జెన్సీ కాలంలో వి.ఎన్. అండర్ గ్రౌండ్‌లో వున్నడు. ఇట్ల పన్నెండో, పదిహేనేళ్ళో అండర్‌గ్రౌండు జీవితమే గడిపిండాయన. ఆయన లైఫ్ అంతా అట్లనే గడిచింది. ఎన్నడూ తన గురించి చెప్పుకునేటోడు గాదు. ఒక పూలదండ ఎవరైన ఏయబోతే, ఏపించుకునేటోడుగాదు. ఒకటే జత బట్టలు సంచిల. అవి పిండుకోవడం, మల్ల గట్టుకోవడం. ఎక్కడ నిర్మాణం బలహీనంగవుందో, ఎక్కడైతే కామ్రేడ్స్‌కి ప్రమాదం వుందో అక్కడికి బోయి నెలలు నెలలు వుండేది. మిర్యాలగూడాలో మూడేళ్ళున్నాడు. అక్కడ కాంగ్రెస్ గుండాల నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడి, అక్కడే ఆఫీసుగట్టించి, సుందరయ్యను బిలిపించి పెద్ద సభపెట్టి, జెండా ఎగరేసి వచ్చిండు. ఎమర్జెన్సీలో దొరకలేదతను. మా ఊర్లో ఒక కరణం ఆయనను దానమడిగితే భూమి దానం జేసిండు. ఆయన అక్కడే పిల్లల కోసం బడి గూడ పెట్టించిండు. ముత్రాసోల్లతోని సొసైటీ బెట్టించిండు. రైతులకు కూడా ఒక సమితి, ఎరువులు, విత్తనాలు, వీటి ఏర్పాటు కోసం ఉద్యమాలు ఆయన నడుపుతూ వచ్చాడు. ఒకసారి మా పిల్లలు ఊర్లో బడిలో వుంటే వి.ఎన్.ను పట్టుకోవడం కోసం పోలీసులు వచ్చి, పిల్లలకి చాక్లెట్టిచ్చి మీ నాయన ఎక్కడున్నడో చెప్పమని అడిగిన్రు. వాల్లకేమెర్క ఆయనెక్కడుంటడో.

ఈ కాలంలోనే ఇక్కడ ఐదెకరాల భూమి అమ్మి, సోమారం కాల్వకాడ, కొంత భూమిగొన్న. బండ్లమీద నాగళ్ళేసుకోని, జీతగాళ్ళను తీస్కపోయి అక్కడ దున్నించిన. నాటుబెట్టి, నెల రోజులున్న అక్కడనే. దోసకాయలు పండించిన. మా జీతగాని భార్య,

నేను దోసకాయలు బండిమీదేసుకోని పోయేది. ఆమెనేమో అమ్ముకొచ్చి పైసలిచ్చేది. అక్కడుండే మన కామ్రేడ్స్ కూడా వండి పెట్టేడిది నాకు అప్పుడప్పుడు.

"ఓ రామ ఎక్కడి గోల. ఇట్ల జేస్తుందేమి ఈమె" అనేటోలు కొందరు. నాకేమీ చిన్నతనం అనిపించలేదు. ఉన్న కుటుంబంలోనే పుట్టినగానీ, ఆ జీవితం అనుభవించలేదు నేను. అందుకని ఆ సెంటిమెంటు అంతగనం రాలేదు నాకు. కష్టాలు పడలేక ఏడ్చిన. కానీ, నామోషీ అనిపించలే. ఏ పనైన జేసిన. అక్కడ ఆ ఊర్లో ఉన్నవాల్లందరూ కష్టపడుతున్నరు. కష్టపడకుండ కూసోని తినేటోల్లు ఎవరూ లేరు. అక్కడ బంగ్లాలలో వుండేటోల్ల ఇండ్లలోని ఆడవాల్లు సద్ది గంపలు నెత్తిన బెట్టుకుని శుభ్రంగా పనికిబోతరు. వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటరు.

నా ఈ భూమి అడవిల మూసీ ఒడ్డున వున్నది. అక్కడొక గుడి వుంది. ఎనకటగట్టింది. ఎవరూ పూజారులు లేరు. ఆ గుడిలోనే పొయ్యి, అక్కడనే వంట. మంచిగ మూసీలో ఈత. ఈతొచ్చు నాకు. బాగా ఈదేది. ఎంజాయ్ చేసేడిది. తోడు మనిషి వుంటే చాలు. జీతగాని భార్య వుందిగద. ఆమె వొండుతది. వాళ్ళు దళితులే. ఆ భూమి దున్నాలంటే అక్కడే పది పదిహేను రోజులుండాల్సి వచ్చేది. జీతగాడు, ఆయన భార్య, నేను మేం ముగ్గురం బోయేది. అక్కడ నుండి తిరిగిరావాలంటే నడిచి, నడిచి నేరేడు జర్ల దాక వచ్చి అక్కడ ఏదో ఒక బస్సు పట్టుకొని రావాల్సివచ్చేది. అట్లా ఆ భూమి సాగు కోసం మా అమ్మాయి పెండ్లయ్యేదాకా పోయివస్తుండేది. చెట్లు జూస్తే పాటలొచ్చేడివి నాకు. మల్ల జూడనైతినా అడవులను అని ఎన్నాళ్లు బాధపడ్డనో. ఆ వరంగల్ అడవులల్ల పెద్ద పెద్ద చెట్లు. పాటలు ప్రతిరోజూ పాడేదాన్ని. జీవితంలో బాధ, ఏడుపుగూడా పాటలతోనే ఎల్లబోసేది నేను. ఒకసారి వరంగల్‌లో బంధువుల ఇంటికి పోవలసి వస్తే, దారిలో అడవి కనబడితే ఒక్క రోజన్నా అక్కడ వుండిపోదాం అనిపించింది. అప్పుడు కూడా గోదావరిలో ఈతకొట్టేది నేను, అది ఉధృతంగా వచ్చినప్పుడు తప్ప. వి.ఎన్.గారికి కూడా ఈత బ్రహ్మాండంగా వచ్చు. గోదావరిలో ఇద్దరం ఈతకొట్టాం. ఆయన ఎప్పుడన్నా చూడటానికి వచ్చేది గుడికాడికి. అక్కడ కూడా మూసీలో ఇద్దరం ఈతలు కొట్టినం. ఆ అడవిల నన్ను చూసినోళ్ళు ఆయనకి చెప్పిపంపేదట. "ఓదేవుడ, గా స్వరాజ్యంగారు అక్కడనే గుడి కాడ వుంది. అక్కడ భూమితో గెరిల్లా పోరాటం చేస్తున్నట్లుందని" చెప్పేవారట ఆయనకి. నేను నవ్వుకునేది.

"ఆ పని లేకపోతే నువ్వసలు ఉండలేకపోదువు" అనేది ఆయన తరువాతి కాలంలో. ఇట్లా వ్యవసాయం చేస్తున్నాననే గానీ, మహిళా సంఘంలో ఉపన్యాసం ఇచ్చేందుకు మధ్యమధ్యలో పిలుస్తుండేది.

కాట్రగడ్డ శ్రీనివాసరావు ఇంటి ముంగల, మొత్తంగా మహిళా సంఘం సంస్కరణలు, అవీ, ఇవీ అని మాట్లాడుతుంటే, అప్పుడేమో నేను, ఆడపిల్లలుగాదు. మగపిల్లలు మనకు జన్మ ఖైదు అనేడిది. ఇట్లా బహిరంగసభలో ఒకసారి చెబితే, కాట్రగడ్డ శ్రీనివాసరావు నా దగ్గరికొచ్చి "భలే విశ్లేషణ చేసినవమ్మ నువ్వు, ఎందుకు? ఎందుకట్లన్నవ్" అన్నడు. "ఆడపిల్లనా ఏ పదిహేనో, పద్దెనిమిదేళ్ళో సాది ఓ అయ్యకి అప్పజెప్తం. ఈ మొగ పోరగాల్లని సెటిలైనంతదాకా సాదాలె. ఆ తర్వాత, అన్ని సంపాదించి పెట్టినవి ఇయ్యాలె" అన్న.

మా పెద్దబాబును మా అమ్మ దగ్గరికి పంపిస్తే, అక్కడ దగ్గర్లోనే, తుంగతుర్తి దగ్గర ఒక ఇంట్లో ఉన్నడు చదువుకోవడానికి. పిల్లల చదువులను వి.ఎన్. గారే చూసుకున్నరు. మా అమ్మ సహకారం తీసుకోవడం, ఊర్లో పంతుళ్ళని పరిచయంజేసుకోవడం, అంత ఆయనే జేసిండు. పెదబాబు గౌతంను డాక్టరు చదువు చదివించాలని ఉండేది. మేం చదివించలేకపోయినం. పేదరికం నుండి బయట పడలేక పోయినం. చివరిదాక అంతే. పంట తేలింది. తినగలిగినం కానీ, బియ్యం దొరకలేదు. ఊర్లో షావుకార్లున్నరు. బియ్యం అమ్ముతరు. కానీ మనకియ్యరు. కొనగలగాలి కదా!

మొదలు మేం ఊర్లోకి వచ్చినప్పుడు పరిస్థితి ఎట్లుండెనంటే మేం తుపాకులు బట్టుకోని పోరాడి వచ్చినోల్లమని అందరికి తెలుసు. ఏమన్న అంటే మమ్మల్ని కూడా కొడతారేమో వీళ్ళు అన్నట్లు భయపడేవాళ్ళు. మేం సెటిల్ అయిన ఊరు ఉద్యమం ఉన్న ఊరు గాదు. సూర్యాపేటకు దగ్గరగ వున్నది అంతే. మేం ఇద్దరం ఊరికి కొత్తవాళ్ళం పూర్తిగా. అయితే కమ్యూనిస్టులుగా అదివరకే పేరెల్లి వున్నవాళ్ళం. ఊర్లో రెండు షావుకారు కుటుంబాలున్నాయి. వాళ్ళు మాకు అప్పు ఇవ్వడానికి, పది రూపాయలివ్వడానికి కూడా భయపడ్డారు. మేం కూడా ఎవరినీ అడగలె.

సరే, నేను మన వల్లగాదు వద్దంటే వి.ఎన్.గారు వినలే. పెద్దోడు గౌతమ్‌కి డాక్టర్ చదువుకోసం కన్నా, ఇంజనీరింగ్ చదువుకి మార్కులొచ్చినయి. దాసు అని ఒకాయనుండె మనకి పరిచయమే. ఆయన ఆర్గనైజరే. ఆంధ్రా నుండి వచ్చి ఇక్కడ కాలేజి పెట్టిండు. మా అన్నయ్య కొడుకును చేర్చిన్రు. అక్కడకు పోయి ఆయన్ని అడిగితే, సరే అని చేర్చుకున్నడు. వి.ఎన్.గారొచ్చి వాడిని అక్కడి నుండి ఊడబీకి డాక్టరు పరీక్ష రాయించిండు. ఎంట్రన్స్ రాయిస్తే వానికి రాలేదు సీటు. కానీ హోమియోలో వచ్చింది. చదివిండు. అప్పుడు హోమియో మందులు ఎవడుదింటున్నడు? ఆ తర్వాత మా కొడుకుకి హోమియో దవఖానాలో గవర్నమెంటు ఉద్యోగం వచ్చింది. మిర్యాలగూడ దగ్గరనే. ఆయన భార్య లెక్చరర్‌గా పనిచేసేది. వాళ్ళిద్దరూ ఇప్పుడు రిటైర్ అయ్యారు. వాళ్లకి ఒక ఆడబిడ్డ, ఒక కొడుకు. ఆ పిల్లల పెండ్లిల్లు గూడ అయిపోయినయి.

ఇంకో బిడ్డ కరుణ, ఆమెను కూడా డాక్టర్ చదివించాలని వి.ఎన్. ప్రయత్నం జేసిండు. కానీ కొన్ని మార్కులు తక్కువ వచ్చినయి. మూడువేలు గడితే కాకతీయాలో సీటు దొరకు. మా దగ్గర పైసలెక్కడివి. భూమి అమ్ముకుంటే పైసలొచ్చేవి. ఫీజు కట్టేవాళ్ళమే. కానీ భూమి అమ్ముకుంటే బతుకుడెట్ల. అందుకని నేను ఆలోచన జేసి, డాక్టర్ వద్దు, ఏమొద్దు, బియ్యేస్సీ చదువు. అని బియ్యేస్సీ చదివించిన. బియెస్సీ అయినంక ఆమెకి ఫీల్డ్ ఆఫీసర్‌గ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగానికి పంపుదామనే అనుకున్నం. కానీ, ఇంతలో మా బంధువులే, పిల్లవాడు ఇంజనీరు. వాళ్ళు చేసుకుంటామంటే ఇచ్చి పెండ్లి జేసినం. మళ్ళీ పరీక్షలు రాస్తే, కరుణకి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఆమె చాలాకాలం పనిజేసి, రిటైర్ కూడా అయింది. నా పిల్లలే ముసలోల్లయిన్రు. నాకు ఇప్పుడు ఎనభయి ఆరేళ్ళుంటాయి.

ఇంకొక కొడుకు నాగార్జున్. లా చదివిండు మా ఆయనకి లా మీద ఇష్టం. ఆయనకి ఇష్టమున్న చదువులు చదివించిండు. అదొక్కటే ఆయన జేసింది. వాడిప్పుడు తంటాలు పడుతున్నడు. ఏం సంపాదించే పరిస్థితిలో లేడు. ఆయనిప్పుడు హోల్‌టైమర్‌గానే ఉన్నడు. ప్రాక్టీసాపాడా! నల్గొండలో, సూర్యాపేటలో చేస్తడు. ఆయన కింద ఇద్దరు లాయర్లను పెట్టుకున్నడు. సూర్యపేటలో ఆర్గనైజ్ చేస్తడు. ఇల్లుగూడ అక్కడనే ఉంది.

మా పెద్దోడు గౌతం రిటైర్డ్ అయినంక, సి.ఐ.టి.యులో పని చేస్తున్నడు. పెద్దకోడలిది తేలప్రోలు, ఆంధ్రా. రాజకీయాలు అస్సలు లేవు. వీళ్ళందరికీ ఇదేం పిచ్చో అంటది (నవ్వు). చిన్న కోడలు మాత్రం ఇందులోనే వుంది. పెళ్ళప్పటికి టెన్త్ పరీక్షలిచ్చింది. ఆ తరువాత ఇంటర్ పూర్తికాకుండానే పెళ్ళయింది. పిల్లలను కనకుంటనే చదివింది. దాని చదువుకి నేను కూడా ఎంబడిపడ్డా. దానికి పరీక్షలున్నప్పుడు నేను గూడా పోయేది పిల్లగాల్లను పట్టుకోవడానికి. ఇంటర్ అయినంక లా చదివింది. వి.ఎన్.గారు పన్నెండేళ్ళు చిన్న కొడుకు నాగార్జున్ దగ్గర్నే వున్నరు. చిన్నకోడలే సవరించింది. వి.ఎన్.గారికి చదువులంటే చాలా ఇష్టం. చాలా మంది పిల్లల్ని తీస్కపోయి, వాళ్ళ తమ్ముళ్ళకి అప్పగించి, చదివించేవాడు.

కష్టం వచ్చినప్పుడు ఎట్లా అంటే వి.ఎన్ చెప్పేది. "మార్గం ఎంచుకున్నప్పుడు వుండాలి. తరువాత మాట్లాడొద్దు" అనేది. "నాకు లైఫ్ గురించి ఐడియాలేదు" అని నేను ఎప్పుడన్నా అంటే. "ఏం ఐడియా లేకుండనే ఇంత ఉద్యమంలో ఇంత పాత్ర తీసుకున్నవా?" అని. ఇంకోమాట గూడ అనేది. "నువ్వు ఏం చేస్తున్నవో అదే నీ ఐడియా" అని.

ఈ దరిద్రం అనుభవించటంతో మా పిల్లలు భయపడిపోయిన్రు. ఉద్యమంలోకి వచ్చి పని చెయ్యాలంటే ఆ కాలంలో దడిసి పోయిన్రు. వాళ్ళను ప్రోత్సహిస్తే కొంత

కాలానికి నిలబడే వాళ్ళేమో. కానీ, వాళ్ళు సిద్ధం కాకుండ బలవంతం చెయ్యడం మంచిది కాదన్పించింది.

మా అమ్మాయిని ఎవరన్నా ఒక ఫుల్‌టైమర్‌కిచ్చి చేస్తే బాగుంటుందనుకున్నాం. కట్నాలిచ్చి పెండ్లి చేసుడు మాకిష్టం లేదు. అందుకని కొన్ని సంబంధాలు ఎత్తి పోయినై. పార్టీ వాళ్ళయితే కట్నం లేకుండ చేసుకుంటరు కదా, అని ఆలోచించినం. కానీ మా అమ్మాయి ఇష్టపడలే. మీ జీవితం చూసినగదా, అంత కష్టపడుడు నాతోని కాదని చెప్పింది. చివరకు పార్టీ సానుభూతి పరుల కుటుంబంలో కుదిరింది. వాళ్ళు దండల పెళ్ళికి ఒప్పుకోవటంతో మాకు కూడా ఇబ్బందన్పియ్యలే. మా అమ్మాయి నా లెక్కనే బాగా మాట్లాడగలదు. ఏదన్న విషయాన్ని మంచిగ వివరించి చెప్పగలదు. ఉద్యమంలోకి వస్తే మంచి స్పీకర్ అయ్యేదికదా, అన్పించేది. కానీ ఆమె ప్రిపరేషన్ లేకుండ బలవంతపెట్టలేం.

# 12

## మహిళా సంఘం

1978లో ఎమ్.ఎల్.ఎ.గ అయితే, మహిళా ఉద్యమంలో అధ్యక్షురాలిగా 1981లో అయిన. 2002లో మహిళా సంఘం అధ్యక్షురాలిగా దిగిపోయిన. ఇరవయి ఏళ్ళు రన్నింగ్ ఉద్యమం నడిపిన. నాకైతే ఈ విషయంలో విపరీతమైన సంతృప్తి. మహిళా ఉద్యమం చేసి ఆస్తిహక్కు సంపాదించినం స్త్రీలకి. ఓ పది డిమాండ్లు పెట్టి ఉద్యమాలు చేసినం. దానితో ఈ చట్టం కూడా ఒకటి. నర్సింగ్ స్కూళ్ళు జిల్లాకొకటి కావాలని డిమాండు చేసినం. నేను ఎమ్.ఎల్.ఎగా అయిన ఫస్టుఫస్టే, రమేజాబీ కేసుపట్టిన. ఈ కేసులో న్యాయం కోసం ఆంధ్రదేశమే స్థంభింపజేసినం. అసెంబ్లీలో నా వాయిస్ వినిపిస్తే, చెన్నారెడ్డి “మాటలు తూటాల లెక్కన ఎక్కువపెడతవ్. ఇది బహిరంగ సభేంగాదు. ఎందుకంత ఆవేశపడతవ్” అన్నడు.

అసెంబ్లీ ప్రారంభమైన పదిహేడోరోజు జరిగింది రమేజాబీ ఘటన. కల్లు రామచంద్రారెడ్డి అని మన కార్యకర్తున్నడు గద. ఆయన ఇట్ల జరిగిందనొచ్చి చెప్పిండు. సరే పోదాం పా, అని అర్ధరాత్రిపోయిన పోలీసు స్టేషన్‌కు. ఆమెతో మాట్లాడి, ఆసుపత్రికి తీస్కపోయి పోలీసు కేసు పెట్టమని అడిగితే పట్టించుకోలేదు. ఆందోళనకు దిగినం. సరే అసెంబ్లీల నేను మాట్లాడబోతే, మాట్లాడనిస్తలేరు. అప్పుడు ఎనిమిది మంది మహిళా ఎమ్.ఎల్.ఎ.లు అందరూ కాంగ్రెస్‌వోల్లే, వాళ్ళు ఆమెను మాట్లాడనీయండని పట్టుబట్టిన్రు. నన్ను బలపరిచిన్రు. అధ్యక్షుడు అప్పుడు మాట్లాడినిచ్చిండు నన్ను. ‘‘నన్ను మాట్లాడనీయకపోతే నేను కూర్చోను” అని అంటే, ఆ అధ్యక్షులు “సుందరయ్యగారికి

చెప్తాను" అనేది. ఎవరికి చెప్పిన, చెప్పకున్నా, ఆ కేసు విచారణ జరిగే వరకు కొట్లాడతామనేది. ఓంకార్ కూడా వున్నాడు గద. అసెంబ్లీలో రమేజాబీ కేసును హైలెట్ చేసినం. బందు గూడా జరిగింది రాష్ట్రంలో. అందరూ అందుకున్నరప్పుడు. అప్పుడు నాకు సంతోషం వేసిన సంగతేందంటే, మనోళ్ళే, అంటే వేరే సంఘాలవాల్లు, స్త్రీల హక్కులు, సమానత్వం అంటూ మొదలుపెట్టిన్రు. వాళ్ళు పెట్టిన ఒకటి రెండు మీటింగులకు నేను కూడా హాజరైన. అప్పుడు నా మీద విమర్శ ఏందంటే, వీల్లు ఫెమినిజం, అదీ, ఇదీ అని అంటున్నరు. వాళ్ళతో పోవుడు మంచిదిగాదని ఒక పక్క అనేది. ఇంకో పక్క అంతా సంచలనంగా ఉంది. నేను అనుకున్న "నేను పోవాలె. ఏం జరుగుతున్నదో పరిశీలించాలె" అనుకున్న, ఆ మీటింగులకు పోయిన.

మొదటి నుండీ నేను మహిళా సంఘాలలో వున్నా; అయితే ఉదయం గారు దానిపైన ఎక్కువ కాన్‌సంట్రేషన్ చేసేవారు. కాగా, పాలసీ మేటర్లు, డిమాండ్లు రూపొందించటం కార్యక్రమాలను రూపొందించటం వంటి వాటిల్లో నేనుండేదానిని. మళ్ళీ జనాన్ని సమీకరించాల్సి వచ్చినప్పుడు కూడా నేనే. ఒకసారి ఆల్ ఇండియా మహిళా సంఘంలో మిడిల్ క్లాస్ పీపుల్‌ని (మధ్యతరగతిని) సమీకరించటం ఇప్పుడు సాధ్యంకాదు. అన్నట్లుగా చర్చలు జరిగాయి. ఆ చర్చల్లో నేను పాల్గొని చెప్పిన అభిప్రాయాలు చాలా సూటిగా, ఖచ్చితంగా వుండి పనికొచ్చినయి. వ్యవసాయ కూలీ మహిళలు, కార్మిక మహిళలు వీరందరి సమస్యలతో మొదలు ఆర్థిక సమస్యలను పరిష్కరించాలె. వారికి రాజకీయ చైతన్యం ఇవ్వాలి. తరువాత సామాజిక సమస్యల్ని పరిష్కరించాలి. అంతేగాని, ఒక్క సామాజిక ఉద్యమంగానే, మహిళా ఉద్యమాన్ని ఉంచితే పనికిరాదు. అట్లనే ఒక్క వర్కింగ్ ఉమెన్ మూవ్‌మెంట్ అంటే కూడ పనికిరాదు అన్న. ఒక దశలో నిర్ణయానికి వచ్చిన్రు. ఆ లెక్కనైతే. సి.ఐ.టి.యు ఉమెన్ వర్కింగ్ ఉమెనే. యూనియన్‌ల ద్వారానే వాళ్లు ఆర్గనైజ్ గావాలె. కానీ, మహిళా సంఘానికి అది కార్యక్రమం గాదు అని చెప్పేసిన్రు. చెప్పడమంటే, చర్చల్లో ఆ జవాబు వచ్చింది. మిడిల్ క్లాస్ మహిళల సమస్యలని కూడా పట్టించుకోవాలి. కానీ వాళ్ళొక రిజర్వ్ ఫోర్స్‌వలె వుండాలి. సమయం వచ్చినప్పుడు మహిళా ఉద్యమానికి ఒక రూపం ఇచ్చేందుకు, బహుళ వర్గాల ఉద్యమంగా అది వుండాలి. ఈక్వాలిటీ సమస్యను వర్గదృక్పథంలో భాగంగా పాలసీలో ఇమడ్చాలి. ఆస్థిహక్కు, పనిహక్కు, సాధికారత, ఇలాంటి ఆర్థిక సమస్యలని మనం ముందులేపి, మధ్యతరగతి మహిళలను స్వతంత్రంగా నిలబెట్టేందుకు కృషి చేయాలి. అలాగే సామాజిక భావజాలానికి, అంటే, ఫ్యూడల్ భావజాలానికి వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో నుండే, వ్యతరేకంగా ప్రచారం, ఊరేగింపులు పోరాటాలు అన్నీ జరగాలి. ఆ ఫ్యూడల్ భావాలను మనం ఎదుర్కోకపోతే, వర్కింగ్

ఉమెన్ కూడా సఫర్ అవుతారు. ఇప్పటికీ స్త్రీలు దెబ్బలుతింటున్నరు. కష్టాల పాలు అవుతున్నారు. విడాకులు దండుగలు కడుతున్నరు.

ఒక సంగతి చెప్పాలె. తెలంగాణ పోరాట కాలంలో కూడా, మహిళల సమస్యలని పట్టించుకున్నం. పరిపాలనా, పంచ్ కమిటీలను ఏసినం. ఆ కమిటీలు ఏసేటప్పుడు, వాటిల్లో ఇద్దరు మహిళలను వేయాలని పట్టుబట్టినం మనం. పార్టీ అంగీకరించింది. స్త్రీలను పోరాట కమిటీలలోనూ, అట్లనే, పంచ్ కమిటీలలోనూ ఏసిన్రు. ఆ పరిపాలనా కమిటీ, ముఖ్యంగా ఈ సామాజిక సమస్యలను పరిష్కరిస్తూ వుండేది. చాలారకాల సమస్యలు మా ముందుకొచ్చేటివి. ఆనాడు రెండు, మూడు పెండ్లిల్లు చేసుకునే వారు మగవాళ్ళు. ఈ పెండ్లి చేసుకున్న ఆడవాళ్ళు. వాడికి కట్టుబడి వుండాలి. వాళ్ళు మరెవరినన్నా లైక్ జేసినా, ఇంట్ల నుండి బయటకెల్లినా, దెబ్బలు కొట్టుడు, బలవంతంగా హింసించుడు చేసేటోల్లు. ఇట్లా ఎక్కువమందిని చేసుకుని, ఆ ఆడవాళ్ళతో చాకిరీ చేయించుకుందురు. నిజానికి ఆ పెండ్లిల్లు ఎందుకు జేసుకునేడిదంటే, పనికోసం. కుటుంబంలో అప్పటి పని పద్ధతులకు తేడా వుంది కదా! అప్పుడు చాలా శరీరశ్రమ వుండేది. నీళ్ళు చేదాలి. వంటకాడ, చేన్లకాడ చాలా శరీరశ్రమ, కష్టం చేయాల్సివచ్చేది. బయట కూలీకి ఈ ఆడవాళ్ళు పోతే, కూలీ వచ్చేది. ఇగ ఎవని కన్నా ఇద్దరు పెండ్లాలున్నరంటే, దొర ఇంట్లొకరు జేసేది. బయటొకరు పనిజేసేది. ఇగ ఆడ మగవాడు గూడా ఒకదొరనే. ఇది సామాజిక సమస్య. ఇది ఎట్లరైటు కాదు. ఈ ఆడోల్లకి వుండటానికి ఇష్టం లేకుండే వాళ్ళని వెళ్ళిపోయేందుకు వదలాలి. అట్ల పరిష్కారాలు జేసేడిది. ఇట్ల చేస్తే దీన్ని కుల పెద్దలు, వాళ్ళ భార్యలు, మహిళల్లో కూడా మేస్త్రీలు, ఒప్పుకోకపోయేది. కులవ్యవస్థని ఒక పద్ధతిలో కొనసాగించేందుకు, మహిళలు కూడా యజమానులుగనే వుండేది. ఆ కాలంలో నేను తప్పించుకునేందుకు, చేతి గాజులు, కడేలు ఇచ్చినామె, గౌండ్లకులంలో పెద్దమనిషి. ఆమె కూడా, నాతో చర్చలుపెట్టేది. "ఏంజెప్తున్నవ్ నువ్వు. పుస్తెలు తెంచుకుంటబోతవా? ఎక్కడన్నా, దండుగ, గిండుగ లేదనంటే భయముంటదా? ఇది మంచిదిగాదు" అనేది. అప్పుడు కూడ నా పేరే ఎలదీసిన్రు. స్వరాజ్యం పంచాయితీలు చెప్పుకుంట వస్తున్నదట. పుస్తెలు తెంపుడే, తెంపుడంట అని ప్రచారం మొదలుపెట్టిన్రు. ఏందిది? పెద్ద రణరంగం సాగుతావుంటే ఈ సమస్యలేంది? ఇట్లయితే ఎట్ల అన్న చర్చలు గూడా వచ్చినయి. అయినప్పటికీ, ఆ సమస్యలన్నింటినీ సమన్వయం జేయవలసి వచ్చింది.

ఒకసారేమైందంటే, మేం అనంతారంలో దొరల మీద దాడిజేసినం. వాళ్ళు పారిపోయిన్రు. ఇంట్లో ఆడోల్లున్నరు. వారిని గౌరవంగానే బయటకు తెచ్చి, ఒక పక్కన నిలబెట్టినం. ఇంట్లకెల్లి గొడ్లను, ధాన్యాన్ని, అన్నీ బయటకుదెచ్చి, మొత్తం పంపకం జేసినం

జనానికి. వాళ్ళు వొడ్లు గంపలల్ల నింపుకున్నరు. ఆ తరవాత, ఆ ఇంటి అరుగు మీద నిలబడి నేను జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న. నా భుజానికి తుపాకీ వుంది. ఇంతలో ఒక గౌడామె నాదగ్గరికి వచ్చి "నాకు తుపాకి ఇయ్యి, తుపాకియ్యి నేను జూస్త" అన్నది. నేను ఇచ్చిన. దాన్ని పట్టుకోని "ఇగ నేను దళంలోకి పోతున్న. రాజక్క దళంలోకి పోతున్న నేను. నాకు నువ్వొద్దు. నీకు ఇంకొతి వుంది. ఆమెనుంచుకోని వుండు నువ్వు" అని జనం ముందే ప్రకటించేసింది. అట్ల రెండుమూడు చోట్ల ఆడోల్లు ఇంట్ల చెప్పకుండనే వచ్చి మాలోని గలిసేది. గిరిజనుల్లో ఒక సాంప్రదాయముంది. భర్తతోని వుండుడు ఇష్టంలేకపోతే, వాడిని వదిలి తనకి ఇష్టమైన వాని ఇంట్ల జొరబడతది ఆమె. ఇగ నాదొడ్లోకొచ్చిన దాన్ని నేను ఇడిసిపెట్టనని ఈడంటడు. పెద్దలు గూడ అట్లనే తీర్పు చేస్తరు. అందుకు దండుగలేస్తరు. వాళ్ళేతిని తాగుతారు. సరే, ఈ అనంతారంలో గౌండ్ల ఎంకటమ్మ ఇట్ల ప్రకటించేసరికి నేను అందరిముందే అడిగిన "ఏం సంగతి ఎంకటమ్మ? నువ్వు ఏంజేస్తవు" అని. "నేను తుపాకిపడత. నాకు గూడ శిక్షణగావాలి" అంది అప్పటికే ఊర్లల్ల మహిళలను మోటివేట్ చేస్తున్నం. శిక్షణ ఇస్తున్నం. వాళ్ళతో మార్చింగ్‌లు చేయించడం. పాకడం, ఎగరటం, తప్పించుకోవడం, అట్లనే ఊర్లో అందరినీ కూడగట్టడం, మాట్లాడడం, ఇట్లాంటి వన్నీ స్త్రీలు నేర్చుకుంటున్నారు. ఆమె ఇవన్నీ గ్రామదళాలలో జరిగేడిది చూసింది. కానీ మమ్ములను జూడగానే అప్పటికప్పుడు హుషార్లబడ్డది. ఆమె అట్ల అనంగనే. జనం గుసగుసలు మొదలుబెట్టిన్రు. "ఇక్కడనే ఇట్లుంటే, మల్ల పోలీసులొస్తరు. మీరు ముందుగాల ఇండ్లకుపొండి, ఎంకటమ్మా, నువ్వుగూడ మీ ఇంటికిబో. మీ ఇంటికి మల్ల నేనొస్త" అన్నగానీ, ఆమె మమ్మల్ని వదిలిపోతలేదు. అప్పుడు ఆ దగ్గరలోనే వున్న ఆమె ఊరికి నేను బోయిన ఆమె ఎంట. ఆమెను ఆమె ఇంటికాడ అప్పజెప్పి వచ్చిన. అయితే తెల్లారే గూడెం అంతా కూర్చున్నరట. అప్పటికి ఆమె వాళ్ళ గ్రామంలో గూడా కొంచెం లీడ్ చేస్తున్నది. అందరూ మాట్లాడుకున్నాక, పోతనంటుంది గద, ఇగ ఆమెని పోనిద్దాంలే అనుకున్నరట. అట్లా ఆమె దళ సభ్యురాలిగా వచ్చి చేరింది.

అప్పుడు అట్లుండేది. సరే, ఇగ మహిళా సంఘంలో వర్కింగ్ ఉమెన్, మధ్యతరగతి స్త్రీలకి కూడా వాళ్ళ సమస్యలు వారికున్నయి. బహుళ వర్గ సంఘంగా దీన్ని ఏర్పాటు చేయాలని అప్పుడు నిర్ణయానికి వచ్చినం. గోదావరీ పర్లేకర్ వంటి వాళ్ళున్నారు. ఆమె ఆదివాసీ, రైతు ఉద్యమాలతో వుంది మొదటినుంచీ. కాబట్టి ఆమెను రైతు సంఘంలోనే వుంచాలన్న మాట వచ్చింది. ఇగ కార్మికుల్లో మహిళలు అట్లనే వుండాల్నా అనే ఒక చర్చ వచ్చింది. కానీ, ఆఖరికి పార్టీ పొలిట్ బ్యూరోనే పంపింది పాలసీని. నేను కూడా ఎప్పుడో రాసిన. ఆంధ్రాలో మహిళా సంఘమే పునాదిగా, వర్కింగ్ ఉమెన్‌ను కూడా ఆర్గనైజ్

చేసేందుకు, అప్పటి ఆంధ్రమహాసభలో కూడా నిర్ణయించిన్రని. అప్పటి మహిళా ఉద్యమ అనుభవాలు కూడా ఆదర్శంగానే వున్నాయి. మనం స్వీకరించాల్సిందే. మహిళా సంఘంలో, మహిళల మూల సమస్యలన్నీ పాలసీగా చేసినం. ఎన్.టి.రామారావు అధికారంలో వున్నప్పుడు ఒక పది డిమాండ్లను పెట్టి మేము ఉద్యమాలు జేస్తే, అందులో ఆరింటిని ఒప్పుకొని ఖచ్చితంగా చేసిపోయిండు. నర్సింగ్ స్కూళ్ళు, మహిళా ప్రాంగణాలు, వృత్తి శిక్షణా కేంద్రాలు, ఆస్తిహక్కు వంటివన్నీ అప్పుడే వచ్చినయి. మంచి ప్లాన్ అది. ఎట్ల జేయాలన్నది అసెంబ్లీలో నేనే బొచ్చెడు జెప్పిన. ఏమో వంటలు నేర్పిస్తరట ఆడోల్లకి. సరుకులుంటే, వంటలు ఎవడైనజేస్తడు. అయినా ఆంధ్రదేశం మహిళలకి రుచులు బాగా తెలుసు. మీరు వాళ్ళ నుండి నేర్చుకోవాల్సిందే అని వాదించిన. శిక్షణా కేంద్రాలలో వంటల గురించికాదు, వృత్తుల గురించి, ఉద్యోగాలు దొరికే పనుల గురించి సబ్జెక్టుండాలని అసెంబ్లీలో వాదించిన.

స్త్రీలపట్ల అత్యాచారాల సమస్యపైన పెద్ద ఎత్తున కదిలించి, ఉద్యమరూపం ఇవ్వడమనేది దేశంలో ఫస్టున మన దగ్గరే జరిగింది. జనంలో బడి, నినాదానికి ఒక ఉద్యమరూపం ఇస్తే, ఏదైనా సరే ముందుకు తీసుకుపోగలగుతాం. మహిళల సమానత్వం ఇతర సాంస్కృతికి విషయాలపైన కూడా, దేశం అంతటా తీయాలె. అట్లనే మన భావాలను ముందుకు తీసుకుపోగలం.

# 13

## ఎమ్.ఎల్.ఎ. గా ప్రయాణం

తెలంగాణలో, నాకన్నా గొప్ప పేరు సంపాదించినామె రాములమ్మ. పోరాటంలో శత్రువును హడలగొట్టిందామె. ఆ తరువాత ఎవరున్నరాడోల్లు. సంసారంలో జొరబడితే చాలామందికి మన ధ్యాసే లేకుంట బోయింది. మరి నేను సంసారం జేసిన. సంఘం జేసిన. నా ప్రత్యేకత అదేనేమో. నేను ఇంట్లో ఉండుకుంట గూడ ఇన్ని తిప్పలు బడుతూ కూడా మా ఊరి జనాన్ని నడిపించిన. ఊరేంది. ఆ చుట్టు పక్కల గూడ పనిజేసిన. ఆ ప్రభావంతోనే నన్ను మొదలు సమితికి ఉపసర్పంచ్‌గా బెట్టిన్రు. సూర్యాపేట సమితికి ఉపసర్పంచ్ నేను. వి.ఎన్.గారిని సర్పంచ్‌గ పెడతమంటే "నాకు పదవులు అక్కరలేదు" అని వదిలిపెట్టాడాయన. ప్రజలమీద ఒక ప్రభావం వుండాలె అని నన్ను బెట్టిన్రు. అప్పుడు గూడ పోరాటాలే జేసినం.

ఒకసారి ఎరువుల బ్లాక్‌లో అమ్ముతుంటే, మార్కెట్‌కు బోయినం. నేను గూడ వడ్లు బోసుకోని, రైతుల్ని తోల్కపోయి మార్కెట్ కొచ్చినం. సూర్యాపేట, ఆ చుట్టుపక్కల

రైతుల్ని సమీకరించి, ఊరేగింపుదీసి, నినాదాలిచ్చుకుంట, షాపులెంబడి, షాపులల్ల జొరబడి బస్తాలు లాక్కొచ్చి, ఇవతల పడేసినం. ఎంత తిరుగుబాటది! ఆ రోజులల్ల పేపర్లల పెద్దగ బడ్డదిది.

"ఒకరైతులా రైతు స్త్రీ – పోరాటంలో రాజకీయ వేత్తలా మల్లు స్వరాజ్యం" అవి నా గురించి పేపర్లకేసిన్రు. అలాంటి సంచలన కార్యక్రమాలు చేసిన. సత్యాగ్రహాలు, పౌరహక్కుల ఉద్యమంలోనూ నా వాయిస్ చాలా ప్రధానమే.

ఎమ్.ఎల్.ఎ.గా నన్ను ఎందుకు బెట్టిన్రంటే ఎన్ని కష్టాలు పడ్డప్పటికీ, పిల్లల్ని సంకలేసుకుని కూడా కంటిన్యూ జేసిన. ఎమర్జెన్సీ వచ్చినప్పుడు, మోటూరి హనుమంతరావుగారు ఉత్తరం రాసిన్రు. ఉదయం గారి చేతికిచ్చి తోలిన్రు. ఏం రాసినరంటే "మన ముఖ్యులందరూ జైళ్ళల్ల ఉన్నరు. ఈ సమయంలో మన వాయిస్ బయటకు వచ్చే అవకాశం లేదు. నువ్వు బయటకెల్లి ఈ పౌరహక్కుల ఉద్యమంలో బహిరంగ సభలల్లో మాట్లాడాలె. పౌరహక్కుల కమిటీలో నువ్వుండాలె" అని "కమిటీలొద్దు పాడొద్దు సభలకైతేనే నొస్తగాని" అన్నా. అప్పుడు ఎమ్.హెచ్ (మోటూరి హనుమంతరావు), మా ఆయన కూడా అండర్‌గ్రౌండ్‌లోనే వున్నరు. అట్ల సభలకెల్లిన.

నన్నుగాక మరెవరిని సెలెక్టు జేస్తరు. మహిళని పెట్టాలనుకుంటే, ఫీల్డులున్న దాన్ని నేనే.

ఆ అసెంబ్లీలో వేరే వాతావరణం వుండె గానీ, అక్కడ గూడా, నేను గెరిల్లా పోరాటమే జేసిన. నాతో పాటు ఓంకారున్నాడు. అతని గైడెన్స్ బాగుండేది. ఓంకారు చట్టపరమైన వాటిని, నా పద్ధతికి తగ్గట్లుగ ప్రశ్నల రూపంలో ఎట్లడగాలన్నది చెప్పేది. చట్టపర జ్ఞానాన్ని నేర్వడం అన్నది ఒక ఎత్తు. అది కూడా తెలియాలి.

ఒక కథ చెప్పాలి. నేను ఎమ్.ఎల్.ఎ.గా గెల్చినంక. ఏపది పదిహేను రోజులకో ప్రమాణ స్వీకారం అన్నరు. నేనేమో ఓట్లయిపోయినంక ఇరవయి రోజులు నియోజకవర్గంల ఆడీడ తిరుక్కుంట బోతున్న. జనం ఊరుకోరుగద. మా ఊరికిరా, అంటే మా ఊరికిరా అని అంటే దండలేసుకుంట తిరుగుతున్న. మల్ల మొత్తంగ నేను పోరాటంలోనే ఉన్నట్లనిపించింది. పిల్లలు పండుగ సెలవులకి ఇంటికని వచ్చి, గోడలు బట్టుకొని ఏడ్చుడు మొదలుపెట్టిన్రు. ఊర్లో జనం మా ఇంటికి రాండి అని తీస్కపోయి వాళ్ళకి అన్నాలు పెడుతున్నరు. నేనేమో గ్రామాలు తిర్గుతున్న. వి.ఎన్.గారికి ఆ గొడ్లు, గడ్డి, ఇల్లు వ్యవసాయం చేసుకుంట వుంటే తెలిసేది. "పొయిల కట్టెలు బెట్టుకుంటూ కూసున్నవ్" అంటూ మా తమ్ముడు వచ్చి నన్ను తీస్కపోయిండాయె.

ఎమ్.ఎల్.ఎ.గా అయి, మొదట అసెంబ్లీకి వచ్చినప్పుడు, చప్రాసీ నన్నులోనికి పోనిస్తలేదు. 'దీన్లకి ఎమ్.ఎల్.ఎ.గా గెల్చినోల్లే పోతరు' అనుకుంట, నన్నులోనికి పోనీకుండా ఆపేసిండు బంట్రోతు. "మరినేను ఎమ్.ఎల్.ఎ. నే గదా" అని అనరావడంలేదు నాకు. అది నాకు ఎక్కలేదు. అదీ ఒక ఉద్యమంలాగా చేసివచ్చిన అంతే. గెల్చిన అనంగనే, మా అన్నయ్య ఎత్తుకున్నడు. దండవేసిన్రు. అదంతా చేసిన్రు గానీ, నాకు తెల్వలే. మా అన్నయ్య అంతకు ముందు రెండుసార్లు గెల్చిండుగానీ, నేను ఎన్నడూ గ్యాలరీదాక గుడరాలే. చూడలె. నాకు తీరలే. నేను ఎవుసాయం మీదనే వున్నా. ఘర్షణలెక్కడ వుంటే, అక్కడ బి.ఎన్. గావాలె. కుశలవరెడ్డి గావాలె. వాళ్ళు గూడా, ఎన్నడూ నన్ను తీసుకొచ్చింది లేదు. సరే, నేను పోదామంటే నన్ను లోనికి పోనిస్తలేరు. ఈ ఓంకారేంజేసిండంటే, లోపటికి పొంగనే ఎవరో పల్కరించి మాట్లాడుతున్నరు అతనితో. అట్ల మాట్లాడుకుంట, మాట్లాడుకుంట అతను సంతకం పెట్టడానికి లోనికెళ్ళిపోయిండు. నన్నేమో చప్రాసి పోనియ్యటంలేదు. "ఎందుక బోనియరు? ఇది అసెంబ్లి గాదా?" అని అంటున్న. "ఇది అసెంబ్లే గానీ, గెలిచినోళ్ళే రావాలి ఇందులకు" అంటున్నడు. అంతలో నేను చిన్నగ "నేను గెల్చినగద" అన్న. ఆయనకి అర్థంగావడంలేదు. "నువ్వెట్ల గెల్చినవ్. నువ్వు గెల్చుడేంది" అంటున్నడు బంట్రోతు (నవ్వు). నేను జూస్తే ఎమ్.ఎల్.ఎ. పొజిషన్‌లో లేను. మరి కనీసం ఇస్త్రీ చీర, కొత్త చీర కాకుంటే మాయె, అదిగూడ లేదు. ఓంకార్ సంతకం పెట్టిండు, వచ్చిండు. ఆయనకి సంతకం బెడుతున్నప్పుడన్నా, కనీసం నేను లేనుగద అన్న ధ్యాసైనా లేదు. బయటకొచ్చి నన్ను చూసి, "ఓహ్! ఏమనుకున్నవ్ ఆమెను. ఆమె మా నాయకురాలు. గెల్చివచ్చింది. ఏమనుకున్నవ్" అని, నన్ను తీసుకోని లోపలికి పోయిండు. అప్పుడు సంతకం బెట్టిన. నాకు ఇంగ్లీషు రాదు. ఎజెండా కూడా ఇంగ్లీషులో ఇస్తున్నరు. కొంచెం భయమైంది మొదటిరోజు. నాకు క్వాటర్ లేదప్పుడు. అప్పుడు సుగుణ ఎర్రమంజిల్ కాలనీలో వుండేది. ఆడినుంచి సుగుణను కలుసుకోడానికి పోయిన.

"ఓ అమ్మ, ఈ మోపునొచ్చినావే. ఎమ్.ఎల్.ఎ.వి, ఈమోపునొచ్చినవ" అంటున్నది. ఈమోపేంది? ఏమైంది? పన్నెండు రూపాయల చీరె. ఆ మధ్య కంట్రోలు చీరెలని వచ్చినవి. అయి నేను కట్టిన, మొద్దు చీరలే కట్టేది. వ్యవసాయానికి పనికొస్తయిగద అవి. సుగుణ బీరువా నుండి, ఒక బెంగాల్ కాటన్ చీర, అవ్వీ, ఇవ్వీ తీసి ఇచ్చింది. తల కదుక్కోమంటే, తలకబోసుకోని తెల్లారి టిప్పుటాపుగ బోయిన అసెంబ్లీకి.

ఆ తర్వాత నేను ఎమ్మెల్యేగా పార్లమెంటరీ రాజకీయాల్లోకి ప్రత్యక్షంగా రావటమన్నది – అదొక పెద్ద కథ. 1978–83 నడుమన తుంగతుర్తి నియోజక వర్గం నుండి ఎమ్మెల్యేగా నేను పోటీ చెయ్యాలని పార్టీ నిర్ణయం. అప్పుడు అన్నయ్య ఎం.పిగా ఉన్నడు. అన్నయ్య

పేరు మాత్రమేగాక నాపేరు కూడ ప్రజలకు బాగా తెలుసు. కాబట్టి గెలుస్తనని నన్ను పెట్టిన్రు.

నాకేమంత ఆసక్తి లేదు దీన్లో. ఉండనని చెప్పిన. నామినేషన్ వెయ్యాల్సిన రోజున కూడ నేను పోలే. తమ్ముడు మా ఇంటికొచ్చిండు. నేను వంట చేస్తున్న. కంది కట్టెలు పెట్టి పొయ్యి మంట బెడుతున్న. "ఓ అమ్మా, ఇంకా పొయిల కట్టెలు పెట్టుకుంట కూర్చున్నవా, అవుతల సీటు మీద నిలబడాలె రమ్మ"న్నడు. "నేను రానే రాను, నా సమస్యలు నాకున్నయి. నా బిడ్డ పెండ్లి చెయ్యాలె. చినుకు పడితె గుడిసెంత కారుతున్నది. చిన్న ఇల్లన్న కట్టుకోవాల్నని కొంచెం ఇటుక బట్టీ పెట్టుకున్న", అని చెప్పిన. ఆయన ఒప్పుకోలే. పార్టీ నిర్ణయాన్ని కాదనలేను కదా! తుంగతుర్తి నుండి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన.

ఎమ్మెల్యేగా ఉండి ప్రజలకొరకు నేను అనుకున్న పనులు చెయ్యటం, అది కూడా ఒక రకంగా గెరిల్లా పోరాటం చేసినంత పనయ్యింది. సాయుధ పోరాట కాలంలో ఆ నియోజక వర్గంలో ప్రజలకు పంచిన భూమిని ఆ తర్వాత దొరలు స్వాధీనం చేసుకున్నరు. దాన్ని తిరిగి ప్రజలకు పంచాలనేది నా లక్ష్యం.

భూదాన యజ్ఞంలో భాగంగా దానం చేసిన భూమిని కూడ దొరలు ఆక్రమించిన్రు. నేను ఎమ్మెల్యేను అయ్యేనాటికి, ఆ భూదాన ఉద్యమం ఎప్పుడో 20 ఏళ్ళ కిందటనే పోయింది. ఆ భూములన్నిటినీ మళ్ళా ప్రజలకు దక్కేట్టు చేయాలని నేను అనుకున్న, బంజారాలు, హరిజనులు అమ్ముకున్న భూములు, దొరోళ్ళు ఆక్రమించిన భూములు ఎక్కడెక్కడో ఉన్నయో వివరాలన్నీ సేకరించినా. ప్రజలను వెంటేసుకుని ఊర్లవెంట తిరిగినా. వాళ్ళు సద్దులు కట్టుకొని వచ్చెటోళ్ళు.

జీపులేదు, మోటారు సైకిళ్ళు లేవు, నడుచుకుంట పోవడమే. ఏ ఊర్ల చీకటి పడితే, ఆ రాత్రి అక్కడ పడుకునేది. జనమంత ఆశ్చర్యపడేటోళ్ళు. ఎమ్మెల్యే అయివుండి కూడ ఇట్ల నడుచుకుంట తిరుగుతున్నవు, ఎట్ల నడుస్తున్నవని అడిగెటోళ్ళు. అలవాటున్నది కదా, నడక నాకు కష్టమేమీ కాదు. అడవిలోనయినా, ఎమ్మెల్యేగావున్నా అదే జీవితం.

ఈమె ఎమ్మెల్యే అయినగాని లేబరోళ్ళు బతికినట్టే సాధారణంగా బతుకుతది, వాళ్ళ లెక్కనే కొట్లాడ్తదని అందరూ చెప్పుకునేటోళ్ళు. ఏదన్న జనానికి అన్యాయం చేస్తే కొట్టేటట్టుగనే ఉన్నరని పోలీసోళ్ళు, ఎమ్మార్వోలు, వేరే అధికారులు భయపడేది. వాళ్ళు నన్ను కూర్చోబెట్టి మర్యాద చేసి, ఏదో చెప్పి పంపించుదామనుకుంటె కుదరకపోయేది నాతో. వాళ్ళ ఆఫీసుల్లో కూర్చోకపోయేదాన్ని. నేను ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం పోలీస్ స్టేషన్లలో ఏనాడూ కూర్చోలేదు. వాళ్ళు ప్రజల మీద దౌర్జన్యాలు చేస్తుంటే మనం మర్యాదలు పొందలేం కదా! ప్రజల పన్లు చేస్తరా, లేదా అని నిలబెట్టి అడిగేదాన్ని.

దొంగతనాలనో, ఇంకేదో నేరాలు మోపుతూనో ప్రజలమీద పోలీసులు దౌర్జన్యం చేయటాన్ని నేనెప్పుడూ సహించలే. ఏ గ్రామం మీదికన్న పోలీసులు వచ్చిన్రని తెలిస్తే వెంటనే వెళ్ళేదాన్ని. మీరు అరాచకంగా ప్రవర్తిస్తున్నరు, చట్టాన్ని ధిక్కరిస్తున్నరు, అసలు ఏ చట్టం ప్రకారం వాళ్ళను అరెస్టు చేస్తున్నరో, ఆ చట్టం ఏందో ముందు చెప్పాల్సిందేనని నిలదీసేదాన్ని. అసలు నా పర్మిషన్ లేకుండ నా నియోజక వర్గంలో కాలు పెట్టడానికి వీల్లేదని కచ్చితంగ చెప్పిన.

భూములు కోల్పోవటం ప్రజలకు బాధగనే ఉన్నది. కానీ, భూస్వాములకు ఎదురు తిరిగి పోరాటం చేయాల్నంటే భయపడుతున్నరు. నేను వస్తనని అనంగనే అమ్మో, నువ్వొస్తే మమ్మల్ని బతుకనియ్యరని భయపడిన్రు. జనం ఎనకల్ల రహస్యంగ పోయిన. అక్కడొక కవుసలామె, వితంతువున్నది. ఆమెను పిలిపించి వీళ్ళెవ్వరికి చెప్పొద్దుగని, రేపుపొద్దునకల్ల ఆ భూముల లెక్కలేంటివో తీసుకొని రమ్మన్న. ఎమ్మార్వో ఆఫీసుకు, తాసిల్దారు ఆఫీసుకు పోదమని చెప్పిన. ఆమె కాగితాలు కూడ దొరోని చేతులనే ఉన్నయి.

చుట్టు పక్కలున్న తండాల ప్రజలను సమీకరించి, ఆ భూముల పట్టాల గురించి చెప్పమని తాసిల్దారును గట్టిగ అడిగినం. అమ్మా, ఆ కాగితాలన్నీ దొరోని ఇంట్ల ఉన్నయి, ఇప్పుడు నిన్ను వెంటబెట్టుకొని పోతే నా ఉద్యోగం ఊడుతదని అన్నడు. ఐతే ఆ దొరతోని మాట్లాడి సెటిల్ చెయ్యిలేదంటే మేమే రాబడ్తమని పట్టుబట్టినం. ఇక ఆయనే చూస్తనన్నడు. కానీ వీళ్ళు పిలిపిస్తే దొరలు వస్తరా? వాళ్ళు రారు, వీళ్ళు పోలేరు. అట్లున్నది వ్యవహారం. ఇక ఇదేమీ పని కాదని నేను పోయి ఆ దొరోని గేటు ముంగట కూచున్న, నువ్వట్ల పోవద్దు, వాని మనుషులు దాడి చేస్తరు, నీ చేతుల ఏమున్నది తిరగబడటానికి, అని పార్టీ వాళ్ళు అభ్యంతరం చెప్పిన్రు.

ఐనగాని మేము కదలకుంట అక్కడనే కూచున్నం. మేమట్ల వాళ్ళ అరుగుమీద కూచోవటంతో కలకలం వచ్చింది. జనమంతా వచ్చి తొంగి చూస్తున్నరు. ఆఖరికి ఆ దొరనే మనుషులను తోలిండు. వాళ్ళకు వండిపెట్టేటోళ్ళుంటరు కదా, వాళ్ళొచ్చి, నన్ను లోపలికి రమ్మన్నరు, నేను రానని చెప్పిన. నేను వచ్చేదుంటె బాజాప్తనే వస్త. నేనేమీ మీ ఇంటికి చుట్టపు చూపుగ రాలేదు. ప్రజల పని మీద వచ్చిన, మీరే బైటకు రావాల్నని చెప్పి పంపిన.

వాడేమీ తక్కువోడు కాదు. మా దగ్గర పట్టాలేమీ లేవు, వాళ్ళే అమ్ముకున్నరు నాకేం సబంధం లేదని జవాబిచ్చిండు. మర్నాడు మళ్ళా తాసిల్దారు దగ్గరికి జనాన్ని తోల్కపోయిన. ఇట్ల పెద్ద గొడవలు నడిచినంక చివరికి నేను సాధించిన. ప్రజల భూములు తిరిగి వాళ్ళకు స్వాధీనమయినై.

అసెంబ్లీలు, ఎమ్.ఎల్.ఎ. పదవులు పోరాటాలను లీడ్ చేయడానికి ఒక సాధనమే. గవర్నమెంటుతో పోరాడటానికి, వాళ్ళ దృష్టికి సమస్యలు తీసుకురావడానికి. చట్టపరమైన ఒక అవకాశం అది. దానివల్ల పోరాటాలు మరిన్ని చేయడానికి వీలవుతుంది అంతే. కరెంటు కావాలి. ఆ సమస్య ఎన్నో ఏళ్ళుగా అట్లా పడి వుంది. బడ్జెట్ సమావేశాల్లో నేను ఖచ్చితంగా నిలబడి కొట్లాడితే, చచ్చినట్లు ఇవ్వక తప్పలేదు. నేను నిలబడ్డ తుంగతుర్తి ఏరియాకు కరెంటు సాధించటం గొప్ప విజయమే.

అసెంబ్లీలో ప్రజా సమస్యలను స్పష్టంగా బయటకు తీసుకవచ్చేడిది. ముఖ్యంగా బంజారాల గురించి, భూ పంపకం గురించి వాదించేడిది. భూదానంలో పంచిన భూములకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా, దగ్గర పెట్టుకున్నరు దొరలు, రావులపల్లి భూస్వాములు. అది దొరల రిగ్గింగ్ కేంద్రం. అందులకు కమ్యూనిస్టులుపోరు. ఆ ఊర్లో ఒక్క ఓటు పడదు మనకు. అప్పుడట్ల వుండె ఆ ఊరి స్థితి. తొమ్మిది వందల తొమ్మిది ఎకరాలు మొత్తం భూమి పట్టాలు తమ దగ్గరే పెట్టుకున్నరు దొరలు.

ఒక మాదిగాయన వచ్చి, నాకీ సమాచారం చెప్పిండు. ఆ సమాచారం ప్రకారం తాసీల్ ఆఫీసులో దేవులాడితే, అక్కడేం కాగితాలు లేవని జెప్పిన్రు వాల్లు. హైదరాబాద్ వచ్చి, మంత్రులతో రిప్రజెంట్ చేసిన. అసెంబ్లీల ఈ సమస్య పెట్టిన. లొల్లి జేసిన. ఎప్పటౌతుగ జనాన్ని కూడేసి భూమి కబ్జాలు బెట్టనీకి ఆ ఊర్లోకి పోతే, నాకు మంచినీళ్లు పోసినామెని ఊర్లకెల్లి ఎల్లగొట్టిన్రు దొరలు. ఆ ఊర్లో ఎంత నిర్బంధమంటే, నాకు సమాచారం ఇచ్చిన మాదిగాయన ఎంబడి పడితే, గా మాదిగాయన ఎట్లనో ఊర్లకెల్లి తప్పించుకుపోయిండు. ఏడబోయిండో జాడలేదు. కష్టపడి, ఆయనను ఎతికి, నా క్వాటర్‌కే తీసుకువచ్చి, ఉంచుకోవాల్సి వచ్చింది. ఆయనను ఊర్లోకి రానిస్తలేరు. నేను ఎమ్.ఎల్ఎ.ని అయి కూడా, ఊర్లోకి పోయేటట్లు లేదు. నేను పోతే దాడులు చేస్తారు దొరలు. ఎట్ల ఈ సమస్య పరిష్కారం అయ్యేది. ఓంకారు దారి జూపిండు. ఫలానా రెవిన్యూ వాళ్ల దగ్గరికి పో, అక్కడికిబో, వాళ్ళని గలువు, ఇక్కడికిపో అని చెప్పేది. ఆ ఊరి మాదిగాయన్నే, ఎంటబెట్టుకోని, ఆఫీసులన్ని తిరిగిన. నేను ఏరియాకు బోయినప్పుడు, ఆయనను ఇక్కడ సిటీలో దాచేది. అట్లానే, ఆ నిర్బంధం వున్న రోజుల్లోనే, రాత్రి హరిజనుల ఇండ్లల కూర్చొని మాట్లాడి వస్తుంటేనే, ఒకామె, దొరోల్ల ఇండ్లల్లనే పనిచేస్తది. ఆమె నాకు ఎక్కువ సమాచారం ఇచ్చింది. “దొరోల్ల కాడనే ఉన్నయమ్మ అందరి పట్టాలు. నా పట్ట గూడ దొరోల్ల దగ్గర్నే వున్నది. నువ్వు ఏదోకటి జేయి. నువ్వు సాధించమ్మ” అన్నది. నాకు తాగనీకి నీళ్లిచ్చింది. మూడోనాడు ఎర్కయి, ఎమ్.ఎల్.ఎ గిట్ల వొచ్చిపోయిందని, ఆ మాదిగామె నీళ్లిచ్చిందని దొరోల్లకి ఎర్కయింది. ఈ మాదిగామెని పనిలోకెల్లి ఎల్లగొట్టిన్రు.

ఏం జేయాలి? ఘర్షణకు దిగేటట్లు లేదు పరిస్థితప్పుడు. చివరికి కలెక్టర్ దృష్టికి విషయం తీసుకొచ్చి, అట్లా సర్వేయర్‌ను తీసుకోని తాహసిల్ దారును తీసుకోని పోయి ఊర్లకు ఎట్లయితేనేం పరిష్కారం జేసినం. నేను ఎమ్.ఎల్.ఎ.గా ఉన్నప్పుడు గ్రామంలో చాలా ఘర్షణ వాతావరణం వుండేది. కాంగ్రెస్‌కీ, సి.పి.యం.కీ మధ్య అప్పుడు ఊరూరు మనవాళ్ళ మీద కేసులు. అంతకు ముందే పంచాయితీలన్నీ మెయిన్‌గా మనకే వచ్చాయి. భూస్వాముల కేంద్రం తుంగతుర్తి మొత్తం నాలుగుచోట్ల నాలుగు పదేసి గ్రామాల చొప్పున కాంగ్రెస్ పట్టు సంపాదించింది. మర్డర్‌లు చేసి, కేసులు బెట్టి వాళ్ళ పట్టు నిలబెట్టుకుంటున్న ప్రాంతం అది. అట్లాంటి చోట్ల ప్రజల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూనే పార్టీని నిలబెట్టడం కోసం, రేయింబవళ్ళూ అవస్థపడాల్సి వచ్చింది. దీనిలోనూ, నాకైతే గెరిల్లా పోరాట అనుభవమే ఉపయోగపడింది. తుపాకులు తీసుకొని కొట్లాడుతున్నమా లేదా అన్నదే కాదు సమస్య. ఆ గ్రామాలలోకి రహస్యంగా వెళ్ళి, ఆ ప్రజల సమస్యలు తీసుకోని, జనాన్ని పోగుచేయడమన్నది, గొప్ప కష్టంతో కూడిన పరిస్థితి. అలాగే జనరల్‌గా వచ్చిన ఉద్యమాలను అందుకోవడమన్నది కూడా ముఖ్యమైనది. సమితిలో వున్నప్పటి, ఎమ్.ఎల్.ఎ.గా అయినప్పటి నా అనుభవాలను, పోరాటాలు చేసేందుకు వేదికగా ఉపయోగించుకున్నాను. అట్లా ఉపయోగిస్తేనే, ప్రజల్ని నిలబెట్టడం, వాళ్ళ సమస్యల్ని పరిష్కరించడం సాధ్యమైంది అప్పుడున్న పరిస్థితుల్లో.

ఏ వామపక్షమైనా, ఏ సిద్ధాంతమైనా, ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలకు ఏ అవకాశాలైతే వున్నాయో, ఆ అవకాశాలను, రాయితీలను చట్టాలలో వున్నవైనా, ఇతర సలహాలేవైనా వుంటే, అవి అన్నీ అందించటం అవసరం. అవేవీ అందించకుండా పోరాటాలు మాత్రమే చేస్తాము. కాకుంటే వదిలిపెడతాము అంటే, మామూలుగా జనం చెప్తరు. "చెట్టెక్కిరి, దులిపిరి, అందుకునేటోడెవడో కింద అందుకుని పోయె" అని. ఎంతమంచి సామెత అది. మాకేందక్కిందని చూస్తరు ప్రజలు. అట్లా ఏరుకుని పోయెటోల్లో గూడా అర్హులకన్నా, అనర్హులు ఎక్కువైపోతారు. ఒకసారి అచ్చంగా, ఓల్టేజ్ పెన్షన్‌కు ఎంతమంది ఎల్తరు అని, నేను ఎమ్.ఎల్.ఎ.గా ఉండగా పదిగ్రామాలలో సర్వే చేసినం. ఈ పది గ్రామాలలో కూడా చట్ట ప్రకారం జూస్తే, ఊరికి పది పన్నెండు మంది ఎల్లిన్రు. ఎలవు, సలవు జేసి చూస్తే ఇరవయి మందెల్లిన్రు. ప్రజల పరిస్థితి దృష్టిలో పెట్టుకుని, పార్టీ దృష్టితో చూస్తే, ఇంకో తీరుగవుంటుంది. దానిలో ఘర్షణ పడవలసి వచ్చింది. అప్పుడు ఏది లీగలు, ఏది ఇల్లీగలు అనే సమస్య వస్తుంది. ఎవరికి ఏం గావాలి? ఎంతమందికి? ఏ రకం సమస్యలను ఎట్లా పరిష్కరించాలి? వీటన్నింటిలో కూడా మనకి

వర్గదృక్పథం వుండాలె. వాళ్ళ జీవనాధారం కోసం ఏం చేయాలి? భూముల పంచాయితీ అంటే, ఒకటో తొంభైయ్యో ఎకరాల సమస్య కాదు.

ఒకచోట తొమ్మిది వందల ఎకరాలు దొరల నుండి గుంజుకున్నది జనానికి అప్పచెప్పాల్సి వచ్చింది. ఆ ఒప్పజెప్పటం కూడా ఫీల్డులోకి దిగి నాగళ్ళు బడితేనే అయింది. కోటమర్తి దగ్గర అన్నయ్య ఎం.పి.గ వున్నప్పుడే నెత్తికి రూమాలు జుట్టుకోని ముందుగాల నాగలిబడితేనే, ఆ భూముల మీదికి మళ్ళీ జనం వచ్చిన్రు. అట్లనే రావులపల్లిలో, బండరావారంలో కూడా. భూస్వాములు జనం ఆధీనంలోని భూమిని ఊడలాక్కున్నరు. దాన్నే చట్టప్రకారం స్వాధీనం చేసుకుని ఒక గొల్లాయనకి ఇచ్చినం. పోలీసులు ఆయనను హింసించి ఆ గొల్లాయన భూమిని మళ్ళీ దొరలకే అప్పజెప్పిన్రు. అప్పుడు నేను ఎమ్.ఎల్.ఎ.గా వున్నా, నేను ఆ ఊరికే పోయి. మూడు రోజులు ఆడనే కూసోని. ఆ భూమి మళ్ళీ ఆయనకే దక్కేదానికి నిలబడ్డ. ఆ టెన్షన్‌ల గుండెబగిలి, హార్ట్ ఎటాక్ వచ్చి చచ్చిపోయిండా గొల్లాయన. అప్పుడాయన కొడుకును తీస్కబోయి, ఆ భూమి మీద నిలబెట్టాల్సి వచ్చింది. ఇదొక అనుభవం నాకు. లీగలో, ఇల్లీగలో, కమ్యూనిస్టు కార్యకర్తలు త్యాగాలు చేసి, జనాన్ని అంటిపెట్టుకుని ఉంటే, ఏ పోరాటం చేయడానికైనా, జనం సిద్ధపడతారు.

భూదానోద్యమంలో ఇచ్చినవి, పోరాటకాలంలో మనం పంచినవి కొన్నిచోట్ల భూస్వాములు ఆక్రమించుకున్నారు. ఎమ్.ఎల్.ఎ.గా వున్న ఆ లీగల్ పదవిని ఉపయోగించి, వాటి కోసం పోరాడి, జనంతో కబ్జా పెట్టించినం. అదో గొప్పపని. ఆ తరువాత తండాలలోనివాళ్లు, పల్లేర్లు, పలుగురాళ్ళు ఉన్న భూములలో, వాళ్ళు నాలాగనే కష్టపడుతున్నరు. వాళ్ళకి కరెంటు రావడం కోసం, చెన్నారెడ్డి గవర్నమెంటప్పుడు బాగా కేంద్రీకరించి పనిచేసిన. తుంగతుర్తి ఏరియాలోని మొత్తం అన్ని తండాలకు కరెంటు వచ్చేలా చేసాను. రాఘవరెడ్డిగారి అనుభవం కూడా వుంది. సాముహికంగా జనానికి పనికివచ్చేలా అనేక పనులు చేసాడాయన. ఏటివొడ్లు, నదుల వొడ్లు, ఆనకట్టలు, చిన్న నీటి వనరులను కాపాడటం, ఇలాంటి పనులను నేను కూడా చేసాను. “బిక్కేరు” అని ఒక ఏరుంది. ఆ ఏటి ఒడ్డున బావులు తీసి వాటికి కావలసిన పైప్‌లైన్లు, గోలాలు ఏయించి అక్కడి నుండి కరెంటు ద్వారా నీళ్ళు తెచ్చుకునే ఏర్పాట్లు చేసినం. అదొక ముఖ్యమైన పని. ఇక రోడ్లంటే, అవి మాములు పనులే. నేను ఎమ్.ఎల్.ఎ.గా ఓడిపోయిన తరువాత కూడా డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ఫాలో అయ్యాను.

జన్నారెడ్డి సుధీర్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి దొరలు. ఆ చుట్టుపక్కల ఊర్ల రైతుల నుండి దాదాపు కోటి రూపాయలదాకా వసూలు చేసారు. కరెంటు తీసుకువస్తామని

చెప్పి. డబ్బులు తిని, పని మధ్యలోనే ఎగ్గొట్టి, రైతులను వదిలేసిన్రు. ఆ ఊర్లలో సి.పియం. పార్టీ బలంగా లేదు కూడా. అవి ఆ దొరల ఊర్లే. వాళ్ళ రిగ్గింగ్ కేంద్రాలే. మేం ఆ ఊర్లకు వెళ్లి పాత దరఖాస్తులు వెతికి తీయించి, కరెంటు కనెక్షన్‌లు వాళ్ళకి వచ్చేలా చేశాం. జనం ఉత్సాహంతో పెద్ద ఊరేగింపు తీసిన్రు. బట్టలు పెడతాం రా అని జనం నన్ను వాళ్ల ఇండ్లకి ప్రేమతో పిలిచిన్రు. ఎవరి దగ్గర తీస్కోలేదు నేను. జనం, లంబాడీ వాళ్ళు. "మల్లు స్వరాజ్యం పెట్టిన దీపం" అంటూ పాటలు పాడుకున్నరు. ఆనాటి పోరాటంలోనూ భూముల పంపకమే, ఈనాడూ భూముల పంపకమే, చేయవలసి వచ్చింది. చేసినం. అప్పుల కింద భూములు వదిలిపెట్టి పోయిన రైతులను కూడా మల్లా తీసుకువచ్చి వాళ్ళెక్కడో బత్కపోతే కూడా తీసుకొచ్చి, వాళ్ళ సమస్యలను పరిష్కారం జేసినం. మొన్నీ మధ్య కూడా ఒక కేసు పరిష్కారమైంది. పదహారేళ్ళు సాగిందా కేసు కోర్టులో.

లీగల్ పద్ధతుల్లో ఎట్లా పోవాలో వి.ఎన్.గారు సహాయపడేవారు. అట్లనే ఓంకార్ కూడా. అసెంబ్లీలో ఎట్ల పోవాల్నో చెప్పేటోడు. అతను నాకు బాగా సహాయం చేసిండు. ఇట్ల చెప్తే చాలు అర్థం చేసుకునేడిది నేను. అధికార్ల పేర్లు కూడా. చదువుకునేటప్పుడు బట్టీపడతరుగద, అట్లా బట్టీ పట్టాల్సి వచ్చేది. అట్లనే వాళ్ళ అధికారాలేంది? వాళ్ళ బాధ్యతలేవి అని కూడా.

నాకు ఈ ఎమ్.ఎల్.ఎ. సీటు కూడా ఎంత విచిత్రంగా వచ్చిందంటే అది వరకు వి.ఎన్.నే పెట్టిన్రు. రెండు మూడు వేల ఓట్ల తేడాలో పోయిండు. "ఈసారి నేను గెలిపిస్త పా నిన్ను. నువ్వే నిలబడాలి" అని చెప్పిన గూడ ఆయన సిద్ధపడలేదు. పార్టీవాళ్ళు కూడా నన్నే బెట్టిన్రు. సూర్యాపేటలో పార్టీ ప్లీనం బెడితే, సుందరయ్యగారితో కూడా చెప్పిన. నా బిడ్డ పెండ్లి జేద్దామనుకుంటున్న. ఆ పిల్లేడ బోతది? పెళ్ళేమైతదని. అప్పటికి రాష్ట్ర కమిటీలో కూడా లేను నేను. అయితే ఉద్యమంలో నా కంటిన్యూటీ ఎన్నడూ తెగలేదు. కాకపోతే, ఒకే జిల్లాలో వున్నప్పటికీ, ఆయనకి ఒకచోట బాధ్యత, నాకొక చోట. కుటుంబ జీవితమే లేదు. అప్పుడప్పుడూ అనిపించేది. కానీ వస్తూనే వుంటారు గద. అసలు రాకుండైతే పోరుగద. ఆయన గైడ్ చేసే పాత్ర నిర్వహిస్తూనే వున్నాడు. అప్పుడు సరిగ్గా అర్థంకాలేదు ఆయన సహకరిస్తున్నాడన్న విషయం. పిల్లల చదువుల విషయంలో కనిపెట్టుకుంటూనే వున్నాడు.

మా ఊర్లో, నేను పెద్దగా అప్పులేకుండానే వ్యవసాయం జేసిన. ఒకసారి భూతనఖా బ్యాంకు వాళ్ళు జప్తుకొచ్చిన్రు ఊర్లోకి. అప్పు కట్టడంలో రైతులు వెనకబడి పోతారుగద జనరల్‌గ. ముందు నా ఇంటికే వచ్చిన్రు. జప్తు చేస్తామని డబల్, డబల్ వడ్డీలుంటాయి గద. ఆ లెక్కలంతా చూసినంకనే గడతాం. ఇప్పుడు గట్టం పొమ్మన్నాం. రెండు సంవత్సరాలుగా కరువు. ఊర్లో ఎక్కువ భాగం రైతులకు లోన్‌లు వున్నాయి.

"నేను కట్టను. రైతులు కూడా కట్టరని చెప్పిన" రైతులకు ఇంకా కో-ఆపరేటివ్ లోన్లు, భూతనఖా లోన్లు కూడా వున్నాయి. ఊరు కొంత భాగం అవతల పక్కన వుంటుంది. నా దగ్గరి నుండి పోయినంక, బ్యాంకోల్లు అవతలి భాగంలోని రైతుల ఇండ్లల్ల జొరబడ్డారు. అప్పుడే రైతులు నా దగ్గరికి పరుగెత్తుకొచ్చి, బ్యాంకోల్లు బిందెలెత్తుకుపోతున్నరు జీపులేసుకొని. నేను అందరినీ పిల్చిన రమ్మని. వాళ్ళవెంట బడ్డాం. జీపులు సూర్యాపేట దిక్కుపోతుండగ, ఎంబడి పడి, రాల్లేసి కొట్టినం. నేను రాళ్ళు దీసుకొని ఏసినంక, జనం ఊకుంటరా? వాళ్ళు గూడ ఏసిన్రు. జీపు ఆపిన్రు.

"నువ్వు నోటీసివ్వలేదు. అప్పెంతో చెప్పలేదు. కరువచ్చి వుంది. ఇప్పుడు ఎట్ల వసూలు చేస్తవు. బిందెలు తీసుకోని వెడితే ఎట్ల?" అని లొల్లి జేసిన. జనం ఎవరి బిందెలు వాళ్ళు జీపులకెల్లి తీసుకోనిపోయారు. పెద్దలొల్లిగద. అధికారులకు కూడా ఈ విషయం తెలుస్తుంది గదా. ఎప్పుడన్నా కలుస్తారు వాళ్ళు. "అమ్మో మీరా? నేను ఫలానా బ్యాంకుల ఉండగ, గల్లా బట్టుకొని కొడతరేమోనని భయమైంది" అంటరు.

"ఏం ఎమ్.ఎల్.ఎ.రా నాయన. ఆ చీరేందీ? ఆ రైకేంది? ఏమన్న అంటే, గల్లా పట్టుకొని కొట్టేట్లున్నది" అన్నరంట నాగురించి.

ఒక లంబడిరైతును నారుబోసుకున్నంక నీకు అప్పిస్త. ఇంజను మోటారిప్పిస్త, మీకు సబ్సిడీ వస్తదని అంటే, ఆయన మోటనీళ్ళుబోసే ఎద్దునమ్మి వాళ్ళన్న కాడికి పైసలు గట్టిండంట బ్యాంకోల్లకి. నారు ఎండిపోతున్నది. నీల్లు తడిపేటట్లు లేదు. సబ్సిడీ ఇస్తలేరు. పోయి అడిగితే, బ్యాంకాయన నీకేం రాదుపో అని, లంబడిరైతును కొట్టిండు. నూతనకల్‌లో బస్సుదిగగానే, ఆ లంబడాయన నా దగ్గరికి వచ్చి భోరుమని ఏడ్చిండు. సక్కంగ బ్యాంకుకుపోయిన. ఆ బ్యాంకు అధికారి నన్ను జూసి ''ఎవలు ఎవలీమె'' అని అడుగుతున్నడు.

"నేనెవలైతే ఏందిగాని, ఈ రైతు సంగతేందని" అడిగిన. "మాకు ఇంకా సబ్సిడీ రాలేదు. వచ్చినంక ఇస్తం పో" అంటున్నడు. "ఫలానా టైం కల్లా వస్తదని నువ్వు వాగ్దానం చేసినవ్ గద. ఎద్దునమ్మిండు. లేకుంటే అప్పటికల్లా ఒక్క మడి కన్నా నీరు కట్టుకునేదిగద. ఏంది ఇది?" అని గట్టిగ అడిగిన ఇంతలో ఎవరో ఆమె ఎమ్.ఎల్.ఎ అని అతనికి చెప్పిన్రు. "ఆమెకి కానూన్ తెల్సునో లేదో సబ్సిడీ వస్తనే ఇస్తం" అన్నడు. అక్కడ ల్యాండు ఫోనుండే, "ఇటుదే, నేను కలెక్టర్‌కు ఫోన్ జేస్త" అన్న. "ఇక్కడెందుకు ఇస్తరు ఫోను" అను కుంట మర్యాదలేకుండ మాట్లాడిండు. బలవంతంగా అయితే కలబడవలసి వచ్చేటట్లుందని అనుకోని, ఆయన గదిలో కూర్చున్నడుగద. "నువ్వు ఈడనే కూర్చో, నేను బోయి కలెక్టర్‌ను కలిసిసొస్త" అని బయటకొచ్చి, బయటకెల్లి గదికి బేడెం వేసి,

ఆడనే కూర్చున్న. ఫోన్ లేదు. పాడులేదు. గా ఊర్లో ఆ కాలంలో ఎక్కడ ఫోన్ దొరకదు. ఇగ కేకలేస్తున్నడు మేనేజరు లోపలికెల్లి. బయట వున్న బంట్రోతుతో "నువ్వు కదిలితివా సస్తవ్. నేను ముందు నిన్ను కొడత" అన్న. ఆ చట్టమేందోనా బొందేందో – రైతు పరిస్థితి ఇట్లుంటే. నాకు చాలా కోపం వచ్చింది. వ్యవసాయం చేసినదాన్ని గద. ఒకసారి దున్నపోతును దెస్తే, కరువుకు మేతలేక, ఇంట్ల అవిగసింజెలుంటే, అవిదిని, పొట్టవాసి, పగిలి చచ్చిపోయింది నా దున్నపోతు. తెల్లారిలేచి నాగలి దున్నేటట్లు లేదు. చంటిబిడ్డ నాకు. చంకల బిడ్డను పట్టుకోని పోయిన. మాదిగవాళ్ళు, పశువుగోసి, "రా అమ్మ చూడనీకి. గీ గింజలు తింటే చచ్చిపోయింది" అని చెబితే చూసిన. బాగ ఏడ్చిన. ఆ బాధ ఎట్టుంటది? నాగలి సాగేటట్లు లేదు మల్ల. గా రైతు బాధ ఎట్ల తెల్వాలి బ్యాంకోనికి. కాస్సేపైనాంక సార్ పిలుస్తున్నడు అన్నడు బంట్రోతు. "నాకు ఫోన్ ఇవ్వమను. రైతుకు హామీ దొరికే దాక, నేను పోను ఇక్కడకెల్లి. నాకు కానూను తెల్వదుగానీ, ఆయనకు అంతకన్న అసలే తెల్వనట్లున్నది" అని తలుపు తెరిచి కలెక్టర్‌కు ఫోను జేసిన. అప్పుడు కలెక్టరే బ్యాంకోల్లను సమావేశపరిచేవాడు. ఆయనకి వివరాలు చెప్పినంక కలెక్టరు ఏమి ఆలోచించిండో రైతుకు అప్పు మంజూరు జేయమని ఆ అధికారికి చెప్పిండు. అతను ఇస్తనని ఒప్పుకున్నాడు. ఆ రాత్రి ఆ ఊర్లనే వున్న. ఆ ఊర్లో నాకు తెలిసినవాళ్ళు ఉన్నరు. వాళ్ళ దగ్గరికిపోతే ఆ రైతుకు, నాకు అన్నంబెట్టిన్రు. అక్కడే పండుకోని, మర్నాడు బ్యాంకుకుపోయిన. రైతుకు అప్పుడు అప్పు ఇచ్చిండా బ్యాంకు అధికారి. అట్ల అన్నింటికీ కొట్లాడాల్సివచ్చేది.

ఆ మధ్య ఈ బ్యాంకు అధికారి ఒక పెండ్లిలో కల్సిండు. నన్ను చూసి దగ్గరికొచ్చి, " ఆరోజు మీరు నిజంగనే నన్ను కొట్టేలెక్కనే వున్నరు" అన్నడు. చివరికి కాంగ్రెస్ ఎమ్.ఎల్.ఎ. పరంధాములు "వామ్మో నువ్వెంత పని జేస్తున్నవ్ అక్క. నీ వెంట పోలీసు స్టేషన్‌కొస్త. హరిజనులన్నా, ఆడవాళ్ళన్నా, వాళ్ళు అసలు ఇంటలేరు" అన్నడు. ఆయన వేదికల మీద గూడ జెప్పేది స్వరాజ్యంగారి దెబ్బకి పనులు జరుగుతయ్ అని. అంత గుర్తింపు వచ్చింది నాకు. నేను ఎమ్.ఎల్.ఎ. నో గాదో అది తర్వాత సంగతిగానీ, ప్రజల సమస్యలను పరిష్కరించగలగటం నాకు సంతోషం కలిగించింది.

1985లో ఎమ్.ఎల్.ఎగా పోటీ చేసి, ఓడిపోయిన. ఈ తరువాత కూడా ఎమ్.ఎల్.ఎ.గా పోటీ చేసిన గానీ, మా తమ్ముడి చీలికతో ఓడిపోయిన మళ్ళీ. వాడుగూడా గెలవలేదు. మళ్ళీ కాంగ్రెస్ దామోదర్ రెడ్డికి సపోర్టు ఇచ్చిండు. దాంతో కాంగ్రెస్ గెలిచింది. ఇగ ఆ తరువాత ఆ నియోజకవర్గం మళ్ళీ మన చేతిలోకి రాలేదు. 1978లో దొరోళ్ళిద్దరు పోటీ చేస్తే వాళ్ళకి తలా ఇరవయివేలు వచ్చినయి. నాకు ఇరవయి ఐదువేల ఓట్లు వచ్చినయి. ఐదు వేల ఓట్లు తేడా అన్నమాట. రెండోసారి 1983లో ఇరవయివేల ఓట్లతో గెల్చిన.

మా తమ్ముడు చీలిపోయి తెలుగుదేశం పార్టీ తరఫున నిలబడితే నేను సి.పి.యం తరఫున నిలబడ్డ. ఇది 1985లో జరిగింది. దానితో ఓట్లు చీలి దొరోడు గెల్చిండు. మా తమ్మునికి చెప్పిన. పార్టీలోనే వుండర. నేను ఇంకోసారి పోటీ చేయన్రా. నా ఇష్టంతోని జేస్తలేను. పార్టీ చెప్పింది గాబట్టి జేస్తున్న అన్న. జనం ఇద్దరు ఇట్ల పోటీ పడుతున్నరు. ఓట్లు చీల్తన్నయి అనుకున్నరు. అనుకున్నగానీ. ముప్పయి వేల ఓట్లు వేసిన్రు నాకే. ఇగ ఆ తర్వాత, మా తమ్ముడు, నేనూ మాట్లాడుకోలేదు. వాడి బిడ్డ పెండ్లిజేసుకుంటున్నది రమ్మని అంటే కూడా నేను బోలే. ఖతం. ఇగ మాట్లాడుకోవడం ఎక్కడిది. వాడు పార్టీ మీద దాడిజేయించె. మన కార్యకర్త ఒకడు చచ్చిపాయె. సంఘం మీద మల్ల దాడిజేయించె. ఎంత జెప్పిన ఇనడాయె. కర్రలు బట్టుకోని. ఆ ఊర్లకె పార్టీవాళ్ళను రానియడాయె. పార్టీవాల్లనే ఏంది. అన్నయ్యను గూడా రానియ్యలేదు. వాడు మా నుంచి చీలిపోయినప్పుడు. ఆ తరువాత కూడా అన్నయ్య నాకు సపోర్టుగనే వున్నడు. చివరికి వాడికై వాడికే మార్పువచ్చింది. ఏం లే, నేను ముసల్దాన్నయిన, వాడు గూడ ముసలోడయ్యిండు. నేను ఇక పోటీ చేయనని పార్టీకి చెప్పేసిన. గానీ 1996లో పార్లమెంటుకు నిలబడాల్సి వచ్చింది ఎం.పి.గ. కానీ ఓడిపోయిన. కానీ ఆ తరువాత రెండేళ్ళకే ఆ గవర్నమెంటు పడిపోయి వెంటనే మళ్ళీ ఎన్నికలొచ్చినయి. పార్టీ నిలబడమంది మళ్ళీ. అన్నయ్య రాష్ట్ర పార్టీ సెక్రటేరియట్‌కి రాసిండు. నా తరువాత పెడితే స్వరాజ్యాన్నే పెట్టండ్రి. ఎందుకంటే ఇంకెవరికీ ఓట్లురావు అని. అప్పటికి పార్టీలోపటే వున్నాడు అన్నయ్య. అయితే పార్టీ సమావేశానికి రాలేదు ఆయన. బి.ఎన్. ఇట్ల రాసిండు. ఇగ నువ్వే నిలబడు అన్నరు. నేను అస్సల్ నిలబడను. నా వల్ల గాదన్న. అప్పటికి దేశంలో బి.సి. ట్రెండ్ వచ్చింది. ఆ బి.సి. ట్రెండ్‌ను, కాన్షీరామ్ ఉద్యమాన్నీ చూసే అన్నయ్య కూడా పార్టీ పాలసీని భిన్నించిండు. ఆయన అప్పటికి సెక్రటేరియట్‌ల వున్నడు. ఆల్ ఇండియా నాయకులకి ఏం జెప్పిండో తెల్వదు మరి. మామూలుగా మేం ఇద్దరం మాట్లాడుకునేప్పుడు, బి.సి. ట్రెండ్ వచ్చింది. దాన్ని మనం క్యాచ్ చేయాలె అనేది. ఉత్తర భారతదేశంలో ఉద్యమం ఎట్ల బుట్టాలన్నది మన సమస్య. తెలంగాణ ఆంధ్రాలలోనే ఉన్న పార్టీకి, అక్కడ ఎట్ల పనిచేయాలన్నది వున్నది. ఉత్తర హిందుస్థానంలో ఫ్యూడలిజం విపరీతంగా ఉంది. చెక్కు చెదరలే. అక్కడ ఎవరూ వేలుబెట్టలే. అక్కడ పూలన్‌దేవి గన్ను పట్టుకొని కొట్లాడుతుంటే జనం ఓటేసిన్రు. ఆ ఫ్యూడలిజాన్ని సూదిమొనతోనన్నా, గడ్డపార ఏయకపోతే, పోయిరి. సూదిమొనతో నన్న గుచ్చున్నన్న గుచ్చురైతిరి. ఏ పార్టీ విస్తృతంగాదాయె ఆడ? వామ పక్షాలని చెప్పుకునే ఏ పార్టీ అన్నా అయిందా అక్కడ? మరి అక్కడ పార్టీలు అట్లనే పండుకోని వుంటే, భారత

విప్లవం ఎట్ల జయప్రదం కావాలి? అది అందరం ఆలోచించాలి. ఉన్నదాని మీదనే, ఊరికట్ట మీదనే భాగవతం ఆడుతున్నం అంటరు. అందరూ అట్లయితే, ఎట్లయితది?

మా చెల్లెలు, తమ్ముడు గూడా మొదటి సంది పార్టీతోనే వున్నరు. గానీ గా తెలుగు దేశం వచ్చినంక, తమ్ముడు అటుపోయిండు. కానీ మా చెల్లెలు సరస్వతి మాతోనే వుంది. ఆమెకి నలుగురు కొడుకులు, ఒక బిడ్డ అందరూ పార్టీతోనే వున్నరు. సింపతీగ వున్నరు. వాళ్ళ ఉద్యోగాలు వాళ్ళు జేసుకుంట. మా చెల్లె కొడుకులు టీచర్లయినరు. మా అమ్మ ఇచ్చింది తప్పా, వాళ్ళకి భూమి లేదు. అత్తగారి ఇంట్ల కూడా భూమి ఏమీలేదు.

మా అన్నయ్య మొదటి నుండీ బయటకు తీసుకొచ్చినోడు. అయితే ఉద్యమంలో ఎవరి పాత్ర వాళ్ళదే. ఆయన ఆ రోజులలోనే, రాష్ట్ర సెంటర్‌కు వచ్చేసిండు. అక్కడ నుండీ నేను స్వతంత్రంగానే నిర్ణయాలు తీసుకొని, నాయకత్వ స్థానంలోకి ఎదిగిన. అంత వరకూ ఫర్వాలేదు. సమితికి ఉప సర్పంచ్‌గ పెట్టాల్సి వచ్చినప్పుడు కూడా నేను వ్యవసాయమే జేస్తున్న. అయినా సరే, నా శక్తి సామర్థ్యాల మీద అన్నయ్యకు మంచి అభిప్రాయమే వుంది. అప్పుడు మా అన్నయ్య ఒక్కడే గాదు, మా తమ్ముడు కూడా నాకు సపోర్టుగనే ఉన్నాడు. ఆ తరువాత, ఎన్.టి. రామారావు గవర్నమెంటు వచ్చిన తరువాత, పాలసీల దగ్గర తమ్ముడికీ, కమ్యూనిస్టు పార్టీకీ మధ్య భిన్నాభిప్రాయాలు వచ్చాయి. పార్టీ బహిరంగంగ – రహస్యంగా ఎట్లా వున్నా, మన గుంపు, దొరోల్ల గుంపు ఎప్పుడన్నా, ఇట్లానే వుండేది పరిస్థితి. కుశలవరెడ్డి ఎప్పుడూ ఫీల్డ్‌లోనే వుండాల్సి వచ్చేది. ఇట్లనే ఎంతకాలం ? ఎన్.టి రామారావు వచ్చిండు గాబట్టి, మార్పులు వస్తున్నయి, అవకాశాలు వస్తున్నయి. కాబట్టి ఆయనతో కలిసి ఉండాలనేది వాడి అభిప్రాయం. అప్పుడు ఇది కాదు, కూడదని పార్టీ అభిప్రాయం.

ఎన్నికలప్పుడు “ఇక్కడ పుట్టినంత మాత్రాన ఇక్కడే సెట్ అయిపోవాల్నా? భాగం పంచుకుబోయి మళ్ళీ భాగానికి వచ్చింది” అంటూ నాకు వ్యతిరేకంగా ప్రచారం జేసిండు తమ్ముడు. అప్పుడనుకున్నా, నేను ఒక స్త్రీని వాళ్ళకంటే ఎక్కువ పేరొస్తుంటే చూడలేకపోయారని అట్లా అనిపించిందప్పుడు. ఇహ అన్నకి స్త్రీలా పురుషులా అన్నదేం లేదు. కానీ ఆయనతో కూడా పాలసీ సంబంధమైన కాస్త తేడా రావడంతో నాతో విభేదించిండు. మార్గం మాత్రం ఏం దొరుకుతుంది ఆయనకన్నా ఆ వయసులో? మాతో పాటే సి.పి.యం.లోనే కొనసాగాడు. చివరికి పోరాట విరమణ తరువాత బయటకొచ్చిన కాడికెల్లి, ఎమ్ఎల్.ఎ. గా, ఎం.పి.కి గా పోటీ చేస్తునే వున్నాడు. పార్టీని నిర్మించడం, ఎక్కడన్నా ఘర్షణలు జరిగితే, అక్కడ నిలబడటం ఇదీ ఆయన రాజకీయ జీవితం. ఇక వ్యక్తిగతం ఎక్కడిది. వాళ్ళొక చోట, నేనొక చోట. నిత్యం పనే పని.

ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడ నా జీవితమంత ప్రజల నడుమనే గడిచింది. ప్రజలకు ఎప్పుడు, ఏ సమస్య వచ్చినా వాళ్ళతోనే ఉండేదాన్ని. ఏ గ్రామం మీదనైన పోలీసులు దౌర్జన్యం చేసినట్టు తెలిసిందంటే, జనాన్ని కూడగట్టి పోలీసు స్టేషన్‌కు వెంబడేసుకొని పోయేది. ఇక ఈమె మనమీద దాడి చేయిస్తదిరా, అన్నట్లు సదురుకోవాల్సి వచ్చేది.

ఆడవాళ్ళ సమస్యలమీద జనం అట్లనే కదిలిన్రు. ఒక గ్రామంలో ఒకామె కోడలికి విషం పెట్టింది. అన్నంలో విషం పెడితే, ఆమె కొంచెం తిని, ఏందో తేడాగ అనిపించటంతోటి ఇక తినలే పడేసింది. అయిన గానీ అత్త కోడలిని బర్రెగడ్డికి తోలింది. ఇంట్లో చచ్చిపోతె తన మీదకి వస్తదని అట్ల పంపింది.

ఆమె చేనికి పోయి, గడ్డి కోసుకుంట ఆడనే పడి చచ్చిపోయింది. కుడితి తొట్లో నీళ్ళు తాగి పందులు చచ్చిపోయినై. దాంతో అందరికీ అనుమానం వచ్చింది, అత్తనే విషం పెట్టిందని. నేను దూరంగ వేరే ఊర్లో వుంటే లేడీస్ ఫోన్ చేసిన్రు. పోలీసోళ్లు పైసలు తిని కేసు మాఫీ చెయ్యకుండ చూడమని చెప్పిన. వెంటనే ఊరంతా కదిలిన్రు. పోలీసోళ్ళను రానీయలేదు. అత్తింటోళ్ళను అరెస్టు చేసిందాక పంచనామా చెయ్యనియ్యలేదు, తలకొరివి పెట్టనియ్యలేదు. అట్ల చైతన్యవంతమయిన్రు ప్రజలు.

ఎమ్మెల్యేగా పని చేయటమంటే చట్టపరమైన కొన్ని పరిమితులుంటయి. వాటికి లోబడే అయినా ప్రజలకు ఉపయోగకరమైన పనులు చెయ్యాలె. దాని కొరకు చొరవ తీసుకొని కొట్లాడటం కమ్యూనిస్టుల కర్తవ్యం.

## 14

### ఉద్యమాలే ఊపిరి

ఎమ్.ఎల్.ఎ. గిరీ అదీ అయిపోయినంక ఉద్యమాలు చేస్తూనే వున్నా.

మద్యపాన వ్యతిరేక ఉద్యమం మహిళా సంఘాలు అన్నీ కలిపి, ఐక్యంగా చేసినయి. అట్లా సమస్యలపై కలిసి పని చేయాలన్న సాంప్రదాయం. ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. కలిసి పనిచేయాలనుకున్నా, ఆయా సంఘాలలో కూడా ఎవరికి వారు తామే నాయకులమనుకుంటూ, ఆ నాయకత్వాలని వదులుతలేరు. అంటే నాయకత్వాలని వదులుమని కూడా కాదుగానీ, ఎక్కడికి పోయినా, అక్కడ పనిజేసేడిది వుంటది. కష్టపడి పని జేసేటోల్లుకు ఎండ్లన్నా నాయకత్వం వస్తది.

1993లో సంపూర్ణ మద్య నిషేధ ఉద్యమంలో చురుకైన పాత్ర వహించిన. దీని కొరకు ఐక్యవేదిక ఏర్పాటైంది. సూర్యదేవర రాజ్యలక్ష్మి, మోటూరు ఉదయం, చంద్ర రాజకుమారి, సంధ్య, వాసిరెడ్డి సీతాదేవి వంటి మహిళా నాయకులందరూ పాల్గొని

పోరాడిన్రు. 1994 గాంధీ జయంతి నాడు ఐక్యవేదిక ఆధ్వర్యంలో గొప్ప ఊరేగింపు జరిగింది. దాదాపు ఇరవై వేలమంది మహిళలు హాజరయిన్రు. సికింద్రాబాద్ గాంధీ విగ్రహం దగ్గర ధర్నా చేసి, ముఖ్యమంత్రిని అడ్డగించినం. లాఠీచార్జి, అరెస్టులు జరిగినై.

ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం ఆధ్వర్యంలో స్త్రీల సమస్యలకు సంబంధించిన కొన్ని డిమాండ్లతో సభ జరిపినం. భారీ ఊరేగింపు తీసినం, వేలాదిమందితో. అసెంబ్లీ దగ్గర గన్‌పార్క్‌లో సభపెట్టి ముఖ్యమంత్రిని సభకు పిలిచినం. లక్షలాదిమంది సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఆయనకు అందచేసినం. తండ్రి ఆస్తిలో ఆడపిల్లలకు సమాన హక్కు, వరకట్న వ్యతిరేక చట్టం, మహిళా శిశు సంక్షేమ ప్రాంగణాల ఏర్పాటు, నర్సింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు, స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్, మహిళల పేరిట భూముల పంపిణీ, మరుగుదొడ్ల ఏర్పాటు, వితంతువులకు పింఛన్లు, పేద స్త్రీలకు ప్రసూతి ఖర్చుల అలవెన్సులు - ఇట్లాంటి డిమాండ్లన్నీ పెట్టినం.

ఎన్‌టిఆర్ అంగీకరించిండు. ఐతే తండ్రి ఆస్తిలో ఆడ పిల్లలకు హక్కు కల్పించే చట్టం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లేదు. దీనిపై అసెంబ్లీలో చర్చించటానికి ఒక కమిటీ వేసిండు ముఖ్యమంత్రి. దానిలో నేను కూడ సభ్యురాలిని. ఆ చట్టం రాష్ట్ర అసెంబ్లీలో పాస్ అయింది.

సరే, ఇట్ల అనేక చట్టాలున్నయి, స్త్రీల కొరకు. అవన్నీ మనం కొట్లాడి సాధించుకున్నవే. అవి సరిగ్గా అమలయ్యేట్టుగా చూసుకోటానికి కూడా కొట్లాడక తప్పదు. కమ్యూనిస్టులు, ప్రగతిశీల వాదులందరూ చెయ్యాల్సింది ఇదే. ప్రజలకు వాళ్ళ హక్కులను గురించి చైతన్యం పెంచాలె. అంతిమంగా చరిత్రను సృష్టించేది, మలుపు తిప్పేది ప్రజలే. కానీ ముందుకు నడిపేవాళ్ళ కమిట్‌మెంట్, జ్ఞానం అనేవి కూడ కీలకమైన విషయాలే. అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనిస్టు ఉద్యమాలు, ఇతర ప్రజా ఉద్యమాలు అందించిన జ్ఞానం మన ముందున్నది. దాన్ని మన పరిస్థితులకు సరైన పద్ధతిలో అన్వయించి చెప్పగలిగినప్పుడే జనం ఇంప్రెస్ అవుతరు. ఆ తరువాత ప్రజలే దాన్ని చేతుల్లోకి తీసుకుంటరు.

స్త్రీల విషయమైనా అంతే. వరకట్న నిషేధానికి చట్టం వచ్చింది, ఆస్తి హక్కు చట్టం వచ్చింది. ప్రజలు సహకరించందే, స్త్రీలు చైతన్యం కానిదే వరకట్న నిషేధ చట్టం అమలు సాధ్యం కాదు. ఆస్తి హక్కు విషయమైనా అంతే. ఆస్తి వచ్చినంత మాత్రాన సమస్య తీరినట్టు కాదు. వరకట్నం కోసం చంపేటోళ్ళు, భార్య ఆస్తి కొరకు కూడ హత్యలు చేస్తరు. ముఖ్యమైనది స్త్రీల చైతన్యం. దానికి మూలమైన చదువు, ఆర్థిక స్వావలంబన.

సమాజం ఉన్నదున్నట్టుగనే వుండి, స్త్రీలకు మాత్రమే సమాన హక్కులు కావాలెనంటె అది జరిగేపనికాదు. మార్క్సిజాన్ని నమ్మే కమ్యూనిస్టులు సమాజం మొత్తాన్ని మార్చడంలో భాగంగానే స్త్రీల సమానత్వం కొరకు కృషి చెయాల్సి ఉంటది. మొగోళ్ళు మారాలెనని ఊరికే చెపుతుంటె సరిపోదు. ఆ మార్పు కొరకు ఒక సామాజిక విప్లవం నడవాలె. అది నడవాలంటే ఆడవాళ్ళూ మొగవాళ్ళూ కలిసి పనిచెయ్యాల్సుంటది. దానికి ప్రతిబంధకంగా మొగవాళ్ళలోనూ, కుటుంబాల్లోనూ వుండే లోపాలతో కొట్లాడాలె. కమ్యూనిస్టు పార్టీలలోనైన పితృస్వామ్య లక్షణాలున్నోళ్ళు కనబడుతూనే ఉంటరు. ఆ లక్షణాలతో ఎప్పటికప్పుడు పోరాడాల్సిందే.

పురుషులకు వ్యతిరేకంగా మాత్రమే పోరాటం చేస్తే ఇదంతా సాధ్యంకాదని నా అభిప్రాయం. ఈ మాట నేను ఈ రోజునే చెప్తలేను, కొందరు ఫెమినిస్టులు అట్లాంటి ధోరణిలో మాట్లాడిన నాడే చెప్పినా. నేను ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లోనే ఫెమినిస్టుల మీటింగ్‌లలో స్టేజి మీదనే ఈ మాట చెప్పినా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఏం చేస్తమని, చెప్పి వుర్కున్న. మళ్ళా విమర్శ పెడితే వ్యక్తులను విమర్శించినట్టే కనబడతది. నేను వ్యక్తిగతంగ ఎవరినీ అనటం లేదు. ఆ వాదనల మీద నా అభిప్రాయాన్ని చెప్తున్నానంతే.

ఆర్థిక సమస్యలను, భూమి సమస్యలను ఏ అడుగుదాకా ముందుకు వేయిస్తమో, ఆ అడుగు మందం సామాజిక సమస్యలను కూడ తీసుకోవాలె. మనదైన ఒక లైన్ మీద నిలబడి సామాజిక సమస్యలను విశ్లేషించాల్సి ఉంటది. మనం చేరాలనుకున్న లక్ష్యం దిక్కుకు నడిచేటప్పుడు ఎన్నో అడ్డంకులొస్తయి. మన దారిలో ఎప్పుడు ఏ ముళ్ళకంప అడ్డమొస్తే, దాన్ని తొలగించుకుంటూ ముందుకు నడవాలె.

స్త్రీల సమస్యల మీద పోరాటాలను నిర్మించటమన్నది కూడా ఒక భావజాలం ప్రాతిపదికన జరగాల. వాళ్ళ సమస్యలను ఏ దృక్పథంతో, ఏ భావజాలంలో అర్థం చేసుకోవాలో స్త్రీలను ఎడ్యుకేట్ చెయ్యడమన్నది ప్రధానం. అప్పుడు వాళ్ళ సమస్యలపై ఎట్లా పోరాడాలన్న చైతన్యం వాళ్ళకు కలుగతది. అట్లా కాకుండా కేవలం మనం చెప్పిన పని చేసేందుకే జనాన్ని కూడగడితే, అది ఒంటెత్తుపోకడగ మిగులుతది. ప్రజల సంసిద్ధతను బట్టి, వాళ్ళు అనుసరించేందుకు వీలయిన కార్యక్రమాన్ని ఎంచుకోవాలె.

ప్రతి పని చేసేటందుకూ, ఒక శాస్త్రం ప్రకారం నడవాల్సుంటది. ఉదాహరణకు బోరు ఏద్దామంటే, నీళ్ళు ఎక్కడ పడతయో చెప్పేటందుకొక శాస్త్రం ఉంటది. అట్లనే విప్లవాన్ని సాధించటం ఎట్లనో చెప్పేందుకు మనకొక శాస్త్రమున్నది. అదే మార్క్సిజం. ఐతే ప్రజలు వాళ్ళ సమస్యలను ఆధారం చేసుకొని, పరిస్థితిని బట్టి ఒక అడుగు ముందుకు వేస్తారు. వాళ్ళలో ఆ అవగాహననూ, చైతన్యాన్ని పెంచడమే మార్క్సిస్టులు, కమ్యూనిస్టులు చెయ్యాల్సిన పని.

ఇదంతా వచ్చిందాక స్త్రీలు విముక్తి చెందటమన్నది పూర్తిగా సాధ్యం కాదు. కమ్యూనిస్టు పార్టీలల్లో కూడ పితృస్వామ్య ధోరణులు ఉండవచ్చు. కాకపోతే మార్పుకు హామీ ఉంటది కాబట్టి, వాళ్ళను ప్రశ్నించవచ్చు. మహిళలు చైతన్య వంతులయితేనే ఇంట్లోనైనా, ఉద్యోగాల్లోనయినా, ఉద్యమాల్లోనయినా పితృస్వామ్యం అరికట్ట బడతది. కేవలం పితృస్వామ్యంపై పోరాటం చేసి ఏమీ సాధించలేం. దానికొక పొలిటికల్ యాంగిల్ ఉండి తీరాలె. శ్రమచేసే ప్రజలందరి విముక్తితోనే స్త్రీల విముక్తి కూడ కలగలిసి ఉంటది. అందుకే పురుషులు చేసే పోరాటానికి రెండింతల పోరాటాన్ని స్త్రీలు చెయ్యాల్సుంటది. ప్రతి స్త్రీ ఇంటా, బయటా తన స్థానాన్ని నిలబెట్టుకోవాల్సిందే.

ఇంత బువ్వ సంపాదించే పనిగా వ్యవసాయం జేసిన నేను. వ్యవసాయం ఇడ్సిపెట్టి, ఎమ్.ఎల్.ఏగా అయినంక, మొత్తం ఇంటి తలుపులకు తాళం. ఊకెనే, అన్నాయంగ వ్యవసాయం బోయింది. ఒక పది పుట్ల వొడ్లు బండె. ఆరుపుట్ల శెనిక్కాయలు బండేది. చిన్నోడు, పెద్దోడు ఇద్దరుగలిసి, ఆ వరి కోయించి, తీస్కబోయి అమ్మి, ఎరువుల బాబతు అప్పులుకొన్ని, అమ్మాయి పెండ్లికని జేసిన అప్పుకొంత కట్టేసిన్రు. నేను కందులమ్ముకోని పోయి, ఆ రోజులల్ల ఒక మూడు వేల రూపాయలు తీసుకొని బోయి ఎన్నికల దిగిన. అది మొదలు బండ్లు, బోరెం, బర్లు, ఎడ్లు, అన్నీ అమ్మాయి అత్తగారింటికి తోలిన్రు. అయ్యో, అంత పడగొడుతున్నరు. దబ్బున ఓడిపోతే మల్ల ఇంటికాడ వచ్చి వుండాల కదా, వ్యవసాయం పోతుందని, కొంత ఆరాటం జేసిన నేను. ఇగ వ్యవసాయం సాధ్యంగాదు. నువ్వు ఇంటికాడలేకుండ అది వీలుబడదని చెప్పిన్రు. ఎక్కడిదక్కడ బోయింది. భూమి పడావుబెట్టిన్రు. మళ్ళీ బోతే ఏమీలేదు. ఆఖరికి వడ్లు గొలుసుకునేడివి గూడ లేవు. వడ్లు బోసుకునేందుకు ఒక జబర్దస్త్ కుండ వుండె. అది వి.ఎన్. ఏ కొనుక్కొచ్చిండు. మంచి వస్తువును సెలక్ట్ చేసేది ఆయన. ఆయన కొన్న కత్తి ఉన్నది ఇప్పటికి. అది బండకేసి సాన బెడితే. నడుస్తూనే వుంటది మల్లి. అప్పుడు బంద్ అయిన వ్యవసాయం, అట్లనే పడావు బడున్నది. ఆ తరువాత ఎన్నటికో వి.ఎన్. వెళ్ళి, ఎవరికో పాలుకిచ్చిండు నాలుగు వేలకి. ఆ నాలుగువేలు నేనే ఖర్చుపెట్టేది. ఆరొందల రూపాయల జీతం ఎం.ఎల్.ఎ.లకు. అండ్ల రెండొందలు పార్టీకి. ఇగ నాలుగొందలుంటయి గద. అయి జేబుల పెట్కపోయేదాన్ని. ఒకనాడు లంబాడాయన పిలగానికి కాలిరిగింది. కాలు ఏలబడుతున్నది. సూర్యాపేట దవఖానకని ఏస్కొచ్చిండు. నేను సూర్యాపేట బస్‌స్టాండ్‌ల దిగిన. ఆ లంబడాయిన వచ్చి, మీదబడి భోరునేడుస్తున్నడు. ఎనకాల పిలగాని కాలూగుతున్నది. రక్తపు బొట్లు కారుతున్నయి. నేను వాళ్ళని దవఖానకు తీసుకుపోయిన. దవఖానలో కట్టుగూడ బయటకెల్లి కొన్కొని తెచ్చుకోమంటున్నరు. ఆడగూడ కొట్టబోయిన. నా సంచీలకెల్లి ఒక చీరదీసి,

కట్టుగడతవా లేదా మొదుగాల అని ఎంటబడ్డ. ఎంబడి బడితే. ఏడికెల్లో తెచ్చి, ఇంత కట్టు కట్టిన్రు. ఇంజెక్షన్‌లు, మందులు, అవీ కొనుక్క రమ్మంటే, నా దగ్గరున్న నాలుగొందల రూపాయలు చేతిలో బెట్టిన. అదీ పరిస్థితి. నిష్టదరిద్రం. పరిస్థితి మల్ల మొదటికొచ్చింది. ఎమ్.ఎల్.ఎ చేసినంక దరిద్రం ఎక్కువైంది. ఉట్టి దరిద్రం గాదు. బట్టలుతుక్కోను, మల్ల అది సంచీల బెట్టుకోను. మల్లా అది తెల్లారి కట్టుకొని బోవడం.

***

కుటుంబాన్ని, పిల్లల్ని సాకటంలో కూడా, ఆరోగ్యంగానే సాదిన. అప్పాలు, అరిసెలు, పండుగలు సెంటిమెంట్లు ఏవీ మా కుటుంబంలో లేవు. పిల్లలకు కూడా రాలేదు అంత ఎక్కువ. చెడు అలవాట్లు కూడా రాలేదు అంత ఎక్కువ. బ్రహ్మాండంగనే పెంచిన. బడి నుండి వచ్చి, ఏమన్న పెట్టమని అడిగితే. టమాటాల తోటలో – టమాటాలు పండించేది. ఆ చెంబక్కడ బెట్టి, కాళ్ళూ, చేతులు గడుక్కొని చెల్కలకు బొండి. చెల్కలో శెనక్కాయిలున్నయి. జీతగాడున్నడు కాల్చిపెడతడు. టమాటాలున్నయి తినండని చెప్పేడిది. బ్రహ్మాండంగ అయి తినొచ్చేవాళ్ళు. వచ్చేప్పుడు మస్తుగ శెనక్కాయిలు, టమాటాలు, కూరగాయలు తెంపుకోని రండనేది. అట్లనే తెచ్చేది వాల్లు. ఇంతింత కూర వొండి పెట్టేదాన్ని. ఏల్లు బుడిపెలొచ్చేవి. ఆ కూరగాయలు దెంపితే, నేను జీతగాని భార్య, ఇంకొకరు. వాల్లకి చెరికూలెడు ఇచ్చేది. పిల్లలు బడికి పోయేటప్పుడు రిక్షాలో సిమెంటు బస్తాల పెట్టి పంపితే, ఆడకు బోయి, పావల పైసలకు అమ్ముకొచ్చేది. ముప్పావల బస్తా. అట్లా బర్రెపాడి, ఇంటిబియ్యం, వడ్లు పండించిన. శెనిక్కాయలు, కందులు, పెసలు, ఇంటి ముంగట రాసిపోసేయేది. చెరువు వొండ్రు తోలిన ఆ భూమికి, మట్టిదోలి ఇంతముందు పన్నెండేళ్ళు పండించిన. సరిగ్గా నెక్ ఆఫ్ మూమెంట్ వచ్చేతలికి ఎమ్.ఎల్.ఎ.నైన. మల్లా దరిద్రం నెత్తినబడ్డది. ఇగ అటో ఇటో పిల్లలైతే పెద్దగైన్రు. ఎమ్.ఎల్.ఎ. అయినంక ఇరవయి రోజులకు అమ్మాయి పెండ్లి చేసినం. ఆమె పెండ్లి అదివరకే నిశ్చయమైపోయింది. అయితే చిన్నోడు మాత్రం ఆగమై పోయిండు. వాడి లైఫ్ నాతోటే. ఎమ్.ఎల్.ఎ. క్వాటర్‌ల. పగలు, మాపు మాసేవనే. తల్లికి, తండ్రికి సేవ చేయడం. తండ్రి బట్టలు, నావైన ఉతికిండు. ఒకసారి జబ్బుజేసి నిమ్స్ ఆసుపత్రిలో బడ్డా. అప్పుడైతే వాడు నా బట్టలు గూడ ఉతికిండు. అన్నం వొండుడు వాడే. పెండ్లిగాకుంట వున్నడప్పుడు. పెద్దోళ్ళిద్దరికీ ఇదివరకే పెండిండ్లయిపోయినయి. చిన్నోడు నాతో పాటే వుండి పనుల కోసం వచ్చిన జనాన్ని ఆఫీసుకు తీసుకుపోవడం, ఇంటికాడ మాకు ఉడకబెట్టి పెట్టడం, మా అమ్మాయి కాన్పులకు వచ్చినా వాడే సగబెట్టవలసి వచ్చేది. ఆ అవస్థ అంతా నాగార్జున మీదకెల్లే ఎల్లిపోయింది. ఆయన మల్లా ఉద్యమం కోసం నల్గొండలో వున్నడు, నేను హైదరాబాద్‌లో. తుంగతుర్తిలో ఒక ఇల్లనేది లేదు.

ఎమ్.ఎల్.ఎ. నాడు పెట్టిన తాళం. మల్ల ఊరికిబోయి ఉన్నది లేదు. పెద్దలమాస పండుగనాడు ఊర్ల, మా ఇంటికి పోదామనుకున్న కానీ ఆ రోజే మీటింగుల వున్న. కొన్నాళ్ళు రైతులు ఏర్లుబడితే, వాళ్ళకి ఇల్లు లేకుంటే వచ్చి మా ఇంటికాడ వుండేవారు. మళ్ళీ వాళ్ళు ఇళ్ళు గట్టుకున్నంక పోయేటోల్లు. ఇట్ల మూడు జంటలు మా ఇండ్ల వుండిపోయిన్రు. వాళ్ళు అండ్ల వున్నప్పుడు కాస్త ఇల్లొద్దిగ ఉండేది. ఎప్పుడన్నా బోతే, వాల్ల ఇంటికాడే కాస్తతినేది. పండుకునేది. ఇప్పుడది కూడా లేదు. గోడలు పడిపోయినయి.

వి.ఎన్. అడవిలో వున్నా, బయట వున్నా ఒక నాయకుడిగానే వున్నాడు. ఆయన నిర్మాణదక్షుడు. ఉద్యమ డ్యూటీని కర్కశంగా ఒక యోగిలా అంకితమై జేసిండు. నాకు ఎప్పటికప్పుడు ఒక గైడ్ లెక్కనే వున్నడు.

చివరి రోజుల్లో వి.ఎన్.గారి ఆరోగ్యవిషయమే. ఆయన పరిస్థితిని ఎప్పటికప్పుడు కనిపెట్టి, తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోలేదు నేను. ఆయనను నిజంగా నేను కాపాడుకోలేకపోయిన. అది మాత్రం జీవితంలో నా ఓటమే. అంతే, ఓటమే. ఎందుకంటే ఎప్పుడూ తిరగటమే. ఎప్పుడూ పనిమీదనే వున్నా. అసలు ఆయనను పట్టించుకోలే నేను. పనుల్లోబడి అది అట్లనే వచ్చింది. అది అలవాటైంది. కుటుంబం పనిలో, వ్యవసాయంలో మునిగిపోయా, కేంద్రీకరించి చేయడం, అప్పుడు ఆరోగ్యంగానే ఉన్నాం కాబట్టి సమస్యల్లేవు. కానీ చివరిదశలో వి.ఎన్. చాలా అవస్థలు పడ్డాడు.

నేను మొదలేం జేస్తుండే? ఇట్ల తిరుగుడు, ఈ పనిమీద కేంద్రీకరించుడు. ఇదంతా ఉంటది కాబట్టి, నాకు వీలుబడదనేది. ఆయన అర్థం చేసుకున్నడు. మేం అనుకోని, మా చిన్నోని దగ్గర ఉంచినం ఆయనను నాగార్జున దగ్గర. అక్కడ మంచిగనే జరిగింది. పెద్ద జబ్బు పడలేదు. ఒక కన్నుకు ఆపరేషన్ చేయించిన్రు వాళ్ళు అక్కడనే. వున్నంతలో మంచిగున్నడు అక్కడ. ఒక కుటుంబ జీవితంలా, పిల్లలు, మనవలు దగ్గరున్నరు. ఆయన పనిమీద తిరిగినా అక్కడికే వచ్చి ఉండేవాడు. నేను గూడా పోయేదాన్ని. తీరా ఇక్కడికొచ్చి, క్వాటర్‌లో సెంటర్ పనికోసమని వచ్చి ఉన్నడు. అక్కడ జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు ఏ పదిహేనేళ్ళో, కేంద్ర కమిటీ మీటింగులకు, ఇక్కడ ఈ మీటింగులకు వస్తూ, పోతుండే. ఆయన అప్పటికే కేంద్ర కమిటీ సభ్యుడు. అక్కడ జిల్లా పార్టీకి ఒప్పజెప్పినంక. నా పాత్ర నేను వదిలినట్లే గదా! నేను బే ఫికర్‌గున్న. తీరా, ఇక్కడ, హైదరాబాదు కొచ్చినంక, ఇద్దరం ఒకింట్లోనే వున్నాం. అప్పటికే నేను రాష్ట్ర కమిటీ పని చేస్తున్నా. 1999 డిసెంబర్‌కి క్వాటర్‌లోకి చేరినం మేం. ఇక్కడికి వద్దన్నానేను. ఇక్కడికొస్తే, మల్లా ఇద్దరం సంఘం పనిలోనే వుంటం. ఎవరు చూసుకునేటోల్లుండరని. అక్కడ చిన్న కొడుకు దగ్గర వున్నా, వాళ్ళు మంచిగ కనిపెట్టుకోని ఉండేవాళ్ళు. నేను కూడా పోతూ వుండేదాన్ని. ఆయనకి

ఆరోగ్య సమస్యలు బాగానే వచ్చేవి. అనారోగ్యంగా వుండే, నిన్ను కనిపెట్టుకొని నేను ఉండటానికి సాధ్యం కాదు. మనం పోదాం పా, మల్లా సూర్యాపేటకే పోయి మకాం పెడదాం రా అన్నా గానీ, వి.ఎన్.వినలే. సూర్యాపేటలకన్నా, ఇక్కడ వుండి చేయాల్సిన పనులున్నాయి నాకు. వృత్తి సంఘాలను లీడ్ చేయాల్సిన పని వుంది. అక్కడ సూర్యాపేటలో వుండి చేయలేనుగద అని అతను పట్టుపట్టిండు. దానితో ఇక్కడే హైదరాబాదులోనే వున్నాం. ఉంటే ఏంవుంది? నాకు బహిరంగ సభలు, నేను మహిళా సంఘం బాధ్యతలు వదులుకున్నా. కానీ, సభల కోసం తిరగటం ఎక్కువైంది. మహిళారంగంలో కేంద్ర కమిటీలో వున్నా, దాన్ని అట్లనే ఉంచిన్రు. మహిళారంగంలో కొంచెం పనే వుంటది. తిరుగుడెక్కువైంది. దానితో ఆయనకి వండి పెట్టలేకపోయిన. నేను లేనప్పుడు పార్టీవాళ్ళు జూస్తరు. గానీ ఒక మనిషి వుండాలేగద? ఏ టైమ్‌లో నన్నా, నాకు అసవరమైతే తనుండాలి. తనకి అవసరమైతే నేనుండాలి. ఆయన డిమాండు జేయలేదు. నేను చూడలేదు. తీరా, ఇక్కడికి హైదరాబాదు వచ్చిన కాడికెల్లి జబ్బునబడ్డడు.

ఆయనకి జ్వరం వచ్చింది. అడ్డంబడ్డడు. ఢిల్లీలో ఫ్రీడం ఫైటర్‌ల ధర్నా పెట్టిన్రు. ఆ ధర్నాకు నేను బోవాల్సి వచ్చింది. తను కూడా పోయి రమ్మన్నడు. ఆయనకి బాగలేదు. మూల్గుతూనే వున్నాడు అప్పటికి. అలాంటి మనిషిని ఇడిసిపెట్టి పోయిన. పోతే ఆడ, మూడు రోజులకని అనుకున్నోళ్ళం, ఎనిమిది రోజులైంది. తొమ్మిదిరోజులైంది. ఆడమంత్రులు, హోంమంత్రి కలుస్తలేరు. హోంమంత్రి అపాయింటుమెంటు కోసం వేచిచూడాల్సి వచ్చింది. ఆ బెంగాల్ కామ్రేడ్స్ వాసుదేవాచార్య పార్లమెంటు లీడరు. నన్నయితే గుర్తుపడతరని నన్నే బొమ్మన్నరు. రాఘవులు వీళ్ళూ వచ్చి, పొమ్మంటే పోయిన. ఊకె, గా కృష్ణమూర్తిని పంపమన్నా. అయనను పంపినా, నేను ఉండిపోదును. కానీ, వి.ఎన్. నేను తిరిగి వచ్చిందాకా, ఎదురు చూసుకుంటూనే వున్నరు. ఏ దవఖానకూ పోలేదు. అది ముదిరిపోయింది. చివరికెట్లనో చిన్నోనికి చెప్పిన్రట. భార్యాభర్తలిద్దరు వచ్చి ఒక రెండు రోజులున్నరు. ఆసుపత్రికి తీస్కపోదామంటే డబ్బులు గూడ లేవు దగ్గర. పైసలు అస్సలుండకపోయేది. ఢిల్లీలో పనిపూర్తిగాకుండ ఎట్ల బోవాలని ఊర్కున్న, నిర్లక్ష్యంజేసిన. నాకోసం ఎదురు జూస్కుంట, పార్టీవాల్లు, సీతారాములు, వాల్లూ వీల్లూ వచ్చి, దవఖానకన్నా పోరాదు అన్నగానీ పోలేదు. రానీ, స్వరాజ్యం రానీ అని ఎదురుచూసిండట పాపం. తీరా నేను వచ్చేటప్పటికి బాగా ముదిరిపోయింది. ఆస్పత్రికి తీస్కపోతే, వెన్నుకి స్పైనల్ కార్డ్‌కి ఇన్‌ఫెక్షన్ వచ్చిందన్నరు. బ్లడ్ సర్క్యులేషన్ ఆగింది. డాక్టర్లు కూడా ఏమీ చేయలేకపోయిన్రు. ఆపరేషన్ చేయిస్తే బతుకుతాడనంటే ఆపరేషన్ చేయించినం. కాలుపడి పోయింది. ఐదునెలలు ఆసుపత్రిలో మంచం మీదనే బడి వున్నడు.

మనిషిని చంపుకున్నంత పనైంది. నేను రెండు సంవత్సరాలు ఆ పశ్చాత్తాపం నుండి బయటపడనే, పడలేకపోయిన. ఎంత మందినో బాగుజేయించిన. ఎమ్.ఎల్.ఎ.గా ఉన్నప్పుడు ఎవరు వచ్చి అడిగినా, వాళ్ళను ఆసుపత్రికి తీసుకొచ్చి, డాక్టర్లకు చెప్పి, తిప్పలబడి, జేబులున్న పైసలిచ్చి, బాగు జేయించిన, కానీ ఆయనను మాత్రం పట్టించుకోలే. ఢిల్లీకి పోకుండా ఉండాల్సింది అనిపించింది. ఉప్పేయించి కాపుతూనే వున్నా ఆయనకి. ఆ టైంలో రాఘవులొచ్చి, దరఖాస్తులిచ్చి, ఢిల్లీకి పొమ్మన్నడు. అంతేగాదు ఆ సమయంలోనే మహిళా సంఘం కేంద్ర కమిటీ మీటింగ్ కూడా వున్నది. ఏమనుకున్న ఏముంది? ఆయన పోయిండు.

***

నా జీవితాన్ని ఒక్కసారి తిరిగి చూసుకుంటే, నిజంగా ఒక పోరాటమేనని అన్పిస్తుంది. ఏనాడు మా అన్నయ్య ప్రేరణతో ప్రజల నడుమకు వచ్చిననో, ఆ పసితనం నుండి నా జీవితమంత ప్రజల నడుమనే గడిచింది. ప్రజల అనుభవాలనుండి నేర్చుకోవటం, నా అనుభవాన్ని ప్రజలకు అందించడం - అనే సూత్రం మీదనే నా జీవితమంత నడిచింది. ఐద్వాకు రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసినా, భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికయినా, నేను చేసిందయితే ఇదే.

గ్రామాల్లో తిరిగి పనిచేసినా, తుపాకిపట్టి గెరిల్లాగా ఉన్నా, అసెంబ్లీలో నిలబడినా, ఎక్కడైనా, ఎప్పుడయినా పోరాటమే నా జీవిత సూత్రం. ప్రతి స్త్రీకి, ప్రతి వ్యక్తికీ అంతిమంగా నేను చెప్పదల్చుకున్నది అదే. పోరాటమే మన జీవితాన్ని తీర్చిదిద్దుతుంది, మన లక్ష్యాలను మనకు అందిస్తుంది.

ఈ చివరి దశలో నా పాత్రను నేను శక్తివంచన లేకుండా, నా శక్తి కొద్దీ నిర్వహించిన అనిపిస్తది. ఉద్యమాలలో, నిర్మాణాల్లో, పార్టీలో ఆ తృప్తయితే నాకుంది.

ఇప్పటి తరానికి ఏం జెప్తాం. అంకితమై పని చేయాల్సిందే. వీర తెలంగాణ పోరాటం నేను జేసిన, నేను జేసిన అంటున్నరట ఎవరెవరో. తెలంగాణ జాడకొస్తే వచ్చినవేమోగానీ, వీర తెలంగాణ కొరకు రాకు. విముక్తా, విమోచనా అంటూ మాట్లాడుతున్నరు. నిన్ననే సెప్టెంబర్‌లో ఒక మీటింగులో మాట్లాడిన. మా టార్గెట్ ఎర్రకోట అని చెప్పిన. ఆ తెలంగాణ సాయుధపోరు. జయప్రదమై, ఎర్రకోట మీద ఎర్రజెండా ఎగరేయాలన్నదే నా కల. నేను గాకపోతే, వచ్చేతరమన్నా, ఆ పని చేసితీరాలి. నాకు ఆశవుంది. నా ఆశ నిరాధారంగాదు. ఆధారం వుంది. ఏం ఆధారమంటే, ఒకనాడు ఉస్మానియా యూనివర్సిటీ బోవాల్నంటే, నా బోటిదానికే వీలుకాలేదు. అందులో అందరూ భూస్వాముల పిల్లలే వున్నరు. మామూలోల్లు ఎవరూలేరు. కానీ, ఇప్పుడు నేను ఉస్మానియాకు

పోతే ఎంత గర్వమో నాకు. గర్వపడతా నేను. ఎందుకంటే, అక్కడ కనపడేవాళ్ళంతా ఒకప్పుడు విద్య నిరాకరించబడ్డ పేదపిల్లలు దళితులు. దొరోని కొడుకు ఒక్కడులేడు. అందుకే నేను చేసిన విప్లవం విజయవంతం అయిందనే అనుకుంటున్న.

కానీ ఇప్పుడు అప్పటి జమీందార్లకన్న డేంజరస్ కార్పొరేట్లు వస్తున్నయి. దాన్ని ఎదిరించి పోరాడాలనే చైతన్యం జనానికి ఎక్కాలె. నిన్నగాక మొన్న ఢిల్లీ యూనివర్సిటీలో గూడ మన పిల్లలు గెలిచిన్రు.

ఒక పక్కనుంచి నియంతృత్వ ధోరణులు కూడా వస్తున్నయి. ప్రజాస్వామ్యం భగ్నమై పోతూ వుంది. అది కూడా బతకదు. నియంతృత్వం రాకుండా కాపాడటం అన్నది ఇప్పుడున్న సమస్య. నియంతృత్వపు అంచులోకి తేలింది దేశం ఇప్పుడు. ఇట్లు నా మరొక పక్క నుంచి ఉరుముల్లా, మెరుపుల్లా ఈ కాంతి కూడా కన్పడుతున్నది. ఈ భారతదేశాన్ని విముక్తి చేసే ఉద్యమాలు గెలుస్తాయనే అనుకుంటున్నా. గెలవాలికూడా! మొత్తం వామపక్షాలన్నీ ఏకమవ్వాలి. భారతదేశం చాలా పెద్దది. ఎక్కడ జనంలోకి పో, నాయకత్వం దొరుకుతుంది. అందుకని, ఈ పార్టీల "గుడుగుడు గుంజం గుండేరాగం" నాయకత్వానికన్నా, జనంలోకి జొరవడితే, ఈ మహాభారత విప్లవానికి, తెలంగాణలో పుట్టిన వారే ముందల నడుస్తురని నాకు ఉంది. ఎందుకంటే ఒకసారి వర్గపోరాటం చేసిన తరువాత ఆ పోరాటం యొక్క ఫలితాలను కూడా కండ్ల జూపినం. ప్రజలు మర్చిపోరు. దానికోసం ఈదేశ ప్రజాస్వామ్యాన్ని లీగల్‌గ నిలబెడతరా, అందుకు అవకాశం వుందా లేదా అనేదానికి ఇంకా కొద్ది టైమే వుంది. ఈ పార్లమెంటరీల పరిధి పడిపోతది. మహా విప్లవం వస్తది. ఆ వచ్చిన విప్లవం గెలుస్తది.

***

# మలిమాట

**ఉమా చక్రవర్తి**
ప్రముఖ ఫెమినిస్టు చరిత్రకారిణి

తెలంగాణ సాయుధపోరాటం అనగానే కొన్ని చిత్రాలు మన మదిలో మెదులుతాయి. ముఖ్యంగా తుపాకులను ఉపయోగించడంలో తర్ఫీదు పొందుతూ, రైఫిల్‌ను పేల్చడానికి సిద్ధంగా ఉన్న నలుగురు మహిళల చిత్రం ఎంతో విస్తృతమైన గుర్తింపు పొంది, తెలంగాణా సాయుధ పోరాటానికి ఒక ప్రతీకగా కూడా నిలిచింది. దీనితో పాటు బుర్రకథ చెబుతున్న మహిళల ఫోటో, నిజాం నిరంకుశ దోపిడీ పాలనకు ప్రాతినిధ్యం వహించిన దొరల రాజ్యానికి వ్యతిరేకంగా, 1940 దశకం చివరి నాళ్లలో పోరాటంలో పాల్గొన్న మహిళల చిత్రాలు కూడా మనకు తరచుగా కనిపిస్తాయి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు తెలంగాణా గడ్డపై నిజాం సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ అధికారాలను నిలదీసిన చరిత్ర మనకు తెలుసుగానీ.. ఈ చిత్రాలను సృష్టించిన వారెవరు, వారు ఏ ప్రయోజనాన్ని ఆశించారు, ఇవి ఎలా ఉపయోగింపబడ్డాయి అనే వివరాలకు సంబంధించి మనకు తెలిసింది తక్కువనే చెప్పాలి. ఈ ఫోటోలకు ఉన్న చారిత్రక ప్రాధాన్యం ఏమిటి? ఈ ఫోటోల్లో కనిపించే మహిళలో ఒకరైన మల్లు స్వరాజ్యం కథనాన్ని ఇప్పుడు ప్రచురించటం ఎందుకు?

తెలంగాణా సాయుధ పోరాటాన్ని విరమించి, నిజాం పాలన అధికారికంగా ముగిసిపోయిన అర్ధ శతాబ్దం తర్వాత జన్మించిన నేటి తరానికి, ఆ వీరోచిత పోరాటాన్ని పరిచయం చేయడమే ఈ ప్రచురణ వెనుక వున్న ముఖ్య ఉద్దేశ్యం.

తెలంగాణాలో దొరల పాలన సారాంశంలో పూర్తిగా అంతం కాలేదని ఈనాడు మనకు తెలుసు. 1970–80వ దశకంలో తెలుగునాట వచ్చిన మహిళా ఉద్యమాలు.. తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న మహిళల పాత్రకు సంబంధించి అనేక ప్రశ్నలను లేవనెత్తాయి. ఆ పోరాటంలో పాల్గొన్న మహిళల పట్ల ఉద్యమానికి వున్న అవగాహన ఏమిటన్న ప్రశ్నను 'మనకు తెలియని మన చరిత్ర' అనే గొప్ప పుస్తకం బలంగా ముందుకు తెచ్చింది. చరిత్రను ఒక నూతన దృక్పథం నుంచి పరిశీలిస్తూ, ఆ ఉద్యమంలో క్రియాశీల మిలిటెంట్ రాజకీయాలలో పాల్గొని, ఉద్యమ విరమణానంతరం వ్యక్తిగత కుటుంబ జీవితాలలోకి తిరోగమించి, ఆ తర్వాత ఎక్కడా కానరాకుండా మరుగైపోయిన కొంత మంది స్త్రీలపై ఈ పుస్తకం దృష్టి కేంద్రీకరించింది. తెలంగాణా ఉద్యమ చరిత్రకు

సంబంధించిన అనేక ఇతర ముఖ్యమైన అంశాలను నేడు దాదాపు మర్చిపోయామనే చెప్పుకోవాలి. నేటి తరానికి, లేదా తెలంగాణా ప్రాంతం వెలుపల జీవిస్తున్న నా తరం వారికయినా 1945 నుంచి 1950వ దశకం తొలినాళ్ళలో తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పుల గురించీ, ఆ పోరాటం ఎదుర్కొన్న సంక్లిష్టమైన దశల గురించీ, అది అందించిన విలువైన విజయాల గురించీ ఎంతవరకు తెలుసు? చరిత్ర ఒక నాటకీయ మలుపు తీసుకుంటున్న సమయంలో, ఆ కాలం గురించి మనకు కనీసమైన అవగాహనను అందించడంలో మల్లు స్వరాజ్యం ఆత్మకథ తోడ్పడుతుందని భావిస్తున్నాను.

తెలంగాణా సాయుధ పోరాటం గురించి ఎంతోమంది పరిశోధక విద్యార్థులు రాశారు. ఉద్యమానికి నాయకత్వం వహించిన పి.సుందరయ్య దగ్గర్నుంచీ కార్యక్షేత్రంలో పనిచేసిన కార్యకర్తల వరకూ అనేక మంది ఆ పోరాటం గురించి, అది అందించిన గుణపాఠాల గురించే కాదు, ఆ ఉద్యమానికి సంబంధించి తమ అనుభవాలు, జ్ఞాపకాలను కూడా గుదిగుచ్చి ఎన్నో పుస్తకాలు రాశారు. కానీ దురదృష్టవశాత్తూ ఆ సాహిత్యమంతా తెలుగులోనే ఉండడం వల్ల ఇతర భాషా పాఠకులకు చేరలేక పోయింది. ఏది ఏమైనా 1945–51 మధ్య జరిగిన తెలంగాణా పోరాటం మనకు ఎంతో విలువైన అనుభవాలను, జ్ఞానాన్ని అందించింది. అదే కాలంలో బెంగాల్‌లో జరిగిన తెభాగా పోరాటం, కేరళలోని పునప్ర వాయలార్ పోరాటాలు కూడా తెలంగాణా సాయుధ పోరాటం తరహాలోనే ప్రధానంగా వ్యావసాయిక సమస్యను కేంద్రం చేసుకుని సాగిన ఉద్యమాలు. ఈ పోరాటాలు జాతీయోద్యమంలోను, దానికి ముందూ, తర్వాతా కూడా పరిష్కారం కాకుండా అపరిష్కృతంగా వుండిపోయిన వ్యావసాయిక సమస్యను అన్ని సిద్ధాంత, రాజకీయ పార్టీలు గుర్తించి సమాధానం చెప్పవలసిన పరిస్థితిని కల్పించాయి.

స్వతంత్ర భారతదేశ ఆవిర్భావ సమయంలో, వ్యవస్థలో సమూలమైన మార్పును ఆశించి అందుకోసం స్వచ్ఛందంగా యుద్ధంలోకి దూకిన ఎంతోమంది నాయకులకు, స్త్రీ–పురుషులకు మల్లు స్వరాజ్యం ప్రతినిధి. నాటి ఆ పరిస్థితులే మల్లు స్వరాజ్యం అసాధారణమైన జీవితానికి బలమైన నేపథ్యాన్ని అందించాయి. ఇవాళ మనం ఇంటర్నెట్లో వెతికితే ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం నుంచి భౌగోళికంగా వేరుపడి, భారతదేశ పటంలో మరో కొత్త రాష్ట్రంగా అవతరించిన తెలంగాణా గురించే ఎక్కువగా కనబడుతుందిగానీ.. దేశ స్వాతంత్ర్యానంతరం కొంతకాలం పాటు రక్తసిక్తమైన తెలంగాణా గురించి గానీ, ఆ నాడు ఈ ప్రాంతంలో స్త్రీ–పురుషులు ఎదుర్కొన్న సాంఘిక పీడన గురించి గానీ, ఎటువంటి ఆదాయ వనరులూ లేని సామాన్య ప్రజలు నాడు దొరల పాలనలో ఎంతటి శ్రమ దోపిడికి గురయ్యారో, ఎంతటి హింసను, అణిచివేతను, అవమానాలను ఎదుర్కొన్నారో, ఎలా

నిర్బంధపు వసూళ్ళకు గురయ్యారో, వాటిని ప్రతిఘటించే క్రమంలో ఎన్నివేల మంది అసువులు బాసారో తెలియచేసే సమాచారం మనకు ఎక్కడా పెద్దగా లభించకపోవడం దురదృష్టకరం. దేశంలో భూమి సమస్యను, గ్రామీణ ప్రాంతంలోని సామాజిక సంబంధాల్లో నెలకొన్న వైరుధ్యాలను పరిష్కరించడంలో విఫలం కావటం.. 1967లో నక్సల్బరి పోరాటానికి దారి తీసింది. నేటికీ ఈ భూమి సమస్య అనేది దేశంలో పరిష్కారం కాని సమస్యగానే మిగిలి వుంది.

దేశంలో తలెత్తిన రైతాంగ పోరాటాల గురించి విస్తృతంగా అధ్యయనం చేసిన ధనాగరే– తెలంగాణా సాయుధ పోరాటాన్ని మొత్తం రైతాంగ పోరాటాలకే ఒక గీటురాయిగా అభివర్ణించాడు. ఒక సామాజిక శాస్త్రవేత్తగా ఆ తిరుగుబాటు యొక్క వర్గస్వభావాన్నీ, దానికి దారితీసిన చారిత్రక అంశాలనూ అధ్యయనం చేసేందుకు ఎంతో ఆసక్తి చూపాడు. 1940వ దశకం చివరి దశలో నిజాం ప్రభుత్వంలో చోటుచేసుకున్న తెలంగాణ పోరాటానికి సంబంధించిన ఏ విశ్లేషణను పరిశీలించినా, నాటి రాజ్యాలన్నింటిలోనూ (ప్రిన్స్‌లీ స్టేట్స్) నిజాం స్టేట్ పెద్దది, అత్యంత సంపన్నమైనది మాత్రమే కాదు... అది ప్రత్యేకించి దొరల దోపిడీకి అనుకూలమైన వ్యవసాయ పద్ధతులను కూడా అవలంబించిందని అర్థమవుతుంది. నాడు దొరలుగా చెలామణి అయిన భూస్వామ్య దోపిడీవర్గం– వెట్టి రూపంలో ప్రజల నుంచి విపరీతమైన స్థాయిలో లెవీని వసూలు చేసింది. ఆ రోజుల్లో భూమిపై యాజమాన్యం అనేది భూస్వాములూ, రైతు యజమానులు, కౌలుదారులు, సన్నకారు రైతుల వంటి రకరకాల రూపాల్లో ఉన్నా.. మొత్తంగా విశాల కోణం నుంచి చూసినప్పుడు భూమికీ, కులానికీ మధ్య గట్టి సంబంధం ఉన్నదని అర్థమవుతుంది. ఎప్పుడూ కూడా ప్రత్యేకించి కొన్ని కులాలు మాత్రమే భూమిపై పట్టును కలిగి వుండటం మనం స్పష్టంగా గమనించొచ్చు. అదే విధంగా కొన్ని కులాలు ఉద్దేశ్యపూర్వకంగానే అనాదిగా భూమి నుంచి దూరం పెట్టబడ్డాయి. వెట్టిని చేసే మాల, మాదిగ, లంబాడా ఇతర గిరిజన తెగలకూ, భూమికీ మధ్య ఉన్న సంబంధం కేవలం శ్రామిక– కూలీ సంబంధమే తప్ప యాజమాన్యపు సంబంధం కాదు. ఇలా అప్పటి వరకూ రకరకాల రూపాల్లో ఉన్న భూసంబంధాలన్నీ కూడా హైదరాబాదు రాష్ట్రంలో 19వ శతాబ్దపు మలిదశలో ఘనీభవించి, ఒక స్థిర రూపం తీసుకున్నాయి. తిరుమలి ప్రకారం, నిజాం ప్రభుత్వం అనుసరించిన నూతన భూ ఆదాయ విధానాలు, నూతన రెవెన్యూ అధికారులు, వ్యవసాయరంగం విస్తరించటం, భూస్వాములు దొరలుగా మారటం తదితర పరిణామాలన్నీ కూడా స్వేచ్ఛా మార్కెట్ ఆవిర్భవించకుండా అడ్డుకుంటూ, శ్రామికుల లభ్యత, సరఫరా అన్నది నిరంతరంగా వుండేలా చేశాయి. ఇదంతా కూడా వ్యవస్థాత్మకంగా, ఎంతో పకడ్బందీగా, శ్రామికులపై నిర్బంధంగా అమలు

చేయబడింది. అంతకు మించి, ఇదంతా కూడా కులవ్యవస్థ పునాదిగానే నిర్మితమవటం ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపించే అంశం. శూద్రుల్లోని దిగువ కులాలు– లొంగిపడివుండి శ్రమించడానికీ, భూస్వాముల భూములను దున్ని, వారి ఇళ్ళల్లో చాకిరి ద్వారా దోపిడీకి గురవ్వడానికి అనుకూలమైన రీతిలో ఈ వ్యవస్థ నిర్మించబడింది. నూతన ప్రాంతాలలో వ్యవసాయ విస్తరణ కోసం పశువుల పెంపకందారులు, చేతివృత్తులవారు, వృత్తి కళాకారుల వంటి వారంతా కౌలుదారులుగా, శ్రామికులుగా నియమింపబడ్డారు. ఈ సాంఘిక, రాజకీయ వాతావరణం అంతిమంగా– ఆ ప్రాంత ప్రజలందరిలో మరీ ముఖ్యంగా దారుణమైన దోపిడికి గురవుతున్న వర్గాలలో తీవ్రమైన అసంతృప్తికి దారి తీసింది. ఇదంతా నిరసన జ్వాలల రూపంలో నిజాం ప్రభుత్వంపై ఒక్కసారిగా పెల్లుబికింది. నిజాం పాలనలోని క్రూరమైన అధికారుల పేర్లు వినబడినప్పుడు చంటిపిల్లలు సైతం పాలు తాగేవారు కాదంటారు తిరుమలి. స్త్రీలు దొరల, అధికారుల లైంగిక దోపిడీకి గురయ్యేవాళ్లు. దొరల వద్ద దాస్యం చేసే తండ్రులు మరణిస్తే, వారి కొడుకులు ఆ స్థానాన్ని భర్తీ చెయ్యవలసి వచ్చేది. ఈ వ్యవస్థ ఎంత దారుణంగా ఉండేదో క్రిషంచందర్ రచించి, గౌతంఘోష్ దర్శకత్వం వహించిన 'మాభూమి' చిత్రంలో కళ్లకు కట్టినట్లు శక్తివంతంగా చూపించారు. వ్యవసాయ రంగంలో తీవ్రమవుతున్న ఈ వైరుధ్యాలన్నింటినీ 1930 చివరి నాటికి ఆసఫ్ జాహి పాలకులు గుర్తించారు. కానీ వ్యవస్థలో ఎటువంటి మౌలిక మార్పులకూ పూనుకోకుండానే వైరుధ్యాల తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేశారు. సంస్కరణలు తీసుకువచ్చే క్రమంలోనే 1939–45 మధ్య రకరకాల కమిషన్‌లను ఏర్పాటు చేశారు. అదే సమయంలో కొన్ని జిల్లాల్లో వ్యవసాయాన్ని జీవనాధార పంటల నుంచి మార్కెట్ ఆధారిత వాణిజ్య పంటల వైపు మళ్లించడం జరిగింది. ఇది రైతాంగంలోని కొన్నికొన్ని వర్గాలను పెను సంక్షోభంలోకి నెట్టింది. ఇక రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఉత్పత్తుల ధరలు ఒడిదుడుకులకు లోనవటం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోవడమే కాదు, ఆ ప్రభావం కూలీల వేతనాల మీదా పడింది. 1940లలో తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయ రంగంలో చోటుచేసుకున్న ఈ సంక్షోభ పరిస్థితులన్నీ కలిసి ప్రజల్లో ప్రతిఘటనను తీవ్రతరం చేసి, సాయుధ పోరాటం వైపు నడిపించాయి. తెలంగాణలో సాయుధ పోరాటం పురివిప్పుకోవటానికి ముందే.. బెంగాల్లో తెభాగా పోరాటం ఆరంభమైంది. నాడు బెంగాల్లో ఏర్పడిన దారుణమైన కరువు పరిస్థితుల్లో రైతులంతా తమ కళ్ల ముందే సాటి రైతులు అమానవీయ పరిస్థితుల్లో చనిపోవటం చూసి చలించిపోయారు. వామపక్ష నాయకత్వంలో సాగిన ఈ పోరాటాల ఫలితంగా రైతు సమస్య అనేది జాతీయ స్థాయిలో ప్రముఖంగా

చర్చకొచ్చింది. ఒక రకంగా గాంధీ సారథ్యంలో సాగిన స్వాతంత్ర్యోద్యమం కూడా ఈ పని చెయ్యలేక పోయింది.

ఈ సందర్భంలోనే మనం నిజాం పాలనకూ, ఆసఫ్ జాహి రాజ్యానికీ ఉన్న కొన్ని ప్రత్యేకమైన సామాజిక, సాంస్కృతిక లక్షణాలనుప్రత్యేకంగా చెప్పుకోవాలి. రాజ్యంలోని మూడు ప్రాంతాల్లో ప్రజలు మూడు వేర్వేరు భాషలు– తెలుగు, మరాఠి, కన్నడ మాట్లాడేవారు. ఉత్తరాది ప్రాంతాల్లో ఇతర ప్రజల భాషల మధ్య ఒదిగిపోయిన ఉర్దూ.. ఇక్కడ మాత్రం కేవలం అధికారిక భాషగానే మిగిలింది. చాలామంది ప్రజలకు దఖ్ఖనీ మాండలికంతో పరిచయం ఉన్నప్పటికీ, తమ సంస్క ృతీ సంప్రదాయాలతో ముడిపడిన మాతృభాష స్థానే అధికార భాషని రుద్దే ప్రయత్నం చేయటంతో ప్రజలకీ, ప్రభుత్వానికీ మధ్య దూరం పెరిగింది. తెలుగు మాట్లాడే ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లో జాతీయోద్యమ ప్రభావానికి తోడు తెలుగుభాషా సాహిత్యాల పునరుజ్జీవన ప్రభావమూ తోడయ్యింది. ప్రజలలో చైతన్యాన్ని రగిలించడానికి సంఘ సంస్కరణోద్యమాలు సాహిత్యం, కవిత్వం, నాటకాలను సాధనాలుగా చేసుకున్నాయి. ఆంధ్ర మహాసభ ఆవిర్భావం, విస్తరణ ఈ నేపథ్యంలోనే జరిగిందే. ఆంధ్ర మహాసభ ప్రారంభంలో కాంగ్రెస్‌కి దగ్గరగా వున్నా తర్వాత కాలంలో కమ్యూనిష్టు పార్టీకి చేరువయ్యింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటన్ సోవియట్ రష్యాతో చేతులు కలపటంతో భారతదేశంలో కమ్యూనిష్టులపై నిషేధం తొలగిపోయింది. కమ్యూనిష్టులకు తమ కార్యకలాపాలను బాహాటంగా నిర్వహించుకునే అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని వాళ్ళు ప్రజల్లో తమ బలాన్ని పెంచుకునేందుకు సద్వినియోగం చేసుకున్నారు. 1943 నాటికి ఆంధ్రమహాసభ కమ్యూనిస్టల చేతిలోకి వచ్చింది. కమ్యూనిస్టుల రైతు సభలు గ్రామ గ్రామానికీ వ్యాపించాయి. పార్టీ మీద నిషేధం తొలగి బహిరంగం కావడం, ఆంధ్ర మహాసభ సామాజిక మార్పును కోరే వేదికగా మారడం తదితర పరిణామాలన్నీ.. తెలంగాణ పోరాటానికి ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బలమైన పునాదిని ఏర్పరచి, దీన్ని దేశంలోనే అతిపెద్ద రైతాంగ గెరిల్లా యుద్ధంగా మార్చిందంటారు సుమిత్ సర్కార్. ఈ ఉద్యమం ఉధృత దశలో... 16,000 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో, 3000 గ్రామాల్లోని 30 లక్షల మంది ప్రజలకు విస్తరించింది.

తెభాగా, పునప్ర వాయలార్ ఉద్యమాలు అందుకోలేకపోయిన సాయుధ పోరాట దశ తెలంగాణాలో మాత్రం 1946 నుంచీ 1951 వరకూ నిరవధికంగా సాగింది. వ్యవసాయిక సమాజంలో సమూల మార్పును సాధించే ఆశయంతో వందలాది మంది స్త్రీలతో సహా వేల మంది ప్రజలు పోరాట పంథా అనుసరించారు. తెభాగా, పునప్ర వాయలార్‌లలో కంటే తెలంగాణాలోని రైతాంగం ఎక్కువ సంఖ్యలో, ఎక్కువ తీవ్రతతో,

మరింత స్ఫూర్తితో ఉద్యమించారా? వీటి మధ్యనున్న పోలికలేమిటి? ఇక్కడి కమ్యూనిస్టు పార్టీ ఎత్తుగడలు ఎక్కువగా సఫలమైనాయా? లేక ఇక్కడి చారిత్రక పరిస్థితులు భిన్నంగా ఉన్నాయా? ఇటువంటి ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించిన రచనలు చాలానే ఉన్నాయి. వాటితో పాటు మన సమీప గతాన్ని ఉగ్రూతలూపిన ఈ చరిత్రను అర్థం చేసుకోవడానికి ఆ చరిత్రను నడిపిన వ్యక్తుల జ్ఞాపకాలు, అనుభవాలు, మౌఖిక చరిత్రలు ఉపయోగపడతాయా? ఈ అనుభవాలు ఉద్యమానికి సంబంధించి కొత్త ప్రశ్నలను లేవనెత్తుతూ, ఆనాటి ఘటనలను నూతన దృక్పథంతో అర్థం చేసుకోవడానికి కొత్తదారులు చూపుతాయా?

ఉవ్వెత్తున వచ్చిన జాతీయోద్యమం, అనంతరం సాధించుకున్న దేశ స్వతంత్రం, వెనువెంటనే జరిగిన దేశ విభజన– ఈ మూడూ కూడా అనంతర కాలంలో తెలంగాణా సాయుధ పోరాటంపై బలమైన ప్రభావం చూపిన ప్రబల ఘట్టాలు. ఇటీవల ప్రచురితమైన సునీల్ పురుషోత్తమన్ పరిశోధన– తెలంగాణ ఉద్యమాన్ని స్వతంత్ర భారత చరిత్రలో చోటుచేసుకున్న తొట్టతొలిదశ ఉద్యమంగా, ఒక మౌలిక ఘట్టంగా సవివరంగా చర్చించింది. ఆయన వివరణ ప్రకారం దేశ విభజన– ఇండిపెండెంట్ హైదరాబాద్‌గా విడిపోవాలన్న నిజాం ఆలోచనకు దోహదం చేసింది. భారతదేశం నుంచి స్వతంత్ర ప్రాంతంగా హైదరాబాదును విడదీయాలనే ప్రతిపాదన– తెలంగాణా సాయుధ పోరాటం మొదలై, బలం పుంజుకుని, అంతం కావడానికి విస్తృత సందర్భంగా పని చేసింది. ఈ పరిణామాలను మరికాస్త వివరంగా చూద్దాం.

బ్రిటిష్ రాజ్యంలో దేశీయ సంస్థానాలను, రాజ్యాలను చూస్తే... వీటిలో చాలా విషయాల్లో ఏకరూపత ఉండేది కాదు. ముఖ్యంగా అధికారాల విభజన, చట్టాలు చేసే హక్కు, పాలనాపరమైన విషయాల్లో ఎవరి పరిధి ఎంత మేరకు.. వంటి విషయాల్లో వీటి మధ్య అస్పష్టతే ఎక్కువగా ఉండేది. కొత్తగా స్వతంత్రం సాధించుకున్న భారత రాజ్య వ్యవస్థ ముందున్న అతి పెద్ద సవాల్– ఈ బ్రిటిష్ ఇండియా అనే అధికార, పాలనాపరమైన కలగూర గంప నుంచి ఐక్యత, సమగ్రత వున్న ఒక దేశాన్ని రూపొందించడం! అది కూడా ఉపఖండం అప్పుడే మూడు ముక్కలై, రెండు దేశాలుగా ఏర్పడ్డ సందర్భంలో.

దేశ విభజనకు హిందూ మెజారిటీ ప్రాంతాలు, ముస్లిం మెజారిటీ ప్రాంతాలన్నది ఆధార సూత్రం. ఇక వివిధ రాజ్యాలు, సంస్థానాల పాలకులకు మాత్రం పాకిస్థాన్లో ఉండాలో, భారతదేశంలో ఉండాలో, లేక స్వతంత్ర దేశంగా వుండాలో నిర్ణయించుకునే హక్కు సాంకేతికంగా వారికే ఇవ్వబడింది. దీంతో ముస్లిం పాలకుడున్న హిందూ మెజారిటీ రాజ్యమైన హైదరాబాదు, హిందూ రాజు పరిపాలిస్తున్న మెజారిటీ ముస్లిం ప్రాంతంగా

వున్న జమ్మూ–కాశ్మీరు ఏ దేశానికి చెందాలనే విషయంలో తీవ్రమైన, హింసాత్మక వివాదాలు తలెత్తాయి. హైదరాబాదు రాజ్యం దేశం నడిబొడ్డులో వుండడం వల్ల దాన్ని భారతదేశంలో విలీనం చేయడం అత్యవసరమని భావించిన సర్దార్ పటేల్ కాశ్మీరు కంటే హైదరాబాదుకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. ఒకవైపు హైదరాబాద్ రాజ్యంలోని గ్రామీణ ప్రాంతాలు రైతాంగ పోరాటంతో అట్టుడికి పోతుండగా నిజాం మాత్రం తన ముందున్న ప్రత్యామ్నాయాలను బేరీజు వేసుకుంటూ ఉన్నాడు. భారత ప్రభుత్వం మొదట నిజాంతో యధాస్థితి (స్టాండ్ స్టిల్) ఒప్పందం చేసుకుంది. కానీ ఆ తర్వాత సైనిక బలంపై పూర్తి పట్టు రాగానే ముందుగా ఆ సైన్యాన్ని.. దీనంతటినీ ఒక దేశంగా నిర్మించటానికి వినియోగించాలని ప్రయత్నించింది. 1948 సెప్టెంబర్‌లో భారతసైన్యం 'పోలీసు చర్య' పేరుతో హైదరాబాదు రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేసింది. అప్పటికే నిజాం వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా వున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణాలోని 'పేద ప్రజలు చేస్తున్న హింసను' దేశ నిర్మాణానికి ఉపయోగించాలని ప్రయత్నించింది. "పోలీసు చర్య" మిలిటరీ పాలనను తెచ్చింది. దానితో వేలాది గ్రామాలలో స్వేచ్ఛకీ, ప్రజాస్వామ్యానికీ మౌలికమైన కొత్త అర్థాలు వెదుకుతున్న రైతాంగ విప్లవకారులు కొత్తగా ఏర్పడిన దేశానికీ, దాని సైన్యానికీ టార్గెట్ అయ్యారు. 1947 నుంచీ కమ్యూనిష్టులు 'ఏ ఆజాదీ ఝూటీ హై' అని నినదించారు. 1948లో స్వతంత్ర భారత సైన్యపు రెండు బ్రిగేడ్లు తెలంగాణాలో దిగి సాయుధ పోరాటాన్ని తుడిచిపెట్టే పని మొదలు పెట్టాయి. పురుషోత్తమన్ చెప్పినట్లు, ఇది స్వతంత్ర భారత చరిత్రలో మొట్టమొదటి తిరుగుబాటు వ్యతిరేక (కౌంటర్ ఇన్సర్జెన్సి) మిలిటరీ ఆపరేషన్.

'పోలీసు చర్య' అన్న ముద్దు పేరుతో మిలటరీ నియంతృత్వం కింద జరిగిన ఘటనలను సుందర్‌లాల్ కమిటీ విచారించిందిగానీ ఆ రిపోర్టుని ప్రభుత్వం బయట పెట్టకుండా దాచి పెట్టింది. అందువల్ల దేశవ్యాప్తంగా మధ్యతరగతి ప్రజానీకానికి ఈ చరిత్ర అంతా కూడా దేశాన్ని 'ఐక్యం' చేసిన గొప్ప కథగానే కనిపించిందిగానీ.. అప్పటికే వేరే రాజ్యంగా వున్న తెలంగాణాలో, ఒక భిన్నమైన, మరింత సమానత్వంతో కూడిన, సమగ్రతను సాధించే స్వప్నం కోసం ప్రజలు ప్రాణాలను బలి పెట్టిన చరిత్ర గురించి తెలియ లేదు.

తెలంగాణా సాయుధ పోరాటం ఏ విషయాల్లో ఎంత వరకు సఫలమైంది, ఆ పోరాటాన్ని ఇంకా ముందుకు తీసుకుపోయే అవకాశం ఉండిందా? అన్నవి కీలకమైన ప్రశ్నలు. కొత్తగా పుట్టిన స్వతంత్ర దేశపు ఆయుధ శక్తి, ప్రజలపై జరిగిన మిలటరీ దాడి– ఈ రెండూ కూడా భారత చరిత్ర గతిని నిర్దేశించిన కీలకమైన అంశాలు. స్వతంత్రం

రాగానే సైన్యం చేపట్టిన తొలిచర్య ఏమంటే ఇంటాబయటా కూడా భౌగోళికంగా హద్దులను స్థిరపరిచటం. అందుకే అటు– కాశ్మీరులో, నాగాలాండ్‌లో దేశ 'సరిహద్దుల్ని' ఏర్పరచటానికీ, అదే సమయంలో దేశ భూభాగం మధ్యలో భూమి కోసం, సమానత్వం కోసం జరుగుతున్న పోరాటాన్ని అంతం చేయటానికీ అత్యధిక ప్రాధాన్యం ఇవ్వటం మనకు కనబడుతుంది. ఈ క్రమంలో రాజకీయ, ఆర్థిక శక్తులు జాతీయ స్థాయిలో ఏకమయ్యాయి.. దీంతో కమ్యూనిస్టులు ఒంటరిగా మిగిలిపోయి ఉద్యమాన్ని ఆపవలసిన పరిస్థితులు తలెత్తాయి. 1947–51 మధ్య భారతదేశాన్ని ఒక జాతి రాజ్యంగా ఏర్పాటు చేస్తున్న రాజకీయ, సామాజిక శక్తులకు.. పటిష్ఠమైన సరిహద్దుల మధ్య సురక్షితమైన దేశాన్ని నెలకొల్పడమే ప్రధాన లక్ష్యం అయ్యిందిగానీ.. గతం నుంచీ కొనసాగుతున్న, లోతుగా వేళ్ళూనుకుని వున్న, కుల, లింగ, వర్గ వివక్షతల వంటి వ్యవస్థీకృత అసమానతలను చక్కదిద్దటమన్నది వారి దృష్టిలో అస్సలు ప్రధాన సమస్యగానే కనబడలేదు.

.............

స్త్రీవాద దృక్పథం నుంచి చరిత్రను తిరగరాయడం అంటే ఏమిటి? అంతకు ముందే రాసిన చరిత్రలో 'స్త్రీలను కలిపి వడ్డించడం' కాదు. పాత చరిత్ర గుర్తించకుండా వదిలేసిన వారి దృక్పథం నుంచి మొత్తం చరిత్రనంతటినీ తిరగరాసే పద్ధతి. 'జాతి', 'దేశం' వంటి భావనలతో రాసిన అధికారిక చరిత్రను– సమాజపు చివరి అంచులలోకి నెట్టబడిన ప్రజలను కేంద్రంగా చేసుకుని విశ్లేషించడం! అందులో కులపరంగా, వర్గపరంగా, లింగపరంగా విస్మరణకు గురైన వాళ్ళు, ఇలా అన్ని కోణాల నుంచి వంచితులైన వారు– అసలైన జాతి, దేశ చరిత్ర నిర్మాతలుగా కేంద్ర స్థానాన్ని పొందుతారు. ఈ అవగాహనతో చారిత్రక దృక్పథాన్ని మరింత ప్రజాస్వామీకరించే క్రమంలోనే 'మనకు తెలియని మన చరిత్ర' వచ్చింది. ఇది తెలంగాణా నుంచి రావడం ఆశ్చర్యకరమూ కాదు, యాదృచ్ఛికమూ కాదు. 1930–1940లలో జాతీయ ఉద్యమంలో భాగంగా ప్రారంభమైనప్పటికీ, రైతాంగ, బడుగు వర్గాలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా "జాతి/దేశం" అనే భావనను ప్రజలే కేంద్రంగా పునర్నిర్వచించిన ఉద్యమాన్ని చూసిన ప్రాంతమిది. సాయుధ పోరాటం మొత్తం సమాజాన్ని మార్చడంలో విఫలమైనా, ఆ ఉద్యమం ముందుకు తెచ్చిన సామాజిక చైతన్యం, సమానత్వపు ఆశయాలు, మానవ విలువలూ ఆదర్శాలుగా మిగిలిపోయాయి. ఆ మిగిలిపోయిన ఆదర్శాలూ, స్వప్నాలే 20 ఏళ్ళ తర్వాత– అంటే ఒక తరం తర్వాత– శ్రీకాకుళం ఆదివాసుల పోరాటానికీ, మళ్ళీ తెలంగాణాలో ఉద్యమంగా పెరగడానికీ దారితీశాయి. కొత్త కమ్యూనిస్టు నిర్మాణాలతో, ప్రజల్ని కేంద్రంగా చేసుకున్న ఎత్తుగడలతో, వ్యవస్థని కూలదోసే ఉద్యమాలు 1960 మలిదశలో మొదలై 90ల వరకూ కొనసాగాయి.

ఈ ఉద్యమాలకీ, 1940లోని సాయుధ పోరాటానికీ అనేక పోలికలు వున్నాయి. సాయుధ 'దళాల' వంటి నిర్మాణ పరమైన పోలికలతో పాటు ప్రజల్ని కదిలించడానికి, కూడగట్టడానికీ అనుసరించిన పద్ధతులు, ఎత్తుగడల్లో కూడా దగ్గరి పోలికలు కనిపిస్తాయి. ఈ ఉద్యమంలో కూడా దోపిడీకి గురైన ప్రజలు పెద్ద ఎత్తున చేరారు. మహిళలు పెద్ద సంఖ్యలో క్రియాశీలక పాత్ర నిర్వహించారు. ఈ ఉద్యమకారులు కూడా తీవ్రమైన నిర్బంధాన్ని, అరెస్టులు, చిత్రహింసలు, ఎన్‌కౌంటర్ పేరిట హత్యలను ఎదుర్కొన్నారు. సమానత్వం ఆశయంగా ఈ ఉద్యమంలోకి వచ్చి, రాజ్యహింసకు గురైన మధ్య తరగతి మహిళలు, లైంగిక సమానత్వాన్ని కూడా ముందుకు తెచ్చారు. అందువల్ల సహజంగానే వాళ్ళు – చరిత్ర మరిచిపోయిన ప్రజల, స్త్రీల అనుభవాల నుంచి తెలంగాణా సాయుధపోరాట చరిత్రను కొత్తగా నిర్వచించడానికీ, రాయడానికీ పూనుకున్నారు. అంతవరకూ ఈ పోరాట చరిత్ర వివిధ నాయకులు రాసిన జ్ఞాపకాలుగా మాత్రమే ఉన్నది. దీనికి పూర్తి భిన్నంగా.. ప్రజల దృక్కోణం నుంచి చరిత్రను నిర్మించాల్సి వచ్చింది. ఇందుకోసం మౌఖిక చరిత్రను, ప్రధానంగా ప్రజలు చెప్పే కథనాలను ఉన్నవి వున్నట్లుగా రికార్డ్ చేయాలి. వీటిని ప్రధాన చారిత్రక సామగ్రిగా చూడాలి. వాటన్నింటినీ అధ్యయనం చేసిన తర్వాతే 'చరిత్రకారుల', 'మేధావుల', 'సిద్ధాంతకర్తల' విశ్లేషణలను పరిశీలించాలి. సాంప్రదాయికంగా చరిత్ర రచనకు ఉన్న ఆధారాలన్నీ కూడా అధికారిక స్థానాల్లో వున్నవారు– ప్రధానంగా పురుషులు రాసినవి. అందువల్ల, వివక్షకు గురైన వారి చరిత్ర ఎప్పుడూ కూడా ఉపేక్షకు గురవుతుంది.

చాలా భిన్నమైన సామాజిక పరిస్థితులలో పుట్టి పెరిగిన వందల మంది స్త్రీలను ఆ కాలంలో పోరాటంలోనికి తీసుకురావడం తెలంగాణా సాయుధ పోరాటపు ప్రత్యేక లక్షణం. కొన్నిసార్లు ఆ స్త్రీలు పోరాటంలోకి రావడానికి కారణం తమ భూముల్ని, పంటనూ రక్షించుకోవాలనే తపనే. ఉదాహరణకి చిట్యాల (చాకలి) అయిలమ్మ. మిగిలిన స్త్రీలు ఉద్యమంలోకి రావడానికి కారణం ఉద్యమపు ప్రభంజనం. విప్లవ కార్యాచరణలోకి ప్రవేశించిన స్త్రీల కథనాల్లో ప్రత్యేకంగా కనిపించేది 'న్యాయం' 'అన్యాయం' అనే విలువలూ, చిన్న వయసు నుంచే ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో ఈ విలువలకు వారిచ్చిన ప్రాధాన్యత. నిజానికి ఉద్యమంలోకి రావడానికి మరెన్నో పరిస్థితులు దోహదం చేసినప్పటికీ న్యాయం తరపున పోరాడాలనేది వీరందరిలో ప్రధాన ప్రేరణాంశంగా కనిపిస్తుంది. మల్లు స్వరాజ్యం విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. నిజాం రాజ్యంలోని అన్యాయాలను, దొరల దుర్మార్గ పాలనను వ్యతిరేకిస్తూనే తాను పెరిగి పెద్దయ్యానని మల్లు స్వరాజ్యం చెబుతుంది. తనలో ఇటువంటి దృక్పథం ఏర్పడడానికి, పేదల పట్ల తన తల్లి చూపించిన దయ, జాలి కొంతవరకూ కారణం అంటుంది. కొన్ని వర్గాల కులాల స్త్రీలకి తమనూ, భూములనూ

రక్షించు కోవడం కోసం కర్రసాములాంటి విద్యలు నేర్పించేవారు. స్వతంత్ర పోరాటంతో ప్రభావితమైన వారి సామాజిక సాంప్రదాయ మౌఖిక జ్ఞాపకాల చరిత్రలో వీరనారిమణులుగా కీర్తించబడిన ఝాన్సీలక్ష్మి బాయి, మధ్యయుగంలో ఆంధ్రాను పాలించిన రాణి రుద్రమదేవి మల్లు స్వరాజ్యాన్ని ఎంతగానో ప్రభావితం చేశారు. ఆమె అప్పటికే కమ్యూనిష్టు ఉద్యమంలో ఉన్నప్పటికీ అప్పటి పంజాబ్, బెంగాల్‌లోని విప్లవకారులైన స్త్రీలు దుర్గాబాబి, కల్పనా దత్ వంటివారి గురించి మల్లు స్వరాజ్యానికి, తెలంగాణాలో పోరాడిన ఇతర స్త్రీలకు తెలిసినట్లు లేదు. (కల్పనా దత్ కమ్యూనిస్టు పార్టీలో చేరి పార్టీ జాతీయ నాయకుడు పి.సి.జోషిని వివాహం చేసుకున్నా, వలస పాలనలో చిట్టగాంగ్‌లో ఆమె నిర్వహించిన సాయుధ విప్లవ కార్యకలాపాల గురించి తెలంగాణా కామ్రేడ్లకు తెలియకపోవడం ఆశ్చర్యకరం.)

వ్యక్తిగతంగా అన్యాయాలను అనుభవించినా అనుభవించకపోయినా, ఆదర్శాలున్న ప్రతి ఒక్కరూ నిజాం రాజ్యంలోని తెలుగు ప్రాంతాల్లో చెలరేగిన ఉద్యమానికి స్పందించారు. అదే సమయంలో కమ్యూనిజం ఒక బలమైన ప్రభావంగా ముందుకొచ్చింది. అప్పటికి కమ్యూనిజం అనేది సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఒక మౌలికమైన కొత్త పద్ధతి. ఆర్థిక రాజకీయ ఉద్యమాలతోబాటు సామాజిక సాంస్కృతిక పోరాటాలను కూడా కలిపి నడిపించగల దృక్పథం వల్ల నాటి యువతరానికి అది కాంగ్రెస్ నడుపుతున్న స్వాతంత్రోద్యమానికి ప్రత్యామ్నాయంగా కనిపించింది. స్త్రీలు కొండపల్లి కోటేశ్వరమ్మలాగా భర్తల ద్వారానో, మల్లు స్వరాజ్యంలాగా అన్నదమ్ముల ద్వారానో కమ్యూనిజం వైపు వచ్చారు. సమాజంలో ఆడపిల్లలపై వుండిన నిఘా, పర్యవేక్షణలు, వాళ్ళకి తమ జీవితాల గురించి స్వతంత్రంగా నిర్ణయించుకునే అవకాశాలు లేని పరిస్థితుల్లో రాజకీయ దృక్పథాలు కూడా పురుషుల ద్వారా రాక తప్పదు. అప్పటి స్త్రీలు చిన్నతనంలోనే పిల్లలుగానే అత్తవారింటికి వెళ్ళిపోతుండేవారు. అటువంటి పరిస్థితులలో నుంచి వచ్చి కూడా ఉద్యమంలో నిలబడి పోరాడిన వాళ్ళెవరు, సాయుధ పోరాటంలో పని చేయడం ద్వారా వాళ్ళు ఏ రకంగా తమ జీవితాలనూ చరిత్రనూ కొత్త మలుపు తిప్పారన్న ప్రశ్నలు మనకిక్కడ ప్రధానమైనవి.

ఉద్యమంలోని స్త్రీలు ప్రధానంగా సాయుధ దళాలలోకో (మల్లు స్వరాజ్యం లాగా) సాంస్కృతిక దళాలలోకో (కోటేశ్వరమ్మ లాగా) వచ్చేవారు. విప్లవం రావాలంటే సాంస్కృతిక చైతన్యం అవసరమని అప్పటి పార్టీ గుర్తించింది. దేవుళ్ళ భజనలకు బదులు సామాజిక, విప్లవభావాల్ని పాడుకోవడం కోసం తాము రాసిన కొత్త సాహిత్యం గురించి మల్లు స్వరాజ్యం వర్ణించారు. ఆమె సాయుధ దళంలో పని చేయడంతో బాటు విప్లవం గురించీ, రాబోయే కొత్త సమాజం గురించి పాడి, ప్రచారం చేసే పనిని కూడా నిర్వర్తించారు. సాయుధ

సాంస్కృతిక దళాలలోనే కాకుండా తెలంగాణ పోరాటంలోని మహిళలు నిర్వర్తించిన మరొక పాత్ర డెన్‌ల నిర్వహణ. అజ్ఞాతంలో ఉన్న ఉద్యమకారులకు తలదాచుకోవడానికి సాధారణ కుటుంబాల లాగా కనిపించే ఇళ్ళను ఏర్పాటు చేయడం. రహస్య జీవితంలో స్త్రీలు కూడా ఉండేవారు. వారికి ప్రత్యేక సమస్యలూ ఉండేవి. నిర్బంధం ఎక్కువగా వున్న రోజుల్లో ఈ పని చాలా ప్రమాదకరమైనదీ, మానసిక ఒత్తిడితో కూడుకున్నది. ఈ పరిస్థితుల్లో తప్పించుకున్న, పట్టుబడిన నాయకుల గురించి తెలిసినంతగా ఆ డెన్‌లను నిర్వహించిన స్త్రీల గురించి మనకు తెలియదు. రహస్య జీవితంలో ఆరోగ్య కారణాల రీత్యా డెన్‌లో ఉండవలసి వచ్చిన మహిళా ఉద్యమకారుల పరిస్థితికి– తనకు అబార్షన్ జరిగినప్పుడు కోటేశ్వరమ్మ అనుభవమే ఒక ఉదాహరణ. బయట వున్న నిర్బంధ తీవ్రతను బట్టి వైద్య సహాయం దొరకవచ్చు, దొరక్కపోనూవచ్చు. అలా స్త్రీలు ఎదుర్కొన్న ఆరోగ్య సమస్యలు ఎన్నో! అటువంటి పరిస్థితుల్లో స్త్రీలకు సహాయంగా వుండి పరిచర్యలు చేసిన యువ ఉద్యమకారుల గురించి మనసును కదిలించే కథనాలు చాలానే ఉన్నాయి. (అయితే తమ డెన్లలోకి వచ్చిన పురుషులు ఆ డెన్‌లను నిర్వహించిన స్త్రీలకు చేసిన సేవల వివరాల గురించి మనకు అంతగా తెలియదు. బహుశా వాటికి అంత ప్రాధాన్యత ఇవ్వలేదనిపిస్తోంది.) తమ మైల బట్టల్ని ఉతికి పెట్టిన యువకుల గురించి కోటేశ్వరమ్మ చెప్పారు. అంటే సంఘటితం చేయడం, ఉద్యమాల్ని నడిపించడం వంటి పెద్ద పనుల్లో నాయకత్వం మునిగి వుండగా, యువతరంలోని స్త్రీ పురుషుల మధ్య కొత్త రకమైన పరస్పర సమీకరణాలు ఏర్పడుతున్నట్లు అర్థమవుతుంది. ఒక నాయకుడిగా పసిబిడ్డను వదిలి పెట్టి వెళ్ళమని ఒక తల్లిని నిర్దేశించడం గురించి సుందరయ్య చాలా బాధగా రాశారు. కానీ ఉద్యమం కోసం బిడ్డను వదులుకున్న తల్లి ఎంత మేరకు ఆ నిర్ణయంతో సమాధానపడిందో మనకు తెలియదు. పిల్లలను వదులుకోవడం గురించి మనకు తెలిసిన కథనాలలో ఆ పిల్లల్ని తర్వాత తిరిగి తెచ్చుకోగలిగారో లేదో తెలియజేసే వివరాలు వుండవు. ఈ బిడ్డ మీకు దొరికితే ప్రేమగా చూసుకోండి అని అభ్యర్థించే ఉత్తరాలతో బాటు పిల్లలను వదిలేసి వెళ్ళిన సంఘటనలను కోటేశ్వరమ్మ చెప్పారు. రాతల్లో మాటల్లో తెలిసిన వివరాలను బట్టి అటువంటి పిల్లల్లో చాలామందికి పెద్దయిన తర్వాత తమ తల్లులతో మంచి సంబంధ బాంధవ్యాలు లేకుండా పోయాయి లేదా పెంచుకోలేక పోయారు. ఇది స్త్రీలకు ప్రత్యేకంగా ఎదురయిన విషాదం. పురుషులు ఇటువంటి బరువు బాధ్యతలకు అతీతంగా ఉద్యమంలో వచ్చిన వివిధ దశలతో ఇమిడిపోగలరు. త్యాగమూర్తులుగా, వీరయోధులుగా పురుషులు పొందే గుర్తింపు వాళ్ళకూ, దూరంగా పెరిగిన పిల్లలకు కూడా గర్వకారణమవుతుంది.

పిల్లలను వదిలిపెట్టిన అపరాధభావం, తర్వాత ఆ పిల్లల తిరస్కారం స్త్రీలకే వర్తించే సమస్యలుగా కనిపిస్తాయి.

సాంస్కృతిక దళాల్లో వున్నా, సురక్షిత డెన్లు నడిపినా, సాయుధ దళాల్లో వున్నా– ఉద్యమంలోని వారందరూ సమానంగా ఎదుర్కొన్న పరిస్థితి– నిర్బంధం నుంచి, నిరంతరం రాజ్యపు నిఘా నుంచి, హింస నుంచీ తప్పించుకుంటూ పని చెయ్యడం. పోరాటం విరమించే దాకా విప్లవకారుల్ని ఏరివేసే ప్రయత్నాల్లో మొదట నిజాం ప్రభుత్వం, 1948 అనంతరం భారత ప్రభుత్వం తెలంగాణాను చిత్రహింసల శిబిరంగా మార్చాయి. నిజాం సైనికులూ, రజాకార్లు, తర్వాత భారత సైన్యం కొనసాగించిన ఈ దాడుల్లో స్త్రీలు ఇంతకు ముందెన్నడూ లేనంత హింసకు గురయ్యారు. గతంలో దొరల భయానక పాలనలో లైంగిక హింసకు గురైన స్త్రీలు, ఆ హింసను వ్యతిరేకించి పోరాడిన పాపానికి శిక్షగా ప్రభుత్వ బలగాల హింసకు గురయ్యారు. ఈనాడు జరుగుతున్నట్లే, కమ్యూనిస్టులకు ఆశ్రయమిచ్చిన, తిండి పెట్టిన నేరానికి ప్రజలను శిక్షించడం జరిగింది. అందులో స్త్రీలను పెట్టిన హింసలు దారుణంగా వుండేవి. 'మనకు తెలియని మన చరిత్ర'లో స్త్రీ శక్తి సంఘటన నమోదు చేసిన స్త్రీల అనుభవాల్లో  ఇటువంటి హింసను అనుభవించిన స్త్రీల జ్ఞాపకాలు అనేకం దొరుకుతాయి. ఉదాహరణకు ఏడాది పాటు అడవుల్లో సాయుధ దళాల్లో వుండి కొడుకును చూసుకోవడానికి ఊరికి వెళ్ళిన దూడల సాలమ్మ పోలీసులకు పట్టుబడి మూడు నెలలపాటు చిత్రహింసలను అనుభవించింది. ఆ తర్వాత కూడా తిరిగి ఉద్యమంలోకి వెళ్ళేటట్లయితే, ఆమె కుటుంబం మొత్తాన్ని జైల్లో పెడతామని బెదిరించి సాలమ్మను వదిలి పెట్టారు.

డాక్టర్ అచ్చమాంబలాంటి వారు సాయుధ దళాలతో పాటు ప్రభుత్వ బలగాలను తప్పించుకుంటూ అడవుల్లో,  ఆదివాసుల గ్రామాలలో తిరిగేవారు. అచ్చమాంబ– గాయపడ్డ కామ్రేడ్లకు చికిత్స చేస్తూ, సుదూర గ్రామాలలోని ప్రజలకు మందులిస్తూ, ప్రసవాలు చేస్తూ పోరాడిన స్త్రీ. అడవులలోని జంతువులను, శత్రువుల తుపాకులనే కాక తనకు వేరే పురుషులతో లైంగిక సంబంధాలున్నాయనే ఆరోపణలను సైతం ఎదుర్కోవలసి వచ్చింది. చివరికి ఇటువంటి పుకార్లను ఆపడానికి, ఆమెకు ఒక కామ్రేడ్‌తో పెళ్ళి చేయవలసి వచ్చింది.

మనం ఇంతవరకూ గుర్తు చేసుకున్న, తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న మహిళల స్థితిగతులతో మల్లు స్వరాజ్యం జీవితానికి పోలికలు, తేడాలూ వున్నాయి. ఆమె కుటుంబ పరిస్థితులు చాలా భిన్నమైనవి. కుల పరంగాకానీ, వర్గ పరంగాకానీ ఆమె అణచివేతకు గురైన కుటుంబం నుంచి రాలేదు. ఆమె తండ్రీ సోదరులూ తమ కుల వర్గ ఆధిక్యతను అనుభవించేవారు. ఆమె తల్లి దీనికి భిన్నంగా తమ దగ్గర పనిచేసే వారి పట్ల

ఎంతో దయతో వుండేది. వాళ్ళ కుటుంబంలో ఆడవాళ్ళకు పరదా పద్ధతి వుండేది. బహుశా లింగపరమైన ఈ కఠోర నియమాల వల్లే కొందరు మహిళలు తమ కుటుంబాలలోని పురుషులు చేసే హింసను వ్యతిరేకించారేమో. తరచుగా చావుదెబ్బలు తినే పనివాళ్ళ పట్ల మల్లు స్వరాజ్యం తల్లికి ఉన్న జాలి అటువంటిదే. (తర్వాత విప్లవకారులైన పిల్లలకు సమర్ధన నిచ్చిన మల్లు స్వరాజ్యం తల్లినీ, కోటేశ్వరమ్మ తల్లినీ గోర్కీ 'అమ్మ' నవలలోని తల్లితో పోల్చట చూస్తుంటాం. కోటేశ్వరమ్మ తల్లి అంజమ్మ మరణించినప్పుడు తను దాచిన చిన్న మొత్తాన్ని పార్టీకి విరాళంగా రాశారు. తనకు తెలిసిన వాళ్ళంతా అప్పటికి సి.పి.ఐ., సి.పి.ఎంగా చీలిపోయారు గనక తన దగ్గర మిగిలిన డబ్బుని ఆ రెండు పార్టీలకూ సమానంగా ఇవ్వాలన్నది ఆమె చివరి కోరిక).

విప్లవ రాజకీయాలలో వున్న మల్లు స్వరాజ్యం అన్న బి.ఎన్.రెడ్డి ఆమెను చాలా ప్రభావితం చేశాడు. ఆయన పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నప్పుడు చేపట్టిన కార్మికుల సమ్మెల లాంటి పనులను చూసుకునే బాధ్యతను చెల్లెలికి ఇచ్చేవాడు. కూలి పెంపుదల కోసం పోరాడి విజయం సాధించిన సమ్మెకు మొదటిసారి తోడ్పడినప్పుడు తనకు 12 ఏళ్ళని మల్లు స్వరాజ్యం చెప్పారు. మల్లు స్వరాజ్యం తుపాకి పట్టుకుని పోరాడారు. ఉద్యమ జీవితంలో అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ శత్రువు దాడులను తప్పించుకుంటూ, శత్రువుపై దాడులు చేస్తూ గడిపిన జీవితం ఆమెది. తమ కుటుంబాలలోని ఆడపిల్లలకు కత్తిసామూ, చదువు నేర్పించడం సాధారణ విషయమని స్వరాజ్యం చెప్పారు. కమ్యూనిష్టు గెరిల్లాగా ఆయుధాలు అందుకోడానికి ఈ తర్ఫీదు పనికి వచ్చిందేమో. అయితే అసలు స్త్రీలకు సాయుధ శిక్షణనిచ్చి దళాలలోకి తీసుకోవడం ఎలా జరిగింది? ప్రపంచ చరిత్రలోగాని, దేశ చరిత్రలోగాని సాయుధమైన స్త్రీల పోరాటాలు వున్నాయా? వాటి నుంచి ఏ పాఠాలు నేర్చుకోవడం జరిగింది? ఇటువంటి కొత్తరకం కార్యాచరణ, బాధ్యతలూ నెరవేర్చడంలో స్త్రీలకు ఎదురయ్యే ప్రత్యేక సమస్యల గురించి పార్టీకి అవగాహన ఉందా? అని ప్రశ్నించుకుంటే, అటువంటి లోతైన ఆలోచనగానీ, అవగాహనగానీ అప్పట్లో లేదనిపిస్తుంది. పంజాబు, బెంగాల్లో – దుర్గా భాబి, కల్పనాదత్ ప్రీతిలత వంటి విప్లవకారులు ఆయుధాలను పట్టారు. సుభాష్ చంద్రబోస్ సైన్యంలో కెప్టెన్ లక్ష్మి స్వామినాథన్ (సెహెగల్) ఝాన్సీలక్ష్మి బ్రిగేడ్ పేరుతో స్త్రీల పటాలాన్ని నడిపారు. చైనా విప్లవంలో కూడా ఇటువంటి ఉదాహరణలు ఉన్నాయి. ఈ ఉదాహరణలు ప్రేరణ అయితే ఇచ్చాయేమో గాని, వాటి నుంచి నేర్చుకున్న దాఖలాలేమిలేవు. అసలు స్త్రీలను సాయుధ దళాలలోకి తీసుకురావాలనే స్పష్టమైన ప్రణాళిక ఉన్నట్లు కూడా కనబడదు. పైగా స్త్రీలకు ఆయుధాలు ఇవ్వడం పట్ల పార్టీలో అనేక అనుమానాలు వ్యక్తమైనట్లు తెలుస్తుంది. ఆడవాళ్ళని సాయుధ దాడులకు

తీసుకు వెళ్ళవచ్చా? ఆడవాళ్ళు తుపాకులు కాల్చగలుగుతారా? ఆడవాళ్ళకు అంత చైతన్యం వుంటుందా? ఎంతైనా ఆడవాళ్ళు కదా? వగైరా వగైరా ప్రశ్నలు చాలానే ఉండేవి.

విప్లవకారులుగా, స్త్రీలుగా తమ అస్థిత్వాలను సమన్వయం చేసుకోవలసిన సమస్యను మహిళలు నిరంతరం ఎదుర్కొన్నారు. పురుషులతో సమానంగా ఆయుధాలు పట్టి పోరాడిన మల్లు స్వరాజ్యం సామాన్య ప్రజల మనసుల్లో ఒక మహానాయకురాలిగా నిలిచిపోయింది. తుపాకులతోపాటు, వడిసెల, రోకళ్ళు, కారంపొడి వంటి అనేక ఇతర ఆయుధాలను కూడా స్త్రీలు ఉపయోగించారు. అచ్చమాంబ చెప్పినట్లు సాయుధ దళాలలో వున్న స్త్రీలూ, మిగిలిన రంగాల్లో పని చేస్తున్న వారూ నిర్మాణాత్మకంగా వేరువేరైనా వాళ్లు చేసే పనులు చాలాసార్లు కలగలిసి పోయేవి. పరిస్థితిని, అవసరాన్నిబట్టి పనులు చేసుకునేవారు. డాక్టర్ అయినప్పటికీ అచ్చమాంబ తుపాకీ పట్టుకునే తిరిగేవారు. సాయుధ దళంలో వున్న మల్లు స్వరాజ్యం ప్రజలను కదిలించడానికి పాటలు పాడేవారు. ఈనాడు ఇంటర్నెట్లో మల్లు స్వరాజ్యం కోసం వెదికితే ఆమె పాడిన పాటలో, ఇచ్చిన ఉపన్యాసాలో దొరుకుతాయి. తన సాయుధ పోరాట అనుభవాలను గుర్తు చేసుకుంటూ– తుపాకితో పోరాడడం తన యుద్ధ సమయపు పని అయితే, ఉపన్యాసాలివ్వడం తన శాంతి సమయపు పని అయిపోయిందని మల్లు స్వరాజ్యం అన్నారు.

మల్లు స్వరాజ్యం తన జీవితానుభవాలను చాలా తక్కువ చేసి చెప్పుకొంటారు. వేలమంది ప్రజలు కలలుగన్న విప్లవాత్మక మార్పుల కోసం సాయుధంగా పోరాడిన జీవితాన్ని వదులుకుని, ఇంటిలో కుటుంబ స్త్రీగా మారడంలో కోల్పోయినదేమిటి? ఆ మార్పుతో ఎలా సర్దుకోగలిగారు? పోరాటం నాటి ఆదర్శాలు, ఆశయాలు కొంత వరకైనా నెరవేరాయా? వంటి ప్రశ్నలకు ఆమె నుంచి మేం పూర్తిగా సమాధానాలు రాబట్టలేకపోయమేమో! ఉద్యమ జీవితంలో నుంచి కుటుంబ జీవితంలోకి రావడంలో చాలా సర్దుబాట్లు చేసుకోవలసి వచ్చిందని మల్లు స్వరాజ్యం చెప్పారు. మళ్ళీ రాజకీయాలలోకి వచ్చి ఒక వక్తగా మారినప్పుడు వేదికల మీద తన చిన్నపిల్లలను పట్టుకునే ఉపన్యాసాలు ఇవ్వాల్సి వచ్చిందని చెబుతారు. మల్లు స్వరాజ్యం జీవిత కథలోని పెద్ద లోటు ఏమంటే, ఆమె తన జీవితానుభవాల్ని తానే స్వయంగా రాయకపోవడం. రాయడం తనకు చాలా కష్టంగా వుంటుందని ఆమె చెప్పారు. అందువల్ల ఆమె జీవిత చరిత్ర భవిష్యత్ తరాల కోసం ఆమె రచనగా కాక ఇతరులకి చెప్పిన కథనంగా మాత్రమే అందుతున్నది.


ఇది ఆమె కథ. ఆమె స్వయంగా చెప్పినది. యువతరం చదువుకోడానికి అందుబాటులో వుండే రికార్డు. అడిగిన ప్రశ్నలను బట్టి ఆమె ఏం చెప్పారో, ఏ విషయాలు

చెప్పలేదో పాఠకులే విశ్లేషించుకోగలరు. మల్లు స్వరాజ్యం జీవితం ఎందరినో మరింత పరిశోధించడానికి ప్రేరేపిస్తుంది. ఆ బాధ్యత ఇక పాఠకులది. చదవండి. ప్రశ్నలు లేవనెత్తండి. మిగిలిపోయిన ఖాళీలను పూరించండి. అవగాహనను ముందుకు తీసుకువెళ్ళండి. తెలంగాణా సాయుధ పోరాటాన్ని భావోద్వేగాలతో, ఆశలతో, ఆశయాలతో గుణపాఠాలతో తిరిగి ప్రోది చేసుకోవాలి, ప్రస్తుత తరం కోసం.. భవిష్యత్ తరాల కోసం కూడా!


అనువాదం : **కె. సంధ్య, రాజీవ్ వెలిచెటి**



మల్లు స్వరాజ్యం *(1983)*



మల్లు స్వరాజ్యం తల్లి చొక్కమ్మ



ఎడమ నుండి కుడికి

ఉప్పల మల్సూరు (4 సార్లు ఎం.ఎల్.ఎ) మల్లు వెంకట నర్సింహారెడ్డి (విన్)

మల్లు స్వరాజ్యం, మల్లు ప్రతాపరెడ్డి ఈ ఫోటో మల్లు స్వరాజ్యానికి పెళ్లికాకముందటిది



డాక్టర్ ఉష (ఉదయం కూతురు) ఒడిలో ఉష పిల్లలు

మధ్యలో మల్లు స్వరాజ్యం

వెనుక నిలబడింది తోట మల్లమ్మ (ఉద్యమంలో కొరియర్ పనిచేసింది)

చివరి వ్యక్తి తెలీదు



# తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు

# మల్లు స్వరాజ్యం ఆత్మకథ

స్వాతంత్ర్యోద్యమం యువతను ఉర్రూతలూగిస్తున్న కాలానికి చెందిన మల్లు స్వరాజ్యం గొప్ప సాహస యోధురాలు. అటు స్వాతంత్ర్యోద్యమంలో, ఇటు సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొంటూ ఆమె తన అనుభవాలను వివరిస్తుంటే వినడం ఒక అనిర్వచనీయమైన అనుభూతిని, ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఆమె మాటతీరు, వ్యవహార శైలి మూస పద్ధతికి భిన్నంగా, చాలా విలక్షణంగా వుంటాయి. ఇలాంటి వ్యక్తులు శతాబ్దానికి ఏ ఒక్కరో వుంటారు. మల్లు స్వరాజ్యం రెండు శతాబ్దాలను ప్రభావితం చేసిన మహా యోధురాలు.

**- వసంత కన్నబిరాన్**

మల్లు స్వరాజ్యం గారి జీవితమంటే 20వ శతాబ్దపు తెలంగాణా సామాజిక రాజకీయ చరిత్ర. అణచివేతను సహించలేని ప్రజల సామూహిక తిరుగుబాటు చరిత్ర. పీడితుల పట్ల సహానుభూతితో పిడికిలి బిగించి పోరాడిన ఒక తరం చరిత్ర. మన జీవితాలకు సంబంధించిన నిర్ణయాధికారాన్ని మన చేతుల్లోకి తీసుకోవటమెలాగో నేర్పే గొప్ప పాఠం ఆమె తొలినాళ్ల జీవితం.

**- ఓల్గా**

మల్లు స్వరాజ్యం తన పదకొండేళ్ల వయసులో ప్రజా జీవితంలో అడుగుపెట్టారు. ఆనాడు తనలో ఏ నిప్పు రవ్వ రాజుకుందో ఇవాళ 86 ఏళ్ల వయసులో కూడా ఇంకా ఆ జ్వాల అలాగే ఎగిసిపడుతూ వుంది. ఈ రోజు కూడా ఆమె ఎంతో స్పష్టతతో, ఆలోచనాత్మకంగా మాట్లాడుతూ, పోరాడుతూ ఎందరో మహిళలకు స్ఫూర్తినిస్తున్నారు. "నా గొంతే నాకు తుపాకి, తూటా" అంటారామె. ఆమె జీవితం ఒక మార్క్సిస్టు వీరోచిత పోరాట గాథ.

**- శాంత సిన్హా**